


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 244

శనివారం 25-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బ్లాక్ ఫ్రైడే సేల్
ఫ్లాట్ 50% తగ్గింపు
24 నుండి 26 నవంబరు, 2023 వరకు
లక్కీ డ్రాలు లేవు | స్క్రాచ్ కార్డులు లేవు | ఖచ్చితమైన బహుమతులు
42" టివి
రూ. 39,999
ఫర్నీచరు
కొనుగోలుతో
FREE
యాక్టివా 6జి
రూ. 99,999
ఫర్నీచరు
కొనుగోలుతో
ఇప్పుడే కొనండి. మీ 1వ ఇఎంఐ 120 రోజులు - మరుసటి సంవత్సరం 2024 తరువాత ప్రారంభమవుతుంది 36 నెలల వరకు ఇఎంఐ ఆప్షన్లు కలవు (కేవలం బాంటియాలోనే)
ఈ దశాబ్దపు డీల్
థాయ్‌లాండ్ ప్రీమియం క్వాలిటీ రిక్లైనర్ కార్నర్ సోఫా 2 రిక్లైనర్స్ మరియు 2 కప్ హోల్డర్స్‌తో + రూ. 30,000 విలువ గల ఉచిత కార్పెట్ మరియు టీవీ స్టాండ్
MRP ₹ 2,09,499 ₹ 69,999 PER DAY EMI ₹ 75
కార్పెట్, టీవీ స్టాండ్ ఉచితం
అన్ని మోటరైజ్డ్ : 2 ఎలక్ట్రిక్ రిక్లైనర్స్‌తో 3 సీటర్ + 2 ఎలక్ట్రిక్ రిక్లైనర్స్‌తో 2 సీటర్ + 1 ఎలక్ట్రిక్ రిక్లైనర్‌తో 1 సీటర్ ఉచిత యుఎస్‌బి ఛార్జర్‌లు + ఉచిత కన్సోల్ టేబుల్
MRP ₹ 2,91,499 ₹ 99,999 PER DAY EMI ₹ 108
రిక్లైనర్ సోఫా సెట్ : 3+2+1 (2 రిక్లైనర్స్‌తో 3 సీటర్ + రిక్లైనర్స్‌తో 2 సీటర్ + రిక్లైనర్‌తో 1 సీటర్)
MRP ₹ 2,04,499 ₹ 89,999 PER DAY EMI ₹ 97
కార్పెట్ ఉచితం
యాక్టివా ప్యాకేజ్ : 3+2 సోఫా సెట్ + మార్బుల్ డైనింగ్ టేబుల్ + హైడ్రాలిక్ కింగ్ సైజ్ బెడ్ + 4 పీసుల బెడ్ షీట్ సెట్ + టివి స్టాండ్ + చిల్డ్రన్ స్టడీ టేబుల్ + ఉచిత యాక్టివా 6G
MRP ₹ 3,02,999 ₹ 99,999 PER DAY EMI ₹ 108
లండన్ ప్రీమియం ఫ్యాబ్రిక్ సోఫా సెట్ 3+2+1
LOWEST PRICE
MRP ₹ 83,499 ₹ 59,999 PER DAY EMI ₹ 65
సోఫా సెట్ : 3+2+1+ డివైడర్ + రూ. 7,000 విలువ గల సెంటర్ టేబుల్ ఉచితం
MRP ₹ 63,999
₹ 32,999 PER DAY EMI ₹ 36
ఉచితం
ప్రీమియం క్వాలిటీ ఫ్యాబ్రిక్ రిక్లైనర్ సోఫా సెట్ 3+2+1 MRP ₹ 1,64,999
2 రిక్లైనర్స్‌తో 3 సీటర్, 2 రిక్లైనర్స్‌తో 2 సీటర్ మరియు రిక్లైనర్‌తో 1 సీటర్
₹ 79,999 PER DAY EMI ₹ 87
బెడ్‌రూం సెట్ : కింగ్‌సైజ్ బెడ్ + 2 బెడ్‌సైడ్ టేబుల్స్ + 6 డోర్ వార్డ్‌రోబ్ + 2 డ్రెస్సింగ్ మిర్రర్స్
MRP ₹ 2,14,999
₹ 79,999 PER DAY EMI ₹ 86
ITALIAN DESIGN
సింగపూర్ ప్రీమియం క్వాలిటీ బెడ్ హైడ్రాలిక్ స్టోరేజ్‌తో + రూ. 30,000 విలువ గల టీవీ / వాల్ యూనిట్ ఉచితం
MRP ₹ 63,999 ₹ 39,999 PER DAY EMI ₹ 43
Hydraulic
ఉచితం
ఎల్ టైప్ సోఫా సెట్ + రూ. 7000 విలువ గల సెంటర్ టేబుల్ ఉచితం
ఉచితం
MRP ₹ 52,999 ₹ 26,999
PER DAY EMI ₹ 29
ప్రీమియం క్వాలిటీ బెడ్ రూం సెట్ : 2 బెడ్ సైడ్ టేబుల్స్‌తో హైడ్రాలిక్ బెడ్ + స్టూల్‌తో డ్రెస్సింగ్ టేబుల్ + 3 డోర్ వార్డ్‌రోబ్
ఉచితం రూ. 65,000 విలువ గల రిక్లైనర్ మసాజర్
MRP ₹ 2,16,999
₹ 99,999 PER DAY EMI ₹ 108
బాటమ్ డ్రా స్టోరేజ్‌తో బెడ్
ఉచితం రూ. 9,000 విలువ గల డ్రెస్సింగ్ మిర్రర్
కింగ్ సైజ్
MRP ₹ 43,999
₹ 20,999
క్వీన్ సైజ్
MRP ₹ 42,499 ₹ 19,999 PER DAY EMI ₹ 22
ప్రీమియం క్వాలిటీ వార్డ్ రోబ్
ఐటెమ్ : 2 డోర్
MRP ₹ 39,799
₹ 10,999
PER DAY EMI ₹ 12
ఐటెమ్ : 3 డోర్
MRP ₹ 45,499 ₹ 15,999
ఐటెమ్ : 4 డోర్
MRP ₹ 58,999 ₹ 21,999
మార్బుల్ డైనింగ్ టేబుల్
4 కుర్చీలతో
MRP ₹ 32,999
₹ 14,999
PER DAY EMI
₹ 36
6 కుర్చీలతో
MRP ₹ 39,499
₹ 17,999
ప్రీమియం ఉడెన్ డైనింగ్ టేబుల్ రూ. 9000 విలువ గల టీవీ స్టాండ్ ఉచితం
4 కుర్చీలతో
MRP ₹ 38,999
₹ 18,999
PER DAY EMI ₹ 18
టీవీ స్టాండ్ ఉచితం
6 కుర్చీలతో
MRP ₹ 33,999
₹ 25,999
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ + స్టడీ టేబుల్ ఉచితం
ఉచితం
4 కుర్చీలతో MRP ₹ 43,999 ₹ 18,999 PER DAY EMI ₹ 20
6 కుర్చీలతో MRP ₹ 56,999 ₹ 23,999 PER DAY EMI ₹ 26
సింగిల్ బెడ్
MRP ₹ 13,499
₹ 5,999
PER DAY EMI ₹ 6
ఫ్రాన్స్ ప్రీమియం క్వాలిటీ స్టడీ టేబుల్
Credit Card EMI ₹ 146 (24 months)
MRP ₹ 7,499 ₹ 2,999
ఎక్స్ఛేంజ్ 20% వరకు తగ్గింపు
ఇప్పుడే బుక్ చేయండి - అదే రోజు డెలివరీ తీసుకోండి!
www.bantia.in
An ISO-9001:2015 Certified Company
ఉ. 10 గం.ల లోపు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయండి. అదనంగా 5% తగ్గింపు పొందండి కూపన్‌కోడ్ : BantiaDiwali ఉపయోగించండి www.bantia.in
మ. 1 గం.లోపు షాపింగ్ చేయండి
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
79950 00930 / 040-2784 1562 / 79933 33351 / 63014 32711
సికింద్రాబాద్ | ఎ.ఎస్.రావు నగర్ | నాగోల్ | హైటెక్ సిటీ | కొంపల్లి | బోడుప్పల్
దిల్‌సుఖ్‌నగర్ | కర్మన్‌ఘాట్ | కూకట్‌పల్లి | వరంగల్ | అత్తాపూర్ | సిద్దిపేట్ | జగిత్యాల్ | విజయవాడలో త్వరలో ప్రారంభం



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 244

శనివారం 25-11-2023



ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి

మరోసారి స్వల్ప లాభాల ముగింపు. 66 వేల దిగువకు సెన్సెక్స్.
-IVలో



సెమీస్‌లో సాత్విక్-చిరాగ్

క్వార్టర్స్‌లో ఓడిన ప్రణయ్... చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ.
-IVలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి బిజినెస్
శనివారం
25-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	48	65,970
నిఫ్టీ ▽	8	19,794

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,242	▽	24
డోజోన్స్	35,348	△	75
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,488	△	5
డాక్స్	16,029	△	35
షాంఘై	3,041	▽	21
నికాయ్	33,626	△	174

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (24 క్యారట్)		
60,620	▽	222
బంగారం (22 క్యారట్)		
57,773	▽	221
వెండి (కిలో)		
79,200	▽	400

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బిఐ	82.59	84.26
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బిఐ	102.86	106.22
€	యూరో	ఎస్‌బిఐ	89.39	95.46
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బిఐ	53.58	54.87
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బిఐ	53.52	55.90
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బిఐ	54.31	56.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.53	12.61

ఎస్‌ఎంసీకి మారుతీ షేర్ల జారీ

- మారుతీలో సుజుకీ మోటార్ వాటా అప్
- సుజుకీ గుజరాత్ ప్లాంట్ మారుతీ చేతికి



న్యూఢిల్లీ: మాతృ సంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్(ఎస్‌ఎంసీ)కి ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన ఆటో రంగ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా 1.23 కోట్ల షేర్లను జారీ చేయనుంది. ఇందుకు తాజాగా కంపెనీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు మారుతీ వెల్లడించింది. దీంతో సుజుకీ మోటార్ గుజరాత్(ఎస్‌ఎంజీ)లో 100 శాతం వాటాను మారుతీ సొంతం చేసుకోనుంది. ఎస్‌ఎంజీలో ఎస్‌ఎంసీకిగల వాటాను సొంతం చేసుకునే బాటలో మారుతీ.. ప్రిఫరెన్షియల్ షేర్ల కేటాయింపునకు తెరతీసిన సంగతి తెలిసిందే. ఇందుకు గత వారం వాటాదారులు సైతం ఆమోదముద్ర వేశారు. వెరసి రూ. 5 ముఖ విలువగల ఒక్కో షేరునీ దాదాపు రూ. 10,421 ధరలో ఎస్‌ఎంసీకి మారుతీ జారీ చేయనుంది. ఆర్‌ఎస్‌బీఏ వేల్యుయేషన్స్ అడ్వయిజర్స్ నివేదిక ప్రకారం ఇది రూ. 12,841 కోట్ల విలువకు సమానంకాగా.. షేర్ల కేటాయింపు తదుపరి మారుతీలో ఎస్‌ఎంసీ వాటా ప్రస్తుత 56.48 శాతం నుంచి 58.19 శాతానికి బలపడనుంది. మరోపక్క 100 శాతం వాటాను పొందనుండటంతో మారుతీకి ఎస్‌ఎంజీ పూర్తి అనుబంధ సంస్థగా ఆవిర్భవించనుంది. 2014లో ఎస్‌ఎంసీ రూ. 18,000 కోట్ల పెట్టుబడులతో అనుబంధ సంస్థగా ఎస్‌ఎంజీని ఏర్పాటు చేసింది. వార్షికంగా 7.5 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం ఎస్‌ఎంజీ సొంతం.

ఈ వార్తల నేపథ్యంలో మారుతీ షేరు బీఎస్‌ఈలో స్వల్పంగా 0.25 శాతం బలపడి రూ. 10,518 వద్ద ముగిసింది.

పతంజలి యోగపీఠ్, భారత ఆర్మీ ఎంవోయూ



న్యూఢిల్లీ: పతంజలి ఇన్‌స్టిట్యూషన్స్, భారత ఆర్మీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఔషధ మొక్కలపై పరిశోధన నిర్వహించనున్నారు. అలాగే, భారత ఆర్మీలో విభిన్నమైన ఐటీ అప్లికేషన్లు, ఆటోమేషన్‌పై పని చేయడం కూడా ఈ ఒప్పందంలో భాగంగా ఉంది. సైనికుల ఆరోగ్యం కోసం యోగ, ఆయుర్వేద ఔషధాలపై పతంజలి పరిశోధన నిర్వహించనుంది. మరోవైపు, విశ్రాంత సైనిక ఉద్యోగులను నియమించుకునేందుకు పతంజలి, దాని అనుబంధ సంస్థలు ప్రాధాన్యం ఇవ్వనున్నాయి.

పబ్లిక్ ఆఫర్.. బంపర్ హిట్!

టాటా టెక్ @ 69 రెట్లు



న్యూఢిల్లీ: ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజిటల్ సర్వీసుల కంపెనీ టాటా టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకి భారీ స్పందన లభించింది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో చివరి రోజు శుక్రవారానికల్లా 69 రెట్లు పైగా అధిక సబ్‌స్క్రిప్షన్ లభించింది. కంపెనీ 4.5 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 312 కోట్లకు పైగా షేర్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 203 రెట్లు బిడ్స్ దాఖలుకాగా.. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 62 రెట్లు, రిటైలర్ల నుంచి 17 రెట్లు చొప్పున దరఖాస్తులు లభించాయి. టీసీఎస్ (2004) తదుపరి రెండు దశాబ్దాలకు టాటా గ్రూప్ నుంచి వస్తున్న ఐపీవోకాగా.. షేరుకి రూ. 475–500 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 3,043 కోట్లు అందుకుంది.



ఈ నాలుగు ఇష్యూలకూ గురువారాని (30)కల్లా షేర్ల కేటాయింపు జరిగే వీలుంది. రిఫండ్స్ శుక్రవారం, షేర్లు సోమవారం (4న) రావచ్చు. వచ్చే నెల 5న స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానున్నట్లు తెలుస్తోంది.

ఫ్లెయిర్ రైటింగ్.. @ 47 రెట్లు



పెన్నులు, స్టేషనరీ ప్రొడక్టుల కంపెనీ ఫ్లెయిర్ రైటింగ్ ఇండస్ట్రీస్ ఐపీవో చివరి రోజు శుక్రవారానికల్లా 47 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. కంపెనీ 1,44,13,188 షేర్లను ఆఫర్ చేయగా.. 67 కోట్లకు పైగా షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. క్విబ్ విభాగంలో 116 రెట్లు అధిక బిడ్స్ నమోదుకాగా, రిటైలర్ల నుంచి 13 రెట్లు బిడ్స్ దాఖలయ్యాయి.

ఫెడ్‌ఫినా @ 22 రెట్లు



ఫెడరల్ బ్యాంక్ అనుబంధ సంస్థ ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఫెడ్‌ఫినా) ఐపీవోకు మంచి స్పందన లభించింది. 5.59 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. 12 కోట్లకుపైగా షేర్లకు (2.2 రెట్లు) బిడ్స్ వచ్చాయి. క్విబ్ విభాగంలో 3.5 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 1.5 రెట్లు, రిటైలర్ల నుంచి 1.8 రెట్లు అధికంగా దరఖాస్తులు లభించాయి.

గాంధార్ ఆయిల్ @ 64 రెట్లు



ప్రైవేట్ రంగ కంపెనీ గాంధార్ ఆయిల్ రిఫైనరీ (ఇండియా) ఐపీవో చివరి రోజు శుక్రవారానికల్లా 64 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. కంపెనీ 2,12,43,940 షేర్లను ఆఫర్ చేయగా.. 136 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల (క్విబ్) విభాగంలో 129 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 62 రెట్లు, రిటైలర్ల నుంచి 29 రెట్లు చొప్పున బిడ్స్ దాఖలయ్యాయి. దీంతో షేరుకి రూ. 160–169 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 501 కోట్ల మేర నిధులను సమీకరించింది. ఇష్యూలో భాగంగా రూ. 302 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 1.17 కోట్లకుపైగా షేర్లను విక్రయానికి ఉంచింది.

పేటీఎమ్ నుంచి బెర్క్‌షైర్ ఔట్

2.46 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల దిగ్గజం పేటీఎమ్‌లో గల మొత్తం 2.46 శాతం వాటాను ప్రపంచ ప్రసిద్ధ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ కంపెనీ బెర్క్‌షైర్ హాథవే తాజాగా విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా పేటీఎమ్ మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో గల 1.56 కోట్లకుపైగా షేర్లను ఆఫ్‌లోడ్ చేసింది. షేరుకి రూ. 877.29 సగటు ధరలో విక్రయించిన వీటి విలువ దాదాపు రూ. 1,371 కోట్లు. అనుబంధ సంస్థ బీహెచ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ ద్వారా మొత్తం వాటాను విక్రయించింది.



కాగా.. దీనిలో 1.19 శాతం వాటాకు సమానమైన 75,75,529 షేర్లను కాప్తాల్ మారిషస్ ఇన్వెస్ట్‌మెంట్ కొనుగోలు చేయగా.. 42.75 లక్షల షేర్ల(0.67 శాతం వాటా)ను ఘిసల్లో మాస్టర్ ఫండ్ ఎల్‌పీ సొంతం చేసుకుంది. ఇందుకు షేరుకి రూ. 877.2 సగటు ధరలో దాదాపు రూ. 1,040 కోట్లు వెచ్చించాయి.

ఈ నేపథ్యంలో పేటీఎమ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3 శాతంపైగా క్షీణించి రూ. 895 వద్ద ముగిసింది.

2 బిలియన్లు ఇన్వెస్ట్ చేస్తాం, కానీ..

- దిగుమతి సుంకాలపరంగా మినహాయింపునివ్వాలి
- భారత్‌లో ప్లాంటు ఏర్పాటుకు టెస్లా ప్రతిపాదన
- పరిశీలిస్తున్న కేంద్రం



ముంబై: అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా భారత మార్కెట్లో ప్రవేశించడంపై మరింతగా కసరత్తు చేస్తోంది. భారత్‌లో ప్లాంటు ఏర్పాటుపై 2 బిలియన్ డాలర్ల వరకు (సుమారు రూ. 16,600 కోట్లు) ఇన్వెస్ట్ చేయడానికి తాము సుముఖంగానే ఉన్నామని, అయితే ఈ క్రమంలో తమకు రెండేళ్ల పాటు దిగుమతి సుంకాలపరంగా కొంత మినహాయింపునివ్వాలని కేంద్రాన్ని కోరుతోంది. సుంకాల మినహాయింపులకు, పెట్టుబడి పరిమాణానికి లంకె పెడుతూ కేంద్ర ప్రభుత్వానికి టెస్లా ఓ ప్రతిపాదన సమర్పించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీని ప్రకారం దేశీ మార్కెట్లోకి ప్రవేశించాక రెండేళ్ల పాటు తాము దిగుమతి చేసుకునే కార్లపై సుంకాలను 15 శాతానికే పరిమితం చేయాలని కంపెనీ ప్రతిపాదించింది. 12,000 వాహనాలకు తక్కువ టారిఫ్ వర్తింపచేస్తే 500 మిలియన డాలర్ల దాకా ఇన్వెస్ట్ చేస్తామని, అదే 30,000 వాహనాలకు వర్తింపచేస్తే 2 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులను పెంచుతామని టెస్లా పేర్కొన్నట్లు సమాచారం.

జనవరి నాటికి నిర్ణయం..

ప్రధాని కార్యాలయం మార్గదర్శకత్వంలో టెస్లా ప్రతిపాదనను పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ), భారీ పరిశ్రమల శాఖ, రోడ్డు రవాణా.. జాతీయ రహదారుల శాఖ, ఆర్థిక శాఖ సంయుక్తంగా మదింపు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనిపై వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొన్నాయి. టెస్లాకు మరీ ఎక్కువ వెసులుబాటు ఇవ్వకుండా అదే సమయంలో గరిష్ఠంగా 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులను దక్కించుకునేలా మధ్యేమార్గంగా పాటించతగిన వ్యూహంపై కసరత్తు జరుగుతోందని వివరించాయి. ఇదే క్రమంలో తక్కువ టారిఫ్‌లతో టెస్లా దిగుమతి చేసుకోవాలనుకుంటున్న వాహనాల సంఖ్యను కుదించడంతో పాటు పలు విధానాలు పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నాయి. తక్కువ స్థాయి టారిఫ్‌లను, ఈ ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా అమ్ముడయ్యే మొత్తం ఎలక్ట్రిక్ వాహనాల్లో (ఈవీ) 10%కి పరిమితం చేయడం, రెండో ఏడాది దీన్ని 20% మేర పెంచడం వీటిలో ఉంది. భారత్‌లో ఈ ఆర్థిక సంవత్సరం 1,00,000 ఈవీలు అమ్ముడవుతాయన్న అంచనాల నేపథ్యంలో తక్కువ టారిఫ్‌లను, అందులో 10%కి, అంటే 10,000 వాహనాలకు పరిమితం చేయొచ్చని తెలుస్తోంది. దేశీయంగా గత ఆర్థిక సంవత్సరం 50,000 పైచిలుకు ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. మరోవైపు, టెస్లా కూడా భారత్‌లో స్థానికంగా జరిపే కొనుగోళ్లను క్రమంగా పెంచుకునే అవకాశం ఉంది. తొలి రెండేళ్లలో మేడిన్ ఇండియా కార్ల విలువలో 20%, ఆ తర్వాత 4 ఏళ్లలో 40% మేర కొనుగోలు చేసేందుకు కంపెనీ అంగీకరించవచ్చని తెలుస్తోంది.

ఐటీ షేర్లకు అమ్మకాల ఒత్తిడి

- మరోసారి స్వల్ప లాభాల ముగింపు
- 66 వేల దిగువకు సెన్సెక్స్
- 19,800 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ



ముంబై: ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో శుక్రవారం స్టాక్ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 48 పాయింట్లు నష్టపోయి 66 వేల స్థాయి దిగువన 65,970 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఎనిమిది పాయింట్లు తగ్గి 19,800 దిగువన 19,794 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం మిశ్రమంగా మొదలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేనందున సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఐటీతో పాటు ప్రభుత్వరంగ బ్యాంకులు, కన్జూమర్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మరోవైపు మెటల్, ఫార్మా, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన చిన్న తరహా కంపెనీల షేర్లు రాణించాయి.

- ఈ ఆర్థిక సంవత్సరంలో 4–3 నూతన ఉత్పత్తులను ఆవిష్కరణతో పాటు నూతన వ్యాపార ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధిస్తామని చైర్మన్ సిద్ధార్థ మొహంతి ధీమా వ్యక్తం చేయడంతో ఎల్‌ఐసీ షేరు 9.50% లాభపడి రూ.678 వద్ద ముగిసింది. లిస్టింగ్ నుంచి ఈ షేరుకిదే అతి పెద్ద ర్యాలీ. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.38 వేల కోట్లు పెరిగి రూ.4.28 లక్షల కోట్లకు చేరింది.
- హిండెన్‌బర్గ్ ఆరోపణలు పరిశీలించాలంటూ కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు తీర్పు రిజర్వ్ చేయడం అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్ ప్రైజెస్ (2.3%, అదానీ పవర్ 4.06%, అదానీ టోటల్ గ్యాస్ 1.2%, అదానీ ఎనర్జీ సెల్యూషన్స్ 0.84%, అదానీ గ్రీన్ ఎనర్జీ 0.77%, అంబుజా సిమెంట్ 0.31% చొప్పున లాభపడ్డాయి.

సాక్షి స్పోర్ట్స్



అనీశ్ భన్వాలాకు కాంస్యం

ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్ కప్ ఫైనల్లో భారత షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకంతో మెరిశాడు. దోహాలో జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో అనీశ్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచాడు. అనీశ్ 27 పాయింట్లు సాధించగా...పీటర్ ఫ్లోరియాన్ (జర్మనీ–35), లీయూహాంగ్ (చైనా – 33) స్వర్ణ, రజతాలు గెలుచుకున్నారు. తాజా ఫలితంతో వరల్డ్ కప్ సీజన్ ముగింపు ఫైనల్ పోటీల్లో పతకం సాధించిన తొలి భారత షూటర్‌గా హరియాణాకు చెందిన అనీశ్ నిలిచాడు. ఈ ఏడాది చక్కటి ఫామ్‌లో ఉన్న 21 ఏళ్ల ఈ కుర్రాడు వరల్డ్ కప్ సీనియర్ విభాగంలో తన తొలి పతకంతో పాటు ఆసియా చాంపియన్‌షిప్ సీనియర్ విభాగంలోనూ తన తొలి పతకాన్ని గెలుచుకున్నాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించడంలో అతను సఫలమయ్యాడు. మరో వైపు పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో భారత షూటర్ అఖిల్ షెరాన్ ఐదో స్థానంతో ముగించాడు.

డేవిస్ కప్ సెమీస్‌లో సెర్బియా

- 2–0తో బ్రిటన్‌పై విజయం
- జట్టును గెలిపించిన జొకోవిచ్



మలగ (స్పెయిన్): ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ డేవిస్ కప్ క్వార్టర్ ఫైనల్లో కీలకమైన విజయంతో సెర్బియాను సెమీస్‌కు చేర్చాడు. తద్వారా డేవిస్ కప్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన ఆటగాడిగా ఘనత వహించాడు. టీమ్ ఈవెంట్‌లో గురువారం అర్ధ రాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సెర్బియా 2–0తో బ్రిటన్‌పై ఘనవిజయం సాధించింది. తొలి సింగిల్స్‌లో లోమిర్ కెమనొవిచ్ (సెర్బియా) 7–6 (7/2), 7–6 (8/6)తో జాక్ డ్రాపెర్ (బ్రిటన్)ను ఓడించగా... రెండో సింగిల్స్‌లో టాప్ ర్యాంక్ ప్లేయర్ జొకోవిచ్ 6–4, 6–4తో కామెరాన్ నోరీ (బ్రిటన్)పై గెలుపొందాడు. 2–0తో ఫలితం తేలడంతో డుసాన్ లాజొవిక్‌తో కలిసి జొకోవిచ్ డబుల్స్ మ్యాచ్ ఆడాల్సిన అవసరం లేకపోయింది. డేవిస్ కప్ టోర్నీల్లో గత మూడేళ్లుగా సెర్బియన్ స్టార్ వరుసగా సాధించిన 21వ విజయమిది. ఓవరాల్‌గా ఈ టీమ్ ఈవెంట్‌లో రికార్డు స్థాయిలో జొకోవిచ్ 44 విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు. కేవలం సింగిల్స్‌నే పరిగణిస్తే జొకోకు ఇది 40వ విజయం అవుతుంది. సెమీస్‌లో సెర్బియా... ఇటలీని ఎదుర్కొంటుంది. మరో క్వార్టర్స్‌లో ఇటలీ 2–1తో నెదర్లాండ్స్‌పై గెలిచింది.



వివాహ బంధంలోకి నవదీప్ సైనీ

భారత క్రికెటర్ నవదీప్ సైనీ శుక్రవారం పెళ్లి చేసుకున్నాడు. తన స్నేహితురాలు స్వాతి అస్థానాను అతను వివాహమాడాడు. దేశవాళీలో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న పేస్ బౌలర్ సైనీ భారత జట్టు తరఫున 2 టెస్టులు, 8 వన్డేలు, 11 టి20లు ఆడి మొత్తం 23 వికెట్లు పడగొట్టాడు.

సెమీస్‌లో సాత్విక్–చిరాగ్

- క్వార్టర్స్‌లో ఓడిన ప్రణయ్
- చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



షెన్‌జెన్: భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి–చిరాగ్ శెట్టి జోడీ ఈ ఏడాది మరో టైటిల్‌పై కన్నేసింది. చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ భారత ద్వయం సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అయితే సింగిల్స్‌లో హెచ్.ఎస్.ప్రణయ్‌కి క్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 21–16, 21–14తో ఇండోనేసియాకు చెందిన లియో రాలీ కార్నడో–డానియెల్ మార్టిన్ జంటపై అలవోక విజయం సాధించింది. ప్రపంచ ఐదో ర్యాంకు జోడీ అయిన సాత్విక్–చిరాగ్ వరుస గేముల్లో 46 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. తొలి గేమ్‌లో 14–14 స్కోరు దాకా ఇండోనేసియన్ జోడీ నుంచి కొంతవరకు పోటీ ఎదురైనా... ఆ తర్వాత భారత షట్లర్ల ధాటికి ప్రత్యర్థి జంట చతికిలబడింది. తర్వాత రెండో గేమ్‌ను సాత్విక్–చిరాగ్‌లు రెట్టించిన ఉత్సాహంతో మొదలుపెట్టారు. 5–2తో ఆధిక్యంలోకి వెళ్లారు. నెట్‌వద్ద పొరపాట్లతో కొన్ని పాయింట్లు కోల్పోయినప్పటికీ వెంటనే పుంజుకొని ఆడటంతో మళ్లీ ఆధిక్యం 11–6కు పెరిగింది. ఇండోనేసియన్ షట్లర్లు ఆ తర్వాత కోలుకోలేదు. 17–10తో గేమ్‌ను చేతుల్లోకి తెచ్చుకున్న భారత అగ్రశ్రేణి జంట నిమిషాల వ్యవధిలోనే 21–14తో మ్యాచ్‌ను మగించేశారు. ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న భారత జంట ఇండోనేసియా సూపర్–1000, కొరియా సూపర్–500, స్విస్ సూపర్–300 టైటిళ్లను సాధించింది. నేడు జరిగే సెమీఫైనల్లో చైనాకు చెందిన జి తింగ్–రెన్ జియాంగ్ యు జంటతో సాత్విక్–చిరాగ్ జోడీ తలపడుతుంది. పురుషుల సింగిల్స్ ప్రపంచ 8వ ర్యాంకర్ ప్రణయ్‌కి క్వార్టర్స్‌లో ఏదీ కలిసిరాలేదు. 31 ఏళ్ల భారత షట్లర్ 9–21, 14–21తో జపాన్ ఆటగాడు, మూడో సీడ్ కొడయ్ నరవొక చేతిలో సులువుగానే ఓడిపోయాడు. తొలిగేమ్‌లో నరవొకకు 9–8తో పోటీ ఇచ్చిన భారత ఆటగాడు తర్వాత వరుసగా అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ నరవొక తొలిగేమ్‌లో తన రాకెట్‌ను నెట్‌పై పరిధి దాటిరావడంతో చైర్ అంపైర్ అతని పాయింట్‌ను తిరస్కరించాడు. అయితే ప్రణయ్ అందివచ్చిన అవకాశాల్ని ఒడిసిపట్టలేక పదేపదే పొరపాట్లు చేసి మ్యాచ్‌ను అప్పగించాడు.

తెలంగాణకు 3 పతకాలు



న్యూఢిల్లీ: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్లేయర్లు సత్తా చాటారు. వ్యక్తిగత విభాగం జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో రోహిత్ కవిటి కాంస్యం గెలుచుకున్నాడు. 621.10 స్కోరుతో రోహిత్ మూడో స్థానంలో నిలిచాడు. టీమ్ విభాగం జూనియర్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో రోహిత్ కవిటి, అబ్దుల్ ఖలీఖ్ ఖాన్, అద్నాన్ ఖుస్రోలతో కూడిన జట్టు మొదటి స్థానంలో నిలిచి స్వర్ణం గెలుచుకోగా, ఈ ముగ్గురే సభ్యులుగా ఉన్న జట్టు పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ సివిలియన్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించింది.

పిస్టోరియస్‌కు పెరోల్



ప్రిటోరియా: గర్ల్‌ఫ్రెండ్‌ను హత్య చేసిన కేసులో గత తొమ్మిదేళ్లుగా జైల్లో ఉన్న మాజీ ఒలింపియన్, ప్రముఖ బ్లేడ్ రన్నర్ ఆస్కార్ పిస్టోరియస్‌కు పెరోల్ లభించింది. దక్షిణాఫ్రికాకు చెందిన పిస్టోరియస్ పారాలింపిక్స్‌లో ఆరు స్వర్ణపతకాలు గెలుచుకోవడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎందరికో స్ఫూర్తిగా నిలిచి ప్రశంసలు పొందాడు. అయితే తన కెరీర్ అత్యుత్తమ దశలో ఉన్న సమయంలో తన గర్ల్‌ఫ్రెండ్ రీవా స్టీన్‌కాంప్‌ను హత్య చేసి జైలుపాలయ్యాడు. వలంటైన్స్‌డే రోజు ఆమెతో జరిగిన వాగ్వాదం నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ కేసులో పిస్టోరియస్‌కు మొత్తం 13 ఏళ్ల 5 నెలల జైలు శిక్ష పడింది.

సెమీస్‌లో శ్రీవల్లి రష్మిక



బెంగళూరు: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 21 ఏళ్ల శ్రీవల్లి 6–1, 6–4తో భారత్‌కే చెందిన వైష్ణవి అడ్కర్‌పై సునాయాస విజయం సాధించింది. సెమీస్‌లో రష్మిక థాయ్‌లాండ్‌కు చెందిన రెండో సీడ్ లాన్లానా తారరుదితో తలపడుతుంది. క్వార్టర్స్‌లో ఆమె 6–1, 6–2తో ఏడో సీడ్ డిలెటా చెరుబిని (ఇటలీ)ని ఓడించింది. ఈ టోర్నీలో హైదరాబాదీ యువతారతో పాటు మరో ఇద్దరు భారత క్రీడాకారిణులు జీల్ దేశాయ్, రుతుజ భోసలే సెమీస్‌కు దూసుకెళ్లారు. క్వార్టర్ ఫైనల్లో జీల్ దేశాయ్ 3–6, 6–7 (8/2), 6–4తో అంటోనియా షమిడ్త్ (జర్మనీ)పై చెమటోడ్చి నెగ్గింది. రుతుజ 7–6 (8/4), 1–6, 6–1తో కజకిస్తాన్‌కు చెందిన ఐదో సీడ్ జిబెక్ కులంబయెవాను కంగుతినిపించింది.

'ధోని నుంచి నేర్చుకున్నాను'

తన ఆటతీరుపై రింకూ సింగ్



విశాఖపట్నం: ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత జట్టు విజయంలో రింకూ సింగ్ కీలక పాత్ర పోషించాడు. చివర్లో దూకుడుగా ఆడాల్సిన స్థితిలో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా నిలబడి అతను ఫినిషర్‌గా మ్యాచ్ పూర్తి చేశాడు. ఈ లక్షణాన్ని తాను మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని నుంచి నేర్చుకున్నట్లు రింకూ సింగ్ చెప్పాడు. 'నేను ఇంత ప్రశాంతంగా ఉండగలిగానంటే అందుకు ప్రత్యేక కారణం ఉంది. ఇలాంటి స్థితిలో ఎలా ఆడాలని నేను మహి భాయ్ (ధోని)తో మాట్లాడాను. ముఖ్యంగా ఆఖరి ఓవర్లో ఒత్తిడికి లోను కాకపోవడానికి ఆయన ఇచ్చిన సూచనలే కారణం. సాధ్యమైనంత ప్రశాంతంగా ఉండటంతో పాటు నేరుగా బౌలర్‌పైనే పూర్తి దృష్టి పెట్టాలని ఆయన చెప్పారు' అని రింకూ సింగ్ వెల్లడించాడు. చివరి బంతికి ఒక పరుగు కావాల్సి ఉండగా రింకూ ఆత్మవిశ్వాసంతో దానిని చక్కటి సిక్సర్‌గా మలిచాడు. అయితే అబాట్ వేసిన ఆ బంతి నోబాల్ కావడంతో సిక్స్ లెక్కలోకి రాలేదు. 'డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లాక అక్షర్ చెప్పే వరకు ఈ విషయం నాకు తెలీదు. అయితే సిక్స్ కాలేకపోవడం పెద్ద అంశం కాదు. మ్యాచ్ గెలవడమే మనకు ముఖ్యం. అది జరిగింది చాలు' అని రింకూ సింగ్ వ్యాఖ్యానించాడు.

చిత్తుగా ఓడిన తెలంగాణ

జాతీయ హాకీ చాంపియన్‌షిప్




చెన్నై: జాతీయ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టుకు భారీ పరాజయం ఎదురైంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఒడిషా 7–0 గోల్స్ తేడాతో తెలంగాణను ఓడించింది. ఒడిషా తరఫున దిప్సన్ తిర్కీ (24వ నిమిషం), రజిన్ కందుల్నా (25, 60), అమిత్ రోహిదాస్ (31), అజయ్ కుమార్ ఎక్కా (36), నీలమ్ సంజీప్ (43), రోషన్ మిన్జ్ (57) గోల్స్ సాధించగా...తెలంగాణ ఒక్క గోల్ కూడా కొట్టలేకపోయింది. మరో మ్యాచ్‌లో పంజాబ్ 13–0తో ఉత్తరాఖండ్‌పై ఘన విజయం సాధించింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, జుగ్‌రాజ్ సింగ్ 'హ్యాట్రిక్' గోల్స్ సాధించడం విశేషం. ఇతర మ్యాచ్‌లలో ఉత్తరప్రదేశ్ 8–1తో రాజస్తాన్‌ను, పుదుచ్చేరి 6–0తో కేరళను, ఢిల్లీ 23–0తో అరుణాచల్‌ప్రదేశ్‌ను ఓడించాయి.

పాక్‌లో డేవిస్ కప్ ఆడేందుకు సుమిత్, శశి విముఖత

అసంతృప్తి వ్యక్తం చేసిన 'ఐటా'

న్యూఢిల్లీ: భారత సింగిల్స్ టెన్నిస్ స్టార్లు సుమిత్ నగాల్, శశికుమార్ ముకుంద్ పాకిస్తాన్‌లో డేవిస్ కప్ ఆడేందుకు నిరాకరించారు. డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1 ప్లేఆఫ్ 'టై'లో భాగంగా భారత్ వచ్చే ఫిబ్రవరిలో పాకిస్తాన్‌తో తలపడాల్సివుంది. అయితే భారత్ తరఫున ఉత్తమ సింగిల్స్ ప్లేయర్లు అయిన సుమిత్ నగాల్ (141 ర్యాంకు), శశికుమార్ (477 ర్యాంకు) చిరకాల ప్రత్యర్థితో ఆడేందుకు విముఖత వ్యక్తం చేశారు. అయితే వారిద్దరు వైదొలగేందుకు కారణాలు వెల్లడించలేదు. కానీ విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు నగాల్ తనకు అంతగా అలవాటు లేని గ్రాస్ కోర్టులో ఆడేందుకు సిద్ధంగా లేనని అన్నాడు. హార్డ్ కోర్టుల్లో రాణించే సుమిత్ ఈ కారణంతో పాక్ వెళ్లేందుకు ఆసక్తి చూపించకపోగా, శశికుమార్ ముకుంద్ మాత్రం ప్రత్యేకించి ఏ కారణం చెప్పకుండానే తప్పుకున్నట్లు తెలిసింది. ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ (ఐటా) దేశం తరఫున ఆడేందుకు నిరాకరించిన ఆటగాళ్లపై అసంతృప్తి వెలిబుచ్చింది. 'ఇది చాలా తప్పు. దేశానికి ప్రాతినిధ్యం వహించాల్సిన పుడు ఇలాంటి కారణాలు చూపడం ఏమాత్రం సమంజసం కాదు. ఈ విషయాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లాం' అని ఐటా ఉన్నతాధికారి తెలిపారు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+6 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 244
శనివారం 25-11-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'



మళ్లీ ఆటంకం
సొరంగంలోని కార్మికులను రక్షించే పనులకు మళ్లీ అవరోధం
-6లో



'డీప్ ఫేక్' ఫిర్యాదుల కోసం..
త్వరలో ఒక వేదికను ఏర్పాటు చేస్తామన్న మంత్రి రాజీవ్ చంద్రశేఖర్
-6లో




బిల్లులను అడ్డుకోవడం తగదు
అసెంబ్లీలో తీర్మానించిన బిల్లులను గవర్నర్లు నిరవధికంగా పెండింగ్‌లో పెట్టడం తగదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.
వివరాలు 6లో ▸



రాజస్తాన్ ఎన్నికలకు సిద్ధం
రాజస్తాన్ శాసనసభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం 199 నియోజక వర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తారు.
వివరాలు 6లో ▸



చంపితే ఎలా ఉంటుందో..!
జుంగ్ యూ జుంగ్.. హత్య చేస్తే ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి నిజంగానే ఘోరానికి తెగబడింది.
వివరాలు 6లో ▸



అతి పెద్ద ఐస్‌బర్గ్.. కదిలింది!
ప్రపంచంలోనే అతి పెద్ద ఐస్‌బర్గ్ (ఏ23ఏ) 40 ఏళ్ల తర్వాత కదలడం మొదలుపెట్టింది. ఇది నిపుణులను ఆందోళన పరుస్తోంది.
వివరాలు 6లో ▸

రైతుబంధుకు ఈసీ గ్రీన్ సిగ్నల్

- రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రకటన
- గతంలోలాగానే తక్కువ భూ విస్తీర్ణం ఉన్న రైతులకు మొదటగా పంపిణీకి శ్రీకారం
- నేటి నుంచి 3 రోజులు బ్యాంకులకు సెలవుతో 28న పంపిణీ చేసేందుకే వీలు
- 29, 30 తేదీల్లో రైతుబంధు పంపిణీకి ఈసీ అనుమతించలేదన్న వ్యవసాయ శాఖ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల వేళ అధికార బీఆర్‌ఎస్‌కు భారీ ఊరట లభించింది. ఈ యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు పంట పెట్టుబడి ఆర్థిక సాయాన్ని విడుదల చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది. తదనుగుణంగా రైతుబంధు సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో డీబీటీ పద్ధతిలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధును గతంలోలాగా తక్కువ భూవిస్తీర్ణం ఉన్న రైతులకు మొదటగా ఇచ్చే పద్ధతిలో పంపిణీ చేసే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపింది. అయితే ఈ నెల 25, 26, 27 తేదీల్లో బ్యాంకులకు సెలవులు ఉండగా ఈ నెల 29, 30 తేదీల్లో రైతుబంధు పంపిణీకి ఎన్నికల కమిషన్ అనుమతించలేదని వ్యవసాయ శాఖ పేర్కొంది. దీంతో ఎన్నికలకు ముందు
మిగతా 5వ పేజీలో ▶



భూపాలపల్లిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

ఇందిరమ్మ రాజ్యమంటే
ఎమర్జెన్సీలు.. ఎన్‌కౌంటర్లు

తెలంగాణ ప్రజలు అరిగోస పడ్డది ఆ పాలనలోనే
ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

- కాంగ్రెస్ వస్తే కర్ణాటక తరహాలో ఇక్కడా దగానే
- 'అభివృద్ధి' పాలన కావాలా? దళారీల పాలన కావాలా?
- బీజేపీకి ఓటేస్తే మోరీలో వేసినట్లే..
- సింగరేణి కొంగు బంగారం.. దీన్ని మరింత విస్తరిస్తాం
- పార్టీల చరిత్ర, పాలన బేరీజు వేసుకుని ఓటేయాలని విజ్ఞప్తి

సాక్షి ప్రతినిధి, వరంగల్/ సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/ సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యమట.. ఆ రాజ్యంలో ఏం జరిగిందో మనకు తెల్వదా?, అంత తొందరగా మరచిపోతమా?. ఇందిరమ్మ రాజ్యమంటే ఎన్‌కౌంటర్లు, ఎమర్జెన్సీలు.. జైలు పాలు చేసే బానిస బతుకులే కదా. తెలంగాణ ప్రజలు అరిగోస పడ్డది ఆ పాలనలోనే కదా. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో సంపదను పెంచుకుంటూ అభివృద్ధి పథంలో సాగే పాలన కావాలా? రైతుబంధు, ఉచిత విద్యుత్, ధరణిలపై అక్కసు వెళ్లగక్కుతూ దళారీల పాలన తెస్తామంటున్న ఇందిరమ్మ రాజ్యం కావాలా? మీరంతా ఆలోచించాలి. రాష్ట్ర సాధన తర్వాత తొమ్మిదేళ్లలో ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి పథంలో దేశంలోనే నంబర్ వన్‌గా ఎదిగాం. ఇలాంటి ప్రభుత్వాలను బలపరిస్తేనే భవిష్యత్ తరాలకు కూడా
మిగతా 2వ పేజీలో ▶

రూ.300 కోట్లు డంప్ చేశారు
- కాంగ్రెస్ ఆరోపణ
- మాజీ ఐఏఎస్ గోయల్ ఇంట్లో ఈసీ సోదాలు
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు నేపథ్యంలో తనిఖీలు

10లో

అందరినీ దూరం పెట్టారు



కేసీఆర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి బహిరంగలేఖ

- అధికారంలోకి వచ్చాక 'కేసీఆర్ ఎవరిమాటా వినడు' అన్నట్లు మారారు
- అప్పుడు అన్ని పార్టీల గడపలూ తొక్కారు.. ఇప్పుడు వాటి ఉనికిని తొక్కేస్తున్నారు.. మంత్రులు, ఎమ్మెల్యేలు మీరు చెప్పింది విని తలూపే 'డూడూ బసవన్నలు' అని ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ.. మీ కుటుంబ ఆలోచనలే సర్వస్వంగా వ్యవహరిస్తున్న మీకు, మీ పార్టీకి ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెబుతారు' అని సీఎం కేసీఆర్‌ను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హెచ్చరించారు. 'ప్రజాస్వామ్యం తోకలేని పక్షిలా మారిందని ఎవరన్నారో గానీ.. దాని తోకల్ని, ఈకల్ని, రెక్కల్ని పీకేసి మీలాంటి నియంతలు వాటిని తమ మకుటాలకు అలంకరించుకుంటారు' అని మండిపడ్డారు. ఉద్యమ నాయకుడిగా 2014లో అధికారంలోకి వచ్చాక 'కేసీఆర్ ఎవరి మాటా వినడు' అన్నట్లు తయారయ్యారని విమర్శించారు. ఈమేరకు కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. 'ఉద్యమ కాలంలో అన్ని పార్టీల గడపలు తొక్కిన మీరు.. అధికారం చేపట్టాక
మిగతా 5వ పేజీలో ▶

ఎస్సీ వర్గీకరణపై కమిటీ


- కేబినెట్ సెక్రెటరీ, ఉన్నతాధికారులకు మోదీ ఆదేశం
- ఎస్సీ వర్గీకరణపై విశ్వరూప మహాసభలో ప్రధాని హామీ
- నేటి నుంచి 3 రోజుల పాటు తెలంగాణలో కమిటీ పర్యటన

సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో మరో అడుగు ముందుకు పడింది. షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లలో ఉప వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు వీలైనంత త్వరగా కమిటీ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. శుక్రవారం కేబినెట్ సెక్రెటరీ రాజీవ్ గౌబా, ఇతర సీనియర్ అధికారులతో ఈ మేరకు ఆయన కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఇటీవల హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో
మిగతా 5వ పేజీలో ▶


సంతకం సాక్షిగా.. మద్యంలో ముడుపులు!

నోట్ ఫైళ్లపై చంద్రబాబు, కొల్లు రవీంద్ర సంతకాలు వెలుగులోకి

- అడ్డగోలుగా మద్యం దుకాణాలు, బార్ల ప్రివిలేజ్ ఫీజులు రద్దు
- ప్రభుత్వ ఖజానాకు రూ.1,299.64 కోట్ల నష్టం
- ఆర్థిక శాఖ అనుమతి, ఆమోదం లేకుండా తతంగం
- కేబినెట్ భేటీ ముగిశాక గుట్టుగా చీకటి జీవోలు జారీ
- టీడీపీ సర్కారు తీరును తప్పబట్టిన ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్
- ఇన్నాళ్లూ మా బాబుకు ఏమీ తెలియదంటూ బుకాయించిన ఎల్లో గ్యాంగ్



ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల కాపీని నాటి సీఎం చంద్రబాబు ముఖ్య కార్యదర్శికి పంపినట్లు ఆధారం



కేబినెట్ ఆమోదం లేకుండా మద్యం దుకాణాలపై ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో-218 కాపీ



బార్లపై ప్రివిలేజ్ ఫీజు రద్దు చేస్తూ జీవోలో పేర్కొన్న అంశం

సాక్షి, అమరావతి: మద్యం కుంభకోణం ద్వారా అస్మదీయ కంపెనీలకు అడ్డగోలుగా ప్రయోజనం కల్పించిన మాజీ సీఎం చంద్రబాబు నిర్వాకాలు సంతకాలు సాక్షిగా బహిర్గతమయ్యాయి. ఇన్నాళ్లూ ఆయనకు ఏమీ తెలియదంటూ బుకాయించిన టీడీపీ నేతలు, ఎల్లో మీడియా వాదనలో ఏమాత్రం నిజం లేదని నోట్‌ఫైళ్ల సాక్షిగా తేటతెల్లమైంది. మద్యం కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ అంతా చంద్రబాబేనని, గుట్టు చప్పుడు కాకుండా ఈ కుంభకోణానికి పాల్పడ్డారని నిరూపించే కీలక ఆధారాలు లభ్యమయ్యాయి. నాడు ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా, కేబినెట్‌కు తెలియకుండా అస్మదీయులకు చెందిన బెవరేజీలు, మద్యం దుకాణాలు, బార్లకు చంద్రబాబు ప్రయోజనం కల్పించారు. 2012 నుంచి మద్యం దుకాణాలపై ఉన్న 8 శాతం ప్రివిలేజ్ ఫీజు ప్లస్ జీఎస్టీ, బార్లపై ఉన్న 9 శాతం ప్రివిలేజ్ ఫీజు ప్లస్ జీఎస్టీని తొలగిస్తూ రెండు చీకటి జీవోలు జారీ చేశారు. తద్వారా ఖజానాకు రూ.1,299.64 కోట్ల మేర గండి కొట్టారు. ఈమేరకు సంబంధిత నోట్ ఫైళ్లపై నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర డిజిటల్ సంతకాలు చేసినట్లు అధికారిక రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఖజానాకు తూట్లు పొడిచి సన్నిహితులు, బినామీలకు చెందిన కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు సాగించిన మద్యం కుంభకోణం ఇలా సాగింది!!

ఆర్థిక శాఖ అనుమతి లేదు... కేబినెట్ ఆమోదం లేదు

అధికారంలో ఉండగా మద్యం విధానం ముసుగులో చంద్రబాబు ప్రభుత్వం యథేచ్ఛగా అవినీతికి పాల్పడింది. 2012 నుంచి అమలులో ఉన్న ప్రివిలేజ్ ఫీజును నిబంధనలకు విరుద్ధంగా తొలగించింది. కనీసం ఆర్థిక శాఖ అనుమతిగానీ కేబినెట్ ఆమోదంగానీ లేకుండానే కథ నడిపించింది. రెండు జీవోలకు కేబినెట్ తీర్మానం చేసి ప్రివిలేజ్


మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలని రూపొందించిన ఫైల్‌పై చంద్రబాబు, కొల్లు రవీంద్ర చేసిన డిజిటల్ సంతకాలు

ఫీజు తొలగించే కీలకమైన జీవోను మాత్రం అడ్డదారిలో తేవడం చంద్రబాబు పన్నాగానికి నిదర్శనం. 2015లో చంద్రబాబు ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని తెచ్చింది. నాడు కేబినెట్ సమావేశానికి ముందు అప్పటి ఎక్సైజ్ కమిషనర్ ఓ నోట్ ఫైల్‌ను ప్రభుత్వానికి పంపారు. మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ ఫీజును కొనసాగించడమే కాకుండా 10 రెట్లు పెంచాలని అందులో ప్రతిపాదించారు. అయితే ఆ ప్రతిపాదనను చంద్రబాబు కేబినెట్ దృష్టికే తీసుకెళ్లలేదు. నూతన మద్యం విధానంపై కేబినెట్ సమావేశంలో చర్చించి 2015 జూన్ 22న జీవోలు 216, 217 జారీ చేయగా ఆ రెండు జీవోల్లోనూ మద్యం దుకాణాలకు (ఏ 4 షాపులు) ప్రివిలేజ్ ఫీజు తొలగిస్తున్నట్లు ఎక్కడా పేర్కొనలేదు. అయితే అదే రోజు సాయంత్రం అప్పటి ఎక్సైజ్ కమిషనర్ ప్రభుత్వానికి ఓ నోట్ పంపారు. మద్యం దుకాణాలపై ప్రివిలేజ్ ఫీజు తొలగించాలని ప్రతిపాదిస్తూ అందుకోసం ఎక్సైజ్ చట్టం 16(9) నిబంధనను రద్దు చేయాలని అందులో సిఫార్సు చేశారు. ఆ నోట్ ఫైల్‌ను చంద్రబాబు కార్యాలయానికి పంపారు. ఈమేరకు 'కాపీ టు పీఎస్ టు సీఎం' అని నోట్‌ఫైల్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అంటే ప్రివిలేజ్ ఫీజును తొలగిస్తున్న విషయం చంద్రబాబుకు స్పష్టంగా తెలుసని తేలిపోతోంది.

సాయంత్రం గుట్టుగా జీవో

చంద్రబాబు ఆమోదంతోనే ప్రివిలేజ్ ఫీజును రద్దు చేస్తూ అదే రోజు అంటే 2015 జూన్ 22న సాయంత్రం గుట్టుగా జీవో 218 జారీ అయింది. ఈ జీవో గురించి కేబినెట్‌లో చర్చించలేదు. అజెండాలో ఆ అంశమే చేర్చలేదు. ఖజానాకు నష్టం వాటిల్లే అంశాలపై ముందుగా ఆర్థిక శాఖ ఆమోదం తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ ప్రివిలేజ్ ఫీజు రద్దు విషయాన్ని ఆర్థిక శాఖకు తెలియచేయలేదు. అనుమతి తీసుకోలేదు. అంటే కేబినెట్‌కు తెలియకుండా, కనీసం ఆర్థిక శాఖ అనుమతి లేకుండా కథ నడిపించాలని చంద్రబాబు ముందే నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది.

బార్లలోనూ అదే బరితెగింపు...

మద్యం దుకాణాలపై అడ్డగోలుగా ప్రివిలేజ్ ఫీజును రద్దు చేసిన చంద్రబాబు అంతటితో ఆగలేదు. తన సన్నిహితులైన బార్ల యజమానులకు కూడా అదే రీతిలో లబ్ధి చేకూర్చారు. ఈమేరకు చంద్రబాబు ఆదేశాలతో బార్లపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయాలని, అందుకోసం ఎక్సైజ్ చట్టం 10(ఏ) నిబంధన తొలగించాలంటూ అప్పటి ఎక్సైజ్ కమిషనర్ 2015 సెప్టెంబరు 1న ఓ సర్క్యులర్ ఇచ్చారు. ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలని బార్ల యజమానులు ప్రభుత్వాన్ని అభ్యర్థించినట్లు కనికట్టు చేశారు. 2015 సెప్టెంబరు 9న బార్ల యజమానులు ఈమేరకు వినతిపత్రం సమర్పించినట్లు రికార్డుల్లో చూపడం గమనార్హం. సెప్టెంబరు 9న వినతి పత్రం సమర్పిస్తే దానికి వారం రోజులు ముందుగానే సెప్టెంబరు 1నే ప్రివిలేజ్ ఫీజు రద్దు చేయాలని ఎక్సైజ్ కమిషనర్ సర్క్యులర్ ఎలా ఇచ్చారన్నది చంద్రబాబే చెప్పాలి. బార్లకు ప్రివిలేజ్ ఫీజు రద్దుపై కూడా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోలేదు. కేబినెట్ ఆమోదమూ పొందలేదు. ఏకపక్షంగా రద్దు చేయాలని నిర్ణయించారు. బార్లపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేస్తూ 2015 డిసెంబర్ 11న జీవో 468 జారీ అయింది. నాటి సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఈ వ్యవహారాన్ని గుట్టుగా నడిపారు. అందుకు సంబంధించిన నోట్ ఫైళ్లపై ఎక్సైజ్ శాఖ మంత్రి హోదాలో కొల్లు రవీంద్ర 2015 డిసెంబర్ 3న సంతకం చేయగా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు 2015 డిసెంబర్ 4న డిజిటల్ సంతకాలు చేయడం గమనార్హం. ఇన్నాళ్లూ అసలు ప్రివిలేజ్ ఫీజు రద్దు విషయం చంద్రబాబుకు కనీసం తెలియదని టీడీపీ న్యాయవాదులు, ఈనాడు రామోజీరావు బుకాయించారు.

తీవ్రంగా తప్పుబట్టిన ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్

టీడీపీ సర్కారు నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయడాన్ని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ తీవ్రంగా తప్పుబట్టారు. రాజ్యాంగబద్ధ సంస్థ 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్'(కాగ్) ఆధ్వర్యంలో స్వతంత్రంగా విధులు నిర్వర్తించే ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఈమేరకు తన అభ్యంతరాలను స్పష్టంగా నివేదించారు. చంద్రబాబు సర్కారు నిర్వాకంతో రాష్ట్ర ఖజానాకు రూ.1,299.64 కోట్ల నష్టం వాటిల్లిందని స్పష్టం చేశారు.

జన హోరుతో జైత్రయాత్ర



సామాజిక సాధికార సభలకు పోటెత్తిన ప్రజలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నంద్యాల జిల్లా ఆత్మకూరులో సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

కదం తొక్కిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శ్రేణులు

వందలాది బైక్‌లతో భారీ ర్యాలీలు..

జగన్ పాలనలో దక్కిన సామాజిక సాధికారతను వివరించిన నేతలు

దళితులను, బీసీలను చంద్రబాబు అవమానించారని మండిపాటు



ఏయూలో చారిత్రక కళావేదిక పునఃప్రారంభం

- సంతోషం వ్యక్తం చేసిన సినీ నటుడు అక్కినేని నాగార్జున
- ఎందరో కళాకారులకు ప్రాణం పోసిన వేదికను మళ్లీ అందుబాటులోకి తేవడంపై హర్షం
- ఏయూలో తన సినిమా చిత్రీకరిస్తానని వెల్లడి

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర యూనివర్సిటీలో అభివృద్ధి చేసిన చారిత్రక ఆరుబయలు రంగస్థల వేదిక-ఎస్కిన్ స్క్వేర్‌ను ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున చేతుల మీదుగా శుక్రవారం పునఃప్రారంభించారు. దాదాపు రూ.కోటి వ్యయంతో నాడు-నేడు పథకం స్ఫూర్తితో ఆధునీకరించిన యాంఫీ థియేటర్‌ను నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. ఏయూ ప్రాంగణంలో తన తండ్రి అక్కినేని నాగేశ్వర రావు నటించిన కులగోత్రాలు చిత్రం షూటింగ్ జరిగిందన్నారు. త్వరలో తన సినిమా షూటింగ్‌ను కూడా ఇదే ప్రాంగణంలో చేస్తానని చెప్పారు. ఎందరో కళాకారులకు ప్రాణం పోసిన ఏయూ రంగస్థల వేదికను మళ్లీ తన చేతుల మీదుగా పునఃప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కళావేదిక చరిత్ర వింటుంటే అల్లూరి సీతారామరాజు గుర్తుకు వచ్చారన్నారు. తనపై ఎనలేని ప్రేమాభిమానాలు చూపించిన ఏయూ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏయూ హిందీ విభాగం గౌరవ ఆచార్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. అక్కినేని నాగేశ్వరరావు సంస్కారం కలిగిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆ రోజుల్లో సొంత ఇంటిని కొనుక్కోకుండా తన సంపాదనలో లక్ష రూపాయలు గుడివాడ కాలేజీకి, రూ.25 వేలు ఏయూకు విరాళంగా అందించారని గుర్తు చేశారు. ఈరోజు ఆయన వారసులు ఏయూ రంగస్థల వేదికను పునఃప్రారంభించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ సూచించిన విధంగా ఆర్ట్స్ కోర్సులకు పూర్వవైభవం తీసుకువస్తున్నామన్నారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, నటన తదితరాలను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన నాడు-నేడు పథకం నిధులతో విశ్వవిద్యాలయంలో చేసిన అభివృద్ధిని వివరించారు. రెండున్నర దశాబ్దాలుగా నిరుపయోగంగా మారిన ఈ ప్రాంగణాన్ని సీఎం జగన్ సహకారంతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. దీనిని నామమాత్రపు అద్దెతో కళాకారులకు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు అక్కినేని అఖిల్, నాగార్జున సోదరి సుశీల, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్స్, డీన్‌లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయకుడు ధనుంజయ్ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

ఏపీ హైకోర్టు ఆవరణలో మళ్లీ ఎత్తు పరీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సై పోస్టుల నియామక ప్రక్రియ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. గత నోటిఫికేషన్‌లో 'ఎత్తు' విషయంలో అర్హత సాధించిన అభ్యర్థులను తాజా నోటిఫికేషన్ కింద అనర్హులుగా ప్రకటించడంపై పిటిషన్ దాఖలు చేసిన అభ్యర్థులకు తమ పర్యవేక్షణలోనే 'ఎత్తు' పరీక్ష నిర్వహిస్తామని హైకోర్టు స్పష్టంచేసింది. హైకోర్టు ప్రాంగణంలోనే దీనికి సంబంధించిన కొలతలు తీసుకుంటామని తేల్చిచెప్పింది. ఎత్తు విషయంలో అధికారులపై పిటిషనర్లు చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలితే, ఒక్కో పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా విధిస్తామని స్పష్టంచేసింది. తాము ప్రతిపాదించిన విధంగా ఎత్తు కొలిచే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను తమ ముందుంచాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేంద్ర, జస్టిస్ న్యాపతి విజయ్ ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు..

ఎస్సై నియామక ప్రక్రియలో భాగమైన దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి ఎత్తు, ఛాతి చుట్టుకొలతను హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్‌గా కొలిచిన అధికారులు అందులో తమను అనర్హులుగా ప్రకటించారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలంటూ ఆరుగొళ్ల దుర్గాప్రసాద్, మరో 23 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2018 నోటిఫికేషన్‌లో అర్హులుగా ప్రకటించిన తమను ఎత్తు విషయంలో తాజా నోటిఫికేషన్‌లో అనర్హులుగా ప్రకటించారన్నారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఎస్సై నియామకాల కోసం గత నెలలో నిర్వహించిన రాత పరీక్షకు సంబంధించిన ఫలితాలను తదుపరి ఉత్తర్వులు జారీచేసేంత వరకు వెల్లడించవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు నియామక బోర్డు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశాయి. ఈ అప్పీల్‌పై శుక్రవారం జస్టిస్ నరేంద్ర నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్‌గా ఎత్తు కొలిచామని ప్రభుత్వ న్యాయవాది జీవీఎస్ కిషోర్‌కుమార్ ధర్మాసనానికి నివేదించారు. ఈ పరీక్షలో పిటిషనర్లు అర్హత సాధించలేదన్నారు. అయితే, ఈ విషయాన్ని సింగిల్ జడ్జి సరైన కోణంలో పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది స్పందిస్తూ.. 2018లో ఎత్తు విషయంలో అర్హత సాధించిన అభ్యర్థులు, తాజా నోటిఫికేషన్‌లో ఎలా అనర్హులవుతారని ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం మరోసారి ఎత్తు పరీక్ష నిర్వహిస్తామని తెలిపింది.

ఏపీలో ఉద్యోగులు తెలంగాణ ఓటరైతే పోలింగ్ రోజు సెలవు

సాక్షి, అమరావతి: తెలంగాణలో ఓటర్లుగా ఉండి.. ఏపీలో తెలంగాణ సరిహద్దు జిల్లాల్లోని వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, ఏరకమైన ఎస్టాబ్లిష్‌మెంట్‌లోనైనా పనిచేస్తున్న ఉద్యోగులు 30న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సెలవును ప్రకటించారు.

పదవుల కోసం కాంగ్రెస్ నిరుద్యోగుల పోటీ

- ఆటో కార్మికుల సమ్మేళనంలో కేటీఆర్
- రేవంత్ కూడా నీతులు చెబుతున్నారు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే ఐదేళ్లు ఇబ్బందులు పడాలి


ఆటో కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నేతలు రాజకీయ నిరుద్యోగంతో బాధ పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు అన్నారు. విద్యార్థుల చదువుల కోసం ఖర్చు పెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ కాగా, పదవుల కోసం కాంగ్రెస్ రాజకీయ నిరుద్యోగులు పోటీ పడుతున్నారని విమర్శించారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో కుటుంబానికి ఒకటే టికెట్ అని చెప్పిన కాంగ్రెస్ ఇంటికి ఇద్దరు అభ్యర్థులకు టికెట్లు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన ఆటో యూనియన్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ అవినీతిపరుడు అని విమర్శలు చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నోట్ల కట్టలతో దొరికిన చిల్లర దొంగ అని, ఆయన కూడా నీతులు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని మర్యాదగా ఇవ్వలేదని, కొట్లాడి తెచ్చుకున్నామని, అలాంటి తెలంగాణను ఉచ్చాల చేతిలో పెడదామా? అంటూ తీవ్రంగా విమర్శించారు.

ఆటో కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి అమలు

50 ఏళ్లు రాష్ట్రానికి ఏమీ చేయని కాంగ్రెస్ కొత్తగా చేసేదేముంది అని కేటీఆర్ ప్రశ్నించారు. మార్చిలో తప్పితే సెప్టెంబర్‌లో పరీక్ష రాసినట్లుగా ఉండకూడదని, ఒకసారి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఐదేళ్లు ఇబ్బందులు పడాలని హెచ్చరించారు. ఆటో నడుపుతూ స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికుల కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి వంటి పథకాలు అమలు చేయడంతో పాటు హైదరాబాద్‌లో ఆటో కార్మిక సంక్షేమ భవనం నిర్మిస్తామని ఈ సందర్భంగా కేటీఆర్ హామీ ఇచ్చారు. గతంలో ఆటోలపై పన్ను రద్దు చేసిన తరహాలో వెహికల్ ఫిట్‌నెస్ చార్జీలు కూడా రూ.వంద కోట్ల మేర రద్దు చేస్తామని ప్రకటించారు.

తెలంగాణ ప్రగతి ప్రస్థానం పుస్తకావిష్కరణ

తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన 'ప్రగతి ప్రస్థానం.. ఎట్లుండె తెలంగాణ ఎట్లైంది'అనే పుస్తకాన్ని కేటీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని వెలువరించిన జర్నలిస్టు రమేష్ హజారీని అభినందించారు.

శాస్త్రోక్తంగా కైశికద్వాదశి ఆస్థానం


మాడవీధుల్లో ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

తిరుమల: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో శుక్రవారం కైశిక ద్వాదశి ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 4.45 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడ వీధులలో ఊరేగిస్తారు. అనంతరం ఉదయం 6 నుంచి ఉదయం 7.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లను బంగారు వాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుమల పెద్ద జీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు పలువురు పాల్గొన్నారు. తిరుమల వసంత మండపంలో శ్రీతులసి దామోదర పూజ ఘనంగా నిర్వహించారు. అలాగే తిరుమలలో చక్రతీర్థ ముక్కోటి శాస్త్రోక్తంగా జరిపారు.

26న కార్తీక పర్వదీపోత్సవం.. 27న పౌర్ణమి గరుడసేవ

శ్రీవారి ఆలయంలో ఆదివారం సాలకట్ల కార్తీక పర్వదీపోత్సవం జరగనుంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తర్వాత ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో సహస్రదీపాలంకరణ సేవను టీటీడీ రద్దు చేసింది. కాగా, పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఈ నెల 27న గరుడసేవ జరగనుంది. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

ఐఏఎస్, ఐపీఎస్‌లపై దాఖలైన పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అఫిడవిట్ ట్యాంపరింగ్ చేసేందుకు సహకరించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇంకా అక్కడే పనిచేస్తున్నారని, వారిని బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మహబూబ్‌నగర్‌కు చెందిన చలువగాలి రాఘవేంద్రరాజు దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. ఇదే అంశంపై పిటిషనర్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారని, దానిపై స్పందిస్తూ వివరణ కూడా ఈసీ ఇచ్చిందని చెప్పారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై విచారణ అవసరం లేదన్నారు.


ఎమ్మెల్యేలు, ఎంపీలపై ఉన్న కేసుల వివరాలివ్వండి

రిజిస్ట్రీకి తెలంగాణ హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను అందజేయాలని రిజిస్ట్రీని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా కేసుల వారీగా వివరాలు సమర్పించాలని స్పష్టం చేస్తూ, విచారణను డిసెంబర్ 15కు వాయిదా వేసింది. అశ్వినీకుమార్ ఉపాధ్యాయ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు విచారణలో భాగంగా ఎమ్మెల్యేలు, ఎంపీలపై ఉన్న క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని నవంబర్ 9న సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో విచారణలను హైకోర్టు వేగవంతం చేసే చర్యలు చేపట్టింది. ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం సుమోటో పిల్‌గా విచారణ చేపట్టింది. ఈ క్రిమినల్ కేసుల డేటాను రెండు వారాల్లోగా క్రోడీకరించి హైకోర్టుకు అందజేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

ఏపీలో 9 నుంచి కులగణన

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు వెల్లడి



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా చరిత్రాత్మకమైన కులగణన ప్రక్రియను డిసెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద శుక్రవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి వేణు మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన తర్వాత జనగణన తప్ప కులగణన జరగలేదని చెప్పారు. సామాజిక సాధికారితకు చిరునామాగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప సంకల్పంతో కులగణన చేపట్టాలని నిర్ణయించారని తెలిపారు. అట్టడుగు కులాలతోపాటు అన్ని వర్గాల పేదల తలరాతలు మార్చడానికే సమగ్ర కులగణనను తమ ప్రభుత్వం చేపట్టిందని పునరుద్ఘాటించారు. ప్రజల జీవన స్థితిగతులను మార్చేందుకు కులగణన చాలా అవసరమని చెప్పారు. సమగ్ర కులగణనతో రాష్ట్రంలో పేదవాడి జీవితానికి భద్రత లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో నిర్వహించనున్న కులగణన దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని మంత్రి ధీమా వ్యక్తంచేశారు.

బీజేపీని ఓడించేందుకే కాంగ్రెస్‌తో జత కట్టాం

కొత్తగూడెం కార్నర్ మీటింగ్‌లో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా


సమావేశంలో మాట్లాడుతున్న డి.రాజా, పక్కన నారాయణ, కూనంనేని, పొంగులేటి తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్'అంటూ గద్దెనెక్కిన నరేంద్ర మోదీ గడిచిన పదేళ్లలో అంబానీ, అదానీ వికాసం కోసమే పని చేశారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపడ్డారు. మోదీ మరోసారి అధికారంలోకి వస్తే సింగరేణి సంస్థను అదానీకి కట్టబెట్టడం ఖాయమన్నారు. కొత్తగూడెంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కొత్తగూడెంలో కాంగ్రెస్ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించాలని కోరారు. మతతత్వ బీజేపీ నుంచి ఈ దేశాన్ని కాపాడేందుకే కాంగ్రెస్, సీపీఐ జతకట్టాయని వెల్లడించారు.

'సింగరేణి'కే భయపడ్డారు..

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు గతేడాదే నిర్వహించాల్సి ఉన్నా ఓటమి భయంలో బీఆర్ఎస్ వాయిదా వేసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. కానీ ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆ పార్టీ ఓటమి నుంచి తప్పించుకోలేదని చెప్పారు. ఈ క్రమంలో కొత్తగూడెం బీఆర్ఎస్ అభ్యర్థి వనమా, ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి నారాయణ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. 'చిన్నపిల్లల మాదిరి డైపర్లు ఉపయోగించే బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఇంట్లో ఉండకుండా ఎన్నికలకు రావడం ఎందుకు'అని ప్రశ్నించారు. 'ఆడవాళ్లు బంగారం, కిరాణం ఇలా ఏదైనా వ్యాపారం చేసుకోవచ్చు కానీ, మద్యం వ్యాపారం చేయడం ఏమిటి? కేసీఆర్ కూతురు కవిత లిక్కర్ స్కాములో అరెస్టు కావాల్సి ఉన్నా, సీఎం కేసీఆర్ బీజేపీ నేతల కాళ్లు మొక్కి తప్పించారు'అంటూ ఘాటైన విమర్శలు చేశారు. ఇదే సమయంలో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకటరావును ఉద్దేశించి 'పార్టీ గుర్తు తల్లి వంటిదని, కానీ వేరే పార్టీకి డబ్బు ఇచ్చి గుర్తు తెచ్చుకున్న వెంకటరావు.. మాజీ సీఎం జలగం వెంగళరావు కడుపున చెడపుట్టాడు' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత పీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో పదికి పది, రాష్ట్ర వ్యాప్తంగా 70 నుంచి 80 సీట్లలో కాంగ్రెస్ కూటమి గెలవబోతోందని తెలిపారు. కాగా, ఈ కార్నర్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ రావాల్సి ఉన్నా చివరి నిమిషంలో ఆమె పర్యటన రద్దయింది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+6 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 244

శనివారం 25-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'



24 మంది బందీలకు స్వేచ్ఛ

సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య కుదిరిన సంధి శుక్రవారం ఉదయం నుంచే అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో 13 మంది ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడిచిపెట్టింది. ఇందుకు బదులుగా 39 మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేయనుంది. – 6లో

నిజాంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న అమిత్ షా. పక్కన శేరిలింగంపల్లి అభ్యర్థి రవికుమార్ యాదవ్. రోడ్ షోకు హాజరైన జనం..





డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి

బీజేపీ అగ్రనేత, కేంద్రమంత్రి అమిత్‌షా

- కోట్లాది రూపాయలు తెచ్చి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతాం
- సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపిస్తాం
- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కేసీఆర్ నెరవేర్చలేదు
- కాంగ్రెస్‌లో మంత్రి పదవి కావాలంటే ఢిల్లీలో చర్చ జరగాలంటూ ఎద్దేవా
- నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, హైదరాబాద్‌లో ప్రచారం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/ బంజారగూడ, అంబర్‌పేట (హైదరాబాద్): తెలంగాణ అభివృద్ధికి డబుల్ ఇంజన్ సర్కార్ అవసరమని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే కోట్లాది రూపాయలు తెచ్చి తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతామని చెప్పారు. సంక్షేమం అంటే ఏమిటో చేసి చూపిస్తామని, బీసీని సీఎం చేసి తీరుతామని అన్నారు. తన కుమారుడు కేటీఆర్ కోసమే కేసీఆర్ రాష్ట్రంలో అవినీతి పాలన సాగించారని ఆరోపించారు. డబ్బులు ఎక్కువ ఇచ్చిన వాళ్లకే కేసీఆర్ మంత్రివర్గంలో అవకాశం దక్కుతుందని, ఇక కాంగ్రెస్‌లో రాష్ట్ర మంత్రి పదవి కావాలంటే ఢిల్లీలో చర్చ జరగాలని అన్నారు. ఇలాంటి పార్టీలు మనకు అవసరం లేదని చెప్పారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల సకల జనుల సంకల్ప సభలో, హైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్షాకోట్, నగరంలోని నిజాంపేట, అంబర్‌పేటల్లో నిర్వహించిన రోడ్‌షోల్లో ఆయన ప్రసంగించారు.

బీఆర్‌ఎస్ అంకం ముగిసిపోయింది..

'గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేసీఆర్ నెరవేర్చలేదు. 2014 ఎన్నికల తర్వాత దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని మోసం చేశారు. బీఆర్‌ఎస్ అంకం ముగిసిపోయింది. ఆ పార్టీ పాలనలో ఔటర్ రింగ్ రోడ్డు, కాళేశ్వరం ప్రాజెక్టు, మద్యం, గ్రానైట్ కుంభకోణాలే ఉన్నాయి. అవినీతిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపిన ఘనులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు. ఇలాంటి వారి భరతం పట్టేందుకు ప్రజలంతా బీజేపీని గెలిపించాలి. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే అవినీతికి పాల్పడిన వారికి జైలు శిక్షలు విధిస్తాం. రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయకుండా యువత జీవితాలతో కేసీఆర్ చెలగాటం ఆడుతున్నారు. కేవలం తన కుటుంబానికే పదవులు కల్పిస్తున్నారు తప్ప తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు కొమ్ముకాస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ గుర్తు అయిన మిగతా 5వ పేజీలో ▶



బీజేపీదే అధికారం..

- అత్యధిక సీట్లు గెలుపొందుతాం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- ఆ రెండు పార్టీలను ఎవరూ నమ్మరు
- నాగారం, కార్వాన్, కంటోన్మెంట్‌లో ప్రచారం

- వివరాలు 5లో

రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి



కాంగ్రెస్ గెలుపుతోనే తెలంగాణ యువత కల సాకారం: ప్రియాంకా గాంధీ

బీఆర్‌ఎస్, బీజేపీ.. బొమ్మా బొరుసు

ఆ పార్టీలకు ఎంఐఎం అంటకాగుతోంది

యువత జీవితాలను కేసీఆర్ చీకట్లోకి నెట్టారు.. రైతులు, మహిళలకు ఏం చేశారని ఓట్లు అడుతున్నారు?

మహబూబాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ప్రచారం

సాక్షి, మహబూబాబాద్/సాక్షి, సిద్దిపేట/హుస్నాబాద్‌రూరల్: 'మందుల షాపులో ప్రతీ మందుపై ఎక్స్‌పైరీ తేదీ ఉన్నట్లే.. బీఆర్‌ఎస్‌కూ కాలం చెల్లింది. ఓటమికి దగ్గరగా ఉన్న ఆ పార్టీ అంతిమ గడియలు లెక్కపెట్టుకుంటోంది' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అన్నారు. త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణను కేసీఆర్ ఆగం చేశారన్నారు. 'మా నాయనమ్మ ఇందిరాగాంధీ ఎప్పుడూ చెబుతూ ఉండేది. ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం. ప్రజలు చైతన్య వంతులు' అని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు ప్రజల్లో చైతన్యం వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తోందని చెప్పారు. ఈ చైతన్యంతో ఫాం హౌజ్‌లో ఉండి పాలించే నాయకులు కావాలో.. ప్రజల మధ్య ఉండి పాలించే కాంగ్రెస్ కావాలో తేల్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పరిధిలోని తొర్రూరులో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభల్లో ప్రియాంక ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఈ ప్రాంతం ప్రజలు చేసిన పోరాటాలకు ప్రపంచ వ్యాప్తంగా కీర్తి ఉందని చెప్పారు.

యువత జీవితాలు చీకటి మయం

'రాష్ట్రం సాధిస్తే ఉద్యోగాలు వస్తాయని యువత ఆశలు పెంచుకుంది. రాష్ట్ర సాధన తర్వాత కేసీఆర్ యువత జీవితాలను చీకటి మయం చేశారు. కష్టపడి చదివినా ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొంది. పేపర్ లీకేజీలతో చదువుకున్న వారి భవిష్యత్ అంధకారంలోకి వెళ్లింది. ఉద్యోగం రాలేదని విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంటే. ఆ కుటుంబాన్ని ఓదార్చాల్సిన ప్రభుత్వం, నాయకులు అసలు ఆమె పరీక్షే రాయలేదని వ్యంగ్యంగా మాట్లాడిన తీరు ప్రభుత్వానికి యువతపై ఉన్న శ్రద్ధకు నిదర్శనం' అని ప్రియాంక అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజస్తాన్‌లో మాదిరిగా ఉద్యోగాల భర్తీ క్యాలెండర్‌ను ముందుగానే విడుదల చేస్తామన్నారు. అదేవిధంగా మిగతా 4వ పేజీలో ▶

బర్రెలక్కకు భద్రత కల్పించండి

- పోలీస్ అధికారులకు హైకోర్టు ఆదేశం
- కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న శిరీష - 2లో

అదానీ గ్రూప్‌పై ఆధారాలున్నాయా?

- సీనియర్ లాయర్ ప్రశాంత్ భూషణ్‌కు సుప్రీంకోర్టు ప్రశ్న
- విదేశీ రిపోర్టులను సాక్ష్యాధారాలుగా పరిగణించలేమని వెల్లడి

➤ భారత్‌కు చెందిన అదానీ గ్రూప్ ఇద్దరు విదేశీ ఇన్వెస్టర్ల ద్వారా ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడిందని ఆరోపిస్తూ ఓసీసీఆర్‌పీ అనే విదేశీ స్వచ్ఛంద సంస్థ ఓ నివేదిక విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. అక్రమాలకు పాల్పడిన అదానీ గ్రూప్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టులో పిల్‌లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది.

- వివరాలు 6లో



ప్చ్!.. మన దాకా రానిచ్చేట్లు లేరుగా..!

శుక్రవారం మెట్రో రైలులో ప్రయాణిస్తూ విద్యార్థినితో మాట్లాడుతున్న కేటీఆర్



సొంతింటి రుణానికి ప్రభుత్వ వడ్డీ!

మధ్యతరగతి వారి కోసం కొత్త పథకం: కేటీఆర్

ఉద్యోగాలు ఇచ్చినా చెప్పుకోలేక పోయాం

దేశంలో ఎక్కడాలేని రీతిలో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

2లో

క్లుప్తంగా...

సీఎం సభలో స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

ఓటెయ్యమని బీఆర్‌ఎస్ కార్యకర్తలకు వేడుకోలు



'అమ్మలారా.. అక్కలారా.. అన్నలారా.. తమ్ముళ్లారా.. ఎన్నికల ప్రచారానికి పైసల్లేవ్.. తిరిగేందుకు బండి లేదు.. ఖర్చుచేసే ఆర్థిక స్తోమత అంతకన్నా లేదు. చాలా గరీబోన్ని.. ఉన్నదల్లా ఈ ఒక్క సైకిలే.. ఈ ఎన్నికల్లో నన్ను రామగుండం ఎమ్మెల్యేగా గెలిపించండి'.. అంటూ ఓటర్లను అభ్యర్థించారు స్వతంత్ర అభ్యర్థి లింగాల శంకర్. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో శుక్రవారం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ జరిగింది. సభ అనంతరం సభాస్థలి గేటు వద్ద సైకిల్ ప్రచార రథంతో స్వతంత్ర అభ్యర్థి ఓట్లు అడిగారు. సభకు వచ్చి వెళ్తున్న కార్యకర్తలు, ప్రజలను టైరు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వేడుకోవడం కనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దు

సీఎం కేసీఆర్‌కు ఈసీ అడ్వైజరీ జారీ

సాక్షి, హైదరాబాద్: దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై కత్తితో జరిగిన దాడి ఘటనపై స్పందిస్తూ ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగంపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. భిన్న కులమతాలు, వర్గాల ప్రజల మధ్య వైషమ్యాలు పెంపొందించే విధంగా ముఖ్యమంత్రి ప్రసంగం ఉందని, ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘననే అని స్పష్టం చేసింది. ఇకపై అలాంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని హితవు పలికింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ముఖ్యకార్యదర్శి అవినాష్ కుమార్ శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అడ్వైజరీ జారీ చేశారు. కొత్త ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడిపై స్పందిస్తూ గత నెల 30న నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో చేసిన ఎన్నికల ప్రసంగంలో కేసీఆర్ రెచ్చగొట్టేలా ప్రసంగించారంటూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయగా, ఈసీ విచారణకు ఆదేశించింది. స్థానిక రిటరి్నంగ్ అధికారి విచారణ చేసి ఈ నెల 14న కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపించారు. దీంతో ఇకపై రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దని ఈసీ అడ్వైజరీ జారీ చేసింది.

నాపై దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించారు

బండి సంజయ్‌పై మంత్రి గంగుల ధ్వజం



కరీంనగర్: ఎంపీ బండి సంజయ్ కుమార్ తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించారని మంత్రి గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ...తనను రాజకీయంగా ఎదుర్కోలేక తన కుటుంబాన్ని వేధించారన్నారు. గతంలో కుటుంబంతో తాను దుబాయ్‌లో ఉన్నప్పుడు తన ఇంటిపై దాడి చేసి, తాళాలు పగలగొట్టి, దౌర్జన్యం చేశారని మండిపడ్డారు. అలాంటి దుర్మార్గునికి, అవినీతిపరునికి ఓటేద్దామా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

పోల్ స్లిప్పుల పంపిణీకి వినతి

సాక్షి, హైదరాబాద్: ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోల్ స్లిప్పులను పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. శనివారంతో పోల్ స్లిప్పుల పంపిణీ ముగియనున్నందున ఉదయం నుంచి సాయంత్రం వరకు వాటిని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచాలని కోరింది. ఈ మేరకు టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ శుక్రవారం ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు లేఖ రాశారు. అధికార పార్టీ ఓటర్లను ప్రలోభపరిచేందుకు ప్రయత్నిస్తోందని కూడా ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్‌కు ఓటేయకపోతే పింఛన్ ఆగిపోతుందని ఓటర్లను బెదిరిస్తున్నారని ఆరోపించారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేటిలోగా ఆర్వోలకు ఫారం 12డీలను పంపాలి

జిల్లా కలెక్టర్లకు సీఈఓ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల విధుల్లో ఉండనున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం ఈనెల 23లోగా సమర్పించిన ఫారం 12డీలను సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల (ఆర్వో)కు పంపించాలని జిల్లా ఎన్నికల అధికారులైన జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. ఫారం 12డీలను పరిశీలించిన అనంతరం సదరు ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని ఆర్వోలకు సూచించారు. ఆర్వోలకు ఈ దరఖాస్తుల చేరవేతను శనివారంలోగా పూర్తి చేయాలన్నారు. దరఖాస్తును సంబంధిత నియోజకవర్గ ఆర్వో పంపడంలో విఫలమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



శుక్రవారం ములుగులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు

..ఎమర్జెన్సీలు.. ఎన్‌కౌంటర్లు

▶ మొదటి పేజీ తరువాయి

మంచి జరుగుతుంది. కాబట్టి అధికార బీఆర్‌ఎస్‌ను బలపరచాలి..' అని ఆ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లా నస్పూర్, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు.

తల్లులకు మొక్కినం..రాష్ట్రం సాధించుకున్నం

'సమ్మక్క సారలమ్మ నేలకు వందనం. రాష్ట్రం కోసం తల్లులకు మొక్కినం. ఎన్నోసార్లు మా తెలంగాణ రావాలని బంగారం ఇచ్చాం. మొక్కులు చెల్లించినం. బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసం. 15 ఏళ్లు మడమ తిప్పకుండా పోరాటం చేసి సాధించుకున్నాం. అంతకుముందు ఈ జాతరకు అంత ఆదరణ లేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏటా రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్లతో బ్రహ్మాండంగా నిర్వహిస్తున్నాం. ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. తొలుత ప్రజాసంక్షేమ సంకల్పంతో విధి వంచితులైన వితంతువులు, వృద్ధులు, వికలాంగుల లాంటి వారిని పరిగణనలోకి తీసుకొని బిర్యానీ కాకపోయినా పప్పు, చారుతోనైనా తినాలని, ఆసరా పింఛన్ రూ.200 నుంచి రూ.2 వేలకు పెంచాం. ఈ ఎన్నికల తర్వాత రూ.5 వేల వరకు పెంచుతాం. చందూలాల్ ఉన్నప్పుడు ములుగు తండావాసీ బాధ చూసి కూతురి పెళ్లికి సాయం చేశాం. ఆ తర్వాత కల్యాణలక్ష్మి ప్రారంభించాం. యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఇలాంటి పథకాలు ఒక్కటైన తెచ్చారా? పక్కన గోదావరి, కృష్ణానది ఉన్నా.. ఎక్కడా తాగునీటి కల్పనకు చర్యలు తీసుకోలేదు. కానీ బీఆర్‌ఎస్ పాలనలో నల్లగొండ జిల్లా ఆరోగ్య సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ పథకం అమలు చేశాం. 44,861 ఎకరాల పోడు భూములు పంపిణీ చేయడమే గాకుండా కేసులు ఎత్తేసి, రైతుబంధు అమలు చేసి, త్రీఫేజ్ కరెంటు సరఫరా పనులు చేపట్టాం. పల్లె, బస్తీ దవాఖానాల్లో ఉచితంగా పరీక్షలు చేస్తున్నాం. కేసీఆర్ కిట్లు ఇస్తున్నాం. గిరిజనేతర పోడు భూమి రైతులకు కూడా పట్టాలు ఇప్పిస్తాం..' అని కేసీఆర్ చెప్పారు.

మంచి ఎమ్మెల్యే గెలిస్తే, మంచి గవర్నమెంట్ వస్తది

'ఓటేసే ముందు పార్టీల చరిత్ర, నడవడిక, దృక్పథం పరిగణనలోకి తీసుకోవాలి. మంచి ఎమ్మెల్యే గెలిస్తే, మంచి గవర్నమెంట్ వస్తది. ఈ రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉంటే బాగా అభివృద్ధి చెందుతుందో ఆలోచించాలి. కాంగ్రెస్ 50 సంవత్సరాల్లో దేశాన్ని, రాష్ట్రాన్ని పరిపాలించిన తీరు, బీఆర్‌ఎస్ పాలన తీరు బేరీజు వేసుకొని నిర్ణయం తీసుకోవాలి. ఎవరైతే న్యాయంగా అవసరమైన పేదలకు పని చేయగలుగుతారో చూసి ఓటెయ్యాలి..' అని కేసీఆర్ కోరారు. 'గతంలో ములుగులో ఓడించారు. మీమీద అలిగిన. ఇప్పుడు గెలిపించకుంటే మీతో పంచాయితీ పెట్టుకుంటా..' అని అన్నారు. ఆయా సభల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు బడే నాగజ్యోతి (ములుగు), గండ్ర వెంకటరమణా రెడ్డి (భూపాలపల్లి), నడిపెల్లి దివాకర్‌రావు (మంచిర్యాల), కోరుకంటి చందర్ (రామగుండం), మంత్రులు సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు కవిత, వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దొంగల చేతిలో రాష్ట్రాన్ని పెట్టొద్దు


'ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా సుమారు 80 నియోజకవర్గాల్లో పర్యటించా. ఇంకో ఇరవై తిరుగుతా. కాంగ్రెస్ పరిస్థితి బాగాలేదు.. తుస్సుమంది. వచ్చేది లేదు.. చచ్చేదీ లేదు. తప్పిదారి ఆ పార్టీకి అధికారం ఇస్తే వైకుంఠం ఆటలో పెద్దపాము మింగినట్లే. తెలంగాణలోనూ కర్ణాటక తరహాలోనే దగా చేస్తారు. మళ్లీ దొంగల చేతుల్లో రాష్ట్రాన్ని పెట్టొద్దు. రైతులకు ఉచిత కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్ 3 గంటలు సరిపోతుందంటోంది. 30 లక్షల పంపుసెట్లను 10 హెచ్‌పీకి పెంచితే అయ్యే రూ.50 వేల కోట్లు ఎవరు ఇస్తారు?. భూ భద్రతతో పాటు రైతుబంధు డబ్బులు నేరుగా ఖాతాల్లో పడే సాంకేతికతతో కూడిన ధరణిని ఎద్దు ఎవుసం తెలియని రాహుల్‌గాంధీ బంగాళాఖాతంలో పడేస్తరట. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలను ఊడగొట్టిందే కాంగ్రెస్ పార్టీ. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ఉద్యోగాలను పునరుద్ధరించుకున్నాం. మొన్ననే సింగరేణి కార్మికులకు బోనస్ కానీ, లాభాల్లో వాటా కానీ..రూ.1,000 కోట్ల వరకు పంచినం. సింగరేణి తెలంగాణకు సిరులతల్లి.. దీన్ని మరింత విస్తరిస్తాం. బయ్యారం ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్రం నాన్చుడు ధోరణి అవలంబిస్తోంది. ఇకపై దాని బాధ్యతలను సైతం సింగరేణి తీసుకుంటుంది. రాష్ట్రంలో ఎక్కడ మైనింగ్‌కు అవకాశాలున్నా సింగరేణి ఆధ్వర్యంలో చేపడతాం. బీజేపీకి ఓటేస్తే మోరీలో వేసినట్లే. దేశంలో 157 మెడికల్ కాలేజీలు పెడితే రాష్ట్రంలో పెట్టాలని వంద లేఖలు రాసినా పట్టించుకోలేదు. బొగ్గు గనులు ప్రైవేటీకరణ చేస్తున్నారు. ప్రతి జిల్లాకు నవోదయ, మెడికల్ కాలేజీ ఇయ్యని బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలి?..' అని కేసీఆర్ ప్రశ్నించారు.

బర్రెలక్కకు భద్రత కల్పించండి

పోలీస్ అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న కర్నె శిరీష(బర్రెలక్క)కు భద్రత కల్పించాలని పోలీస్ అధికారులను హైకోర్టు ఆదేశించింది. సభల్లో పాల్గొనేటప్పుడు కూడా భద్రతాచర్యలు చేపట్టాలని, ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు కొనసాగించాలని స్పష్టం చేసింది. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకే కాకుండా ప్రాణాలకు ముప్పు ఉందని భావిస్తే స్వతంత్ర అభ్యర్థులకూ భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్, డీజీపీకి ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. తనపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారని, ప్రాణాలకు ముప్పు ఉన్న నేపథ్యంలో 2 ప్లస్ 2 గన్‌మెన్లతో భద్రత కల్పించాలని కోరుతూ బర్రెలక్క హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై





జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఆమె తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ మూడు రోజుల క్రితం బర్రెలక్కపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని, ఈ దాడిలో ఆమెకు ఏం కాకున్నా, ఆమె సోదరుడు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. బర్రెలక్కకు భద్రత కల్పించాలని ఆదేశాలు జారీచేసింది.

పరేడ్‌గ్రౌండ్‌లో నేటి బీఆర్‌ఎస్ సభ రద్దు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నేడు(శనివారం) నిర్వహించ తలపెట్టిన ప్రజా ఆశీర్వాదసభను బీఆర్‌ఎస్ రద్దు చేసింది. హైదరాబాద్-సికింద్రాబాద్‌లో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు, అల్పపీడనం మూలంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరుగుతున్న ప్రజాఆశీర్వాద సభల వేదికగా సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 82 నియోజకవర్గాల్లో కేసీఆర్ ప్రచారసభలు జరిగాయి. జంటనగరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకుతోడు విశాలమైన సభాస్థలాలు లేకపోవడంతో అన్ని నియోజకవర్గాలకు సంబంధించి పరేడ్ మైదానంలో భారీసభ కోసం ఏర్పాట్లు చేశారు. అయితే ఎన్నికల ప్రచారానికి గడువు 4 రోజులే ఉండటంతో సభ జరిగే అవకాశంలేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

సరదా ముచ్చట్లు.. సెల్ఫీలు

- మెట్రో రైల్లో ప్రయాణించిన కేటీఆర్
- మంత్రితో మాట్లాడేందుకు ప్రయాణికుల ఆసక్తి
- హైదరాబాద్ అద్భుతమన్న కేరళ వాసి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా ఉన్న రాష్ట్ర మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం మెట్రో రైల్లో ప్రయాణం చేసి ప్రయాణికులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు. హెచ్‌ఐసీసీలో రియల్ ఎస్టేట్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. రాయదుర్గం స్టేషన్ నుంచి బేగంపేట్ వరకు మెట్రోలో పయనించారు. 20 నిమిషాల పాటు ప్రయాణికులతో కలిసిపోయి సరదాగా ముచ్చటించారు. ప్రయాణికులు కూడా ఆయనతో మాట్లాడేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపించారు. ఇంటర్మీడియట్ చదువుతూ వైద్య విద్య కోసం శిక్షణ తీసుకుంటున్న ఒక విద్యార్థినితో పాటు, ఎంబీబీఎస్ చదువుతున్న మరో విద్యార్థి కేటీఆర్‌తో మాట్లాడారు.

మెడికల్ కోడింగ్ ఆలోచన ఎలా వచ్చింది?

జర్మనీలో బయోటెక్నాలజీ రంగంలో పనిచేస్తున్న మరో ప్రయాణికుడు కేటీఆర్‌తో సెల్ఫీ తీసుకున్నారు. జర్మనీతో సమానంగా బయోటెక్నాలజీ రంగంలో హైదరాబాద్ అభివృద్ధి చెందుతున్న తీరుపై కేటీఆర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద మెట్రో ఎక్కిన మరికొందరు విద్యార్థినులు కూడా మంత్రితో మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన వారు నగరంలో మెడికల్ కోడింగ్ శిక్షణను పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. దీంతో 'గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన మీకు మెడికల్ కోడింగ్‌లో శిక్షణ తీసుకోవాలనే ఆలోచన ఎలా వచ్చింది?'అని కేటీఆర్ వారిని అడిగారు. స్నేహితుల ద్వారా తెలుసుకున్నామని వారు జవాబివ్వగా..మంత్రి వారికి 'ఆల్ ది బెస్ట్'చెప్పారు. పలువురు మహిళలు, వయోధికులు కూడా ఆయనతో మాట్లాడారు. ఆయన పనితీరును, చేపట్టిన పలు కార్యక్రమాలను ప్రశంసించారు. కేరళకు చెందిన ఒక టూరిస్ట్ హైదరాబాద్ నగరంలో మూడు రోజులపాటు పర్యటిస్తున్నట్లు తెలిపారు. నగరంలో కొత్తగా నిర్మించిన కట్టడాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని ఆయన చెప్పారు. హైరైజ్‌డ్ బిల్డింగ్‌లు, విశాలమైన రహదారులను చూస్తుంటే విదేశాల్లో తిరుగుతున్నట్లుగా అనిపించిందన్నారు. 'నేను ఎవరో తెలుసా'అని ఆయన్ను మంత్రి అడగ్గా..' మీరు మాకు బాగా తెలుసు. తెలంగాణకు కిటెక్స్ పరిశ్రమ వచ్చినప్పుడు మీ గురించి మా రాష్ట్రంలో విస్తృతమైన చర్చ జరిగింది..'అంటూ ఆ టూరిస్ట్ బదులిచ్చారు.

మంచి నాయకులను ఎన్నుకోండి

పలువురు యువతీయువకులతో మాట్లాడిన కేటీఆర్.. ఈనెల 30న జరగనున్న ఎన్నికల ప్రక్రియలో తప్పనిసరిగా భాగస్వాములు కావాలని వారిని కోరారు. ఒక గంట సమయాన్ని ఓటు వేసేందుకు కేటాయిస్తే ఐదు సంవత్సరాల పాటు మంచి నాయకులను ఎన్నుకోవచ్చని చెప్పారు.

ఉద్యోగాలు ఇచ్చినా చెప్పుకోలేక పోయాం

- దేశంలో ఎక్కడాలేని రీతిలో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్
- రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారనేది అవాస్తవం
- మేం 70 నుంచి 82 స్థానాల్లో గెలుస్తామని సర్వేలు చెప్తున్నాయి



సాక్షి, హైదరాబాద్: 'ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినా వ్యక్తీకరణ బాగా చేసి చూపించ లేకపోవడంతో నిరుద్యోగుల్లో కొంత అసంతృప్తి ఉంది. అందరితో తిట్లు తింటున్నాం. ఈ నేపథ్యంలో కొన్ని సంజాయిషీలు, వివరణలు ఇచ్చేందుకే ఉద్యోగార్థులతో ఇటీవల భేటీ అయ్యాం. వాస్తవానికి దేశంలో ఎక్కడా లేని రీతిలో 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు, ఇతర అవాంతరాలను అధిగమించి యువతకు అనేక ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి తెస్తాం..' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు చెప్పారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రేవంత్, సంజయ్ ఎంట్రన్స్‌లు, ఇంటర్వ్యూలు ఎదుర్కొన్నారా?

'టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీని గుర్తించి చర్యలు తీసుకున్నది రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే. నేను అనేక ఎంట్రన్స్‌లు, ఇంటర్వ్యూలు ఎదుర్కొన్నా. చదువుకుని ఉద్యోగాలు చేశా. రేవంత్, బండి సంజయ్ లాంటి వారు ఎప్పుడైనా ఇలాంటివి ఎదుర్కొన్నారా? దేశంలో మాకంటే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రాలు లేవని మోదీ, రాహుల్‌కు సవాలు చేస్తున్నా. ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించి నిరుద్యోగుల ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగుతాం. కేంద్రంలో 59 లక్షల ఉద్యోగాలు ఉంటే, రాష్ట్రంలో ఉన్నవి ఏడున్నర లక్షలు మాత్రమే. రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారనేది అవాస్తవం, వారి సంఖ్య 8 నుంచి 10 లక్షల వరకు ఉండొచ్చు..' అని కేటీఆర్ చెప్పారు.

సాధించాల్సింది ఇంకా ఉంది

'స్థిరత్వం, సమర్థత, నమ్మకత్వం, పనితీరు, తెలంగాణ ప్రజల్లో ఆత్మగౌరవం పెంచడం వంటివి మేము సాధించాం. తెలంగాణలో మేము తెచ్చిన మార్పు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జరిగే నష్టం ప్రజలకు విడమరిచి చెప్తున్నాం. 'సాధించింది చాలా ఉంది.. సాధించాల్సింది ఇంకా ఉంది' అనేది మా నినాదం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఆచరణ సాధ్యం కాని రీతిలో ఉన్నాయి. కోవిడ్ వల్ల రాష్ట్ర బడ్జెట్‌కు రూ.లక్ష కోట్ల నష్టం వాటిల్లింది. సంక్షేమ పథకాలు కొనసాగించడం వల్ల ఇతర పనులు కొంత మందగించాయి. రక్షణ శాఖ భూములు కేటాయించి ఉంటే పాట్నీ, జేబీఎస్ స్కైవేలు పూర్తి చేసి ఉండేవాళ్లం. హైదరాబాద్‌లో రోడ్లు, కరెంటు తదితరాలు బాగు చేశాం. డ్రైనేజీ, వరద నీటి వ్యవస్థను ఇంకా మెరుగ్గా చేయాల్సి ఉంది. మళ్లీ అధికారంలోకి వస్తే మూసీ సుందరీకరణ, వరద నీటి నిర్వహణ పనులు చేస్తాం. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తిగా అందుబాటులోకి వస్తే పేదరికం తొలిగిపోతుంది..' అని అన్నారు.

సోనియా సరిగా హ్యాండిల్ చేయలేదు

'కాంగ్రెస్‌లో మా పార్టీ విలీన ప్రతిపాదనను సోనియా సరిగా హ్యాండిల్ చేయకపోవడం వల్లే మేము ఎన్నికల్లో పోటీ చేసి అధికారంలోకి వచ్చాం. నేను మంత్రి అవుతానని కలలో కూడా అనుకోలేదు. కుటుంబ పార్టీ విమర్శలు వస్తాయని కేసీఆర్‌కు చెప్పినా ఆయన తోసిపుచ్చి మంత్రిని చేశారు. మునుగోడులో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీరు అందించడం నా జీవితంలో అత్యంత తీపి జ్ఞాపకం..' అని కేటీఆర్ చెప్పారు. తమపై వస్తున్న విమర్శలపై మాట్లాడుతూ.. 'మాపై దుర్భాషలాడుతున్న ప్రతిపక్షాలను తొక్కేసి ఉండాల్సింది. జర్నలిస్టుల ముసుగులో యూ ట్యూబ్ చానెళ్ల ద్వారా ప్రతికూల ఎజెండాను ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని ఉండాల్సింది...' అని వ్యాఖ్యానించారు.

కుంభకోణాలకు చిరునామాగా మార్చేందుకా?

'మార్పు కోసం అధికారం ఇవ్వాలని కోరుతున్న వారు.. ఆరు నెలల్లో సీఎంని మార్చేందుకా, కుంభకోణాలకు చిరునామాగా మార్చేందుకా? ఎందుకో చెప్పాలి. గుజరాత్‌లో బీజేపీ ఐదుమార్లు గెలిచినప్పుడు, 50 ఏండ్లు కాంగ్రెస్ అధికారం చెలాయించినపుడు మార్పు అవసరం అనిపించలేదా? ప్రజలు ప్రగతికి, సానుకూల రాజకీయాలకే ఓటు వేస్తారు. మేము బీజేపీ సహా ఏ పార్టీకి బీ టీమ్ కాదు. మేము జాతీయ రాజకీయాల్లోకి విస్తరించకుండా ఉండేందుకు కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న కుట్రలు ఇవి. 2014, 2018 లోనూ మేము ఓడిపోతున్నామంటూ ప్రచారం చేశారు. చంద్రబాబు వంటి నేతలు రూ.500 కోట్లతో వచ్చి మహాకూటమి ఏర్పాటు చేయడం వంటివి చూశాం. ఇప్పుడు కూడా ఏదో జరుగుతుందని అపోహలు సృష్టించడం కాంగ్రెస్ గేమ్‌ప్లాన్‌లో భాగం. మేం 70 నుంచి 82 స్థానాల్లో గెలుస్తామని సర్వేలు చెప్తున్నాయి. సొంతంగానే మెజారిటీ సాధిస్తాం. అనుకున్నది సాధించే నైజం కలిగిన కేసీఆర్ నాయకత్వంలో హ్యాట్రిక్ సాధిస్తాం. ఐదు అంచెల పాలన వ్యవస్థ ఉన్న చోట సీఎం ప్రజలను కలవాల్సిన అవసరం లేదు. అయినా ప్రజల మనోభావాలను గౌరవిస్తూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'ప్రజా దర్బార్' నిర్వహిస్తాం..' అని కేటీఆర్ తెలిపారు.

మిస్టర్ ఖర్గే.. ఖబడ్దార్

బిచ్చం కాదు.. కొట్లాడితే వచ్చింది తెలంగాణ ● ఎల్లారెడ్డి ప్రచార సభలో మంత్రి హరీశ్‌రావు



నంగునూరులో శుక్రవారం జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డి రూరల్/ నంగునూరు (సిద్దిపేట)/నారాయణఖేడ్: 'కాంగ్రెస్ బిచ్చమేస్తే తెలంగాణ వచ్చిందని మాట్లాడుతున్న మిస్టర్ ఖర్గే.. ఖబడ్దార్.. నోరు అదుపులో ఉంచుకుని మాట్లాడు... బిడ్డా.. నువ్వు బిచ్చం ఇయ్యలే.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు కేసీఆర్ ఆధ్వర్యంలో అవిశ్రాంత పోరాటం చేసి కొట్లాడితే తెలంగాణ వచ్చింది. ఎవరి దయాదాక్షిణ్యాలతో రాలేదు'అని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ అధ్యక్షుడిపై నిప్పులు చెరిగారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలో, సిద్దిపేట జిల్లా నంగునూరులో, అలాగే సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగిన రోడ్‌షోలో మంత్రి మాట్లాడారు. తెలంగాణను బిచ్చమేశామని ఇక్కడి ప్రజలను అవమానిస్తే జాగ్రత్త అంటూ హెచ్చరించారు. 'తెలంగాణకు వచ్చి సూక్తులు చెబుతున్న మల్లికార్జున ఖర్గే.. నీ సొంతూరులో మంచినీళ్లు వస్తున్నాయా .. తెలంగాణలో వచ్చినట్లు 24 గంటల కరెంటు వస్తుందా చెప్పు, నీ ఊరికి సరైన రోడ్లు ఉన్నాయా? యువశక్తి కింద ఒక్కరికైనా ఒక్క రూపాయి ఇచ్చారా చెప్పు' అని ఎద్దేవా చేశారు. 'కర్ణాటకలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామంటూ పేపర్లలో తప్పుడు ప్రకటనలు ఇవ్వడం కాదు.. కర్ణాటక ఎట్లా ఉంది.. మా తెలంగాణ ఎట్లా ఉందో వచ్చి చూడు.. జమీన్.. ఆస్మాన్ ఫరక్ ఉంటది. ఖర్గే.. మీ సొంతూరిలో మూడు రోజులకు ఒకసారి మంచి నీళ్లు వస్తే తెలంగాణలోని పల్లెపల్లెలో ప్రతీరోజు మంచినీరు వస్తుంది... వ్యవసాయ రంగానికి కర్ణాటకలో 5 గంటల కరెంటు ఇస్తే తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం'అని తెలిపారు. చిటికేస్తే వచ్చే కరెంట్ కావాలా.. కటిక చీకటిలో మగ్గుతున్న కర్ణాటక తరహా కరెంట్ కావాలో ప్రజలే తేల్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫామింగ్ సీఎం.. ఫాంహౌస్ కాదు

కేసీఆర్ ఫాంహౌస్ సీఎం కాదని.. ఫామింగ్ సీఎం అవుతారని హరీశ్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజల గౌరవాన్ని పెంచి రైతు బాంధవుడిగా నిలిచారన్నారు. రైతుబంధు ఎకరాకు రూ.16 వేలు చేస్తామని మేం చెబితే.. కాంగ్రెస్ వాళ్లు సంవత్సరానికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామని చెప్పారన్నారు. రైతుల రుణమాఫీ కోసం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశామని, అనుమతి లభించిన వెంటనే డబ్బులు విడుదల అవుతాయని, లేకున్నా డిసెంబర్ 3న తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే విడుదల చేస్తామని చెప్పారు.

సొంతింటి రుణానికి ప్రభుత్వ వడ్డీ!



శుక్రవారం మాదాపూర్‌లో జరిగిన రియల్ ఎస్టేట్ సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కేటీఆర్

మధ్యతరగతి వారి కోసం ఓ సరికొత్త పథకం

- కేసీఆర్ ఆలోచన చేస్తున్నారన్న కేటీఆర్
- రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా గంటలో రాజధానికి..!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సొంతిల్లు లేని కుటుంబం ఉండకూడదనేదే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కేటీ రామారావు అన్నారు. డబుల్ బెడ్‌రూమ్, గృహలక్ష్మి పథకాలతో సమాంతరంగా మధ్యతరగతి వారి కోసం ఓ సరికొత్త పథకానికి సీఎం కేసీఆర్ ఆలోచన చేస్తున్నారని తెలిపారు. బ్యాంకు రుణంతో 1,200 నుంచి 1,500 చదరపు అడుగుల మధ్య ఇల్లు కొనుగోలు చేసే వారి బ్యాంకు వడ్డీని ప్రభుత్వమే కట్టేలా ఈ పథకం ఉండే అవకాశం ఉందని వివరించారు. శుక్రవారం కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో జరిగిన రియల్ ఎస్టేట్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొమ్మిదిన్నరేళ్ల కాలంలో రెండేళ్లు కరోనాతో, ఎన్నికలకు మరొక ఏడాది పోగా నికరంగా ఆరున్నరేళ్లు మాత్రమే పరిపాలించామని.. ఈ తక్కువ సమయంలో ప్రజలకు కనీస అవసరాలు మాత్రమే తీర్చగలిగామని కేటీఆర్ చెప్పారు.

హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికలు

సృజనాత్మకత కార్యక్రమాల అమలులో చిన్న చిన్న సమస్యలు ఎదురవడం సర్వసాధారణమేనని, అలాంటిదే ధరణి అని కేటీఆర్ చెప్పారు. గతంలో లంచం ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ జరిగేది కాదని, కానీ, ఇప్పుడు ధరణితో పారదర్శకంగా ఒకే రోజు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరుగుతున్నాయని తెలిపారు. ధరణికి సమస్యలను పరిష్కరించేందుకు నిపుణుల కమిటీ ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి చెప్పారు. తెలంగాణలో ఏ ప్రాంతం నుంచి అయినా ఒక గంటలో హైదరాబాద్ చేరుకునేలా ఒక రవాణా ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. హరిత భవనాలు, పునరుత్పాదక విద్యుత్‌కు ప్రాధాన్యతను ఇవ్వడంతో పాటు ఎలక్ట్రిక్ వాహనాల షటిల్ సర్వీస్‌లతో కాలుష్యాన్ని తగ్గించవచ్చని చెప్పారు. అర్బన్ పార్క్‌లను పెంచుతామన్నారు.

అహంకారం కాదు.. చచ్చేంత మమకారం

ప్రతిపక్షాలు మాకు అహంకారం అంటూ ప్రజలకు సంబంధం లేని అంశాలను చూపి తిడుతున్నాయని, తెలంగాణపై తమకుంది అహంకారం కాదని, చచ్చేంత మమకారమని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్‌ది సోషల్ మీడియాలో హడావుడే తప్ప క్షేత్రస్థాయిలో ఏమీ లేదని విమర్శించారు. డిసెంబర్ 3న మళ్లీ బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జాతీయ పార్టీల్లో నిర్ణయాలు ఢిల్లీలో తీసుకోవాల్సి ఉంటుందని, సీఎం పీఠం కోసం కొట్లాడకుండా, సొంతంగా నిర్ణయాలు తీసుకునే ప్రభుత్వంతో నే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. రెండున్నర దశాబ్దాలలో తెలంగాణ ప్రాంతంపై ప్రభావం చూపిన నేతలు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ అని అన్నారు. బాబు ఐటీ అభివృద్ధికి, రాజశేఖర్ రెడ్డి పేదల అభ్యున్నతి కోసం కృషి చేశారని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఐటీ సహా పేదల వరకు అన్ని రంగాల వృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు. కేసీఆర్ పాలనలో పల్లెలు, పట్టణాలు సమాంతరంగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు.

Presenting

The Carens X-Line

X from a different world

First-in-class	Best-in-class	First-in-class	Class-leading	Best-in-class
Stylish matte graphite exterior and black glossy grille	G1.5 Turbo petrol engine with 117.5 kW (160 ps) power	Rear seat entertainment screen and walk-in lever	Futuristic interiors with spacious 3-rows and captain seats	Kia Connect with 68 smart features

Price starts at ₹18 94 900*.

Book Now | **Call** 1800 108 5000 | **Visit** www.kia.com/in | Book Kia Carens



KIA
Movement that inspires

Carens
From a different world

Take all the great things the Kia Carens has to offer and get ready to be transported to a different world. Right from the Xclusive Matte Graphite Exterior to the Space-age Cockpit with Sage Green Upholstery, Walk-in Lever and Rear Seat Entertainment Screen, the Carens X-Line is crafted to immerse you into a different world of style and comfort.

Stylish matte graphite exterior and black glossy grille



make you stand out in the world.

G1.5 Turbo Petrol engine with 117.5 kW (160 ps) power



delivers unmatched power for all your family trips.

Rear seat entertainment screen and walk-in lever



give the freedom to choose your entertainment and adjust your space.

Futuristic interiors with spacious 3-rows and comfortable captain seats



offer more legroom and comfort, which is class-leading.

Kia Connect# skill with Amazon Alexa



lets you control your Kia from the comfort of your home.

Robust 15 Hi-Safety Package
STANDARD ACROSS ALL VARIANTS

6 Airbags, ESC (Electronic Stability Control), VSM (Vehicle Stability Management), BAS (Brake Assist), HAC (Hill-start Assist Control), DBC (Downhill Brake Control), ABS (Anti-lock Brake System), All Wheel Disc Brakes, Highline Tyre Pressure Monitoring System, Rear Parking Sensors, ISOFIX Child Anchor, High Mount Stop Lamp with Emergency Stop Signal, All Seat 3-point Seat Belts with Reminder, Speed Sensing Door Lock and Impact Sensing Door Unlock

Kia Service Connected • Adaptive • Responsive • Engage	3 Years Unlimited Km Warranty	Extended Warranty Up to 5 Years	My Convenience Plus Best-in-class Cost of Ownership^	IoT Based Smart Services^^	24x7 | 3 Years Nationwide RSA**

Book Now | **Call** 1800 108 5000 | 093195 91407 | Look for "Kia India" @ | **Visit** www.kia.com/in | Book Kia Carens

T&C Apply. *Ex-showroom price all India. The product shown is for representation purpose only. Actual features, color and specifications as shown may not be part of standard fitment and may vary. The color shown is subject to availability and may not be available across all variants and may slightly differ from those shown in the ad. Class is defined as 3-row seater car with overall length less than 4 550 mm & height more than 1 680 mm. ^Computed cumulatively with all benefits from comprehensive coverage. ^^IOT based workshops for live vehicle tracking for digital experience.**RSA Coverage across India except Andaman & Nicobar Islands and Lakshadweep Visit your nearest Kia dealership for more details. #Kia Connect comes with 3-year free subscription. Amazon Alexa device is not a standard car accessory and the customer needs to purchase from a third party. Kia Connect skill features may vary depending on the variant, device compatibility, software and network availability both in the vehicle and Alexa device. Kia Connect skill is only available in India and can be interacted with in English and Hindi. Smartwatch and mobile phone are not provided with the vehicle. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Pvt. Ltd.) reserves the right to make any changes with respect to the trims, colors, specifications and other details of any model as mentioned or to discontinue any model or to modify/discontinue any service without prior notice. Kia urges you to follow traffic rules, these are meant to keep you safe on roads. No liability accepted for errors and printing errors.

FOR INFORMATION CONTACT: TELANGANA: HYDERABAD: VIHAAN KIA, KUKATPALLY, PH: 9394812345, AUTOMOTIVE KIA, KONDAPUR, PH: 6309908117, NAGOLE, PH: 6309908118, CAR KIA, JUBILEE HILLS, PH: 7997858880, GACHIBOWLI: PH: 7799906846, KARIMNAGAR: MALIK KIA, PH: 7730911111, KHAMMAM: AUTOMOTIVE KIA, PH: 6309908189, MAHBUBNAGAR: AUTOMOTIVE KIA, PH: 9704111425, NALGONDA: AUTOMOTIVE KIA, PH: 6309908183, NIZAMABAD: SUNRISE KIA, PH: 7995944482, SECUNDERABAD: VIHAAN KIA, PH: 9738312345, WARANGAL: MALIK KIA, PH: 9703433333, ANDHRA PRADESH: ANANTAPUR: MGB KIA, PH: 8333929195, BHIMAVARAM: SIMHA KIA, PH: 8688836544, CUDDAPPAHA: HOSHI KIA, PH: 8688829739, GUNTUR: SIMHA KIA, PH: 8688836566, KAKINADA: KANTIPUDI KIA, PH: 7799740208, KURNOOL: MGB KIA, PH: 8500963906, NELLORE: HOSHI KIA, PH: 8688829718, RAJAHMUNDRY: KANTIPUDI KIA, PH: 7799740208, TIRUPATI: HOSHI KIA, PH: 8688829739, VIJAYAWADA: SIMHA KIA, PH: 8688836501, VISHAKHAPATNAM: LAKSHMI KIA, PH: 7997815777.

INNOCEAN-078/23

క్లుప్తంగా...

కాంగ్రెస్ రావడం ఖాయం

సీడబ్ల్యూసీ సభ్యురాలు సుప్రియా శ్రీనటే



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు అధికారంలో సమానత్వం లభిస్తుందని సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని, కానీ రాష్ట్రం వచ్చిన తర్వాత తెలంగాణలో సగటు మనిషి జీవితం దుర్భరమైపోయిందని సీడబ్ల్యూసీ సభ్యురాలు సుప్రియా శ్రీనటే వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...రాష్ట్రంలో ఏ వర్గం అభివృద్ధి చెందకపోయినా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. కేసీఆర్ ఇంట్లోనే సీఎం, మంత్రి పదవులు తెచ్చుకున్నారని, ప్రజలకు మాత్రం ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా సీఎం కేసీఆర్ నెరవేర్చలేదని చెప్పారు. తెలంగాణలోని ప్రతి వర్గం మార్పు కోరుకుంటోందని, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు.

నేటి నుంచి సీతారాం ఏచూరి, బృందా కారత్ ఎన్నికల ప్రచారం




సాక్షి, హైదరాబాద్: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ శనివారం నుంచి ఈనెల 28 వరకు వివిధ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని రాష్ట్ర పార్టీ వెల్లడించింది. సీతారాం ఏచూరి ఈ నెల 25న సాయంత్రం పాలేరు నియోజకవర్గంలో పర్యటిస్తారని, 26న మధ్యాహ్నం భువనగిరి సభలో ప్రసంగిస్తారని, 27న మిర్యాలగూడ నియోజకవర్గంలో రోడ్ షోలో పాల్గొంటారని పేర్కొంది. బృందా కారత్ ఈనెల 26న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సభలో పాల్గొంటారని, 27న భద్రాచలం నియోజకవర్గంలో దుమ్ముగూడెం, చర్లలో నిర్వహించే సభల్లో పాల్గొంటారని, 28న కోదాడ, హుజూర్‌నగర్‌లలో రోడ్ షో నిర్వహిస్తారని వివరించింది.

సోనియా దీవిస్తే సీఎం అవుతా

– కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ: సోనియా గాంధీ ఆశీర్వదిస్తే ఏదో ఒకరోజు సీఎం అవుతానని నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని తిప్పర్తి మండలం థానేదారుపల్లి, కంకణాలపల్లి, దుప్పలపల్లి, రాయినిగూడెం తదితర గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆగమైందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఆయనను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. 15 రోజుల్లో కేసీఆర్‌ను ప్రగతి భవన్ నుంచి బయటకు పంపే పరిస్థితి రాబోతుందని జోస్యం చెప్పారు. ఉద్యోగాల భర్తీ కోసం పోటీ పరీక్షలు నిర్వహించడంలోనూ ప్రభుత్వం విఫలం కావడం వల్లే నిరుద్యోగులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్ష మేరకు సోనియాగాంధీ తెలంగాణ ఇస్తే.. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల ఊబిలో పడేశారని కోమటిరెడ్డి ధ్వజమెత్తారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అబ్రహం

రేవంత్ సమక్షంలో చేరిక



సాక్షి, హైదరాబాద్/అలంపూర్: అలంపూర్ నుంచి పోటీ చేసేందుకు టికెట్ లభించని బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ అసెంబ్లీ అభ్యర్థి సంపత్ కుమార్‌తో పాటు వచ్చిన అబ్రహం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం సమావేశమయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. అబ్రహంకు రేవంత్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాశ్‌రెడ్డి, ఆర్డీఎస్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్‌కు, ప్రజలకు మధ్య ఎన్నికలు: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్నవి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఎన్నికలు కాదని, బీఆర్ఎస్, తెలంగాణ ప్రజల మధ్య ఎన్నికలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీనేనని ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లో అమలు చేస్తామని రవి హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి



పాలకుర్తి నియోజకవర్గ పరిధి తొర్రూరులో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభకు హాజరైన జనం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాథమిక స్థాయి నుంచి మంచి విద్యను అందించేందుకు ప్రతీ మండలంలో ఒక ఇంటర్నేషనల్ స్టాండర్డ్ స్కూల్‌ను నెలకొల్పుతామన్నారు.

మహిళగా వారు పడే బాధలు తెలుసు

'ఒక మహిళగా తెలంగాణలో మహిళలు పడే ఇబ్బందులు నాకు తెలుసు. పిల్లలు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు, ఉప్పులు పప్పుల రేట్లు పెరిగినప్పుడు, గ్యాస్, కరెంట్ బిల్లులు భారమైనప్పుడు మహిళలే ఎక్కువ ఇబ్బంది పడతారు. ఇటువంటి ఖర్చులను అధిగమించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తాం. గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తాం. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం మొదలైన పథకాలు అమలు చేస్తాం' అని చెప్పారు. రైతుల సంక్షేమం కోసం పాటు పడే పార్టీ కాంగ్రెస్ ఒక్కటే అని అన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం రైతుల భూములను గుంజుకుంటోందని మండిపడ్డారు. సాగునీటి కోసం రూ.లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ ప్రభుత్వానికి ఏటీఎంగా మారిందన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే..

కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒక్కటే.. వారికి మద్దతుగా ఎంఐఎం ఉందని ప్రియాంకా గాంధీ అన్నారు. డబ్బులు పెరిగితే మనిషిలో అహం పెరుగుతుందని, ఇప్పుడు ఈ రెండు ప్రభుత్వాలకు అహం పెరిగి ప్రజల సమస్యలు పట్టడం లేదని చెప్పారు. పార్లమెంట్‌లో పెట్టిన బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు తెలపడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ రెండు పార్టీలకు అంటకాగుతున్న ఎంఐఎం నాయకులు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి దేశ ప్రజల స్థితిగతులు తెలుసుకున్న రాహుల్‌ను విమర్శించడం శోచనీయమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య జరుగుతున్నాయని ప్రియాంక చెప్పారు. ఢిల్లీలో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇస్తే, తెలంగాణ బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతు ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఎంఐఎం 60కి పైగా స్థానాల్లో పోటీ చేస్తుంటే.. తెలంగాణలో 9 స్థానాల్లోనే ఎందుకు పోటీ చేస్తోందన్నారు. నాన్న (రాజీవ్ గాంధీ) చనిపోయిన తర్వాత తమ కుటుంబానికి పీవీ నరసింహారావు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ అభ్యర్థులు యశస్విని రెడ్డి (పాలకుర్తి), పొన్నం ప్రభాకర్ (హుస్నాబాద్), పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, కర్ణాటక మంత్రులు దినేష్ గుండూరావు, తీన్మార్ మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజలను నమ్ముకుంది: పొంగులేటి

బీఆర్ఎస్ అభ్యర్థి దయాకర్‌రావు డబ్బులను నమ్ముకున్నారని, కాంగ్రెస్ అభ్యర్థి ప్రజలను నమ్ముకున్నారని కాంగ్రెస్ ప్రచార కమిటీ కార్యదర్శి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన కాంగ్రెస్‌తోనే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ఖమ్మంలో కాంగ్రెస్ 9, మిత్రపక్షం సీపీఐ కొత్తగూడెం గెలుస్తుందని చెప్పారు. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ.. విద్యార్థులు, సబ్బండ వర్గాలు ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ ఆకాంక్ష కోసం పోరాడితేనే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందన్నారు. కానీ దాని ఫలాలు మాత్రం కేసీఆర్ మాత్రమే అనుభవిస్తున్నారని, మన త్యాగాల ఫలం మనమే అనుభవించాలంటే కేసీఆర్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

ఉబ్బితబ్బిబ్బయిన కుటుంబం



ప్రియాంక ఉన్న ఫళంగా ఓ గీతకార్మికుడి ఇంటికి వెళ్లారు. కుటుంబసభ్యులు ఆమెను చూసి ఒక్కసారిగా ఉబ్బితబ్బిబ్బయ్యారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో సభను ముగించుకొని కొత్తగూడెం వెళ్తున్న క్రమంలో కిషన్‌నగర్‌లో నిర్మాణం అసంపూర్తిగా ఉన్న ఇంటికి మామిడి తోరణాలు, బంతిపూల దండలు కనిపించడంతో ప్రియాంక కారు ఆపి వారి ఇంట్లోకి వెళ్లారు. కుటుంబ యజమాని గీత కార్మికుడు జాగిరి రాజయ్య, రమ దంపతులతో కాసేపు ముచ్చటించారు. ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేస్తుండటంతో పూజ గురించి ఆరా తీశారు. ఇంటి నిర్మాణం ఎందుకు ఆపారని, దుకాణం ఎందుకు పెట్టుకోలేదని అడిగారు. దీంతో ఇంటి యాజమాని ఆర్థిక ఇబ్బందులే కారణమన్నారు. ఇంటి యజమానురాలిని ఆప్యాయంగా పలకరించి ఫోన్ నంబర్ తీసుకున్నారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శుక్రవారం బహిరంగ సభలో పాల్గొన్న ప్రియాంకా గాంధీ తిరిగి వెళ్తుండగా మహిళలతో కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు సెల్ఫీలు తీసుకున్నారు.

ఎన్ని దాడులు చేసినా కాంగ్రెస్ గెలుపును ఆపలేరు: రేవంత్

సాక్షి, హైదరాబాద్: 'కేవలం కాంగ్రెస్ నాయకులనే లక్ష్యంగా చేసుకుని ఈడీ, ఐటీ దాడులు ఎందుకు జరుగుతున్నాయి? వీటి వెనుక ఉన్న అదృశ్య హస్తాలు ఎవరివి? కాంగ్రెస్ నేతలను వేధించాలని ఎక్కడి నుంచి ఈడీ, ఐటీలకు సంకేతాలు వస్తున్నాయి? కాంగ్రెస్ నేతలపై జరుగుతున్న దాడుల వెనుక ఎవరున్నారో తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలి' అని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలంగాణ ప్రజలకు బహిరంగలేఖ రాశారు. గత పదేళ్లలో మోదీ, అమిత్ షాల ఆదేశాలు లేకుండా ఈడీ, ఐటీ సంస్థల్లో చీమ చిటుక్కుమన్నది లేదని, ఇప్పుడు కూడా అమిత్ షా, కేసీఆర్‌లు పథక రచన చేస్తే పీయూష్ గోయల్, కేటీఆర్‌లు అమలు పరుస్తున్నారని ఆ లేఖలో తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కై, కాంగ్రెస్ నేతలను లక్ష్యంగా చేసుకున్నారని, అత్యున్నత ప్రభుత్వ సంస్థలు, రాజ్యాంగబద్ధ వ్యవస్థలను కూడా మోదీ, కేసీఆర్‌లు తమ రాజకీయ క్రీడలుగా మార్చేశారని విమర్శించారు. ఆ రెండు పార్టీల్లో చేరితే పవిత్రులు, ప్రజల పక్షాన కొట్లాడితే ద్రోహులవుతారా? అని ప్రశ్నించారు.

నిరుద్యోగులూ.. ఇందిరమ్మ రాజ్యం తీసుకురండి

- అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలిస్తాం
- తెలంగాణ ప్రజల కోసం సోనియా ఆరు గ్యారంటీ పథకాలు తీసుకొచ్చారు
- ఆ పథకాలతో అధికారంలోకి వస్తాం.. ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్‌దే
- నకిరేకల్, తిరుమలగిరి, యాదగిరిగుట్ట సభల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి




నకిరేకల్‌లో జరిగిన కాంగ్రెస్ సభకు హాజరైన జనం. అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేముల వీరేశం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, సాక్షి, యాదాద్రి, తిరుమలగిరి (తుంగతుర్తి): రాష్ట్ర ప్రభుత్వం గత పదేళ్లలో ఖాళీగా ఉన్న 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి ఉంటే వాటిలో సింహభాగం నల్లగొండ విద్యార్థులకే వచ్చి ఉండేవని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. వారంతా ఇళ్లకు వెళ్లలేక హైదరాబాద్ రోడ్లపై తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి నిరుద్యోగులకు సీఎం కేసీఆర్ అన్యాయం చేస్తుంటే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో, సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో, యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట శివారులో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు, వారి కుటుంబ సభ్యులను కలిపితే మొత్తం 1.80 కోట్ల ఓటర్లు ఉంటారన్నారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులు, నిరుద్యోగులంతా ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా ఆ లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలు తీసుకొచ్చారన్న రేవంత్... ఆ గ్యారంటీ పథకాలతో అధికారంలోకి వస్తామన్నారు. ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్ పార్టీదేనని చెప్పారు.

పదేళ్లలో రూ. 6 లక్షల కోట్ల అప్పులు...

'కేటీఆర్.. మీ నాయన వంద నోటులాంటి వారు కాదు.. దొంగ నోటు లాంటి వారు.. ఎలక్షన్లు, సెలక్షన్లు, కలెక్షన్ల పేరుతో దోచుకున్నారు. కాళేశ్వరం కట్టానని అంటున్న కేసీఆర్ రూ. 1.5 లక్షల కోట్లు పెట్టి మేడిగడ్డను ఇసుకపై కట్టారా?'అని రేవంత్ ప్రశ్నించారు. 60 ఏళ్లలో 16 మంది సీఎంలు రూ. 69 వేల కోట్లు అప్పులు చేస్తే పదేళ్లలోనే కేసీఆర్ ఏకంగా రూ. 6 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. దీన్నిబట్టి ఎవరు దొంగ.. ఎవరు గజదొంగో తెలంగాణ ప్రజలు ఆలోచించాలని కోరారు.

ఆ 12 మందిని అసెంబ్లీ గేటు తాకనివ్వొద్దు...

తెలంగాణ ఉద్యమంలో జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన మంత్రి పదవికి రాజీనామా చేసి నల్లగొండలో ఆమరణ దీక్ష చేపట్టారని, తెలంగాణ వచ్చేంత వరకు మళ్లీ పదవి తీసుకోకుండా ఆదర్శంగా నిలిచారని రేవంత్ కొనియాడారు. అలాగే తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయంలో అద్దంకి దయాకర్ పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉన్నాని... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక దయాకర్‌ను ప్రజలు ఉన్నత స్థానంలో చూస్తారని చెప్పారు. కానీ కేసీఆర్ మాత్రం ఏనాడూ తెలంగాణ కోసం పదవులను విసిరేయలేదని, రాజీనామా చేసిన పదవులను తిరిగి పొందారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో గెలిచి పార్టీ ఫిరాయించిన 12 మందిని ఈ ఎన్నికల్లో అసెంబ్లీ గేటును తాకనీయొద్దని... భవిష్యత్తులో ఇంకెవరికీ పార్టీ ఫిరాయించాలన్న ఆలోచన కూడా రాకుండా వందేళ్లు గుర్తుండేలా తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. కేసీఆర్‌కు మూడోసారి అధికారమిస్తే ఇప్పటికే ఆయన కుటుంబం నుంచి రాజకీయాల్లో ఉన్న ఐదుగురికితోడు లక్కీ నంబర్ ఆరు కలిసొచ్చేలా మనవడిని కూడా మంత్రిని చేస్తాడేమోనని వ్యంగ్యాస్త్రం సంధించారు.

పదేళ్లు ఓపిక పట్టాం.. ఇక సహించేది లేదు

కేసీఆర్ ఓటమి భయంతో డబ్బులతో ఓట్లు కొనుగోలుకు సిద్ధమయ్యారని... ఓటుకు రూ. 10 వేల చొప్పున పంచి గెలవాలని చూస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అయితే వాళ్లు ఇచ్చినదంతా తీసుకొని కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. 'పదేళ్లు ఓపిక పట్టాం.. ఇక సహించేది లేదు. మీరు అనుకుంటే ఢిల్లీలో మోదీని.. గల్లీలో ఈ కేడీని బండకేసి కొట్టండి'అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆలేరు ఎమ్మెల్యే కుటుంబం పేదల భూములను ఆక్రమించిందని.. లక్ష్మీనరసింహస్వామిని కూడా మోసం చేసిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఆలేరులో బీఆర్ఎస్‌ను ఓడించి లక్ష్మీ నరసింహస్వామి మొక్కు చెల్లించాలని పిలుపునిచ్చారు.

కారు ఇంజన్‌లో కరెన్సీ కట్టలు

- ఇంజన్ వేడికి చెలరేగిన మంటలు
- డబ్బుల కట్టలు మరో కారులోకి మార్చేసి పరారీ



ఖిలా వరంగల్: ఎన్నికల అధికారుల కళ్లు గప్పి కారు ఇంజన్ భాగంలో నోట్ల కట్టలు భద్రపర్చి తరలిస్తుండగా ఇంజన్ వేడికి నోట్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో వెనకాల వస్తున్న మరో కారులోకి క్షణాల్లో డబ్బులను మార్చేసి మంటలంటుకున్న కారును అక్కడే వదిలేసి డ్రైవర్‌తో పాటు అందరూ పరారయ్యారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకు చెందిన కొందరు బానోతు వినోద్ పేరుతో ఉన్న (టీఎస్ 09 ఈఎల్ 6645) కారు ఇంజన్ భాగంలో కరెన్సీ నోట్ల సంచులను భద్రపర్చి వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపు బయల్దేరారు. ఖమ్మం జాతీయ రహదారి బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి రాగానే ఇంజన్‌నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగతో మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై కారును రోడ్డుపై నిలిపివేసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో కొంత మేరకు డబ్బులు కాలిపోగా, మంటలు అంటుకున్న డబ్బులను తీసి బయట పడేస్తుండగా స్థానికులు వాటి కోసం ఎగబడ్డారు. కారు వెనకభాగంలో పైలెట్‌గా వస్తున్న మరో కారులోకి డబ్బుల సంచులను మార్చేసి క్షణాల్లో అక్కడినుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న మామునూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఏసీపీ సతీశ్, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్సై ప్రమోద్‌లతో కలిసి ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఘటన స్థలాన్ని సందర్శించారు. కారు నంబర్ ఆధారంగా విచారణ చేపట్టాలని డీసీపీ ఆదేశించినట్లు తెలిసింది. దీనిపై ఏసీపీ సతీశ్ వివరణ కోరగా కారులో డబ్బులు ఉన్నాయా.. లేవా.. ఉంటే ఎంత డబ్బు ఉన్నది అనే విషయంపై స్పష్టత లేదని, కారు నంబర్ ఆధారంగా విచారిస్తున్నామని అన్నారు.



గడ్డి అన్నారం పీఅండ్‌టీ కాలనీలో జరిగిన కార్నర్ సమావేశానికి హాజరైన ప్రజలు. మాట్లాడుతున్న ఖర్గే

వచ్చేది మా ప్రభుత్వమే

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

- తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సే, అభివృద్ధి జరిగేదీ కాంగ్రెస్‌తోనే
- ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తాం

ఎల్‌బీనగర్/లింగోజిగూడ: తెలంగాణలో మాఫియా రాజ్యం నడుస్తోందని, ప్రతి పనిలో అవినీతి తప్ప.. అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. తెలంగాణతో పాటు రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం గడ్డిఅన్నారం డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన కార్నర్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందే చేస్తుంది తప్ప మాట తప్పదని తెలిపారు. '2014లో బీజేపీ ప్రభుత్వం వస్తే నల్లధనాన్ని వెలికి తీసి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పారు.. మీకు వచ్చాయా'అని ప్రజలను ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి, జాతీయం చేసిన ఎన్నో కంపెనీలను బీజేపీ ప్రభుత్వం అమ్మి సొమ్ము చేసుకుంటోందని విమర్శించారు. ఇందిరా గాంధీ, రాజీవ్, సోనియా గాంధీల నాయకత్వంలో గతంలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని ఖర్గే అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు గంటల కొద్దీ సమయం వేచి చూసినా సీఎం కేసీఆర్ దర్శనం దక్కదని, అదే మాఫియా నేతలకు మాత్రం క్షణాలలో దర్శనం లభిస్తుందని అన్నారు. లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని చెప్పి వందల్లో కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజలను మోసం చేసి, ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతి ఒక్కరు చెయ్యి చెయ్యి కలిపి ముందుకు రావాలని కోరారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు ఒక్కటేనని, బయటకు మాత్రమే ఈ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సేనని, అభివృద్ధి జరిగేది కూడా కాంగ్రెస్‌తోనేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తీరుతుందని, చేసేవే చెప్తామని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ విజయం కోసం నిరంతరం కృషి చేస్తున్న తెలంగాణ జన సమితి, సీపీఐతో పాటు ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు రాహుల్ గాంధీ పర్యటన

బోధన్, ఆదిలాబాద్, వేములవాడ, ఆంథోల్, సంగారెడ్డి, కామారెడ్డిల్లో ప్రచారం



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు ఆయన తెలంగాణలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. బోధన్, ఆదిలాబాద్, వేములవాడ సభలకు వెళ్లనున్న ఆయన శనివారం పార్టీ ముఖ్య నేతలు పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. తొలుత మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ పోటీ చేస్తున్న ఆంథోల్, ఆ తర్వాత టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పోటీ చేస్తున్న సంగారెడ్డి, అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బరిలో ఉన్న కామారెడ్డి నియోజకవర్గాల్లో ఆయన ప్రచారంలో పాల్గొననున్నారు.

ఉద్యోగాల భర్తీ లేకే నిరుద్యోగులు ఆత్మహత్య

బీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ ధ్వజం



మునుగోడులో విలేకరులతో మాట్లాడుతున్న జైరాం రమేష్. చిత్రంలో రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, దీంతో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేష్ అన్నారు. ఎంతో మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న రాష్ట్రం ఒకే కుటుంబం చేతిలో బందీగా మారిందని విచారం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కే పరిమితమై ప్రజాసమస్యలను విస్మరించారని ఆరోపించారు. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పదేళ్ల నుంచి నిజాంను తలపించే పాలన కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి పేద మహిళకు ఏడాదికి రూ.30 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు, ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యుడు గౌతమ్, నాయకులు నారబోయిన రవి ముదిరాజ్, వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, వటికోటి శేఖర్, జాల వెంకన్న, జాజుల అంజయ్యగౌడ్, బూడిద లింగయ్య యాదవ్, భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్



ఖమ్మం మయూరిసెంటర్: ప్రజా పోరాటాల సారథులుగా పోటీలో నిలిచిన సీపీఎం అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీకి పంపాలని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు మాణిక్ సర్కార్ పిలుపునిచ్చారు. ఖమ్మం సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్ తరఫున శుక్రవారం రోడ్ షో ద్వారా ప్రచారం నిర్వహించారు. మాణిక్ సర్కార్ మాట్లాడుతూ దేశంలోని బీజేపీ పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని, నిరుద్యోగ తీవ్రత, ధరల పెరుగుదల ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. విభజించి పాలించే రీతిలో బీజేపీ వ్యవహరిస్తుండటమే కాక స్వతంత్ర వ్యవస్థలను అణచివేస్తోందని ఆరోపించారు. అందుకే ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను ఏకం చేస్తున్నామన్నారు. తెలంగాణ ఎన్నికల్లో ప్రజలు చైతన్యాన్ని ప్రదర్శించాలని, నిత్యం ప్రజల సమస్యలపై పోరాడుతున్న సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీపీఎం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కాకున్నా, తమ పార్టీ అభ్యర్థులను చట్టసభల్లోకి పంపిస్తే ప్రజల హక్కులపై ప్రశ్నిస్తారని చెప్పారు. ఈ ప్రచారంలో నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. మధిర నియోజకవర్గం ముదిగొండలో శుక్రవారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచార సభలో కూడా మాణిక్ సర్కార్ ప్రసంగించారు.

తెలంగాణను కాపాడేది కాంగ్రెస్సే

సీడబ్ల్యూసీ సభ్యురాలు అల్కాలాంబా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలనుంచి ప్రజలను కాపాడేది కాంగ్రెస్ పార్టీనేనని, ఆరు గ్యారంటీ స్కీంలను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీకే రాష్ట్ర ప్రజలు ఓటు వేయాలని సీడబ్ల్యూసీ సభ్యురాలు ఆల్కాలాంబా పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...తెలంగాణతో పాటు ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర తర్వాత ప్రజల్లో ఆలోచన పెరిగిందని, అందుకే కర్ణాటకలోని డబుల్‌ఇంజన్ సర్కారును ఓడించి అక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని చెప్పారు. బీజేపీ నేతలు దేశాన్ని విడిచిపెట్టి తెలంగాణలో ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చారని, కశ్మీర్‌లో ఐదుగురు జవాన్లు చనిపోతే వెళ్లకుండా అమిత్‌షా తెలంగాణకు వచ్చి బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, తమను గెలిపించడం ద్వారానే సమగ్రాభివృద్ధి జరుగుతుందని అల్కాలాంబా చెప్పారు.

క్లుప్తంగా...

నేడు యూపీ సీఎం యోగి విస్తృత ప్రచారం

సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ శనివారం రాష్ట్రంలో విస్తృత ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బహిరంగసభలో ఆయన పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు వేములవాడ అసెంబ్లీలో నిర్వహించే సభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని ఆకాశ్‌పురి హనుమాన్ మందిరం నుంచి రోడ్‌షో ప్రారంభించి అనిత టవర్, పురానాపూల్ గాంధీ స్టాచ్యూ, గోల్కొండ (గోషామహల్ జిల్లా)లలో కార్నర్ మీటింగ్‌లలో యోగి ప్రసంగిస్తారు.

సీఎం పదవికి కాంగ్రెస్ నేతల పోట్లాట

• మాజీ డీజీపీ కృష్ణప్రసాద్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోలింగ్‌కు ఇంకా ఆరు రోజుల వ్యవధి ఉండగానే.. కాంగ్రెస్‌లో కౌన్ బనేగా సీఎం పోట్లాట తారస్థాయికి చేరిందని బీజేపీ అధికార ప్రతినిధి, మాజీ డీజీపీ కృష్ణప్రసాద్ ఎద్దేవా చేశారు. ఈ పోట్లాట రాబోయే రోజుల్లో మరింత తీవ్ర రూపమై మూసీనదిలో మురికి మాదిరిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున.. అలాంటి వారికి ఓటేయొద్దని ప్రజలను కోరుతున్నట్టు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అస్థిర ప్రభుత్వాలే కొనసాగుతున్నాయని విమర్శించారు. ఇటీవల కాంగ్రెస్ నేత సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని.. దళితుడు సీఎం అవుతాడని చెప్పారన్నారు. వెంటనే ఆ పార్టీ నేతలు సంపత్‌కుమార్, మల్లు రవి కాదు కాదు.. రేవంత్‌రెడ్డి సీఎం అవుతారంటూ ఆ ప్రకటనతో విభేదిస్తూ మాట్లాడారని గుర్తు చేశారు. మధ్యమధ్యలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా.. తాను సీఎం అవుతానని చెబుతున్న విషయం తెలిసిందేనన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిచాక అందరూ కూర్చుని మాట్లాడుకుని, పార్టీలో ఎవరు సీనియరో వారే సీఎం అవుతారంటూ.. రేవంత్ కంటే తానే సీనియర్‌నని భట్టి విక్రమార్క కూడా చెప్పకనే చెప్పారన్నారు. టీఆర్ఎస్ దళిత సీఎం హామీ కూడా గోదావరిలో కొట్టుకుపోయిందని ఎద్దేవా చేశారు. బీసీ నేతను సీఎం చేస్తామనే హామీని బీజేపీ మాత్రమే అమలు చేయగలుగుతుందని కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు.

సోనియా వల్ల కాదు, పోరాటంతోనే తెలంగాణ వచ్చింది

• బీజేపీ నేత మురళీధర్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని ఆ పార్టీ ప్రచారం చేసుకుంటోందని బీజేపీ నేత, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'సోనియా వల్ల తెలంగాణ రాష్ట్రం రాలేదు. సకలజనుల పోరాటంతోనే వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఖబర్దార్.. చరిత్రను అవమానించకండి' అని హెచ్చరించారు. విధిలేని పరిస్థితుల్లోనే కాంగ్రెస్‌పార్టీ తెలంగాణ ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కలిసి నాటకం ఆడుతున్నాయని మండిపడ్డారు. సెక్యులరిజాన్ని సీఎం కేసీఆర్ ఖూనీ చేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని పహాడీషరీఫ్‌లో ముస్లింలకు మాత్రమే ఐటీ పార్కు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. అక్కడ హిందువులు లేరా? అని నిలదీశారు. కుటుంబ రాజకీయాలను ప్రభుత్వంలోకి కేసీఆర్ బహిరంగంగా తీసుకువచ్చారని మండిపడ్డారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ కుటుంబపార్టీలు. కుటుంబ రాజకీయాలను అంతమొందించాలి. సామాజిక తెలంగాణ ఇవ్వగలిగే ఏకైక పార్టీ బీజేపీ. తెలంగాణ సమాజం ఆలోచించి ఓటు వెయ్యాలి' అని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణపై కమిటీ

▶ మొదటి పేజీ తరువాయి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వరూప మహాసభలో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొనడం తెలిసిందే. ఎస్సీ వర్గీకరణకు, మాదిగల సాధికారతకు సాధ్యమైన మార్గాలపై కేంద్రం త్వరలో కమిటీ ఏర్పాటు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా మందకృష్ణ చేస్తున్న ప్రతి పోరాటానికీ బీజేపీ మద్దతుగా నిలించిందని ఆయన పేర్కొన్నారు. ''మీది న్యాయ పోరాటం. ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలనే మాదిగ ఉప కులాల కోరిక అత్యంత న్యాయమైనది. మీకు జరుగుతున్న అన్యాయానికి వీలైనంత త్వరగా అడ్డుకట్ట వేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం. ఇందుకోసం వెంటనే కమిటీ వేస్తామని హామీ ఇస్తున్నా. ఈ విషయమై సుప్రీంకోర్టులో కూడా ఇప్పటికే న్యాయ ప్రక్రియ కొనసాగుతోంది'' అని ఆయన చెప్పారు. కాగా, నవంబర్ 30న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మోదీ శనివారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఉన్నతాధికారులతో ప్రధాని భేటీ చర్చనీయంగా మారింది.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం

• అత్యధిక సీట్లు గెలుపొందుతాం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
• ఆ రెండు పార్టీలను ఎవరూ నమ్మరు
• నాగారం, కార్వాన్, కంటోన్మెంట్‌లో ప్రచారం



రాంపల్లి సభకు హాజరైన ప్రజలు. (ఇన్‌సెట్‌లో) సభలో ప్రసంగిస్తున్న రాజ్‌నాథ్‌సింగ్

కీసర, గోల్కొండ/కంటోన్మెంట్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు గెలుపొంది రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తొమ్మిదిన్నరేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి విఫలమైందన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామని చెప్పిన కేసీఆర్ ఎంతమందికి భూమి ఇచ్చారో చెప్పాలనీ, ఇంటికో ఉద్యోగమన్న సీఎం రాష్ట్రంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని విచారణ చేపడుతామన్నారు. శుక్రవారం నాగారంలోని రాంపల్లిలో, కార్వాన్ నియోజకవర్గంలో, కంటోన్మెంట్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో రాజ్‌నాథ్ ప్రసంగించారు. తెలంగాణ అభివృద్ధికి పీఎం మోదీ చిత్తశుద్ధితో కృషి చేశారనీ, కేంద్రం నుంచి పెద్ద ఎత్తున ఆర్థికసాయం అందించారని గుర్తు చేశారు. ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మడం లేదన్నారు. దేశాన్ని సమర్థవంతంగా పాలిస్తున్న బీజేపీ తెలంగాణలో కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయనుందన్నారు. దశాబ్దాల తన పాలనలో దేశాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేని కాంగ్రెస్ పార్టీని ప్రజలు అన్ని చోట్లా తిరస్కరించారని, ఇక్కడా అదే జరుగుతుందని వ్యాఖ్యానించారు. బీజేపీ పరిపాలన దక్షత ఏమిటో ప్రజలకు తెలిసినందువల్లే వారు వరుసగా మోదీకి జై కొడుతున్నారని అన్నారు. నేడు దేశం ప్రపంచ అగ్రరాజ్యాల సరసన చేరిందంటే అది ప్రధాని మోదీ సమర్థపాలన, సరైన విధాన నిర్ణయాలే కారణమని చెప్పారు. పార్టీ అభ్యర్థులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి (మేడ్చల్), టి.అమర్‌సింగ్ (కార్వాన్)కు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్వాన్ నియోజకవర్గంలో గుడిమల్కాపూర్ చౌరస్తా నుంచి దర్బార్ మైసమ్మ దేవాలయం వరకు జరిగిన బీజేపీ రోడ్ షోలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలు

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలని, బీజేపీ మాత్రమే ప్రజల పార్టీ అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కుటుంబ పాలనకు ప్రాధాన్యమిచ్చే బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ఓడించాలన్నారు. బీజేపీ ఏదైనా చెబితే తప్పకుండా చేసి తీరుతుందన్నారు. 1951లో ఏర్పడిన జనసంఘ్ తమకు పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీ వస్తే ఆర్టికల్ 370 రద్దు చేస్తామని మరుసటి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందన్నారు. అలాగే, అయోధ్యలో రామమందిరం నిర్మిస్తామని 1980 దశకంలో ప్రకటించిందన్నారు. చెప్పినట్లుగానే ఆర్టికల్ 370 రద్దు చేశామని, అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తిచేసి జనవరిలో ప్రారంభించబోతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తు అయిన కారు బేకార్ అని వ్యాఖ్యానించారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి

▶ మొదటి పేజీ తరువాయి

కారు స్టీరింగ్ ఎంఐఎం పార్టీ చేతుల్లో ఉంది. కేసీఆర్ అవినీతిని అంతమొందించి ఆయన్ను ఇంటికి పంపిస్తేనే ఎంఐఎం అగడాలకు అడ్డుకట్ట పడుతుంది..' అని అమిత్‌షా అన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి బీజేపీ కృషి

'ప్రధాని మోదీ దేశాన్ని నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్లుగా పరిష్కరించని అయోధ్య రామాలయం సమస్యను మోదీ ప్రభుత్వం పరిష్కరించింది. కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి పాటుపడుతోంది. రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఇస్తే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై విచారణ జరిపించి బాధ్యులను జైలుకు పంపుతాం. రెండున్నర లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇస్తాం. ఉత్తర తెలంగాణలో అత్యధికంగా ఉన్న గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక ఎన్ఆర్ఐ పాలసీని తీసుకొస్తాం. బీడీ కార్మికులకు ఉచిత చికిత్స కోసం నిజామాబాద్‌లో 500 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినం అధికారికంగా నిర్వహిస్తాం. పెట్రోల్, డీజిల్‌పై జీఎస్‌టీని తగ్గిస్తాం. రూ.3,100కు క్వింటాల్ ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. రాష్ట్ర ప్రజలకు ఉచితంగా అయోధ్య శ్రీరాముని దర్శనం కల్పిస్తాం. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం. మోదీ సంకల్పంతో జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేయనున్నాం. దీంతో పసుపు రైతుల జీవన ప్రమాణాలు పెరుగుతాయి..' అని అమిత్‌షా చెప్పారు. బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, అభ్యర్థులు కృష్ణయాదవ్ (అంబర్‌పేట), తోకల శ్రీనివాస్‌రెడ్డి (రాజేంద్రనగర్), ఏలేటి అన్నపూర్ణమ్మ (బాల్కొండ), పైడి రాకేశ్‌రెడ్డి (ఆర్మూర్), మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ టాప్-5 నేతలంతా నేడు రాష్ట్రంలోనే..

• ప్రచారంలో పాల్గొననున్న మోదీ, అమిత్ షా, నడ్డా, యోగి
• పార్టీ ఎన్నికల కమిటీల పనితీరును సమీక్షించనున్న బీఎల్ సంతోష్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో శనివారం ఓ అరుదైన సన్నివేశం ఆవిష్కృతం కానుంది. బీజేపీలోని ఐదుగురు అగ్రశ్రేణి నేతలు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తోపాటు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) బీఎల్ సంతోష్ తమ రాకతో పార్టీ కేడర్‌లో జోష్ నింపనున్నారు. ప్రధాని మోదీ శని, ఆది, సోమవారాల్లో వరుస సభలు, రోడ్ షోలలో పాల్గొంటుండగా, అమిత్ షా శుక్ర, శని, ఆదివారాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే సిర్పూర్, వేములవాడలలో బహిరంగ సభలు, సనత్‌నగర్, గోషామహల్ నియోజకవర్గాల పరిధిలో రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొంటున్నారు. మరోవైపు పార్టీ ఎన్నికల కమిటీల పనితీరును బీఎల్ సంతోష్ శనివారం సమీక్షించనున్నారు. అధికార బీఆర్ఎస్‌పై ప్రజావ్యతిరేకత ఉందన్న సొంత సర్వేల అంచనాల నేపథ్యంలో బీజేపీ శక్తియుక్తులను తెలంగాణపై కేంద్రీకరిస్తోందని.. అందులో భాగంగానే అగ్రనాయకత్వం ముమ్మర ప్రచారం చేస్తోందని ఆ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

తెలంగాణలో అధికారంలోకి వస్తాం

• బీజేపీ గ్రాఫ్ రోజురోజుకు పెరుగుతోంది
• వచ్చే 4 రోజులు గట్టిగా ప్రచారం చేయండి
• పార్టీ ముఖ్యనేతల ఎన్నికల సమీక్షలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ధీమా వ్యక్తంచేశారు. అదే విశ్వాసంతో నాయకులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ రోజురోజుకు పెరుగుతోందని, అధికార సాధన దిశగా మరింత కష్టపడి పనిచేయాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రస్తుతం పార్టీకి అనుకూలంగా ఎన్నికల వాతావరణం ఉందని, మరో నాలుగు రోజులు గట్టిగా పని చేసి మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. తెలంగాణలో సాగిస్తున్న ఎన్నికల ప్రచారం పార్టీ లక్ష్యాల సాధన దిశగానే ముందుకు సాగుతుందనే సంతృప్తిని అమిత్ షా వ్యక్తం చేసినట్టు పార్టీవర్గాల సమాచారం. ప్రతి ఇంటికి వెళ్తూ బీజేపీకి అనుకూలంగా ఓటు వేసే విధంగా ఓటర్లకు దగ్గర కావాలని దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. శుక్రవారం రాత్రి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యనేతలతో అమిత్‌షా భేటీ అయ్యారు. తెలంగాణలో ఎన్నికల వాతావరణం ప్రచార సరళి గురించి కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, పార్టీ జాతీయ సంస్థాగత సహ కార్యదర్శి శివ ప్రకాశ్‌ను అమిత్ షా అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ప్రచార సమయాన్ని పూర్తిగా ఉపయోగించుకుంటూ బీజేపీకి అనుకూల వాతావరణం సృష్టించాలని సలహా ఇచ్చినట్టు తెలిసింది. అలాగే ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, తాను కూడా శని, ఆదివారాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తానన్నట్టు అమిత్ షా తెలిపారు. సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శ్రుతి, కాసం వెంకటేశ్వర్లు యాదవ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

రైతుబంధుకు ఈసీ గ్రీన్ సిగ్నల్

▶ మొదటి పేజీ తరువాయి

కేవలం 28వ తేదీనే రైతుబంధు సొమ్ము పంపిణీకి వీలుంది. విడతలవారీగా పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ ప్రకటించడంతో ఒకేరోజు రైతుబంధు సొమ్ము రైతులందరి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉండదని అధికారులు అంటున్నారు. రైతుబంధు ద్వారా ఈ యాసంగి సీజన్‌లో 70 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది.

అందరినీ దూరం పెట్టారు

▶ మొదటి పేజీ తరువాయి

ఆ పార్టీల అస్తిత్వాలను తొక్కేసేలా వ్యవహరిస్తున్న విషయం వాస్తవం కాదా? ఉద్యమంలో ఉన్న రాజకీయ జేఏసీలోని ప్రజాసంఘాలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, విద్యావంతులు, మేధావులను ఒక్కరొక్కరిగా దూరం పెట్టింది మీరు కాదా? ఈ విషయం తమ కొంప మునిగేంతవరకు చాలామంది ఉద్యమకారులకు అర్థం కాలేదు. మీ ఆలోచన తెలిసిన వారికి ఇదేం కొత్త విషయం కాదు. మీతో కలిసున్న వారిలోనూ చాలామందికి ఇప్పుడిప్పుడే మీ మనస్తత్వం పూర్తిగా బోధపడుతోంది' అన్నారు.

అహంకారం, మీ నియంతృత్వ ధోరణి..

'మీలోని అహంకారం, మీ నియంతృత్వ ధోరణి, 'అంతా నేనే' అన్న హిరణ్యకశ్యపుని స్వభావం. మీ దృష్టిలో ప్రజలంటే మీరు చెప్పింది వినే అమాయకులు. మీ సమావేశాల్లో వారిని కసురుకునే స్వభావం చూస్తేనే అర్థమైపోతుంది. మీ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు.. మీరు చెప్పింది విని తలూపే 'డూడూ బసవన్న'లు' అని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. టీవీలను, పత్రికలను 10 కి.మీ లోతులో పాతిపెడతానన్న తర్వాత వాళ్లలో కొందరు మీకు వ్యతిరేకంగా రాయడం లేదు. ఉద్యమంలో నచ్చిన రాతలు ఆ తర్వాత పునరుద్ఘాటిస్తే.. మీరు జీర్ణించుకోవడం లేదు. 'ప్రజాసమస్యల గుండె చప్పుడుకు, తెలంగాణ గొంతుకకు, భావస్వేచ్ఛకు వేదికైన ధర్నాచౌక్‌ను మీరు ఎత్తేశారు. గొంతెత్తిన వారిని సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించి మీ దార్లోకి తెచ్చుకుంటారు. మీ మనసులో వచ్చేదే 'రాష్ట్ర ప్రజలందరి ఆలోచన', దాన్ని అమలుచేయడమే 'రాష్ట్ర సంక్షేమం' అని భావించే కొత్త తరహా నియంతృత్వ ప్రజాస్వామ్యమే ఇప్పుడు తెలంగాణలో నడుస్తోంది' అని కిషన్‌రెడ్డి ఆ లేఖలో ధ్వజమెత్తారు.

సీఎం ఎక్కడ ఉంటారో తెలియదు..

ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండాల్సిన ముఖ్యమంత్రిని ఎప్పుడు? ఎక్కడ? ఎలా? కలవాలో తెలియక జనం, వారు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు గురచెందుతున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. 'గతంలో ఎందరో పాలకులు అమలు చేసిన ప్రజాదర్బార్ స్థానంలో అత్యద్భుతంగా ప్రగతి భవన్‌ను ఆధునిక నిజాం భవనంగా నిర్మించి ప్రజాభీష్టంతో పనిలేకుండా మీకు నచ్చిన నిర్ణయం తీసుకోవడం మరెవరికైనా సాధ్యమా?' అని ప్రశ్నించారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వంటి పెద్దలెందరో.. సచివాలయం, అసెంబ్లీ వంటివి ప్రజలకు సౌలభ్యాన్ని కలిగించేలా నిర్ణయాలు తీసుకోవాలని సంకల్పించారు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇదేనా మీ రాజ్యాంగం?

'మీరెలాగూ సచివాలయానికి రారని తెలిసి.. అన్నిరకాల ఫైళ్లే ప్రగతిభవన్‌కు రావడమే మీ దృష్టిలో రాజ్యాంగం. ఇలాంటి నియంతృత్వ మనస్తత్వమే.. మీ రూపాన్ని యాదాద్రి దేవాలయ రాతిస్తంభాలపై చెక్కించుకునేంత వరకు వెళ్లింది. ప్రజాగ్రహానికి లొంగి మీరు వాటిని తొలగించాల్సి వచ్చింది లేదంటే.. ఆగమశాస్త్రప చిత్రాలు కాకుండా మీ చిత్రాలు ఆలయంలో ఉండేవి' అని కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు. 'స్పీకర్ దగ్గర జరిగే బీఏసీ (బిజినెస్ అడ్వయిజరీ కమిటీ) సమావేశంలో తప్ప అఖిలపక్షం నేతల ముఖాలు కూడా చూడటం మీకు ఇష్టం ఉండదు. ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్న మీ అప్రజాస్వామిక మనస్తత్వాన్ని ప్రజలు గ్రహిస్తున్నారు' అని హెచ్చరించారు.

అందరి తెలంగాణగా మార్చడమే లక్ష్యం

• పేదల రాజ్యాధికారంతోనే బాంచన్ సంస్కృతి పోతుంది
• అసెంబ్లీ ఎన్నికల్లో రెండంకెల సీట్లు సాధిస్తాం
• సాక్షి టీవీ ఇంటర్వ్యూలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: కొందరి తెలంగాణను అందరి తెలంగాణ చేయడమే బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారు. సాక్షి టీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రాష్ట్రాన్ని దొరల తెలంగాణ కాకుండా పేదల తెలంగాణగా మార్చాలనేది బీఎస్పీ ఆలోచన అని తెలిపారు. తెలంగాణలో దొరలు వదిలిపెట్టిన గడీలు గత తొమ్మిదేళ్లలో మళ్లీ పునర్నిర్మాణమయ్యాయని ఆయన విమర్శించారు. బాంచన్ కాల్మొక్త అనే సంస్కృతి తెలంగాణలో పోలేదని చెప్పారు.

అన్ని వర్గాలను కలుపుకుంటాం...

పేదల రాజ్యాధికారంతోనే బాంచన్ సంస్కృతి పూర్తిగా పోతుందని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. స్పష్టమైన ప్రణాళికతో అన్ని వర్గాలను కలుపుకొని కృషి చేస్తే రాజ్యాధికారం తప్పకుండా సాధ్యమవుతుందన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో డబుల్ డిజిట్ సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వీలైతే రాజ్యాధికారం చేపడతామని ఆశిస్తున్నట్లు చెప్పారు. జార్ఖండ్‌లో గతంలో స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలిచిన మధు కోడా ముఖ్యమంత్రి అయిన విషయాన్ని ప్రవీణ్‌కుమార్ గుర్తుచేశారు.

మాయావతి వల్లే యూపీలో బహుజనులకు రాజ్యాధికారం...

దళితులు కేవలం ఎమ్మెల్యేలు, మంత్రులైతే సరిపోదని, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొనే స్థితిలో ఉంటేనే రాజ్యాధికారం వచ్చినట్లవుతుందని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి సీఎం అయిన తర్వాతే బహుజనులకు రాజ్యాధికారం వచ్చిందన్నారు. మాయావతి హయాంలో దళితులకు భూముల పంపిణీ జరిగిందని, ఆమె ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించిందని చెప్పారు. మాయావతి పాలన వల్ల రెండు, మూడు తరాల బహుజనులు బాగుపడ్డారని ఆయన తెలిపారు.

ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 10 లక్షల ఉద్యోగాలిస్తాం..

ముఖ్యమంత్రిని కలిసి తమ ఆలోచనలు పంచుకొనే అవకాశం రాష్ట్రంలో ఏ అధికారికీ లేదని ప్రవీణ్‌కుమార్ చెప్పారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారులు సైతం కానిస్టేబుల్ ఆపితే ప్రగతి భవన్ గేటు వద్ద నుంచే వెనక్కి వెళ్లిన సందర్భాలున్నాని పేర్కొన్నారు. గురుకులాల సెక్రటరీగా వెళ్లిన వెంటనే తాను దళిత, నిమ్న, వెనుకబడిన, అణగారిన అనే పదాలను నిషేధించి స్వేరో అనే పదాన్ని తీసుకొచ్చానని తెలిపారు. తమ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న 10 లక్షల ఉద్యోగాల హామీ మొత్తం ప్రభుత్వ ఉద్యోగాలు కాదని, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలన్నీ కలిపి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయన వివరణ ఇచ్చారు. ఇవేగాక మరిన్ని విషయాలను ప్రవీణ్‌కుమార్ సాక్షి టీవీతో పంచుకున్నారు.

రైతురాజ్యం తీసుకొస్తాం

• వరికి రూ. 3,100 మద్దతు ధర, ఎకరానికి రూ. 24 వేల సాయం అందిస్తాం
• ఎరువుల సబ్సిడీ.. ఏటా ఉచితంగా నాలుగు సిలిండర్లు ఇస్తాం
• బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు భూకబ్జాదారులు
• కరీంనగర్ జిల్లా కొత్తపల్లి ప్రచార సభలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్



కొత్తపల్లిలో ప్రసంగిస్తున్న బండి సంజయ్

కొత్తపల్లి (కరీంనగర్): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని, తెలంగాణలో అధికారంలోకి రాగానే రైతురాజ్యం తీసుకొస్తామని కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం వరికి రూ. 3,100 మద్దతు ధర చెల్లిస్తామని, ఎకరానికి రూ. 24 వేల సాయం చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి (హెచ్)లో చేపట్టిన సభలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం రెండు పంటలకు కలిపి రైతులకు ఏటా రూ. 12 వేలు ఇవ్వడంతోపాటు డీఏపీ, ఇతర ఎరువుల సబ్సిడీ పేరుతో ఎకరానికి రూ. 18 వేలు చెల్లిస్తోందన్నారు. కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ఎకరాకు రూ. 6 వేలను బ్యాంకులో జమ చేస్తోందని చెప్పారు. ఈ లెక్కన రైతులకు మోదీ ప్రభుత్వం రూ. 24 వేలు సాయం చేస్తుంటే కేసీఆర్ ప్రభుత్వం అన్ని సబ్సిడీలు బంద్ పెట్టి రైతుబంధు పేరుతో రూ. 10 వేలు మాత్రమే సాయం చేస్తోందని బండి సంజయ్ వివరించారు. పేదలకు ఇప్పటికే ఉచితంగా 'ఉజ్వల'సిలిండర్లు ఇస్తున్నామని, బీజేపీ అధికారంలోకి రాగానే ఏటా ఉచితంగా 4 సిలిండర్లు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి గంగుల కమలాకర్ అధికారంలో ఉండి ఏమీ చేయలేక.. తనపై అవినీతి ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. మంత్రి తెచ్చిన ఐటీ టవర్‌లో తొండలు గుడ్లు పెడుతున్నాయని... ఇప్పటివరకు ఒక్క కంపెనీ కూడా ఆ భవనంలోకి రాలేదని, ఒక్కరికీ ఉద్యోగం దొరకలేదని బండి సంజయ్ ఆరోపించారు. గొల్లకుర్మలకు గొర్రెలు ఇస్తామని రూ. 46 వేలు డిపాజిట్ చేయించుకొని మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దని ఆయన దుయ్యబట్టారు. రేషన్ మంత్రిగా ఉండి ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, బీసీ మంత్రిగా ఉండి ఒక్కరికి బీసీ బంధు ఇవ్వలేదని ఆరోపించారు. పౌరసరఫరాలశాఖ మంత్రిగా రూ. 1,300 కోట్లను గోల్‌మాల్ చేశారని తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు భూకబ్జాదారులని, ఎవరి చరిత్ర ఏమిటో బేరీజు వేసుకొని ఓటేయాలని ప్రజలను సంజయ్ కోరారు.

ప్రజల శ్రేయస్సుకోరే పార్టీ బీజేపీ

'గ్యారంటీ'గా మోసంచేసే పార్టీ కాంగ్రెస్: కేంద్ర మంత్రి అర్జున్‌ముండా



వికారాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి అర్జున్‌ముండా అన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వికారాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. అలంపల్లి నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు కొనసాగిన ర్యాలీలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని మోదీ సందేశంతో ఇక్కడికి వచ్చానని, స్థానిక అభ్యర్థి నవీన్‌కుమార్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందని, ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. తాము అధికారంలోకి వస్తే అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారంటీలు ఇచ్చి అవి సక్రమంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని, మళ్లీ తెలంగాణలో ఆరు గ్యారంటీలంటూ ఓట్లడుగుతోందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ప్రజలను మోసం చేసే పార్టీలని ముండా మండిపడ్డారు. ప్రజల శ్రేయస్సు కోరే ఏకైక పార్టీ బీజేపీ అని, 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రజలు నిర్ణయించుకున్నారు: లక్ష్మణ్

• కర్ణాటక, హిమచల్‌లో చెల్లని కాంగ్రెస్ గ్యారంటీలు, తెలంగాణలో ఎలా చెల్లుతాయి?



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌ను అధికారంలోంచి దించేందుకు ప్రజలు నిర్ణయించుకున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. దశాబ్ద కాలంపాటు సాగిన కల్వకుంట్ల కుటుంబ అవినీతి పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. గతంలో ఇచ్చిన హామీలే అమలు చేయకపోవడంతో బీఆర్ఎస్ మేనిఫెస్టోను చిత్తుకాగితంతో సమానంగా చూస్తూ ప్రజలు తిరగబడుతున్నారని చెప్పారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక కూడా కర్ణాటక, హిమచల్‌ప్రదేశ్‌లలో చెల్లని కాంగ్రెస్ గ్యారంటీలు, తెలంగాణలో ఎలా చెల్లుతాయని ప్రశ్నించారు. ఆ రాష్ట్రాల్లో కాంగ్రెస్ గ్యారంటీలు వారంటీ కూడా లేకుండా 'ఎక్స్‌పైరీ డేట్'కి వచ్చేశాయని ప్రజలు వాపోతున్నారని పేర్కొన్నారు. వరి మద్దతుధర రూ.3,100 పెంపుదలతో రైతుకు లబ్ధి చేకూరుతుందని, ఎరువుల సబ్సిడీతోపాటు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధితో అదనపు లబ్ధి కలుగుతుందని చెప్పారు. ప్రస్తుత ప్రచారసరళి చూస్తుంటే బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకోవడంతోపాటు బీజేపీకి మద్దతు ప్రకటన స్పష్టమౌతోందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని చెప్పారు.

విభజన రాజకీయాలు ఎవరివి?

• కేంద్ర సహాయమంత్రి మీనాక్షి లేఖి



సాక్షి, హైదరాబాద్: దేశంలో విభజన రాజకీయాలు చేస్తున్నది ఎవరని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి మీనాక్షి లేఖి ప్రశ్నించారు. హిందుగాళ్లు బొందుగాళ్లు అన్న సీఎం కేసీఆర్ విభజన రాజకీయాలు చేస్తున్నారా? లేక సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అంటున్న ప్రధాని మోదీ చేస్తున్నారా? అని నిలదీశారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మైనారిటీలకు రిజర్వేషన్లు ఎవరు ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారినంత మాత్రాన దాని బ్రాండ్ ఏమీ మారదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల అప్పు చేసి, ప్రజల నెత్తిన పెద్ద భారాన్ని మోపిందన్నారు. తెలంగాణలో తలసరి ఆదాయం గురించి మాట్లాడుతున్న కేటీఆర్.. మరి తలసరి అప్పు సంగతేమిటో చెప్పాలని మీనాక్షి లేఖి డిమాండ్ చేశారు.

ఈ ప్రదర్శనను ఆపండి...!

యూపీ మంత్రిని వారించిన వీర జవాను తల్లి

న్యూఢిల్లీ: ఒక వైపు కన్నకొడుకును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో మునిగి ఉన్న ఓ మాతృమూర్తి..పరిహారం చెక్కు ఇస్తూ ఫొటో తీయించుకోవాలనే మంత్రి యావను చూసి అసహనం వ్యక్తం చేశారు. 'ఈ ప్రదర్శనను ఆపండి' అంటూ అక్కడున్న వారిని వేడుకున్నారు. యూపీలో చోటుచేసుకున్న ఈ ఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మంత్రి తీరును ప్రతిపక్ష పార్టీల నేతలు తీవ్రంగా ఎండగట్టారు. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీలో గురువారం ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో యూపీలోని ఆగ్రాకు చెందిన కెప్టెన్ శుభమ్ గుప్తా అసువులు బాశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పరిహారం చెక్కు అందజేసేందుకు మంత్రి యోగేంద్ర ఉపాధ్యాయ్ శుక్రవారం ఆయన కుటుంబాన్ని కలుసుకున్నారు. తీవ్ర శోకంలో ఉన్న కెప్టెన్ శుభమ్ గుప్తా తల్లితో మంత్రి మాట్లాడారు. అనంతరం పరిహారం చెక్కు ఇచ్చేందుకు మంత్రి ప్రయత్నించగా ఆమె తీసుకోలేదు. 'నాకు ఏమీ వద్దు, ఈ ఎగ్జిబిషన్(ప్రదర్శని మత్ లగావో)ను ఇక ఆపండి' అంటూ వేడుకున్నా చెక్కును అలాగే పట్టుకుని ఫొటో తీయించుకునేందుకు మంత్రి ప్రయత్నిస్తున్నట్లు వీడియోలో రికార్డయింది.

అదానీ గ్రూప్‌పై ఆధారాలున్నాయా?

సీనియర్ లాయర్ ప్రశాంత్ భూషణ్‌కు సుప్రీంకోర్టు ప్రశ్న

న్యూఢిల్లీ: విదేశీ రిపోర్టులను సాక్ష్యాధారాలుగా పరిగణించలేమని, అందులోని అంశాలను స్వచ్ఛమైన నిజాలుగా భావించలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. భారత్‌కు చెందిన అదానీ గ్రూప్ ఇద్దరు విదేశీ ఇన్వెస్టర్ల ద్వారా ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడిందని ఆరోపిస్తూ ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) అనే విదేశీ స్వచ్ఛంద సంస్థ ఓ నివేదిక విడుదల చేసిన సంగతి తెలిసిందే. అమెరికా బిలియనీర్ జార్జి సోరోస్ ఈ సంస్థను స్థాపించారు. ఈ నివేదిక వెలువడిన నేపథ్యంలో.. అక్రమాలకు పాల్పడిన అదానీ గ్రూప్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు వ్యక్తులు సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ హాజరయ్యారు. ''విదేశీ నివేదికలను కచ్చితంగా నిజాలుగా ఎందుకు స్వీకరించాలి? ఓసీసీఆర్‌పీ నివేదికను మేము తోసిపుచ్చడం లేదు. కానీ, అదానీ గ్రూప్ అక్రమాలకు పాల్పడినట్లు సాక్ష్యాధారాలు కావాలి. అదానీ గ్రూప్‌నకు వ్యతిరేకంగా మీ దగ్గరున్న ఆధారాలేమిటి?'' అని ప్రశాంత్ భూషణ్‌ను ప్రశ్నించింది.

రిషి సునాక్ పాపులారిటీ రేటింగ్ 25%

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్‌కు, అధికార కన్జర్వేటివ్ పార్టీకి ఇదొక పెద్ద ఊరట. ఇటీవల మంత్రివర్గంలో మార్పుల తర్వాత సునాక్ ప్రభుత్వానికి కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. పార్టీలో అసమ్మతి మొదలైంది. అయితే, శీతాకాల బడ్జెట్‌లో కొన్నిరకాల పన్నులను తగ్గించనున్నట్లు ప్రకటించారు. దీంతో రిషి సునాక్‌తోపాటు ప్రభుత్వానికి ప్రజాదరణ స్వల్పంగా పెరిగినట్లు తాజాగా 'ద టైమ్స్' పత్రిక నిర్వహించిన ఓపీనియన్ పోల్స్‌లో వెల్లడయ్యింది. బడ్జెట్‌ను బుధవారం పార్లమెంట్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పన్ను మినహాయింపుల పట్ల ప్రజలు సానుకూలంగా స్పందించారు. సర్వేలో సునాక్ ప్రభుత్వ పాపులారిటీ రేటింగ్ 25 శాతానికి చేరినట్లు తేలింది. గత వారంతో పోలిస్తే ఇది 4 పాయింట్లు అధికం కావడం విశేషం. ఇటీవలి కాలంతో కన్జర్వేటివ్ పార్టీకి దక్కిన అత్యధిక రేటింగ్ ఇదే. ఇదిలా ఉండగా, ప్రతిపక్ష లేబర్ పార్టీ రేటింగ్‌లో ఎలాంటి మార్పు జరగలేదు. ప్రజాదరణ 44 శాతంగానే ఉన్నట్లు సర్వే వెల్లడించింది.

సత్యేందర్ జైన్ బెయిల్ గడువు మళ్లీ పొడిగింపు

న్యూఢిల్లీ: మనీల్యాండరింగ్ ఆరోపణలెదుర్కొంటున్న ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ మధ్యంతర బెయిల్ గడువును సుప్రీంకోర్టు మరోసారి పొడిగించింది. బెయిల్ గడువు శుక్రవారంతో ముగియడంతో జస్టిస్ ఏఎస్ బొపన్న సారథ్యంలోని ధర్మాసనం విచారించాల్సి ఉంది. ఆయన అందుబాటులో లేకపోవడంతో జస్టిస్ బేలా ఎం. త్రివేది బెయిల్ గడువును డిసెంబర్ 4వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. జైన్ పెట్టుకున్న రెగ్యులర్ బెయిల్ దరఖాస్తుపై విచారణ కూడా అదే రోజున ఉంటుందని స్పష్టం చేశారు. మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై గత ఏడాది మేలో జైన్‌ను ఈడీ అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.

భారత్ అప్పీల్‌ను స్వీకరించిన ఖతార్ కోర్టు

న్యూఢిల్లీ: భారత నేవీకి చెందిన 8 మంది మాజీ అధికారులకు మరణశిక్ష పడిన కేసులో భారత ప్రభుత్వం పెట్టుకున్న అప్పీల్‌ను ఖతార్ న్యాయస్థానం స్వీకరించింది. ఈ పరిణామంపై భారత విదేశాంగ శాఖ స్పందించలేదు. అక్కడి కోర్టు ఈ కేసుపై త్వరలో విచారణ చేపట్టవచ్చని భావిస్తున్నారు. ఖతార్‌లోని అల్ దహ్రా సంస్థలో పనిచేస్తున్న భారత నేవీ మాజీ అధికారులను గూఢచర్యం ఆరోపణలపై గత ఏడాది ఆగస్టులో అధికారులు అరెస్ట్ చేశారు. విచారణ జరిపిన ఖతార్ ఫస్ట్ ఇన్‌స్టాన్స్ కోర్టు వారికి మరణశిక్ష విధిస్తూ అక్టోబర్ 26న తీర్పు వెలువరించింది.

'చీఫ్ సెక్రటరీ' వివాదానికి సుప్రీం పరిష్కారం

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నియామకంపై కేంద్రం, ఆప్ ప్రభుత్వం మధ్య నలుగుతున్న వివాదానికి సుప్రీంకోర్టు ఒక పరిష్కారమార్గం చూపింది. చీఫ్ సెక్రటరీ హోదాకు అర్హులైన అయిదుగురు సీనియర్ పరిపాలనాధికారుల పేర్లను ఈనెల 28న ఉదయం 10.30 గంటల్లోగా సూచించాలని కేంద్రాన్ని కోరింది. అందులో నుంచి ఒకరి పేరును అదే రోజు ఎంపిక చేసుకుని, ఈ వివాదానికి ముగింపు పలకాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. తమతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా కొత్తగా చీఫ్ సెక్రటరీని కేంద్రం నియమించజాలదంటూ ఢిల్లీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ సూచనలు చేసింది. అంతకుముందు, కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీలోని ఆప్ సర్కార్ చీఫ్ సెక్రటరీ నియామకం విషయంలో పోటాపోటీగా వాదనలు వినిపించాయి.

మందు పాతర పేలి.. ఇద్దరు కూలీలు మృతి

చర్ల(తెలంగాణ): పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు ఏర్పాటుచేసిన మందు పాతర పేలి ఇద్దరు కూలీలు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూంబింగ్‌కు వచ్చే బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు మందు పాతరలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం నారాయణపూర్ జిల్లా చోటే డోంగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజ్‌పూర్‌కు చెందిన కూలీలు గనుల వద్దకు అటవీ మార్గాన వెళ్తున్నారు. పొరపాటున మందుపాతరపై కాలు పెట్టిన ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

బిల్లులను అడ్డుకొనే స్వేచ్ఛ గవర్నర్లకు లేదు: సుప్రీం

న్యూఢిల్లీ: రాష్ట్రాల గవర్నర్ల తీరుపై అత్యున్నత న్యాయస్థానం మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేసింది. అధికారాన్ని దుర్వినియోగం చేయవద్దని గవర్నర్లకు సూచించింది. అసెంబ్లీలో తీర్మానించిన బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా పెండింగ్‌లో కొనసాగించడం తగదని తేల్చిచెప్పింది. అలాంటి స్వేచ్ఛ గవర్నర్లకు లేదని స్పష్టం చేసింది. ప్రజల చేత ఎన్నిక కాని గవర్నర్లకు రాజ్యాంగబద్ధంగా కొన్ని అధికారాలు ఉన్నప్పటికీ రాష్ట్రాల శాసనసభల్లో చట్టాలు చేసే ప్రక్రియను అడ్డుకోవడానికి ఆ అధికారాలను ఉపయోగించుకోవద్దని హితవు పలికింది. ఇలాంటి చర్యలు ప్రజల చేత ఎన్నికైన ఎమ్మెల్యేల అధికారాన్ని తగ్గించేలా ఉంటాయని తేల్చిచెప్పింది. అసెంబ్లీలో తీర్మానించిన నాలుగు కీలక బిల్లులపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నెల 10న 27 పేజీల తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వివరాలను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. రాష్ట్రపతి నియమించే గవర్నర్ రాష్ట్రానికి నామమాత్ర అధిపతి మాత్రమేనని ఉద్ఘాటించింది. ఈ ఏడాది జూన్ 19, 20వ తేదీల్లో పంజాబ్ అసెంబ్లీలో తీర్మానించిన బిల్లులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని గవర్నర్ భన్వరీ లాల్ పురోహిత్‌ను ధర్మాసనం ఆదేశించింది.

అతి పెద్ద ఐస్‌బర్గ్...
40 ఏళ్ల తర్వాత కదిలింది

గ్లోబల్ వార్మింగే కారణం క్రమంగా కరిగిపోతున్న వైనం

అది ప్రపంచంలోనే అతి పెద్ద ఐస్‌బర్గ్. పేరు ఏ23ఏ. విస్తీర్ణం ఏకంగా 4,000 చదరపు కిలోమీటర్లు. మరోలా చెప్పాలంటే పరిమాణంలో గ్రేటర్ లండన్‌తో పోలిస్తే రెండింతలకు పై చిలుకే. అంతటి విస్తీర్ణంతో, ఏకంగా 400 మీటర్ల మందంతో భారీ సైజుతో అలరారుతూ చూసేందుకది ఓ మంచు ద్వీపకల్పంలా కన్పించేది. అలాంటి ఐస్‌బర్గ్ దాదాపు 40 ఏళ్ల తర్వాత కదలడం మొదలు పెట్టింది. ఈ పరిణామం పర్యావరణ నిపుణులను ఆందోళన పరుస్తోంది. గ్లోబల్ వార్మింగ్ తాలూకు దుష్పరిణామాలకు దీన్ని తాజా సంకేతంగా వారు భావిస్తున్నారు...

1986 నుంచీ...

ఏ23ఏ ఐస్‌బర్గ్ అప్పుడెప్పుడో 1985 చివర్లో అంటార్కిటికా తీరం నుంచి విడిపోయింది. అంటార్కిటికా తాలూకు అతి పెద్దదైన ఫిల్చ్‌నర్ మంచు ఫలకం నుంచి విడిపోయిన భారీ ఐస్‌బర్గ్‌ల్లోకెల్లా పెద్దదిగా ఇది రికార్డులకెక్కింది. అప్పటికే ఏ23ఏపై సోవియట్ యూనియన్ ఒక పరిశోధన కేంద్రం కూడా ఏర్పాటు చేసుకుంది! అందులోని సామగ్రినంతటినీ అది హుటాహుటిన తరలించడం మొదలు పెట్టింది. కానీ కొద్దిపాటి ప్రయాణం అనంతరం 1986కల్లా అంటార్కిటికా పరిధిలోని వెడెల్ సముద్రంలో ఐస్‌బర్గ్ నిశ్చలంగా నిలిచిపోయింది. ఒకరకంగా సముద్రం తాలూకు అడుగు భాగంతో కలిసిపోయి అలా నిలబడిపోయింది.

కరిగిపోతోంది...

ఇంతకాలం నిశ్చలంగా ఉన్నది కాస్తా ఏ23ఏ ఇప్పుడు మరోసారి కదులుతోంది. దీనికి కారణాలపై సైంటిస్టులంతా దృష్టి సారించగా, ఇది అంటార్కిటికా సముద్ర జలాల ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతున్న ఫలితమేనని తేలింది! ''దాదాపు 40 ఏళ్ల కాలగమనంలో ఐస్‌బర్గ్ పరిమాణంలో కుంచించుకుపోయింది. దానికి గ్లోబల్ వార్మింగ్ తోడైంది'' బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే రిమోట్ సెన్సింగ్ నిపుణుడు డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్ తెలిపారు. వాస్తవానికి ఏ23ఏలో 2020లోనే అతి తక్కువ స్థాయిలో కదలికలు మొదలయ్యాయని చెప్పుకొచ్చారు. సముద్ర పవనాల హోరు, ప్రవాహాల జోరుకు అది ఇప్పుడు వేగం పుంజుకుందన్నారు. ఇప్పుడది క్రమంగా అంటార్కిటిక్ ద్వీపకల్పపు ఉత్తరాగ్రంకేసి కదులుతోంది. చివరికది ఐస్‌బర్గ్‌ల క్షేత్రంగా పిలిచే అంటార్కిటికా దక్షిణ ప్రాంతానికి చేరేలా కన్పిస్తోంది.



ప్రమాద ఘంటికే...!

ఎంత పెద్ద ఐస్‌బర్గ్‌లైనా కాలక్రమంలో చిక్కిపోవడం, క్రమంగా కనుమరుగవడం పరిపాటే. కానీ అందుకు వందలు, కొన్నిసార్లు వేలాది ఏళ్లు కూడా పడుతుంటుంది. అలాంటి ప్రస్తుతం ప్రపంచంలోకెల్లా అతి పెద్దదైన ఏ23ఏ ఐస్‌బర్గ్ ఇలా శరవేగంగా కరుగుతుండటం, కదిలిపోతుండటం ప్రమాద సూచికేనని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అది దక్షిణ జార్జియా కేసి సాగితే అక్కడి జీవావరణానికి పెద్ద సమస్యగా కూడా మారవచ్చని చెబుతున్నారు. దాని నుంచి కరిగే నీటితో పెరిగిపోయే సముద్ర మట్టం ఆ ద్వీపకల్ప తీరంలో లక్షలాది సీల్స్, పెంగ్విన్లు, సముద్ర పక్షుల పునరుత్పత్తి ప్రాంతాలను ముంచెత్తవచ్చన్నది వారి ఆందోళన. అయితే ఈ పరిణామంతో కొన్ని లాభాలూ లేకపోలేదట! ''ఐస్‌బర్గ్‌లు జీవనప్రదాలు కూడా. కరిగే క్రమంలో వాటినుంచి విడుదలయ్యే ఖనిజ ధూళి సమీప సముద్ర జీవజాలానికి ప్రాణాధారంగా మారుతుంది'' అని సైంటిస్టులు చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

24 మంది బందీలకు స్వేచ్ఛ

అమల్లోకి వచ్చిన ఇజ్రాయెల్-హమాస్ ఒప్పందం

- 13 మంది ఇజ్రాయెలీలు, 10 మంది థాయ్‌లాండ్ పౌరులు, ఒక ఫిలిప్పైన్స్ జాతీయుడికి విముక్తి
- విడుదలైన బందీలను ఈజిప్టుకు తరలించిన రెడ్‌క్రాడ్ సంస్థ
- గాజాలో కాల్పుల విరమణ ప్రారంభం.. ఆగిన ఇజ్రాయెల్ దాడులు
- మొదటి దశలో 39 మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టిన ఇజ్రాయెల్!
- ఈజిప్టు నుంచి గాజాకు మానవతా సాయం, ఇంధనం చేరవేత



హమాస్ విడుదల చేసిన బందీలతో గాజా నుంచి బయల్దేరిన వాహనం.



టెల్ అవీవ్‌లో బంధువుల ఆనందోత్సాహాలు

గాజాస్ట్రిప్/జెరూసలేం: సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. గాజా స్ట్రిప్‌లో శుక్రవారం భూతల, వైమానిక దాడులు ఆగిపోయాయి. ప్రపంచంలోనే అతిపెద్ద బహిరంగ జైలుగా పేరుగాంచిన గాజాలో ఏడు వారాల తర్వాత ప్రశాంత వాతావరణం కనిపించింది. పాలస్తీనియన్ల ఎదురు చూపులు ఫలిస్తున్నాయి. విదేశాల నుంచి పెద్ద ఎత్తున మానవతా సాయం, ఇంధనం గాజాకు చేరుకుంటోంది. అమెరికా, ఈజిప్టు, ఖతార్ దేశాల చొరవతో ఇజ్రాయెల్–హమాస్ మధ్య కుదిరిన సంధి శుక్రవారం ఉదయం నుంచే అమల్లోకి వచ్చింది. తాత్కాలిక కాల్పుల విరమణ నాలుగు రోజులపాటు కొనసాగనుంది. ఒప్పందం మేరకు హమాస్ చెరలోని బందీల విడుదల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటిరోజు 13 మంది ఇజ్రాయెలీ బందీలకు హమాస్ మిలిటెంట్లు స్వేచ్ఛావాయువులు ప్రసాదించారు. వీరిలో ఆరుగురు వృద్ధులు, నలుగురు పిల్లలున్నారు. వారిని రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించారు. మొత్తం 24 మంది బందీలను హమాస్ విడిచిపెట్టిందని, వారిని 4 వాహనాల్లో ఈజిప్టుకు చేర్చామని రెడ్‌క్రాస్ వెల్లడించింది. వీరిలో 13 మంది ఇజ్రాయెల్ పౌరులు, 10 మంది థాయ్‌లాండ్ పౌరులు, ఒకరు ఫిలిప్పైన్స్ పౌరుడున్నట్లు ఖతార్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ప్రకటించారు. విడుదలైన బందీలంతా ఆరోగ్యంగానే కనిపిస్తున్నారని ఇజ్రాయెల్ వైద్య శాఖ తెలియజేసింది. హమాస్ డిమాండ్‌ను నెరవేరుస్తూ ఇజ్రాయెల్ కూడా మొదటి దశలో 39 పాలస్తీనా ఖైదీలను విడుదల చేసిందని సమాచారం. వీరిలో 24 మంది మహిళలు కాగా 15 మంది చిన్నారులు. వారిని తీసుకుని వాహనాలు వెస్ట్‌ బ్యాంక్‌లోని జైళ్ల నుంచి రమల్లాకు బయల్దేరాయి. నాలుగు రోజుల వ్యవధిలో 50 మంది బందీలకు హమాస్ విముక్తి కల్పించాల్సి ఉంది. అలాగే 150 మంది ఖైదీలను జైళ్ల నుంచి ఇజ్రాయెల్ విడిచిపెట్టాలి. ప్రస్తుతం 7,200 మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్నారు.

'ఉత్తరాది వలస'లపై కాల్పులు..

ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులు ఆగిపోవడంతో దక్షిణ గాజా నుంచి జనం ఉత్తర గాజాకు కాలినడకన తిరిగివస్తున్నారు. వారిని ఎక్కడికక్కడ అడ్డుకొనేందుకు ఇజ్రాయెల్ సైన్యం ప్రయత్నిస్తోంది. శుక్రవారం పలుచోట్ల వారిపై కాల్పులు జరిపింది. ఎవరూ వెనక్కి వెళ్లొద్దంటూ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించారని, 11 మంది గాయపడ్డారని స్థానిక మీడియా తెలియజేసింది. అక్టోబర్ 7న గాజాపై దాడులు మొదలైన తర్వాత ఇజ్రాయెల్ హెచ్చరికల వల్ల ఉత్తర గాజా నుంచి లక్షలాది మంది ప్రాణభయంతో దక్షిణ గాజాకు వలసవెళ్లారు. వారంతా స్వస్థలాలకు తిరిగి రావాలని భావిస్తున్నారు.

గాజాకు 1.30 లక్షల లీటర్ల డీజిల్

కాల్పుల విరమణ, బందీల విడుదల ప్రక్రియ ప్రారంభం కావడంతో గాజాకు మానవతా సాయం చేరవేతలోనూ వేగం పెరిగింది. ఆహారం, నిత్యావసరాలు, ఔషధాలు, వైద్య పరికరాలు, దుస్తులు తదితర సామగ్రితో దాదాపు 90 వాహనాలు శుక్రవారం ఈజిప్టు నుంచి రఫా క్రాసింగ్ గుండా గాజాలోకి ప్రవేశించాయి. అలాగే 1.30 లక్షల లీటర్ల డీజిల్ కూడా గాజాకు అందింది. డీజిల్ లేక, జనరేటర్లు పనిచేయక గాజా ఆసుపత్రుల్లో వైద్య సేవలు ఇప్పటికే నిలిచిపోయాయి. కాల్పుల విరమణ అమల్లో ఉన్న నాలుగు రోజుల్లో రోజుకు 1.30 లక్షల లీటర్ల డీజిల్‌ను గాజాకు సరఫరా చేయడానికి ఇజ్రాయెల్ అనుమతి ఇచ్చింది. వాస్తవానికి గాజాకు నిత్యం 10 లక్షల లీటర్ల డీజిల్ అవసరం.

కాల్పుల విరమణ పొడిగిస్తారా?

ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కేవలం నాలుగు రోజుల పాటే అమల్లో ఉంటుంది. ఆ తర్వాత కూడా ఒప్పందాన్ని పొడిగిస్తారని సమాచారం. హమాస్ చెరలో 240 మంది బందీలు ఉన్నారు. వారందరినీ విడుదల చేయించాలంటే నాలుగు రోజుల సమయం సరిపోదు. అందుకే ఒప్పందం పొడిగింపునకు ఇజ్రాయెల్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

రాజస్తాన్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- 199 నియోజకవర్గాల్లో నేడు పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కాంగ్రెస్ అభ్యర్థి మరణించడంతో ఒక స్థానంలో పోలింగ్ వాయిదా



జోధ్‌పూర్‌లో పోలింగ్ సామగ్రిని అందుకుంటున్న సిబ్బంది

జైపూర్: రాజస్తాన్ శాసనసభ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల దాకా పోలింగ్ జరుగనుంది. 200 నియోజకవర్గాలకు గాను 199 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అధికారులు సిద్ధమయ్యారు. శ్రీగంగానగర్ జిల్లాలోని కరణ్‌పూర్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే గుర్మీత్‌సింగ్ కూనార్ మరణించడంతో ఇక్కడ పోలింగ్‌ను వాయిదా వేశారు. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి 1,862 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రాష్ట్రంలో మొత్తం 5.25 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లోనూ తమ అభ్యర్థులను బరిలోకి దించింది. కాంగ్రెస్ పార్టీ భరత్‌పూర్ స్థానాన్ని తమ మిత్రపక్షం రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్‌ఎల్డీ)కి కేటాయించింది. కాంగ్రెస్, బీజేపీతోపాటు సీపీఎం, ఆర్‌ఎల్పీ, భారత్ ఆదివాసీ పార్టీ, భారతీయ ట్రైబల్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎంఐఎం తదితర పార్టీలు సైతం పోటీకి దిగాయి. పెద్ద సంఖ్యలో తిరుగుబాటు అభ్యర్థులు బరిలోకి దిగడం కాంగ్రెస్, బీజేపీలకు ఆందోళన కలిగిస్తోంది.

బరిలో ఉద్ధండులు..

పోలింగ్ సజావుగా జరగడానికి అన్ని చర్యలు తీసుకున్నామని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని రాజస్తాన్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ప్రవీణ్ గుప్తా తెలిపారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత అశోక్ గహ్లోత్, పీసీసీ అధ్యక్షుడు గోవింద్‌సింగ్, అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషీ, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ తదితరులు మరోసారి అదృష్టం పరీక్షించుకుంటున్నారు. బీజేపీ నుంచి సీనియర్ నేతలు వసుంధర రాజే, రాజేంద్ర రాథోడ్, సతీష్ పూర్ణియా, ఎంపీలు దివ్యా కుమారి, రాజ్యవర్ధన్ రాథోడ్, బాబా బాలక్‌నాథ్, కిరోడీలాల్ మీనా తదితరులు పోటీపడుతున్నారు. అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది.

గహ్లోత్, సచిన్ పైలట్ సయోధ్య!

రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ మధ్య విభేదాల సంగతి తెలిసందే. తాము ఐక్యంగా ఉన్నామని చాటేందుకు ఎన్నికల వేళ గహ్లోత్ ప్రయత్నించారు. సచిన్ పైలట్ ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న వీడియోను గహ్లోత్ శుక్రవారం సోషల్ మీడియాలో పోస్టుచేశారు. తద్వారా ప్రజలకు సానుకూల సంకేతం ఇచ్చేందుకు ప్రయత్నించారు.

ఒకే ఒక్క కుటుంబం కోసం పోలింగ్ బూత్

సాక్షి, న్యూఢిల్లీ: రాజస్థాన్ అసెంబ్లీకి నేడు జరగనున్న ఎన్నికల్లో ఒకే ఒక్క కుటుంబం కోసం అధికారులు ప్రత్యేకంగా ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న బార్మర్ జిల్లా పార్ గ్రామంలో రాష్ట్రంలోనే అతి చిన్న పోలింగ్ కేంద్రం ఉంది. ఇక్కడ ఒక కుటుంబంలోని 35 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సరిహద్దుకు ఆనుకుని ఉన్న ఈ గ్రామ ప్రజలు గత ఎన్నికల వరకు ఓటేయడానికి 20 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. ఎడారిలో రోడ్లు లేకపోవడంతో ప్రజలు కాలినడకన, ఒంటెలపై పోలింగ్ బూత్‌కు చేరుకొనేవారు. పోలింగ్ కేంద్రం చాలా దూరంగా ఉండటంతో వృద్ధులు, మహిళలు పలుమార్లు ఓటు వేయలేకపోయారు. ఈ పరిస్థితిపై సమాచారం అందుకున్న ఎన్నికల కమిషన్ అధికారులు గ్రామంలో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో మూడు వేర్వేరు ఇళ్లలో నివసించే ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మహిళలు, 18 మంది పురుషులు మొత్తం 35 మంది ఓటేయనున్నారు. కాగా, సిరోహి జిల్లాలోని అబు–పింద్వారా అసెంబ్లీ నియోజకవర్గంలో 4,921 అడుగుల ఎత్తులో ఉన్న షేర్‌గావ్ ఓటర్లు తొలిసారిగా తమ సొంతూళ్లోనే ఓటు వేయనున్నారు. గ్రామంలోని 117 మంది గిరిజనుల ఓటర్ల కోసం ఎన్నికల సంఘం ఈసారి ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల సిబ్బంది దట్టమైన అటవీప్రాంతంలో దాదాపు 18 కిలోమీటర్లు నడిచి పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

చంపితే ఎలా ఉంటుందో చూసేందుకు...
నిజంగానే మర్డర్ చేసింది!



ఆమె పేరు జుంగ్ యూ జుంగ్. వయసు 23 ఏళ్లు. ఉండేది దక్షిణ కొరియాలోని బుసాన్‌లో. నేరాలు, ఘోరాలంటే మహా పిచ్చి. ఎంతగా అంటే, టీవీల్లో రియల్ క్రైమ్ స్టోరీలను విపరీతంగా చూసేది. క్రైం నవలలు కూడా తెగ చదివేది. వాటి స్ఫూర్తితో, హత్య చేస్తే ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి నిజంగానే ఘోరానికి తెగబడింది. హత్య ఎలా చేయాలో, శవాన్ని ఎలా మాయం చేయాలో తెలుసుకునేందుకు ఇంటర్నెట్‌లో నెలల పాటు సెర్చ్ చేసి మరీ రంగంలోకి దిగింది. ముక్కూ మొహం తెలియని ఓ అమాయక టీచర్‌ను విచక్షణా రహితంగా పదేపదే పొడిచి పొట్టన పెట్టుకుంది! చివరికి శవాన్ని మాయం చేసే క్రమంలో అద్దెకు తీసుకున్న ట్యాక్సీ డ్రైవర్ పోలీసులకు ఉప్పందించడంతో కటకటాల పాలైంది! నేరాల సంఖ్య తక్కువగా ఉండే దక్షిణ కొరియా లో ఈ ఉదంతం సంచలనం సృష్టించింది...

విద్యార్థి తల్లిగా నమ్మించి...

జుంగ్ ఓ నిరుద్యోగి. తాతతో కలిసి నివసించేది. చేసేందుకు పనేమీ లేకపోవడంతో క్రైం ప్రోగ్రాంలు, సంబంధిత రియాల్టీ షోలకు, క్రైం నవలలకు బానిసగా మారింది. హత్యానుభవం ఎలా ఉంటుందో చూడాలని నిర్ణయించుకున్నాక సంబంధిత సమాచారం కోసం ఇంటర్నెట్‌లో వెదికింది. అనంతరం తగిన వ్యక్తి కోసం ట్యూటరింగ్ యాప్‌ల్లో నెలల పాటు వేట సాగించింది. హోం ట్యూషన్లు చెబుతారా అంటూ కనీసం 50 మందిని సంప్రదించింది. చివరికి గత మే నెలలో ఒక 26 ఏళ్ల మహిళను ఎంచుకుంది. తనను తాను ఓ హైస్కూలు స్టూడెంట్ తల్లిగా పరిచయం చేసుకుంది. తన బిడ్డకు ఇంగ్లిష్ పాఠాలు చెప్పాలంటూ నమ్మించింది. అందుకామె సమ్మతించాక ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి స్కూల్ యూనిఫాం కూడా తెప్పించుకుంది! అది వేసుకుని ట్యూటర్ ఇంటికి వెళ్లింది. ఆమె తలుపు తీసి లోనికి రానివ్వడమే ఆలస్యం, వెంట తీసుకెళ్లిన కత్తితో పదేపదే దాడికి దిగింది. ఏకంగా 100 సార్లకు పైగా పొడిచింది! చనిపోయిన తర్వాత కూడా దాడి ఆపలేదట! ఆ తర్వాత తాపీగా మృతదేహాన్ని ముక్కలుగా నరికింది. వాటిని సూట్‌కేస్‌లో కుక్కి, ఓ ట్యాక్సీలో తీసుకెళ్లి దూరంలో నది దగ్గర పడేసి చేతులు దులుపుకుంది. రక్తమోడుతున్న సూట్‌కేసును ఓ అమ్మాయి అడవిలో పడేసిందంటూ ట్యాక్సీ డ్రైవర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. జుంగ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు యావజ్జీవ ఖైదు విధించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సొరంగం పనులకు మళ్లీ ఆటంకం

కార్మికులను రక్షించే ప్రయత్నాలకు అంతరాయం

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని సిల్ క్యారా సొరంగంలో 12 రోజులుగా చిక్కుకుపోయిన కార్మికులను రక్షించే పనులకు శుక్రవారం మళ్లీ అవరోధం ఏర్పడింది. గురువారం సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన డ్రిల్లింగ్‌ను 25 టన్నుల భారీ ఆగర్ యంత్రంతో శుక్రవారం తిరిగి ప్రారంభించారు. అయితే, కొద్దిసేపటికే మరోసారి సమస్యలు రావడంతో నిలిపివేశారు. వాటిని సరిచేసి మళ్లీ పనులు ప్రారంభించినా గంటలోనే మళ్లీ అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. కూలిన శిథిలాల గుండా సొరంగంలోకి ఒకదానికొకటి వెల్డింగ్‌తో కలిపిన స్టీలు పైపులను పంపించి, వాటిగుండా కార్మికులను వెలుపలికి తీసుకు వచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రెండు రోజులుగా ఏర్పడుతున్న అంతరాయాలు టన్నెల్ వద్ద ఆత్రుతగా ఎదురుచూస్తున్న కార్మికుల సంబంధీకుల్లో ఆందోళన రేపుతోంది. అయితే, మిగిలి ఉన్న 5.4 మీటర్ల మేర శిథిలాల్లో డ్రిల్లింగ్‌కు అవరోధాలు ఎదురుకాకపోవచ్చని ప్రత్యేక రాడార్ ద్వారా తెలిసిందని అధికారులు తెలిపారు. ఇలా ఉండగా, టన్నెల్ నుంచి వెలుపలికి వచ్చాక కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, ఆ వెంటనే గ్రీన్ కారిడార్ ద్వారా ఆస్పత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు గఢ్వాల్ రేంజ్ ఐజీ కేఎస్ నంగ్యాల్ చెప్పారు.

'డీప్ ఫేక్' ఫిర్యాదులపై ప్రజలకు సహకరిస్తాం

- ఐటీ సేవల్లో లోపాలపైనా కూడా..
- కేంద్ర మంత్రి రాజీవ్ చంద్ర శేఖర్

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాల్లో డీప్ ఫేక్ వంటి అభ్యంతరకర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రజలకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ చెప్పారు. సామాజిక మాధ్యమ వేదికలపై ఐటీ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ప్రజలిచ్చే ఫిర్యాదుల కోసం తమ శాఖ త్వరలో ఒక వేదికను అందుబాటులోకి తేనుందని వెల్లడించారు. ప్రస్తుతమున్న గ్రీవెన్స్ అప్పిలేట్ కమిటీ(జీఏసీ)కి ఇది అదనమన్నారు. సామాజిక మాధ్యమ వేదికల ప్రతినిధులతో సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీ నిబంధనలకు అనుగుణంగా సోషల్ మీడియా సంస్థలు వాటి వినియోగ నిబంధనలను సర్దుబాటు చేసుకునేందుకు వారం సమయం ఇచ్చినట్లు వెల్లడించారు. డీప్‌ఫేక్‌గా గుర్తించిన కంటెంట్‌ను సోషల్ మీడియా వేదికల నుంచి తొలగించడానికి బదులుగా ఆ కంటెంట్‌పై డీప్‌ఫేక్ అనే లేబుల్ వేసినా సరిపోతుందని తెలిపారు. 2022 అక్టోబర్‌లో నోటిఫై చేసిన ఐటీ నిబంధనల్లోని 7వ సెక్షన్ అమలు కోసం ప్రత్యేకంగా ఒక అధికారిని నియమిస్తామన్నారు. దీనివల్ల అభ్యంతరకర కంటెంట్‌పై బాధితులు ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఎఫ్ఐఆర్‌ల నమోదు ప్రక్రియలో తమ మంత్రిత్వ శాఖ సహాయకారిగా ఉంటుందని కూడా తెలిపారు. ఐటీ నిబంధనల్లోని సెక్షన్–7 సామాజిక మాధ్యమ వేదికల హోదాను తక్షణమే రద్దు చేసేందుకు వీలు కల్పిస్తుంది. నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకునేందుకు సైతం వీలుంటుంది. 'నిబంధనలను లక్ష్యపెట్టని సోషల్ మీడియా సంస్థలపై కేసులు నమోదవుతాయి. సంబంధిత కంటెంట్‌ను పోస్ట్ చేసిన వారిపైనా కేసులుంటాయి'అని మంత్రి తెలిపారు. ఆయా సంస్థలు చట్టానికి లోబడి వ్యవహరిస్తే డీప్‌ఫేక్ వంటి సమస్యలు ఇకపై తలెత్తే అవకాశమే లేదన్నారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 25 । నవంబర్ । 2023



ఫైనల్ టచ్ షో

బీజేపీ అగ్రనేతలంతా ఇక్కడే మకాం

- రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, అంబర్‌పేటలలో అమిత్‌షా
- కీసర, కంటోన్మెంట్‌లలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- ఇప్పటికే పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, మంత్రులు స్మృతీ ఇరానీ, పీయూష్‌గోయల్..
- రేపు సైతం కొనసాగనున్న మోదీ పర్యటన

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నియోజకవర్గాలపై కమలనాథ్‌లు స్పెషల్ ఫోకస్‌పెట్టారు. వరుస పర్యటనలతో ఆ పార్టీ కేడర్‌లో జోష్ నింపుతున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నగరానికి చేరుకున్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా వీరంతా సుడిగాలి పర్యటనలు చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం అభ్యర్థి తోకల శ్రీనివాసరెడ్డిని గెలిపించాల్సిందిగా కోరుతూ హైదర్షాకోట్‌లో.. శేరిలింగంపల్లి అభ్యర్థి రవికుమార్ యాదవ్ విజయం కోసం నిజాంపేట్ ఎక్స్ రోడ్‌లో.. అంబర్‌పేట అభ్యర్థి కృష్ణ యాదవ్ తరపున ఆ నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించారు. ఇక రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం మేడ్చల్, కంటోన్మెంట్ అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. మేడ్చల్ బీజేపీ అభ్యర్థి ఏనుగు సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలో నిర్వహించిన సకలజనుల విజయ సంకల్ప సభలో రాజ్‌నాథ్ ప్రచారం చేశారు.

- ఇప్పటికే ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర మంత్రులు స్మృతీ ఇరానీ, ప్రీయూష్ గోయల్ కూడా పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఓటర్లే లక్ష్యంగా వీరంతా ప్రచారం చేస్తున్నారు. బీజేపీ అగ్రనేతలంతా బేగంపేటలోని హోటల్ ఐటీసీ కత్రియా వేదికగా మకాం వేసి, రోజుకు రెండు మూడు శివారు జిల్లాలతో పాటు సాయంత్రం నగరంలోని పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. అభ్యర్థుల తరపున రోడ్‌షోలు, విజయ సంకల్ప సభలు నిర్వహిస్తున్నారు.

నేడు మహేశ్వరానికి ప్రధాని మోదీ..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ శనివారం నగరానికి చేరుకోనున్నారు. సాయంత్రం 5 గంటలకు తుక్కుగూడ వేదికగా నిర్వహించే 'విజయ సంకల్ప సభ'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఓఆర్ఆర్ సమీపంలో ఏర్పాటు చేసిన సభాస్థలికి మహేశ్వరం, రాజేంద్రనగర్, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులను పెద్ద సంఖ్యలో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాని మోదీతో పాటు ఇతర ముఖ్య నేతలు కూడా సభకు హాజరు కానుండటంతో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఇప్పటికే కేంద్ర భద్రతా బలగాలు సభాస్థలికి చేరుకుని, ఏర్పాట్లను పర్యవేక్షించాయి. ప్రధాని సభ నేపథ్యంలో సాయంత్రం శ్రీశైలం జాతీయ రహదారితో పాటు తుక్కుగూడ నుంచి శంషాబాద్ వైపు వెళ్లే ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డుపై ఆంక్షలు విధించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కాగా.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం నగరానికి రానున్నట్లు సమాచారం.

ట్రాఫిక్ ఆంక్షలు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శని, ఆదివారాల్లో నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం సాయంత్రం 5.20 నుంచి 5.50 గంటల వరకు, ఆదివారం ఉదయం 10.35 నుంచి 11.05 గంటల వరకు బేగంపేట విమానాశ్రయం–రాజ్‌భవన్ మధ్య ఆంక్షలు అమలులో ఉంటాయి. వాహన చోదకులు వీటిని దృష్టిలో పెట్టుకుని సహకరించాలని ఆయన కోరారు.







కేటీఆర్.. మెట్రో టైం!

మున్సిపల్ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం రాయదుర్గం నుంచి బేగంపేట్ వరకు మెట్రోలో పయనించారు. ఆయనతో పలువురు ప్రయాణికులు, మెట్రో సిబ్బంది సెల్ఫీ దిగారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత ఎన్నికల ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని మంచి నాయకులను గెలిపించుకోవాలని సూచించారు.



అమిత్ షో

అంబర్‌పేట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి బీజేపీ అభ్యర్థులు కృష్ణ యాదవ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్ యాదవ్‌లకు మద్దతుగా తలపెట్టిన రోడ్ షోల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొని ప్రసంగించారు. భారీ ర్యాలీ నిర్వహించారు.

ఖర్గే.. కబర్



ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్‌కు మద్దతుగా గడ్డిఅన్నారం పీఅండ్‌టీ కాలనీలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు.

'రాజ్' ఆవాజ్..



మేడ్చల్, కార్వాన్, కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, టి.అమర్‌సింగ్, శ్రీ గణేష్‌లకు మద్దతుగా నిర్వహించిన సభల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

డీకే 47



అంబర్‌పేట్ కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడారు. కేసీఆర్ అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు.

విజయ గీతం




కంటోన్మెంట్, సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థులు జీవీ వెన్నెల, ఆదం సంతోష్ కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోల్లో ఆ పార్టీ నాయకురాలు విజయశాంతి మాట్లాడారు.

● ఎక్కేద్దాం.. అడిగేద్దాం

గిరాగిరా తిరిగేద్దాం!

ఎన్నికల సమయంలో హెలికాప్టర్ల వినియోగం

- ప్రతిరోజూ పదింటిని తెచ్చుకుంటున్న రాజకీయ పార్టీలు
- గంటకు రూ.లక్షల్లో అద్దె చెల్లింపు
- గత ఎన్నికల్లో కంటే ఈసారి పెరిగిన హెలికాప్టర్ల సంఖ్య
- ప్రముఖుల రాకపోకలతో సందడిగా బేగంపేట్ ఎయిర్‌పోర్టు



సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల ప్రచారంలో హెలికాప్టర్లు దూసుకెళ్తున్నాయి. రాజకీయ నేతల సుడిగాలి పర్యటనల్లో గిరికీలు కొడుతున్నాయి. గతంలో జరిగిన ఎన్నికల కంటే ఈసారి వీటి వినియోగం విరివిగా పెరిగింది. అన్ని ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు రోజుకు మూడు, నాలుగు సభల్లో పాల్గొంటున్నారు. బహిరంగసభలతో పాటు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలు, ర్యాలీలు, సమావేశాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. దీంతో కొన్ని గంటల వ్యవధిలోనే రాష్ట్రమంతటా పర్యటించాల్సివస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరుసగా వివిధ ప్రాంతాల్లో జరిగే సభల్లో పాల్గొనేందుకు రోడ్డు మార్గంలో వెళ్లడం కష్టసాధ్యంగా మారడంతో అన్ని ప్రధాన పార్టీల ముఖ్య నాయకులు హెలికాప్టర్లపైనే ఆధారపడి పరుగులు తీస్తున్నారు. ఇంచుమించు నెల రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి రోజు మూడు, నాలుగు సభల్లో పాల్గొంటున్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సైతం రోజుకు నాలుగైదు సభలకు హాజరవుతున్నారు. మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు, బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తదితర నాయకులు రాష్ట్రం నలుమూలలా పర్యటిస్తున్నారు. ప్రధాన పార్టీల స్టార్ క్యాంపెయినర్లు కూడా హెలికాప్టర్లలో పర్యటిస్తున్నారు. గత ఎన్నికల్లో రోజుకు 3 నుంచి 4 హెలికాప్టర్లను మాత్రమే వినియోగించగా ఈసారి రోజుకు పది వరకు వినియోగిస్తున్నట్లు అంచనా.

ఐదుగురి నుంచి ఏడుగురి వరకు..

- ప్రస్తుతం రాజకీయ పార్టీలు వినియోగిస్తున్న హెలికాప్టర్లన్నీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినవే. కొన్ని సింగిల్ ఇంజిన్ సామర్థ్యం కలిగినవి కాగా, చాలా వరకు డబుల్ ఇంజిన్ సామర్థ్యం కలిగిన వాటినే వినియోగిస్తున్నారు. ఒక్కో చాపర్‌లో ఐదుగురు నుంచి ఏడుగురు ప్రయాణం చేయవచ్చు. దీంతో వీటి కోసం పార్టీలు చేసే ఖర్చు కూడా రూ.లక్షల్లోనే ఉంది. గతంలో గంటకు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు చార్జీ ఉంటే ఇప్పుడు ఒక్కో హెలికాప్టర్‌కు గంటకు రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆయా సంస్థలు చార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.
- తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరగడం, అన్ని పార్టీలకు చెందిన నాయకులు విరివిగా పర్యటిస్తుండటంతో చార్జీలను భారీగా పెంచాయని ఏవియేషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్‌లకు చెందిన పలు ఏవియేషన్ సంస్థలు హెలికాప్టర్లను ఏర్పాటు చేస్తున్నాయి. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో గ్లోబల్ వెక్ట్రా హెలికార్ప్, చిప్సన్ ఏవియేషన్, ఇండో పసిఫిక్ ఏవియేషన్, గోల్డెన్ ఈగిల్ ఏవియేషన్ తదితర సంస్థలకు చెందిన హెలికాప్టర్లు ప్రచారంలో పరుగులు తీస్తున్నాయి. ఆగస్టా వెస్ట్‌ల్యాండ్ (ఏడబ్ల్యూ) 109, ఏడబ్ల్యూ 139, ఏడబ్ల్యూ 169, బెల్ 429, యూరో కాప్టర్ 135 తదితర రకాలకు చెందిన హెలికాప్టర్లు ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో తిరుగుతున్నాయి. ఈ నెల 28 వరకు రాజకీయ పార్టీలు హెలికాప్టర్లను వినియోగించనున్నాయి.

బేగంపేట్ ఎయిర్‌పోర్టు.. బిజీబిజీ

ప్రముఖుల రాకపోకలు మినహా మిగతా రోజుల్లో నిశ్శబ్దంగా ఉండే బేగంపేట్ ఎయిర్‌పోర్టు కొద్ది రోజులుగా సందడిగా మారింది. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలు, నాయకుల రాకపోకలతో బేగంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీకి విమానాలు పరుగులు తీస్తున్నాయి. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ అధ్యక్షులు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే, ఆ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, తదితరుల రాకపోకలతో పాటు వారితో పాటు వచ్చే ఇతర నాయకులు, స్థానిక నేతల ఉరుకులు, పరుగులతో బేగంపేట్ కళకళలాడుతోంది.

ట్రా'ఫికర్' తగ్గేనా?

ప్రజారవాణాకు పెద్దపీట వేసిన ప్రభుత్వం

...అయినా ఇంకా తప్పని తిప్పలు

- ఇప్పటికీ రోడ్లపైనే కాలం చెల్లిన వాహనాలు
- పార్కింగులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు
- ఏళ్లుగా పత్తా లేని ట్రక్ పార్కులు, బస్ టెర్మినళ్లు
- సమస్యను పరిష్కరించాలని నగర చోదకుడి డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని ప్రజా రవాణా వ్యవస్థలో పెను మార్పులు వచ్చాయి. ఎంఎంటీఎస్‌కు తోడు మెట్రో రైల్ దూసుకుపోతోంది. కొత్తగా పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు రోడ్లు ఎక్కుతున్నాయి. ఎక్కడికక్కడ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు రూపుదిద్దుకుంటున్నాయి. అయినప్పటికీ సగటు వాహన చోదకుడికి ట్రాఫిక్ ఇబ్బందులు తప్పట్లేదు. ప్రతిరోజూ వెయ్యి చొప్పున అదనంగా రోడ్డు పైకి వస్తున్న వాహనాల తాకిడిని సిటీ రోడ్లు తట్టుకోలేకపోతున్నాయి. ఈ సమస్యలు పూర్తి స్థాయిలో తీరాలంటే కొన్ని కీలక చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్టీఏ విభాగంలో కలిసి చేయాల్సిన కీలక అంశాలు మరికొన్ని ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు.

ఆ వాహనాలు రహదారులపై అనేకం..


రోడ్ల తిరిగే వాహనాలకు 'జీవితకాలం' ఉంటుంది. కమర్షియల్ వాహనాలకు 15 ఏళ్లు, వ్యక్తిగత వాహనాలకు 22 ఏళ్లు జీవిత కాలమని నిబంధనలు చెబుతున్నాయి. కాలం ముగిసిన తర్వాత ప్రతి సంవత్సరం పరీక్షలు చేయించి, పన్ను చెల్లించి రెన్యువల్ చేయించుకుంటూ ఉండాల్సిందే. ప్రస్తుతం నగరంలో సంచరిస్తున్న వ్యక్తిగత వాహనాల్లో కాలం చెల్లినవి లక్షల సంఖ్యలోనే ఉన్నాయి. కమర్షియల్ వాహనాల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ ఇవీ చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నాయి. వీటిపై అటు ఆర్టీఏ, ఇటు ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెడితే రోడ్లపై వాహనాల సంఖ్య తగ్గడంతో పాటు పన్ను రూపంలో భారీ ఆదాయం చేకూరుతుంది. వీటన్నింటికీ మించి రోజురోజుకూ పెరిగిపోతున్న వాయి కాలుష్యాన్ని కొంత మేర నియంత్రించినట్లు అవుతుంది.

పార్కులు, టెర్మినల్స్ అత్యవసరం...

- కోర్ సిటీలోకి ప్రవేశించే భారీ వాహనాలు, ప్రైవేట్ బస్సుల వల్ల ట్రాఫిక్ చిక్కులు తప్పట్లేదు. నిర్ణీత సమయాల్లోనే వీటిని నగరంలోకి అనుమతిస్తున్నప్పటికీ కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. వీటికి పరిష్కారంలో నగరానికి నాలుగు దిక్కులా ట్రక్ పార్కులు, బస్ టెర్మినల్స్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఏళ్ళుగా ఉన్నాయి. ఇప్పటికే బాట సింగారంలో నిర్మించిన ట్రక్ పార్క్ ఫ్రూట్ మార్కెట్‌గా మారిపోయింది. సకల సదుపాయాలతో నలుదిక్కులా టెర్మినల్స్, పార్కులు నిర్మించడంతో పాటు కచ్చితంగా వినియోగించుకునేలా చేయాలి.
- నగరంలోని రోడ్లు గరిష్ఠంగా 9 టన్నుల బరువు ఉన్న వాహనాలనే తట్టుకోగలరు. నిర్ణీత సమయాల్లోనూ ఇంతకు మించిన బరువు వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవడం ద్వారా రోడ్డు ధ్వంసం కావడం తగ్గుతుంది. ఈ ప్రభావం కూడా సిటీ ట్రాఫిక్‌పై ఉంటుంది. ఇప్పటికే మెట్రో రైల్ ప్రాజెక్టును మరింత విస్తరించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనికి తోడు ఎంఎంటీఎస్‌ను సైతం అవసరమైన స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

అడుగడుగునా ఆక్రమణలే...

రహదారులకు పక్కగా ఉండే క్యారేజ్‌వేలు ఎంత క్లియర్‌గా ఉంటే వాహన శ్రేణులు అంత వేగంగా ముందుకు కదులుతాయి. ఫుట్‌పాత్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఈ సౌలభ్యంతో పాటు పాదచారుల భద్రతకు పెద్దపీట వేసినట్లు అవుతుంది. నగరంలోని ప్రధాన రహదారులతో పాటు ఇతర రోడ్లలోనూ ఆక్రమణలకు కొదవే లేదు. ఫుట్‌పాత్‌లను చిరు వ్యాపారులతో పాటు బడా బిజినెస్ మ్యాన్స్ సైతం అందినకాడికి ఆక్రమించేసుకుంటున్నారు. వీటితో పాటు పార్కింగ్ ప్రాంతాలుగా కేటాయించిన సెల్లార్లు సైతం వాణిజ్యపరంగా వినియోగించేస్తున్నారు. ఈ కారణంగానే ఆయా ప్రాంతాల్లో క్యారేజ్ వేలు కూడా కనిపించకుండా పోతున్నాయి. వీటి ప్రభావం రహదారిపై వెళ్తున్న వాహనాలపై ఉంటోంది. దీనికి తోడు నగరంలో అనేక ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ అవసరం.



పరేషాన్‌లో పతంగి!

మజ్లిస్ పార్టీకి తలనొప్పిగా ఎంబీటీ

- ఊహించని పరిణామాలతో ఉక్కిరిబిక్కిరి
- యాకుత్‌పురాలో నువ్వా.. నేనా?
- రెండు సిట్టింగ్ స్థానాలో కాంగ్రెస్ గట్టిపోటీ
- పాతబస్తీలో వేడెక్కిన రాజకీయం

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ రాజకీయాలను శాసించే మజ్లిస్‌కు ఎంబీటీ పోరు తప్పడం లేదు. ఏకంగా యాకుత్‌పురా అసెంబ్లీ స్థానంలో తీవ్రమైన పోటీ నెలకొనడంతో మజ్లిస్‌కు ఎంబీటీ కొరకరాని కొయ్యగా మారింది. ఈసారి పాతబస్తీకే పరిమితమై కేవలం తొమ్మిది స్థానాల్లో బరిలో దిగినప్పటికీ.. ఒక సిట్టింగ్ స్థానంలో ఎంబీటీ, మరో రెండు సిట్టింగ్ స్థానాల్లో కాంగ్రెస్ దూకుడు ఆందోళనకరంగా తయారైంది. గతంలో ఏన్నడూ లేని విధంగా మజ్లిస్‌కు గడ్డు పరిస్థితి నెలకొంది. దీంతో ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సిట్టింగ్ స్థానాలపై ప్రత్యేక దృష్టి సారించి పాదయాత్ర, స్థానిక సభలతో పరిస్థితి చక్కదిద్దేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

యాకుత్‌పురా చేజారేనా?

- ఎంబీటీ దూకుడుతో మజ్లిస్‌కు యాకుత్‌పురా సిట్టింగ్ స్థానం చేజారే పరిస్థితి నెలకొంది. మజ్లిస్ పక్షాన నాంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఎంబీటీ పక్షాన ఆ పార్టీ అధికార ప్రతినిధి అమ్జదుల్లాఖాన్ పోటీ పడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు రంగంలో ఉన్నప్పటికీ పోటీ మాత్రం ఇద్దరి మధ్యే నెలకొన్నట్లు కనిపిస్తోంది. యాకుత్‌పురా సిట్టింగ్ ఎమ్మెల్యే అహ్మద్ పాషాకు రిటైర్మెంట్ ప్రకటించిన మజ్లిస్.. నాంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ అభ్యర్థిత్వాన్ని యాకుత్‌పురాకు బదిలీ చేసి రంగంలోకి దింపింది.
- రెండు దశాబ్దాలుగా యాకుత్‌పురా స్థానాన్ని కైవసం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న ఎంబీటీ ఈసారి ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. వాస్తవంగా గతంలో మజ్లిస్ నుంచి చీలిన ఎంబీటీ యాకుత్‌పురా స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆ తర్వాత ఎంబీటీ నుంచి ఎన్నికైన ముంతాజ్ ఖాన్ మజ్లిస్‌లో చేరి వరసగా గెలుస్తూ వచ్చారు. గత పర్యాయం ముంతాజ్ ఖాన్ చార్మినార్ నుంచి పోటీ చేసి ఇటీవల రిటైర్మెంట్ తీసుకున్నారు. ఎంబీటీ తన పూర్వవైభవం కోసం యాకుత్‌పురాపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఈసారి ఎలాగైనా పాగా వేసేందుకు పాట్లు పడుతోంది.

నాంపల్లి పదిలమేనా?

మజ్లిస్ సిట్టింగ్ స్థానమైన నాంపల్లిలో పరిస్థితి నువ్వా.. నేనా? అన్న విధంగా తయారైంది. మజ్లిస్ వ్యూహాత్మంగా సిట్టింగ్ ఎమ్మెల్యేను పక్క సెగ్మెంట్‌కు పంపించి ఇక్కడి నుంచి మాజీ మేయర్ మాజీద్ హుస్సేన్‌ను రంగంలోకి దింపింది. ఇదే స్థానం నుంచి మూడు పర్యాయాలుగా పోటీ పడుతున్న ఫిరోజ్ ఖాన్ కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో ఉండటంతో తీవ్ర పోటీ తప్పడం లేదు. కాంగ్రెస్ దూకుడు కూడా మజ్లిస్‌కు ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు ఫిరోజ్ ఖాన్‌కు వ్యక్తిగత ప్రాబల్యం మజ్లిస్ ఓట్లకు గండికొట్టే అవకాశాలున్నాయి. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్ బలపడింది. స్థిరాస్తి వ్యాపారి అక్బర్ ప్రచారం ఉధృతం చేయడం మజ్లిస్‌ను కలవర పెట్టిస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల తన స్థానాన్ని పదిలపర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన రాష్ట్ర రెజ్లర్లు



సాక్షి, సిటీబ్యూరో: రష్యాలో జరిగిన మాస్కో రెజ్లింగ్‌ ప్రపంచ గ్రాప్లింగ్‌ చాంపియన్‌ షిప్‌లో భారత రెజ్లింగ్‌ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. నవంబర్‌ 17 నుంచి 19 వరకు జరిగిన ఈ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 19 దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణకు చెందిన రెజ్లర్లు పతకాల పట్టికలో తమదైన ముద్ర వేశారు. శ్రీనిధి (34 కేజీలు)– రెండు బంగారు పతకాలు, నేహా (సీనియర్స్‌, 84 కేజీలు)– రజతం, వైష్ణవి ఠాకూర్‌ (46 కేజీలు)– రజతం, శ్రీచక్ర (62 కేజీలు)– కాంస్య పతకాలు సాధించారు. పురుషుల్లో సుధాకర్‌ యాదవ్‌ (92 కేజీలు) రజత పతకం సాధించగా...యువ రెజ్లర్లు ఓం దీప్‌ (73 కేజీలు), మణికాంత్‌ యాదవ్‌ (84 కేజీల) విభాగంలో 4వ స్థానంలో నిలిచారు. ప్రముఖ రెజ్లర్‌, గచ్చిబౌలి స్టేడియం కోచ్‌ సుధాకర్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో తెలంగాణ జట్టు కఠోర శిక్షణ పొందింది. ఈ బృందాన్ని గ్రాప్లింగ్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ ముంగి జైపాల్‌ రెడ్డి, అధ్యక్షుడు శ్రీధర్‌ మహంకాళి, కార్యదర్శి మనోజ్‌ దాస్‌ అభినందించారు.

ఓటింగ్‌ శాతం పెంచుదాం

- ప్రజల్లో అవగాహనకు కృషి
- 30న పోలింగ్‌కు అంతా సిద్ధం
- పకడ్బందీగా ఎన్నికల కోడ్‌ అమలు
- ఎన్నికల నిర్వహణకు 12,500 మంది సిబ్బంది

'సాక్షి'తో మేడ్చల్‌ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పి.గౌతమ్‌

సాక్షి, మేడ్చల్‌ జిల్లా: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో గతంలో కంటే ఓటింగ్‌ శాతాన్ని పెంచుతామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ పి.గౌతమ్‌ తెలిపారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 51.69 శాతం, 2018 ఎన్నికల్లో 55.88 శాతం ఓటింగ్‌ నమోదైందని, ఈ ఎన్నికల్లో ఓటింగ్‌ శాతాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన తోకూడిన చైతన్య కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ ఈ నెల 30న ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా అవసరమైన పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ల కోసం ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మేడ్చల్‌ ఈవీఎంలు బోగారంలోని హోలీమేరీ ఇంజనీరింగ్‌ కాలేజీలో, మల్కాజిగిరి ఈవీఎంలు సైనిక్‌పురి భవన్స్‌లో, కూకట్‌పల్లి ఈవీఎంలు జేఎన్‌టీయూలో, ఉప్పల్‌ ఈవీఎంలు రామంతాపూర్‌ పాలిటెక్నిక్‌ కళాశాలలో, కుత్బుల్లాపూర్‌ ఈవీఎంలు లయోలా కాలేజ్‌ నుంచి పంపిణీ చేసేలా అన్ని సిద్ధం చేసినట్లు గౌతమ్‌ తెలిపారు. జిల్లాలో ఎన్నికల అధికారులందరూ సమన్వయంతో విధుల నిర్వహించేలా ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై తెల్పిన వివరాలు ఆయన మాటల్లోనే...

అసెంబ్లీ బరిలో 126 మంది అభ్యర్థులు

జిల్లాలోని మేడ్చల్‌, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 126 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. వారికి గుర్తులను కూడా కేటాయించాం. పోలింగ్‌ కేంద్రాలకు అనుగుణంగా ఇప్పటికే మొదటి ర్యాండమైజేషన్‌ ద్వారా ఆయా నియోజకవర్గ కేంద్రాలకు ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల (ఈవీఎం)లను తరలించి స్ట్రాంగ్‌ రూముల్లో భద్రపరిచాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్‌ కేంద్రాల సంఖ్య కంటే 25 శాతం అదనంగా (రిజర్వు) బ్యాలెట్‌ యూనిట్లు, కంట్రోల్‌ యూనిట్లను కేటాయించాం.



పకడ్బందీగా కోడ్‌ అమలు

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నాం. శాసనసభ ఎన్నికలకు సంబంధించి 16 విభాగాలకు 22 మంది నోడల్‌ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు చాలా కమిటీలు పనిచేస్తున్నాయి.

పారదర్శకంగా బ్యాలెట్‌ ఓటింగ్‌

ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు మొత్తం 1070 మంది ఇంటి నుంచే ఓటు వేసేందుకు వీలుగా ఫారం 12 (డి) పంపిణీ చేశాం. సీక్రెట్‌ ఓటింగ్‌ కోసం ఓటింగ్‌ కంపార్టుమెంట్స్‌ ఏర్పాటు చేస్తున్నాం. మొత్తంగా 6 వేల మందికి పోస్టల్‌ బ్యాలెట్‌ వెసులుబాటు కల్పించాం. పోస్టల్‌ బ్యాలెట్‌ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పోలింగ్‌ కేంద్రాల్లో ఓటు వేసే అవకాశం ఉండదు.

ఒక్కో పోలింగ్‌ కేంద్రంలో 1500 మంది ఓటేయొచ్చు...

జిల్లాలో 2,439 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఒక్కో పోలింగ్‌ కేంద్రంలో 1,500 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటారు. సమస్యాత్మకంగా గుర్తించిన వెయ్యి పోలింగ్‌ కేంద్రాల వద్ద అదనపు బలగాలను నియమించాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. అన్ని పోలింగ్‌ కేంద్రాల్లో వెబ్‌ క్యాస్టింగ్‌ ఏర్పాటు చేస్తున్నాం. మహిళలకు నియోజకవర్గానికి ఐదు చొప్పున 25 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశాం. దివ్యాంగులకు 5, యువతకు 5 ప్రత్యేక పోలింగ్‌ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశాం. ఇప్పటికే ఆయా ఓటర్లకు పోలింగ్‌ స్లిప్పులను పంపిణీ చేశాం. వందశాతం పోలింగే లక్ష్యంగా ప్రచారం కల్పిస్తున్నాం. పోలింగ్‌ నిర్వహణకు 12,500 మంది ఎన్నికల సిబ్బందిని నియమించాం. ఆరుగురు ఎన్నికల పరిశీలకులతోసహా మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల తీరును పర్యవేక్షిస్తున్నారు.



ఫిర్యాదులపై స్పందన

ఎన్నికల ప్రచార సభలు, సమావేశాల కోసం సువిధ యాప్‌ ద్వారా అందిన దరఖాస్తులకు సకాలంలో అనుమతులు మంజూరు చేస్తున్నాం. ఇప్పటి వరకు 260 అనుమతులు ఇచ్చాం. సీ విజిల్‌ యాప్‌ ద్వారా ఇప్పటి వరకు 315 ఫిర్యాదులు అందగా వాటిని పరిష్కరించాం. జిల్లాలోని 14 చెక్‌పోస్టుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నిఘా బృందాల పనితీరును కంట్రోల్‌ రూమ్‌ ద్వారా పర్యవేక్షించేందుకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన పీటీజెడ్‌ కెమెరాలను వారి వాహనాలకు అమర్చాం. ఇప్పటి వరకు చెక్‌ పోస్టుల తనిఖీల్లో ఆభరణాల విలువతో కలిపి నగదు మొత్తం రూ.50.96 కోట్లు స్వాధీనం చేసుకున్నాం.



'విజయం' కోసం.. వెంకటేశ్వరకాలనీ డివిజన్‌ వెంకటేశ్వరనగర్‌లో లంబాడి మహిళలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖైరతాబాద్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి పి.విజయారెడ్డి



మేము సైతం మాధ'వరం' కూకట్‌పల్లిలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మాధవరం కృష్ణారావును గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్న వారి కుటుంబ సభ్యులు

ఉత్తర భారతీయ వ్యాపారులకు అండగా బీఆర్‌ఎస్‌

- రాష్ట్ర పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ కోలేటి దామోదర్‌ గుప్తా



సమావేశంలో పాల్గొన్న దామోదర్‌గుప్తా, నందకిశోర్‌ వ్యాస్‌

అబిడ్స్‌: గ్రేటర్‌లోని ఉత్తర భారతీయ వ్యాపారులకు గత పదేళ్లుగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం అండగా నిలిచిందని రాష్ట్ర పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ కోలేటి దామోదర్‌ గుప్తా అన్నారు. వీరి సంక్షేమానికి సీఎం కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌లు ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. మార్వాడీలు, రాజస్థానీయులు, గుజరాతీయుల వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు రాకుండా చూశారని అన్నారు. శుక్రవారం రాత్రి ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌లో ఉత్తర భారతీయులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ వైశ్య సమాజ్‌ ఉత్తర భారతీయుల దీపావళి స్నేహ మిలాన్‌ కార్యక్రమాన్ని గోషామహల్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి నందకిశోర్‌ వ్యాస్‌తో కలిసి కోలేటి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మంత్రి కేటీఆర్‌ ఈ కార్యక్రమానికి రావాల్సి ఉండగా అనివార్య కారణాలతో రాలేదని వివరించారు. ఉత్తర భారతీయుడైన నందకిశోర్‌ వ్యాస్‌ను గోషామహల్‌లో గెలిపించాలని కోరారు. నందకిశోర్‌ వ్యాస్‌ మాట్లాడుతూ.... తనకు మద్దతు పలుకుతున్న వ్యాపారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 30వ తేదీన జరిగే పోలింగ్‌లో ఓటు వేసి తనను గెలిపిస్తే జీవితాంతం రుణపడి ఉంటానని, గోషామహల్‌ ప్రజలకోసం నిరంతరం పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమాజ్‌ ప్రతినిధులు రవిప్రసాద్‌, ఎంఎల్‌.అగర్వాల్‌, యోగేష్‌ సింగ్‌, కైలాస్‌ దాలియా, సుధాకర్‌ షా, వినోద్‌ అగర్వాల్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు గడ్డం శ్రీనివాస్‌ యాదవ్‌, ఉద్యమనేత ఆర్వీ మహేందర్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా మాక్‌ పోలింగ్‌ పూర్తి చేయాలి: కలెక్టర్‌



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల కమిషనింగ్‌, మాక్‌ పోలింగ్‌ త్వరగా పూర్తి చేయాలని ఎన్నికల అధికారులను హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి ఆదేశించారు. శుక్రవారం చాంద్రాయణగుట్ట, గోషామహల్‌, మలక్‌పేట, యాకుత్‌పుర నియోజకవర్గాలకు చెందిన డీఆర్సీలను సందర్శించి అక్కడ జరుగుతున్న కమిషనింగ్‌, మాక్‌ పోలింగ్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్‌ అధికారులతో మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కమిషనింగ్‌, మాక్‌ పోలింగ్‌ నిర్వహించాలని అన్నారు. మాక్‌ పోలింగ్‌, కౌంటింగ్‌ జరిగే రోజు లెక్కింపు కౌంటర్ల ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశారు.

కేసీఆర్‌ కుటుంబ పాలనను అంతం చేయాలి

కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌

కాచిగూడ: సీఎం కేసీఆర్‌ అవినీతి..కుటుంబ పాలనను అంతం చేయాలని కర్నాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ పిలుపునిచ్చారు. కర్ణాటకలో తాము ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని, దీనిపై అబద్ధాలు ప్రచారం చేస్తున్న తెలంగాణ మంత్రులకు దమ్ముంటే కర్ణాటకను సందర్శించి వాస్తవాలు తెలుసుకోవాలని సవాల్‌ విసిరారు. శుక్రవారం రాత్రి అంబర్‌పేట కాంగ్రెస్‌ అభ్యర్థి డాక్టర్‌ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాచిగూడలో జరిగిన రోడ్‌ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్‌, బీజేపీలు రెండు ఒకటేనని, ఈ పార్టీలకు ప్రజల గుణపాఠం తప్పదన్నారు. సీఎం కేసీఆర్‌ రూ.లక్షల కోట్ల కుంభకోణాలకు పాల్పడ్డారని, అవినీతి కుటుంబ పాలనను ప్రజలు చీదరించుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవడానికి ప్రజలు కాంగ్రెస్‌ పార్టీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీలను డిసెంబర్‌ 9 నుంచే అమలు చేయడం ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రముఖ సినీ నటి, కాంగ్రెస్‌ నాయకురాలు విజయశాంతి మాట్లాడుతూ కేసీఆర్‌ అవినీతిని బీజేపీ ప్రోత్సహిస్తుందని, ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి, పార్టీ నేతలు దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవి రమేష్‌, పులి జగన్‌ పాల్గొన్నారు.

ఎన్నికలతో.. కదలని ఫైళ్లు!

- కార్యాలయాల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణ
- నెల రోజులుగా ఇదే పరిస్థితి
- పాలన లేక ప్రజల పాట్లు

సాక్షి, సిటీబ్యూరో:

- రాంనగర్‌కు చెందిన మురళి అనే వ్యక్తి తన బస్తీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేశాడు. హైకోర్టు నిర్మాణాన్ని నిలిపి వేయాలని ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఆ ఉత్తర్వులు జీహెచ్‌ఎంసీ అమలు చేయలేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే తాము ఎన్నికల విధుల్లో బిజీ అని సమాధానం ఇవ్వడంతో మురళి అవాక్కయ్యారు.
- చింతల్‌ బస్తీకి చెందిన ఓ వ్యక్తి కల్యాణలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసి..అధికారులను సంప్రదించగా వారికీ ఇదే సమాధానం ఎదురైంది.
- పాతబస్తీకి చెందిన ఓ వ్యక్తి తన ఖాళీ స్థలానికి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం కావాలంటూ దరఖాస్తు చేశాడు. కానీ అధికారులు ఇప్పుడు కుదరదు..ఎన్నికల కోడ్‌ ఉంది..తర్వాత రండి అంటూ దాటవేశారు.

...ఇలా ఎన్నికల పేరుతో అధికారులు పాలనను పక్కకు నెట్టేశారు. దీంతో అన్ని విభాగాల్లోనూ పెండింగ్‌ దరఖాస్తులు పెరిగిపోతున్నాయి. దాదాపు రెవెన్యూ యంత్రాంగం మొత్తం ఎన్నికల నిర్వహణలో నిమగ్నమైంది. అసెంబ్లీ ఎన్నికలతో ఎన్నికల కోడ్‌ అమల్లో ఉంది. అధికశాతం అధికారులను బదిలీ చేశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులకు ఎన్నికల కోడ్‌ అడ్డొచ్చింది. ఫలితంగా ఆయా సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోవట్లేదు. నెలరోజుల నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సామాన్యులు మాకేంటీ దుస్థితి అని వాపోతున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కూడా జారీ కావడం లేదని తెలుస్తోంది. సమీక్షల్లేవు..సమావేశాల్లేవ్‌..అధికారులు బదిలీ అయ్యారు. ఇవన్నీ దరఖాస్తులు ముందుకు కదలకుండా ఉండేందుకు కారణమంటూ ఓ అధికారి విశ్లేషించారు. మీసేవ ద్వారా వచ్చే దర ఖాస్తులను నిర్ణీత సమయం ప్రకారం పరిష్కరిస్తుంటారు. నెలరోజులుగా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని మరో ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు.

తెలంగాణ రాజకీయాల్లో 'డ్రామా' లేదు: రాంగోపాల్‌వర్మ

సాక్షి, సిటీబ్యూరో: ఓ వైపు తెలంగాణ ఎన్నికల రణక్షేత్రం అంతకంతకూ వేడెక్కుతూ పూటకో మలుపులు తిరుగుతోంది. అయినప్పటికీ 'తెలంగాణ రాజకీయం పట్ల ఆసక్తి కలగడం లేదు. ఇక్కడ డ్రామా లేదు' అని తను గతంలో అన్న మాటల్ని పునరుద్ఘాటించారు సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌ వర్మ. యాపిల్‌ హోమ్‌ రియల్‌ నీడ్‌ ఇండియా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో జరుగనున్న మిక్స్‌ అండ్‌ మింగిల్‌ మెగా క్రిస్మస్‌ కార్నివాల్‌ పోస్టర్‌ని బంజారాహిల్స్‌లోని తాజ్‌ డెక్కన్‌ హోటల్‌లో శనివారం రామ్‌గోపాల్‌ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఈవెంట్‌ ద్వారా వచ్చిన నిధులను మిషన్‌ భద్రత పేరుతో సేవా కార్యక్రమాలకు వినియోగిస్తారనే విషయాన్ని ప్రస్తావిస్తూ తాను సేవ చేయకున్నా చేసేవారికి మద్దతు తెలపాలనే ఉద్దేశ్యంతోనే తొలిసారిగా ఈ తరహా ఈవెంట్‌కి వచ్చానన్నారు. క్రిస్మస్‌ పండుగ తనకు బాగా నచ్చుతుందని, అత్యంత సింపుల్‌గా శుభ్రంగా జరిపే పండుగ అని పేర్కొన్నారు. నిర్వాహకురాలు నీలిమ ఆర్య తదితరులు పాల్గొన్నారు

వైభవంగా యాదాద్రీశుడి కల్యాణోత్సవం

కవాడిగూడ: ఎన్‌టీఆర్‌ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం శుక్రవారంతో 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీ పరిపూర్ణానందగిరి స్వామీజీ (వ్యాసాశ్రమం, ఏర్పేడు), శ్రీ రథదర రామానుజ జీయర్‌ స్వామీజీ (జగన్నాథ మఠం హైదరాబాద్‌) అనుగ్రహ భాషణం వినిపించగా, గరికపాటి నర్సింహారావు ప్రవచనాలు విన్పించారు. ప్రధాన వేదికపై కొల్హాపూర్‌ మహాలక్ష్మికి కోటి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం యాదాద్రి లక్ష్మీ నర్సింహ స్వామివారిని పల్లకి వాహనంపై ఊరేగించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ జె.శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.





కోటి దీపోత్సవంలో పాల్గొన్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ జె.శ్రీనివాసరావు, ఎన్టీవీ చైర్మన్‌ నరేంద్ర చౌదరి

వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సామాజికవేత్త బినామెహతా

బంజారాహిల్స్: గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన హ్యాండ్ టూ హ్యాండ్ సంప్రదాయ చేనేత పట్టు ఉత్పత్తుల వస్త్ర ప్రదర్శనను నగరసామాజిక వేత్త బినా మెహితా శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 29వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు జయేష్ తెలిపారు. దేశంలోని 14 నగరాల నుంచి చేనేత కళాకారులు, సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు ఇక్కడ ప్రదర్శిస్తున్నారని అన్నారు.

పోల్ చీటీలు.. ఓటరు గైడ్‌లు

- ముమ్మరంగా చీటీల పంపిణీ
- పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యం

పోలింగ్ కేంద్రానికి తేలికగా వెళ్లే సూచికలు



నందినగర్‌లో పోల్ చీటీలతో పాటు ఓటరు గైడ్ పంపిణీ చేస్తున్న బీఎల్‌వోలు



బంజారాహిల్స్: పోలింగ్ శాతం పెంచడంతో పాటు ఓటర్లు తమ పోలింగ్ కేంద్రానికి తేలికగా చేరుకునేలా ఎన్నికల సంఘం వివిధ రకాల ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా పోల్ చీటీలతో పాటు ఓటరు గైడ్ పేరుతో చిన్న పుస్తకాన్ని కూడా అందిస్తున్నది. ఈ ఓటరు గైడ్‌లో ఓటరు జాబితాలో తమ పేరు చెక్ చేసుకోవడం, పోస్టల్ బ్యాలెట్ పొందే విధానం, పోటీ చేసే అభ్యర్థుల వివరాలు తెలుసుకునే పద్ధతి, పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాల్సిన గుర్తింపు పత్రాలు, పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ విధానం నమోదై ఉంటాయి. ప్రజలు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేందుకు బీఎల్‌వోలు వారం రోజుల నుంచి ప్రతి ఒక్కరికీ ఓటరు సమాచార చీటీలు (పోల్ చీటీలు) పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు ఓటరు గైడ్‌ను కూడా మొదటిసారిగా పోల్ చీటీలతో పాటు ఇంటికి ఒకటి చొప్పున అందిస్తున్నారు. వీటితో పాటు ఈవీఎంలో ఓటు వేసే విధానం, వీవీ ప్యాట్‌లో ఓటును సరిచేసుకోవడం, భారత ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన యాప్‌లు, ఓటరు నమోదుకు కావాల్సిన అర్హతలు, ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు విధానం, తదితర అంశాలతో కూడిన ఓటరు గైడ్లను బీఎల్‌వోలు పంపిణీచేస్తున్నారు. ప్రతి ఇంటికీ ఒక ఓటరు గైడ్ ఇవ్వడం ద్వారా ఆ ఇంట్లో ఉండే ఓటర్లు అందరూ తమ సమీప పోలింగ్ కేంద్రం వివరాలను సమగ్రంగా తెలుసుకునేందుకు ఎలాంటి అవాంతరాలు లేకుండా రాజకీయ నేతల ప్రమేయం లేకుండా నేరుగా వెళ్లేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు పోల్ చీటీలను కూడా రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రతినిధులే ఓటర్లకు అందజేసేవారు. అయితే ఈ ప్రక్రియతో ఓటర్లను పోల్ చీటీలు ఇస్తూ ప్రలోభాలకు గురి చేస్తున్నారనే కారణంగా గత రెండు, మూడు ఎన్నికల నుంచి అధికారులే ఈ పోల్ చీటీలను పంపిణీ చేస్తున్నారు. దీనికి మంచి స్పందన వస్తున్నది. రాజకీయాలకు సంబంధం లేకుండా బీఎల్‌వోలు ఈ పోల్ చీటీలు అందిస్తుండటంతో ఓటర్లకు ఒత్తిడి కూడా తగ్గింది. ఇప్పుడు తాజాగా ఓటరు గైడ్ పేరుతో మరింత సమాచారాన్ని అందిస్తూ ఓటర్లకు ఓటు వేసే విధానాన్ని, పోలింగ్ కేంద్రాల ప్రాంతాన్ని సవివరంగా అందిస్తున్నది. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని 258 పోలింగ్ బూత్‌ల పరిధిలో గత కొద్ది రోజుల నుంచి పోల్ చీటీలు, ఓటరు గైడ్లు ఇంటింటికీ అందజేస్తున్నారు.

జంగ్ తెలంగాణ 2023

ఖైరతాబాద్‌లో ఈవీఎంల కమిషనింగ్ పూర్తి

స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన అధికారులు



ఈవీఎంలో బ్యాలెట్ పేపర్ లోడ్ చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్: ఎన్నికలపర్వంలో మరో కీలక ఘట్టమైన ఈవీఎంల కమిషనింగ్ (బ్యాలెట్ పత్రం ఏర్పాటు, నమూనా పోలింగ్) ప్రక్రియ శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ముగిసింది. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్‌లో గురువారం నుంచి స్ట్రాంగ్‌రూమ్‌లలో ఈవీఎంల కమిషనింగ్ కొనసాగింది. ఈసీఐఎల్ ఇంజినీర్ల పర్యవేక్షణలో అభ్యర్థులు, వారి ఏజెంట్ల ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారులు కమిషనింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈవీఎంలలో భాగాలైన బ్యాలట్ యూనిట్‌కు, కంట్రోల్ యూనిట్‌కు, వీవీ ప్యాట్‌కు పోలింగ్ కేంద్రం చిరునామా ట్యాగ్‌లను అమర్చడం ద్వారా ఈ ప్రక్రియను ఖైరతాబాద్ ఆర్‌వో వెంకటేష్ ధోత్రే ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిషనింగ్ ప్రక్రియలో భాగంగా ఈసీఐఎల్ ఇంజినీర్లు వీవీ ప్యాట్‌లో బ్యాటరీ, పేపర్ రోల్ అమర్చి గుర్తులను లోడ్ చేశారు. అనంతరం ప్రింట్‌ను ఆర్‌వో పరిశీలించారు. దీని తర్వాత బ్యాలెట్ యూనిట్‌లోని పరికరాలన్నీ అసలైనవేనని ఇంజినీర్లు నిర్ధారించారు. ప్రతి బ్యాలెట్ కాగితం వెనుక ఆర్‌వో సంతకం చేసి బ్యాలెట్ యూనిట్‌లోని తెరను తెరిచి కాగితాన్ని అమర్చి అనంతరం వాటికి సీల్‌వేశారు. దీని తర్వాత కంట్రోల్ యూనిట్‌లో బ్యాటరీలను అమర్చారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ల అనుసంధానం చేసిన తర్వాత కంట్రోల్ యూనిట్ స్విచ్ ఆన్ చేసి నమూనా పోలింగ్ నిర్వహించారు. నమూనా పోలింగ్‌లో భాగంగా ప్రతీ అభ్యర్థితో పాటు నోటాకు సైతం ఒక ఓటు చొప్పున వేసి కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్లలోని ఫలితాలను పోల్చి చూశారు. నమూనా పోలింగ్ డేటాను సేకరించి పేపర్ రోల్ లాక్ చేసి వీవీ ప్యాట్ అనుసంధానించడం ద్వారా ఈ ప్రక్రియ ముగిసింది. రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగినట్లు అధికారులు తెలిపారు.

సంక్షేమ పథకాలతో హ్యాట్రిక్ విజయం తథ్యం: మాగంటి



ముస్లింలను ఓటు అభ్యర్థిస్తుతున్న మాగంటి

శ్రీనగర్‌కాలనీ: బీఆర్‌ఎస్ పార్టీ అందించిన సంక్షేమ పథకాలే హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తుందని ఈ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిగూడ ఇమాంగూడ మసీద్ ఈ హుస్సేని వద్ద జుమ్మాలో పాల్గొని మైనార్టీలకు ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. మైనార్టీలకు అధిక ప్రాధాన్యత బీఆర్‌ఎస్ పార్టీ ఇస్తుందని, ముస్లింలు బీఆర్‌ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ వనం సంగీత, అప్పుఖాన్, మధుయాదవ్, సోను పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అరాచక పాలనను అంతం చేద్దాం: అజహరుద్దీన్



ప్రచారం చేస్తున్న అజహరుద్దీన్



ప్రచారంలో నవీన్‌యాదవ్...

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్‌కు ఓటువేసి తెలంగాణను అరాచకపాలన నుంచి రక్షించుకోవాల్సిన అవసరం వచ్చిందని, ఓటుతో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ, శ్రీనగర్‌కాలనీలలో ప్రచారం చేశారు. నియోజవర్గ ప్రజలు చాలామంది నిరుపేద జీవితాన్ని గడుపుతున్నారని, మా పథకాలు, చేసే అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే అని, వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గ ఇంచార్జ్ నవీన్‌యాదవ్ కమలాపురికాలనీ, ఇందిరానగర్‌లలో ప్రచారం చేశారు. నేతలు భవానీశంకర్, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో బీఆర్‌ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్‌ఎస్ యువ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్ రావు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ... కేసీఆర్ భరోసా వివరించి బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటు వేసి గెలిపించలని కోరారు. యువకులందరూ రిస్కువద్దు–మరోసారి కేసీఆర్‌కు ఓటు అంటూ నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు.

నేల కూలిన భారీ వృక్షం



కూలిన చెట్టును తొలగిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని లోటస్ పాండ్‌లో శుక్రవారం ఉదయం ఓ భారీ చెట్టు నేల కూలింది. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ దారిలో రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించి కూలిపోయిన చెట్టును తొలగించారు.

ఖైరతాబాద్‌లో మార్పు తథ్యం



వెంకటేశ్వరనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి

- పీజేఆర్ ఆశయ సాధనే లక్ష్యం
- ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి



వెంకటేశ్వరకాలనీ: ఖైరతాబాద్ నియోజకవర్గం ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆమె వెంకటేశ్వరకాలనీ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని వెంకటేశ్వరనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పీజేఆర్ లాంటి నాయకుడిని ఖైరతాబాద్ ప్రజలు కోరుకుంటున్నారని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకే తాను పోటీ చేస్తున్నానని వెల్లడించారు. పీజేఆర్ పాలనను ప్రజలకు చూపిస్తానన్నారు. తనకు ఎక్కడికి వెళ్లినా పీజేఆర్ కూతురిగా విశేష ఆదరణ లభిస్తుందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా కృషి చేస్తానని అన్నారు.

కాంగ్రెస్ ముస్లింలను వాడుకుని వదిలేస్తుంది

ఎంఐఎం పార్టీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ



శ్రీరాంనగర్‌లో మాట్లాడుతున్న అక్బరుద్దీన్ ఓవైసి

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ముస్లింలను వాడుకుని వదలేస్తుందని, ఇందుకు మౌలానా అబుల్ కలాం ఆజాద్, గులాం నబీ ఆజాద్, షరీఫ్‌లు ఉదాహరణలని ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఎంఐఎం అభ్యర్థి రాషీద్ ఫరాజుద్దీన్ తరుపున గురువారం రాత్రి డివిజన్‌లోని శ్రీరాంనగర్‌లో ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్, కర్ణాటక ఇన్‌చార్జ్ అన్వర్ సాదిత్, ఎంఐఎం అభ్యర్థి రాషీద్ ఫరాజుద్దీన్, నాయకులు జానీమియా, నర్సింగ్‌రావు, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎర్రగడ్డ నుంచి శ్రీరాంనగర్ వరకు పాదయాత్ర నిర్వహించారు.

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం



ప్రచారం చేస్తున్న డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు వెళుతున్న ఇండియన్ ప్రజా కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీ, ఎల్లారెడ్డిగూడలలో ప్రచారాన్ని చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టి అమలుకానీ హామీలతో వారిని మోసం చేస్తున్నారన్నారు. ఈల గుర్తుకు ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అలోచింపజేసిన వైజ్ఞానిక అంశాలు

పంజగుట్ట: విల్లామేరీ మహిళా కాలేజీలో శుక్రవారం సైన్స్, గణితం ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎమ్ఈసీ విద్యార్థినులు పాల్గొన్నారు. ఎనిమిది మంది విద్యార్థినులు ఒక బ్యాచ్‌గా ఏర్పడి చంద్రయాన్, డ్రోన్, హార్ట్‌కు బ్లడ్ ఎలా సర్క్యులేట్ అవుతుంది, మైక్రోఓవెన్ లాంటి 30 మోడల్స్ తయారు చేసి ప్రదర్శించారు. ఆయా వైజ్ఞానిక అంశాలు సందర్శకులను అలరించి, ఆలోచింజనేశాయి. ఉత్తమ ప్రదర్శనలకు న్యాయనిర్ణేతలు ఉత్తమ మొడల్‌ను ఎంపికచేసి గోల్డ్, సిల్వర్ మెడిల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు. విద్యార్థినులు చేసిన డ్యాన్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కాంగ్రెస్ అభ్యర్థి అజహర్ గెలుపు ఖాయం



కార్మికనగర్‌లోని ప్రచారం చేస్తున్న సీఎన్ రెడ్డి, భవానీశంకర్

రహమత్‌నగర్: ఎన్నికల్లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ గెలుపు ఖాయమని రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, నగర కాంగ్రెస్ నాయకుడు భవానీశంకర్‌లు ధీమా వ్యక్తం చేశారు. ఎస్‌ఎస్‌బీనగర్, ఓంనగర్, కార్మికనగర్ బస్తీల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు గ్యార నాగరాజు, జె.పి.జ్ఞానేశ్వర్, షేక్ సాబేర్, మన్సూర్, శ్రీనివాస్, షరీఫ్, ఎక్బాల్, లింగమూర్తి పాల్గొన్నారు.

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు: నవీన్‌యాదవ్



యూసుఫ్‌గూడలో ప్రచారం చేస్తున్న నవీన్‌యాదవ్

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్‌లో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఈ మార్పు మరికొన్ని రోజుల్లోనే చూడబోతున్నామని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.నవీన్‌యాదవ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ నేతలు ఉపేందర్‌రెడ్డి, ఆబెద్, హైదర్, సంపత్ కుమార్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్ ప్రశాంతం



ఎంఎస్ మక్తాలో మైనార్టీలను ఓటు అభ్యర్థిస్తున్న దానం



ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి దానంతో కాజా సూర్యనారాయణ తదితరులు

- దానం నాగేందర్‌ను గెలిపిద్దాం.. ప్రగతికి బాటలు వేద్దాం
- ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ

ఫిలింనగర్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణం నెలకొందని కుల, మత కల్లోలాలు పూర్తిగా కనుమరుగయ్యాయని ఈ క్రెడిట్ అంతా సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అందుకే బీఆర్‌ఎస్‌కు మరోసారి ఓటు వేసి గెలిపిద్దామని ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. కాలనీవాసుల ఆత్మీయ సమావేశం శుక్రవారం ఫిలింనగర్‌లో జరిగింది. ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ కూడా పాల్గొని ఇక్కడికి విచ్చేసిన వారందరికీ కారు గుర్తుకు ఓటు వేయాల్సిందిగా కోరారు. ఇందులో భాగంగా సూర్యనారాయణ మాట్లాడుతూ... 24 గంటలు కరెంటు, మంచినీటి సరఫరా విజయవంతంగా కొనసాగుతున్నాయని ఈ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత అసెంబ్లీ, కార్పొరేటర్ ఎన్నికల్లో కాలనీవాసులందరూ బీఆర్‌ఎస్‌కు అండగా నిలబడ్డారని ఈ ఎన్నికల్లో కూడా నాగేందర్‌కు ఓటు వేయాలని కోరారు. హైదరాబాద్ అభివృద్ధి కేసీఆర్, కేటీఆర్‌తోనే సాధ్యమయ్యాయన్నారు. రోడ్లు, బైపాస్‌లు, ఫ్లై ఓవర్లు, ఇలా నగరాన్ని అందంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మాతలు జి. ఆదిశేషగిరిరావు, కె.ఎస్.రామారావు, అశోక్ కుమార్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సోమాజిగూడ డివిజన్‌లో దానంకు విశేష స్పందన..

బంజారాహిల్స్: సోమాజిగూడ డివిజన్ పరిధిలోని ఎంఎస్ మక్తాలో శుక్రవారం ముస్లింలు నమాజు ముగించుకున్న అనంతరం బయటికి వచ్చిన తర్వాత ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ వారందరినీ పేరుపేరునా పలకరిస్తూ ఈ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాగేందర్‌కు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. జూబ్లీహిల్స్ డివిజన్ గురుబ్రహ్మనగర్ బస్తీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారందరికీ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని నాయుడునగర్‌లో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌కు హ్యాట్రిక్ విజయం తథ్యం

హిమాయత్‌నగర్: కాంగ్రెస్, బీజేపీ నాయకులు అబద్ధపు ప్రచారాలు, మొసలి కన్నీరు కారుస్తూ ఓట్లు అడుగుతున్నారని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. శుక్రవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లోని చంద్రానగర్, ముత్యాలబాగ్, బగ్గీఖానలతో పాటు పలు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ రామన్‌గౌడ్‌తో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.



గురుబ్రహ్మనగర్‌బస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్



నాయుడునగర్‌లో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతి నాయక్

కాంగ్రెస్‌ను నమ్మితే కర్నాటక పరిస్థితే



ఓటువేయాలని అభ్యర్థిస్తున్న దీపక్‌రెడ్డి



డప్పు కొడుతున్న లంకల

జూబ్లీహిల్స్ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ అభివృద్ధిపథంలో నడవాలంటే కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి కోరారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీ, ఎల్లారెడ్డిగూడలలో ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ చేసిన ప్రజా వ్యతిరేకపనుల వల్ల ప్రజలు నిరాశలో ఉన్నారని, బీజేపీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే కర్ణాటక పరిస్థితి తలెత్తుతుందన్నారు. ఎంఆర్‌పీఎస్ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొని డప్పు కొడుతూ ప్రచారం చేపట్టారు. నేతలు శాంతికుమార్, హరీష్, గారపాటి అనంతలక్ష్మి, బంగారు లక్ష్మణ్, అనూహ్యారెడ్డి పాల్గొన్నారు.

భర్త మరణించినా తప్పని వేధింపులు

- కొట్టి చంపుతామని అత్తమామల బెదిరింపు
- పిల్లలనూ చూడనీయని వైనం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

వెంగళరావునగర్: వితంతువు అయిన మహిళను అత్తారింటివారు చంపుతామని బెదిరింపులకు గురి చేస్తున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... వరంగల్ ప్రాంతానికి చెందిన వి.కల్పనకు యూసుఫ్‌గూడలోని శ్రీకాంత్‌తో 2008లో వివాహమైంది. వారికి ఇరువురు కుమారులు కూడా ఉన్నారు. పెళ్లయినప్పటి నుంచి ఆమెకు అత్తమామలు, బావ తదితరులతో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. గత నెల 3వ తేదీన శ్రీకాంత్ అనారోగ్యంతో మృతిచెందాడు. నాటి నుంచి ఆమెను అత్తారింటివారు మరింతగా వేధిస్తున్నారు. ఆమె బంగారం, దుస్తులు, చివరకు సర్టిఫికెట్లు కూడా లాక్కుని పిల్లలను వారి వద్దనే ఉంచుకుని ఆమెను కొట్టి పుట్టింటికి పంపారు. కుమారులను చూడటానికి ఈ నెల 15న అత్తారింటికి రాగా ఆమెపై మరోసారి హత్యాయత్నం జరిగింది. మరోసారి వస్తే నీతో పాటు పిల్లలను కూడా చంపుతామని బెదిరించారు. దాంతో ఆమె వారి వేధింపులు తాళలేక తనకు రక్షణ, నివాసం కావాలంటూ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్

వెంగళరావునగర్: దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడేవారికి ఆయుర్వేద వైద్యమే సరైనదని ఆయుర్వేద వైద్య నిపుణులు తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం జీటీఎస్ కాలనీలోని టీఎస్‌సీపీడీసీఎల్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వైద్యులు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావని చెప్పారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, కీళ్ళనొప్పులు తదితర రోగాలు ఉన్న రోగులకు దాదాపు 100 మందికి ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ దశరథ్, డాక్టర్ శోభారాణి, డాక్టర్ రమ్యశ్రీ, డాక్టర్ మాధవిలు వైద్యసేవలు అందించగా 1104 యూనియన్ అధ్యక్షులు సర్వేశ్వర్, ట్రాన్స్‌కో అధికారి క్లెం శ్రీనివాసరెడ్డి, సర్కిల్ ఎస్ఈ చంద్రశేఖర్, డీఈ వేణుగోపాల్, పీఆర్‌ఓ జిలాని పాల్గొన్నారు.

బీజేపీ వాహనంపై మతిస్థిమితం లేని వ్యక్తి దాడి

రహమత్‌నగర్: బీజేపీ ప్రచార వాహనం అద్దాలను ధ్వంసం చేయడంతో ఆ పార్టీ నాయకులు శుక్రవారం బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి ఎన్నికల ప్రచార వాహనంలో శుక్రవారం ఎస్పీఆర్‌హిల్స్‌లోని కమలానగర్‌లో వద్ద ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇదే బస్తీకి చెందిన మతి స్థిమితం లేని షేక్‌నాసర్ అనే వ్యక్తి వాహనంపై రాళ్లతో దాడి చేశాడు. ఈ ఘటనలో వాహనం ముందు అద్దం పూర్తిగా ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు బోరబండ పీఎస్‌కు పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని షేక్ నాసర్‌ను అదుపులోకి ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో చికిత్సను అందిస్తున్నారు. కాగా తమ ప్రచార వాహనంపై కావాలనే దాడి చేయించారని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్, నాయకులు మన్మథ, కుమార్‌నాయక్, పార్టీ నాయకులతో కలిసి బోరబండ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కు వినతిపత్రం సమర్పించారు.

2024లో ప్రభుత్వ సాధారణ సెలవులివే

సాక్షి, హైదరాబాద్: 2024లో ప్రభుత్వ సాధారణ సెలవుల వివరాలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, ఫిబ్రవరి, మే, నవంబర్ నెలల్లో ఒక్కటి కూడా సాధారణ సెలవు లేదు.

తేదీ	రోజు	సెలవు
01-01-2024	సోమవారం	న్యూ ఇయర్ డే
14-01-2024	ఆదివారం	భోగి
15-01-2024	సోమవారం	సంక్రాంతి/పొంగల్
16-01-2024	మంగళవారం	కనుమ
26-01-2024	శుక్రవారం	రిపబ్లిక్ డే
08-03-2024	శుక్రవారం	మహా శివరాత్రి
29-03-2024	శుక్రవారం	గుడ్ ఫ్రైడే
05-04-2024	శుక్రవారం	బాబుజగ్జీవన్‌రామ్ జయంతి
09-04-2024	మంగళవారం	ఉగాది
10-04-2024	బుధవారం	రంజాన్
14-04-2024	ఆదివారం	డా.బీఆర్ అంబేద్కర్ జయంతి
17-04-2024	బుధవారం	శ్రీరామనవమి
17-06-2024	సోమవారం	బక్రీద్
17-07-2024	బుధవారం	మొహర్రం
15-08-2024	గురువారం	స్వాతంత్ర్య దినోత్సవం
26-08-2024	సోమవారం	శ్రీ కృష్ణ అష్టమి
07-09-2024	శనివారం	వినాయకచవితి
16-09-2024	సోమవారం	ఈద్ మిలాదున్‌నబీ
02-10-2024	బుధవారం	మహాత్మాగాంధీ జయంతి
11-10-2024	శుక్రవారం	దుర్గాష్టమి
12-10-2024	శనివారం	మహర్‌నవమి
13-10-2024	ఆదివారం	విజయదశమి/దసరా
30-10-2024	బుధవారం	నరకచతుర్దశి
31-10-2024	గురువారం	దీపావళి
25-12-2024	బుధవారం	క్రిస్టమస్

రూ.300 కోట్లు డంప్ చేశారు

కాంగ్రెస్ ఆరోపణ

- మాజీ ఐఏఎస్ గోయల్ ఇంట్లో ఈసీ సోదాలు... ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు నేపథ్యంలో తనిఖీలు
- ఆయన ఇంటి వద్ద కాంగ్రెస్ నేతల నిరసన


గోయల్ ఇంటి వద్ద జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్

బంజారాహిల్స్: విశ్రాంత ఐఏఎస్, మాజీ ప్రభుత్వ సలహాదారు ఏకే గోయల్ ఇంట్లో ఎన్నికల అధికారులు సోదాలు జరిపారు. ఎన్నికల కోసం ఏకే గోయల్ ఇంట్లో సుమారు 300 కోట్ల రూపాయల డంప్ ఉందని దీనిపై విచారణ జరపాలంటూ తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి ఎన్నికల కమిషన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసులు జూబ్లీహిల్స్‌లోని గోయల్ ఇంట్లో సోదాలు జరిపారు. ఐదుగురు అధికారుల బృందం లోపలికి వెళ్లగా జూబ్లీహిల్స్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా సమాచారం అందుకున్న మల్లు రవితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గోయల్ నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చెందిన వాహనాలతోపాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చెందిన ఓ మహిళా ఉద్యోగిని కూడా అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారించారు. అయినప్పటికీ కార్యకర్తలు వినిపించుకోకపోవడంతో స్వల్పంగా లాఠీచార్జ్ చేశారు. ఈ తోపులాటలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రకాశ్, జ్ఞానేశ్వర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

అజారుద్దీన్ అండ్ కో ధర్నా

పోలీసులు లాఠీలు ఝుళిపించడంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భవాని శంకర్ తదితరులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. విచక్షణా రహితంగా లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధర్నా చేశారు. దీంతో జూబ్లీహిల్స్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

రెండు రోజుల క్రితమే సమాచారం: మల్లు రవి

గోయల్ ఇంట్లో నుండి డబ్బులు తరలిస్తున్నట్టు రెండు రోజుల క్రితమే తమకు సమాచారం అందిందని మల్లు రవి తెలిపారు. ఈ వ్యవహారంపై నిఘా పెట్టి నిర్ధారించుకున్న అనంతరం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఎన్నికల అధికారులు ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చాక కొన్ని వాహనాలు బయటికి వెళ్లడంపై తమకు అనుమానాలు ఉన్నాయని ఈ విషయంపై ప్రశ్నించినందుకు పోలీసులు లాఠీలకు పని చెప్పారని ఆరోపించారు. సోదాలు రాత్రి పొద్దు పోయేవరకు సాగాయి. పశ్చిమ మండలం అడిషనల్ డీసీపీ హనుమంతరావు, జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్, బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ సుబ్బయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జగన్మోహినిగా భద్రాద్రి రామయ్య



భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి శుక్రవారం జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మాసంలో వచ్చే క్షీరాబ్ది (చిలుక ద్వాదశి) రోజు స్వామి వారిని జగన్మోహినిగా అలంకరించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ సందర్భంగా ఆస్థాన విద్యాంసులు స్వామివారి అలంకార విశిష్టతను వివరించగా.. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు స్వామివారి విశేష ప్రసాదంగా అమృతం అందజేసి, తిరువీధి సేవ ఘనంగా జరిపారు.

రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్‌గా స్నేహజ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ (ఆర్‌పీఓ)గా 2016 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారిన్ సర్వీస్ ఆఫీసర్ జొన్నలగడ్డ స్నేహజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చార్టర్డ్ అకౌంటెంట్‌గా పని చేసిన స్నేహజ స్వస్థలం హైదరాబాద్. అంతకుముందు స్నేహజ బీజింగ్‌లో ఇండియన్ ఎంబసీ సెకండ్ సెక్రెటరీగా పనిచేశారు. విదేశీ వ్యవహారాల శాఖలో విజిలెన్స్ విభాగంలో, బంగ్లాదేశ్, మయన్మార్ డివిజన్‌లో అండర్ సెక్రెటరీగా కూడా విధులు నిర్వర్తించారు.

మంత్రి మల్లారెడ్డి అనుచరుడి ఇంట్లో సోదాలు

హైడ్రామా మధ్య 8 గంటల పాటు సోదాలు

బోడుప్పల్: మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రధాన అనుచరుడు, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి ఇంట్లో శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. సంజీవ్‌రెడ్డి ఇంట్లో ఎన్నికలకు సంబంధించిన డబ్బులు ఉన్నాయంటూ కాంగ్రెస్ నేతలు చేసిన ఫిర్యాదుతో అధికారులు రంగంలోకి దిగారు. 3.50 కోట్ల రూపాయలను ఎన్నికల కోసం ఇంట్లోడంప్ చేశారనే ఆరోపణలు రావడంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ తనిఖీల హైడ్రామా నడిచింది. స్క్వాడ్ టీమ్ ఇన్‌చార్జి రాధిక ఉదయం తొలుత ఇంట్లోని అన్ని గదులను సీజ్ చేశారు. ప్రత్యక్షంగా డబ్బులు దొరికితే సీజ్ చేసే అధికారం తమకు ఉంటుందన్నారు. ఇంట్లో మద్యం సీసాలు ఉన్నాయని వదంతులు రావడంతో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య వచ్చి తనిఖీలు చేశారు. చివరకు ఎఫ్ఎస్‌టీ టీమ్, ఐటీ, ఎక్సైజ్ అధికారులు ఏమీ దొరకలేదని చెబుతూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని అక్రమంగా సోదాలు చేస్తున్నారంటూ నినదించారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడకు చేరుకుని సంజీవ్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

శనివారం 25-11-2023



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+6 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 244
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

పుట్టిన వానికి మరణం ఎలా తప్పదో, అలాగే చనిపోయిన వారికి జన్మ తప్పదు.
అందుచేత శోకింపనవసరం లేని దాని కోసం నీవు శోకింప తగదు.
– హైందవ ధర్మం

సాక్షి
శనివారం, 25 నవంబర్ 2023

కనీసం ఇప్పటికైనా...


దేన్నయినా పదే పదే చెప్పవలసిరావటం ఎవరికైనా ఇబ్బందే. అందునా రాజ్యాంగ పదవుల్లో వున్నవారికి పదే పదే రాజ్యాంగ నిబంధనలు గుర్తుచేయటం మరింత ఇబ్బందికరమైన వ్యవహారం. కానీ మన సర్వోన్నత న్యాయస్థానానికి ఇది తప్పడం లేదు. తమ శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదముద్ర వేయకపోవటాన్ని సవాలు చేస్తూ పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పునిస్తూ గవర్నర్ల అధికారాలకుండే పరిధులు, పరిమితుల గురించి సుప్రీంకోర్టు మరోసారి చెప్పక తప్పలేదు. తన ఆమోదముద్ర కోసం వచ్చిన బిల్లుపై 'సాధ్యమైనంత త్వరగా' గవర్నర్ నిర్ణయం తీసుకోవాలని, పునఃపరిశీలన అవసరమని భావిస్తే ఆ సంగతి తెలియజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈనెల 10న వెలువడిన ఆ తీర్పు పూర్తి పాఠం గురువారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో వెలువడింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును నిలిపి వుంచేందుకు, వెనక్కి పంపేందుకు రాజ్యాంగంలోని 200వ అధికరణ గవర్నర్‌కు అధికారమిస్తోంది. బిల్లు సక్రమంగా లేదని, స్పష్టత కొరవడిందని లేదా రాజ్యాంగ నిబంధనలను అతిక్రమిస్తోందని గవర్నర్ భావించినప్పుడు దాన్ని తిప్పిపంపొచ్చు. అయితే ఆ సందర్భంగా గవర్నర్ ఏం చేయాల్సివుంటుందో కూడా అదే అధికరణ వివరిస్తోంది. గవర్నర్ ఇచ్చిన సలహాను అంగీకరించి బిల్లుకు సవరణలు చేయటమా లేక యధాతథంగా దాన్నే మరోసారి ఆమోదించి పంపటమా అనేది శాసనసభ ఇష్టమని కూడా అదే అధికరణ తేటతెల్లం చేస్తోంది. రెండోసారి వచ్చిన బిల్లును గవర్నర్ ఆమోదించి తీరాలని ఆ అధికరణ వివరిస్తోంది. నిబంధనలు ఇంత స్పష్టంగా వున్నప్పుడు రోజుల తరబడి, నెలల తరబడి నిర్ణయం చెప్పకుండా బిల్లుల్ని పెండింగ్‌లో వుంచటం అసమంజసం, రాజ్యాంగ విరుద్ధం. కానీ మన దేశంలో పదే పదే ఇలాగే జరుగుతోంది.

ఇతరేతర వ్యవస్థలు కాలానుగుణంగా ఎంతోకొంత మార్పులు చెందుతూ వచ్చాయి. గవర్నర్ల వ్యవస్థ మాత్రం అన్నింటికీ అతీతంగా వుండిపోయింది. అంతక్రితం సర్కారియా కమిషనైనా, ఆ తర్వాత వీరప్ప మొయిలీ నేతృత్వంలోని పాలనా సంస్కరణల కమిషనైనా రాజకీయ నేతలకు ఆ పదవులు ఇవ్వొద్దని సూచించాయి. గవర్నర్ పదవిని రాజకీయ పునరావాసంగా మార్చొద్దని 1994లో ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు కూడా హితవు చెప్పింది. రాజకీయాలకు అతీతంగా వుండే వ్యక్తులు లేదా ఏదో ఒక రంగంలో నిష్ణాతులైనవారు ఆ పదవిలో వుంటే మంచిదని సర్కారియా కమిషన్ సూచించింది. కానీ కేంద్రంలోని ఏ ప్రభుత్వమూ ఆ సూచన శిరోధార్యమని భావించలేదు. ఇటీవల గవర్నర్లకూ, రాష్ట్ర ప్రభుత్వాలకూ మధ్య తరచు వివాదాలు తలెత్తుతున్నాయి. పంజాబ్‌తోపాటు తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో ప్రభుత్వాలకూ, గవర్నర్లకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పంజాబ్‌లో మరీ విపరీతం. అక్కడ ఏకంగా 12 బిల్లుల విషయంలో గవర్నర్ ఎటూ తేల్చకుండా ఆపేశారు. గవర్నర్లు ఇలా వ్యవహరించటం వల్ల ప్రజల దృష్టిలో ప్రభుత్వాలు చులకనవుతాయి. సమస్య అపరిష్కృతంగా వుండిపోవటానికి కారణం తెలియక అధికార పక్షంపై సామాన్యులు విరుచుకుపడతారు. బహుశా అలా జరగాలని గవర్నర్లు కోరుకుంటున్నారేమో తెలియదు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలపట్ల ఇలా చిన్నచూపుతో వ్యవహరించటం తమ పదవిని తామే చిన్నబుచ్చుకోవటమని గవర్నర్లు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.

సమస్యేమంటే తమ ఏలుబడిలోని ప్రభుత్వాలకు గవర్నర్‌లు ఇబ్బందిగా మారినప్పుడు కొత్తగా మొదటిసారి ఇలా జరుగుతున్నట్టు మాట్లాడే పార్టీలు, గతంలో తాము అధికారంలో వుండగా వ్యవహరించిన తీరును పూర్తిగా మరిచిపోతాయి. దేశంలో ఏ మూలైనా గవర్నర్‌కూ, ఒక ప్రభుత్వానికీ మధ్య వివాదం తలెత్తినప్పుడల్లా కేంద్రంలోని జనతాపార్టీ ప్రభుత్వం గుర్తుకు రాకమానదు. 1977లో జనతాపార్టీ అధికారంలోకి రాగానే ఒకే వేటుతో పది రాష్ట్ర ప్రభుత్వాలను రాజ్యాంగంలోని 356వ అధికరణ కింద బర్తరఫ్ చేసింది. 1980లో కేంద్రంలో మళ్లీ అధికారం వచ్చాక కాంగ్రెస్ ఇదే పని చేసింది. ప్రజల ఆమోదంతో అధికారంలోకొచ్చిన ప్రభుత్వాలను ఇలా ఇష్టానుసారంగా, కక్షపూరితంగా రద్దు చేయటం దారుణమని ఆ రెండు పార్టీల ప్రభుత్వాలూ అనుకోలేదు. ఆ తర్వాత కాలంలో కూడా ఇదే ధోరణి కొనసాగాక బొమ్మై కేసులో సుప్రీంకోర్టు విస్పష్టమైన తీర్పునిచ్చింది. అలాంటి చర్యకు పార్లమెంటు ఉభయసభల ఆమోదం వుండితీరాలన్న నిబంధన విధించింది. అటు తర్వాత ఈ నిరంకుశ విధానానికి ఏదోమేరకు బ్రేకు పడిందనే చెప్పాలి. ఇప్పుడు పంజాబ్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల కేరళ, తమిళనాడు ప్రభుత్వాలకు కూడా ఊరట వచ్చినట్టే. ఇప్పటికే ఆ రాష్ట్ర ప్రభుత్వాలు తమ బిల్లులు పెండింగ్‌లో వుంచటాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఫెడరల్ వ్యవస్థలో గవర్నర్ల పాత్రేమిటన్న అంశంలో మన రాజ్యాంగ నిర్మాతలకు తగిన అవగాహన లేకపోవచ్చు. కానీ 'సాధ్యమైనంత త్వరగా' బిల్లులపై నిర్ణయం తీసుకోవాలనటం ద్వారా గవర్నర్ల బాధ్యతేమిటో స్పష్టంగా చెప్పినట్టయింది. చట్టాల రూపకల్పనలో శాసనసభల పాత్ర వమ్ము అయ్యేలా అధికారాలను వినియోగించటం సరికాదని తాజా తీర్పులో సుప్రీంకోర్టు చెప్పటం హర్షించదగింది. మరోసారి ఇలా చెప్పించుకోవాల్సిన అవసరం రాకుంటే తమకే గౌరవప్రదమని గవర్నర్లు గుర్తించటం మంచిది.

కాప్-28లో భారత్ భూమిక కీలకం!

విశ్లేషణ



కె.పి. నాయర్


వాతావరణ మార్పులపై మనిషి పోరుకు వేదికగా నిలిచిన కాప్ సమావేశాలు నవంబర్ 30న ప్రారంభం కానున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగనున్న ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పుల 28వ సదస్సు మానవాళి భవిష్యత్తును నిర్దేశించవచ్చు. అంతర్జాతీయ వాతావరణ మార్పుల చర్చల్లో సమూలమైన మార్పు తీసుకు రావాలని భారత్ కాంక్షిస్తోంది. ఆతిథ్య దేశంతో భారత్‌కు ఉన్న ప్రత్యేక అనుబంధం కూడా కాప్–28 సమా వేశాలు తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు దోహదపడతాయని భావిస్తున్నారు. దీనికి కేంద్రబిందువుగా భారత ప్రభుత్వపు లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ (లైఫ్) కార్యక్రమం ఉండాలి. సుస్థిర, అతితక్కువ ఇంధన ఖర్చును పోత్సహించే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు లైఫ్ దోహదపడుతుంది.

గత వారం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షంతో యుఏఈలో జనజీవితం స్తంభించిపోయింది. పాఠశాలలు బంద్ అయ్యాయి. పాఠాలు ఆన్‌లైన్ మార్గం పట్టాయి. కార్యాలయాలకు వెళ్లాల్సిన ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్‌కు పరిమితమయ్యారు. ఒక్కసారిగా ముంచెత్తిన వాన జోరుకు వీధుల్లో కార్లు పడవలయ్యాయి. పౌరుల భద్రతకు అధికార యంత్రాంగం నానా పాట్లూ పడాల్సి వచ్చింది. చిత్రమైన విషయం ఏమిటంటే... యుఏఈ, సౌదీ, బెహ్రెయిన్ వంటి దేశాల ప్రజలు నిన్నమొన్నటివరకూ నింగి నుంచి నేలకు జారే వాన చినుకులు చూసేందుకు రుతుపవనాల సీజన్‌లో ముంబైకి వచ్చేవారు. కేవలం వాన హోరు, జోరులను ఆస్వాదించేందుకు వీరు నరీమన్ పాయింట్, గేట్ వే ఆఫ్ ఇండియా వంటి ప్రాంతాల్లో సముద్రాభిముఖంగా ఉన్న ఖరీదైన బంగళాలు, హోటళ్లలో దిగేవారు. 1970లలో బయటపడ్డ ముడిచమురు వారి ఈ విలాసానికి సాయపడేది. వాన చినుకులకు వారు ముఖం వాచిపోయి ఉండేవారు. అయితే అది గతం. ఇప్పుడు వారే భారీ వర్షాలను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తూండటం వైచిత్రి.

గాలి మూటలు... నీటి రాతలు...

15 రోజులపాటు కొనసాగే కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(కాప్) 28వ సమావేశానికీ, వాతావరణ మార్పులపై జరిగే ఇతర సమావేశాలకూ మధ్య స్పష్టమైన తేడా ఇదే కానుంది! ధనిక దేశాలు అనేకం కాప్ సమావేశాల్లో పెద్ద మాటలు మాట్లాడతాయి. అలివికాని హామీలూ గుప్పిస్తాయి. సమావేశాల తరువాత అన్నింటినీ మరచిపోతూంటాయి. ఇప్పుడు ఆ దేశాలూ వాతావరణ మార్పుల ప్రభావాన్ని ప్రత్యక్షంగా చవిచూస్తున్నాయి. అయితే అవి యూఏఈ మాదిరిగా పరిస్థితిని సీరియస్‌గా తీసుకుంటాయన్న గ్యారెంటీ లేదు. మరికొన్ని దేశాలు అసలు సమస్యను కాకుండా, లక్షణాలపై ఎక్కువ దృష్టి పెడతాయి. డోనాల్డ్ ట్రంప్ 2025 జనవరి నాటికి మళ్లీ అమెరికా అధ్యక్షుడయ్యే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో వాతావరణ మార్పులపై అతడికి నమ్మకం లేకపోవడం ఇక్కడ చెప్పుకోవాలి. గత పాలకులు సంతకం చేసిన అనేక అంతర్జాతీయ ఒప్పందాల నుంచి అమెరికా తప్పుకొనేలా చేసిన ఘనత ఆయనదే.

రెండేళ్ల క్రితం గ్లాస్గోలో జరిగిన కాప్–26 సందర్భంగా యునైటెడ్ కింగ్‌డమ్ కూడా పెద్ద హామీలిచ్చింది. వాతావరణ మార్పులకు మూల కారణాలను వెతికి సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించింది. ఆ ప్రకటన తరువాత ఏం జరిగిందన్నది వెనుదిరిగి చూసుకుంటే... స్వదేశంలో జరిగిన కాప్–26 సమావేశాలకు వైఫల్యం ముద్ర అంట కూడదనే యూకే అలా ప్రకటించి ఉండవచ్చునన్న అనుమానాలు బలపడుతున్నాయి. యూకేతోపాటు పారిశ్రామిక దిగ్గజ జీ–7 దేశాలన్నీ ఇలాంటి మాటలే మాట్లాడాయి. వాతావరణ మార్పుల సమస్యకు



ప్రధాని మోదీతో కాప్28 అధ్యక్షుడు సుల్తాన్ అల్ జబేర్ (యూఈఏ)

చేసింది మాత్రం సున్నకు సున్న హళ్లికి హళ్లి! కాప్–26లో ఇచ్చిన హామీల అమలును మాత్రమే కాదు... 2015 నాటి కాప్–21 అంటే చారిత్రాత్మక ప్యారిస్ ఒప్పందం విషయంలోనూ యూకే వెనకడుగు వేసింది. వాతావరణ మార్పుల విషయంలో ప్యారిస్ ఒప్పందం మొట్టమొదటి అంతర్జాతీయంగా అమలు చేయదగ్గ చట్టంగా మారడం గమనార్హం. మొత్తం 196 దేశాలు సంతకాలు చేసిన ఈ ఒప్పందం విషయంలో ప్రస్తుత బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్... వాతావరణంలోకి విడుదలవుతున్న కర్బన ఉద్గారాలను తగ్గించేందుకయ్యే ఖర్చులతో బ్రిటిష్ ప్రజలపై పడే ఆర్థిక భారం ఆమోదయోగ్యం కాదంటున్నారు. మరోవైపు యూఏఈ ఈ ఖర్చులను భరిస్తానని చెప్పడమే కాదు... సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో పెట్టుబడుల ద్వారా ఇతర దేశాలకూ సాయం చేస్తామని ప్రకటించింది.

సమస్యను పరిష్కరించే గాంధేయవాదం

2015 నాటి కాప్ 21 సమావేశాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన వాతావరణ మార్పుల విషయంలో నిర్ణయాత్మకంగా మారింది. అప్పటివరకూ సమస్యగా భావించినదే పరిష్కారంలో భాగమైపోయింది. వాస్తవానికి భారత్, కాప్–28కు ఆతిథ్యమిస్తున్న యూఏఈ రెండూ వాతావరణ మార్పుల సమస్య పరిష్కారం విషయంలో ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలిచాయి. అందుకే ఈ కాప్–28 సమావేశాల్లో భారత్ పాత్ర కీలకం కానుంది. ప్రపంచ దేశాలన్నీ సమస్య పరిష్కారానికి ఒక్కమాటపై కదిలేలా చేసేందుకూ భారత్ గట్టి ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉంది.

ఈ ఏడాది జనవరిలో యూఏఈ పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత శాఖ మంత్రి సుల్తాన్ అహ్మద్ అల్ జబేర్‌ను కాప్–28 అధ్యక్ష స్థానం వరించింది. ఆ వెంటనే ఆయన మొదటగా భారత్ పర్యటనకు విచ్చేశారు. దీన్ని భారత్ మరచిపోలేదు. బెంగళూరులో మాట్లాడుతూ కాప్–28పై జబేర్ తన అంచనాలను వివరించారు. దశాబ్ద కాలంగా అల్ జబేర్ తరచూ భారత్‌కు వస్తున్నారు. భారతీయ నేతలతో ఆయన సంబంధాలు బాగా తెలిసినవే. అల్ జబేర్ మంత్రి మాత్రమే కాకుండా, అబూదబీ నేషనల్ ఆయిల్ కంపెనీ గ్రూపు సీఈవో కూడా. యూఏఈతో సంబంధాలను మెరుగుపరచుకునేందుకు మోదీ ప్రయత్నిస్తున్న సమయంలో ద్వైపాక్షిక ఇంధన సంబంధాలను మార్చేయడంలో అల్ జబేర్ కీలకపాత్ర పోషించారు. అబూదబీ నేషనల్ ఆయిల్ కంపెనీ ద్వారా భారత్ ఇంధన భద్రతకు గట్టి హామీ కూడా ఇచ్చారు. పరస్పర ప్రయోజనకరమైన ఈ అంశం ప్రస్తుత సమావేశాల్లోనూ ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

కాప్–28 అధ్యక్షుడిగా అల్ జబేర్ మద్దతు ఉండటంతో అంతర్జాతీయ వాతావరణ మార్పుల చర్చ దిశను నిర్ణయాత్మకంగా మార్చాలని భారత్ కూడా ఆశిస్తోంది. ఆయా దేశాలే కేంద్రంగా సాగుతున్న ప్రయత్నాలను సార్వజనీనం చేసేందుకు భారత్ ప్రయత్నించాలి. దీనికి కేంద్రబిందువుగా మోదీ ప్రభుత్వపు లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ (లైఫ్) కార్యక్రమం ఉండాలి. సుస్థిర, అతితక్కువ ఇంధన ఖర్చును పోత్సహించే ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రజలు అలవర్చుకునేందుకు లైఫ్ కార్యక్రమం దోహదపడుతుంది. దీనికి ప్రపంచ ఆమోదముద్ర పడితే ప్రస్తుత జీవనశైలి భిన్నంగా మారుతుంది. మహాత్మా గాంధీ చెప్పినట్లు ఆలోచనలు ఆచరణ రూపం దాలుస్తాయి. ధనిక దేశాల ఖరీదైన జీవనశైలి, వృథా వ్యవహారాలకు చెక్ పడుతుంది. వీటి కారణంగా భూమ్మీద వనరులు కరిగిపోతున్న విషయం తెలిసిందే.

అబూదబీ నేషనల్ ఆయిల్ కంపెనీ సీఈవో అయిన అల్ జబేర్ ఆ దేశంలో సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రోత్సాహానికీ కృషి చేస్తున్న విషయం చెప్పుకోవాలి. యూఏఈ రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీ మస్‌దార్‌కు ఆయన తొలి సీఈవోగా, తరువాతి కాలంలో ఛైర్మన్‌గానూ పనిచేశారు. ఈ కంపెనీకి దాదాపు 40 దేశాల్లో ప్రాజెక్టులు ఉన్నాయి. కాప్–28లో పర్యావరణానికి హాని కలిగించని ఇంధనాల వాడకం వైపు ప్రపంచం మళ్లేందుకు అల్ జబేర్ కాలుష్య కారక ముడిచమురు పరిశ్రమ వర్గాలతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. యూఏఈ స్వయంగా చమురు అమ్మకాలు చేస్తున్నప్పటికీ పశ్చిమాసియాలో అణుశక్తి కేంద్రం కలిగిన తొలి దేశం కూడా ఇదే కావడం గమనార్హం. పర్యావరణానికి మేలు చేసే స్వచ్ఛమైన టెక్నాలజీలను అందుబాటులోకి తెచ్చేచ్చేందుకు అవసరమైన ఆర్థిక వనరులు యూఏఈ వద్ద పుష్కలం. ఈ నేపథ్యంలోనే 2015 నాటి ప్యారిస్ సమావేశాల కంటే ఈ సారి జరిగే కాప్ సమావేశాలు మరింత ఫలప్రదమవుతాయని ఆశిద్దాం.

వ్యాసకర్త వ్యూహాత్మక అంశాల విశ్లేషకుడు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మీకేది ముఖ్యం?



మీరు ఒక ఫెస్టివల్ (చలన చిత్రోత్సవం) సినిమా తీయాలనుకుంటున్నారా లేక థియేటర్‌లో ప్రదర్శించేదా? నేను ఆదర్శపూర్వకంగా మాట్లాడుతున్నాను కావొచ్చు గానీ, మీరు నమ్మే సినిమాను తీయడం ముఖ్యం.

– నమ్రతా జోషి, సినీ విమర్శకురాలు

నమ్మగలమా?



శిక్ష నుంచి మినహాయింపు ఉండి (ఇంప్యూనిటీ), యూఎస్ గడ్డ నుంచి తీవ్రవాద బెదిరింపులకు పాల్పడుతున్న ఒక్క సిక్కు అతివాదిని ఇండియా లక్ష్యంగా చేసుకుందంటూ యూఎస్ కల్పిత కథనం ఒక పత్రికలో వచ్చింది. జో బైడెన్ ప్రభుత్వం నమ్మదగిన భాగస్వామి అని ఇండియాలో అనుకుంటున్నవాళ్లు కాస్త ఆలోచించుకోవాలని చెప్పడానికి ఇదొక ఉదాహరణ.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

పేరు ప్రాచీనం



నేను యూదుడిని అయినప్పటికీ, నా పేరులో 'ఖాలెద్' అని ఎందుకు ఉందని జనం అడుగుతూనే ఉంటారు. ఇస్లాం రావడానికి ముందే ఈ పేరు ఉనికిలో ఉందని తెలుసుకోండి.

– ఖాలెద్ హసన్, పరిశోధకుడు

వారే విజేతలు



సాహసోపేత జర్నలిజం కోసం ఉన్న ప్రతి అవార్డునూ ఈ యేడాది గెలుచుకోవడానికి పాలస్తీనా జర్నలిస్టులు అర్హులు.

– రానా అయూబ్, జర్నలిస్ట్

అదే ముఖ్యం



మీరు ఎన్ని ఉదయాలు సంతోషంగా నిద్రలేస్తున్నారు అనేదాన్ని బట్టి, విజయాన్ని నిర్వచించాలి.


– రిశద్ ప్రేమ్‌జీ, పారిశ్రామికవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ప్రగతిశీల సాహితీవేత్త

'వెనుక తరములవారి వీర చరితల సిరులు నార్వోసి త్యాగమ్ము నీర్వెట్టి పెంచరా, విరిసి సుఖములు పండురా' అనే స్ఫూర్తిమంతమైన సందేశాన్ని ముందు తరాలకు అందించిన దార్శనికుడు కామ్రేడ్ పులుపుల వెంకట శివయ్య. తన సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ కార్యకలాపాల ద్వారా 20వ శతాబ్దిలో తెలుగు నేలను ప్రభావితం చేసిన ప్రముఖులలో పులుపుల ప్రసిద్ధులు.

1910 నవంబర్ 14న పల్నాటి సీమలో జన్మించిన పులుపుల విద్యార్థిగానే స్వాతంత్య్రోద్యమంలో ప్రవేశించి జైలు పాలయ్యారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (ఆనర్స్) చదివారు. కాశీ నుండి రాగి చెంబులో గంగాజలం పట్టుకు రాకుండా కమ్యూనిస్టు సాహిత్యాన్ని తీసుకువచ్చి, ఆంధ్రలో కమ్యూనిస్టు చైతన్య స్రవంతిని ప్రవహింపజేసిన ఆయన కమ్యూనిస్టు ఉద్యమ ఆద్యులలో ఒకరు. 1937, 38లలో కొత్తపట్టణం, మంతెనవారి పాలెంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన రాజకీయ పాఠశాలలకు శివయ్య ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. స్వాతంత్య్ర సమరయోధునిగా, కమ్యూనిస్టు ఉద్యమ కార్యకర్తగా శివయ్య నెల్లూరు, అలీపురం, బళ్ళారి జైళ్లలో 1930 ఉప్పు సత్యాగ్రహం నుండి 1944 వరకూ 38 నెలల జైలు జీవితం గడిపారు. 1952, 62లలో వినుకొండ శాసనసభ నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికైనారు.



శివయ్య అభ్యుదయ సాహితీవేత్త. 1934లో ప్రారంభమైన 'ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం'లో క్రియాశీల పాత్ర పోషించారు. విలువైన గేయాలు, వ్యాసాలు రాశారు. ఆయన పలనాటి సీమను గురించిన సమగ్ర గీతం రాశారు. 'రాబోయే రోజుల్లో రాజయ్యే మొనగాడా/రాబోయే రోజుల్లో రచయించే బుగారా...' అని వైతాళిక గీతం ఆలపించిన కవి శివయ్య. ఆయన రాసిన 'రాజమండ్రిలో పంతులుగారు', 'గిడుగు గ్రాంథిక భాషావాదుల పాలిటి పిడుగు', 'భాష–పుట్టు పూర్వోత్త రాలు' చాలా విలువైన సమాచారంతో కూడిన సాహిత్య వ్యాసాలు.

శివయ్య 1944లో రాజమండ్రిలోని హితకారిణీ సమాజం కార్యదర్శి శివరావును కలిసి వీరేశలింగం రచనల పునర్ముద్రణకు హక్కులు సాధించారు. ఈనాడు వీరేశలింగం రచనలు మన చేతుల్లో ఉన్నాయంటే శివయ్యే కారణం. 'నయాగరా' కవిత్రయానికి శివయ్య మార్గదర్శి. 1943లో నరసరావుపేటలో ఏర్పడిన 'నవ్యకళా పరిషత్తు' సభ్యులైన అనిసెట్టి సుబ్బారావు, నయాగరా కవిత్రయం, రెంటాల గోపాలకృష్ణ వీరంతా ఆరుద్ర అన్నట్లు 'యవ్వనంలో పులుపుల వెంకటశివయ్యగారి రహస్య కమ్యూనిస్టు పాఠాల బోధనల వల్ల ప్రభావితులు' (రెంటాల గోపాలకృష్ణ కవితా సంపుటి 'శివ ధనువు'కు ఆరుద్ర రాసిన ముందు మాటలో).

1976 జూలై 14న మాస్కోలో మృతి చెందే నాటికి శివయ్య 'అరసం' గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులుగా, 'ఆఫ్రికా–ఆసియా రచయితల సంఘం' ఆంధ్రప్రదేశ్ సమితి అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. 'ఈ నిరంకుశ రాజ్యమేలేటి కాలాన ఎలుగెత్తి పాడాను స్వాతంత్ర్య గీతాన్ని, మరణింపగాబోను అమరజీవిని నేను' అన్న మాటలకు నిదర్శనం శివయ్య జీవితం.

– పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం జాతీయ అధ్యక్షులు

(రేపు గుంటూరులో 'కా॥ పులుపుల వెంకటశివయ్య గేయాలు–వ్యాసాలు' పుస్తకం ఆవిష్కరణ)

సామాజిక విప్లవానికి నాంది కులగణన

అభిప్రాయం



దానీ

గెలిచే అవకాశాలున్న పార్టీలో ఎన్నికల ముందు ఎక్కువ సీట్లు అడగడానికీ, గెలిచిన పార్టీలో ఎన్నికల తరువాత ఎక్కువ పదవులు కోరడానికీ రాజకీయ నాయకులు కులం కార్డును వాడడం సహజం. ఇలాంటి సందర్భాల్లో ప్రతీ కులం తన జనాభా సంఖ్యనూ, శాతాన్ని పెంచి చెపుతుంటుంది. ఈ శాతాలన్నింటినీ కూడితే సులువుగా 300 దాటుతుంది! ఎన్నికల సంవత్సరంలో కులగణన చర్చ మరింత వేడెక్కుతోంది.

సమాజంలో విభిన్న సమూహాల మధ్య సంబంధాలను నిర్ణయించడంలో వేల సంవత్సరాలుగా కులం ప్రధాన పాత్ర పోషిస్తున్న దేశం మనది. ప్రతి కులానికి ప్రత్యేకమైన చరిత్ర, సంస్కృతి ఉంటుంది. మన దేశంలో 5 వేలకు మించి కులాలున్నాయని అంచనా. కులాలతోనే మన దేశంలో సామాజిక అంతస్తుల దొంతర ఏర్పడుతోంది. వీటిని అర్థం చేసుకోవడానికి కులగణన ఒక చారిత్రక అవసరంగా మారింది. సామాజిక విప్లవానికి కులగణన నాంది పలుకుతుంది.

ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగంలోనే విద్యా, ఉపాధి రిజర్వేషన్లు కల్పించారు. సామాజిక వివక్షకు గురవుతూ, విద్యారంగంలో అవకాశాలు కోల్పోతున్న సమూహాల కోసం ఉద్దీపన చర్యలు చేపట్టడంలో చాలా తాత్సారం జరిగింది. 1979 జనవరి 1న ప్రధాని మొరార్జీ దేశాయి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి 'సోషల్లీ అండ్ ఎడ్యుకేషనల్లీ బ్యాక్ వర్డ్ క్లాసెస్ కమిషన్'ను నియమించారు. స్వల్ప కాలం బిహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన బిందేశ్వరీ ప్రసాద్ మండల్‌ను చైర్మన్‌గా నియమించడంతో దానికి 'మండల్ కమిషన్' అనే పేరు వచ్చింది. రెండేళ్ళ పరిశీలన తరువాత 1980 డిసెంబరు 31న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీకి బీపీ మండల్ తన నివేదికను సమర్పిస్తూ ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేశారు. ఇక్కడ ఒక విచిత్రం వుంది. మండల్ కమిషన్ ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇమ్మందిగానీ, కులగణన నిర్వహించమనలేదు. బ్రిటిష్ కాలపు రికార్డుల ప్రకారం దేశంలో బీసీల జనాభా 54 శాతం ఉంటుందని అంచనా వేసి అందులో 50 శాతం అనగా 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది.

ఓబీసీ రిజర్వేషన్ల కేసు మీద అంతిమ తీర్పు రాకముందే 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వీపీ సింగ్ మండల్ కమిషన్ సిఫార్సుల్లో కొన్నింటిని అమలుపరచ బోతున్నట్టు ప్రకటించారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో ఇది చాలా సాహసోపేతమైన నిర్ణయం. జనతాదళ్ నాయకుడైన వీపీ సింగ్‌కు లోక్ సభలో మెజారిటీ లేదు. ఎన్‌టీ రామారావు నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్ అభ్యర్థిగా రంగంలో దిగి, బయటి నుండి బీజేపీ ఇచ్చిన మద్దతుతో ఆయన 'మైనారిటీ ప్రభుత్వానికి' ప్రధాని అయ్యారు.

అప్పట్లో బీజేపీకి లోక్ సభలో 85 సీట్లున్నాయి. ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే తన ఓటు బ్యాంకు అయిన ఓసీలు పార్టీకి దూరం అయిపోతారని ఆ పార్టీ భయపడింది. అప్పటి బీజేపీ అధ్యక్షులు ఎల్‌కే అద్వాణి 1990 సెప్టెంబరు 25న సోమనాథ్ నుండి అయోధ్య వరకు 35



రోజుల 'రామ్ రథయాత్ర' మొదలెట్టారు. దీనికి రెండు లక్ష్యాలున్నాయి. మొదటిది; మండల్ కమిషన్ సిఫార్సుల అమలును అడ్డుకోవడానికి ఏకంగా వీపీ సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టడం. రెండోది, ముస్లింల మీద ద్వేషాన్ని రెచ్చగొట్టి హిందూ ఓటు బ్యాంకును సమీకరించడం. ఈ రెండు లక్ష్యాల రథయాత్రను రాజకీయ విశ్లేషకులు 'మండల్–కమండల్' అని పిలిచేవారు. బీజేపీ తన మద్దతును ఉపసంహరించుకోవడంతో 1990 నవంబరు 7న వీపీ సింగ్ ప్రభుత్వం పడిపోయింది.

రెండేళ్ల తరువాత 1992 నవంబరు 16న 'ఇంద్ర సహానీ కేసు'లో సుప్రీం కోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను ఆమోదిస్తూ తుది తీర్పు ఇచ్చింది. అయితే, మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనీ, క్రీమీలేయర్ కుటుంబాలను రిజర్వేషన్ పరిధి నుండి తప్పించాలనీ కొత్తగా రెండు నిబంధనలు పెట్టింది. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన పక్షం రోజుల్లోనే కరసేవకులు బాబ్రీ మసీదును కూల్చి వేశారు.

బ్రిటిష్ పాలకులు భారత దేశాన్ని పరిపాలించాలంటే ఇక్కడి సమాజ స్వభావాన్ని, ముఖ్యంగా కుల, మత స్వభావాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాల్సిన అవసరముందని గుర్తించారు. 1881లో తొలిసారిగా జనగణన నిర్వహించారు. ఆ మరు సంవత్సరం అంటే 1882లో విలియం విల్సన్ హంటర్ నాయకత్వాన ఏర్పడిన కమిషన్ దేశంలో కులగణన నిర్వహించింది. అప్పటి నుండి ప్రతి పదేళ్ళకు ఒకసారి జనగణన కార్యక్రమం క్రమం తప్పకుండ సాగుతోంది. కానీ, కులగణన జరగలేదు.

స్వతంత్ర భారత దేశంలో తొలిసారిగా కులగణన చేపట్టిన ఘనత బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌కు దక్కుతుంది. దేశంలో అంతటి చొరవను చూపిన మరో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే. బిహార్‌లో 214 కులాలున్నట్టు తేలింది. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో 7 వందలకు పైగా కులాలున్నట్టు అంచనా. ఆ లెక్కన ఏపీ కులగణన ప్రాజెక్టు బిహార్ కన్నా మూడు నాలుగు రెట్లు పెద్దది.

రెండేళ్ళ క్రితం బిహార్ రాష్ట్ర అఖిలపక్షం ఢిల్లీ వెళ్ళి కులగణన చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షాలను కోరింది. దానికి వాళ్ళు అంగీకరించలేదు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఎస్సీ, ఎస్టీ మినహా మరెవ్వరికీ కులగణన నిర్వహించడం తమ విధానం కాదని 2021 జులై 20న పార్లమెంటులో ఒక విస్పష్ట ప్రకటన చేశారు.

బీజేపీది ఒక విచిత్రమైన వ్యవహారం. ఒకవైపు, ఉచితాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయి అంటుంది; ఎన్నికల ప్రచారంలో తామరతంపరగా ఉచితాలను ప్రకటిస్తుంది. ఒకవైపు, కులం వంటి సంకుచిత భావాలకు తాము దూరం అంటుంది. ఎన్నికలకు ముందు కుల సమ్మేళనాలు నిర్వహిస్తుంది. ఈ ఏడాది మొదట్లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ నిర్వహించిన కుల సమ్మేళనాలను చూశాం. ఇప్పుడు ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మళ్ళీ అలాంటివే చూస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ లో 'బీసీ సమ్మేళనం'లో పాల్గొన్నారు; నాలుగు రోజుల్లో మళ్ళీ వచ్చి 'మాదిగ సమ్మేళనం'లో పాల్గొన్నారు. కానీ, విధాన పరంగా వారు కులగణనకు వ్యతిరేకం.

నిజానికి సామాజిక న్యాయానికి కులగణన ఒక ప్రాతిపదిక అవుతుంది. సంక్షేమ పథకాలను అడగడానికి ప్రజలకూ, వాటిని రూపొందించడానికి ప్రభుత్వాలకూ అది ఆధారంగా మారుతుంది. ఇప్పుడు కులగణన 'ఇండియా కూటమి'కి కొత్త అస్త్రంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధి ప్రతి సభలోనూ 'జిత్నీ ఆబాదీ; ఉత్నా హక్', 'జిస్కీ జిత్నీ భాగేదారీ; ఉస్కీ ఉత్నీ హిస్సేదారీ' (ఎంత జనాభో అంత హక్కు) అంటున్నారు. ఏపీలో తలపెట్టనున్న కులగణన విజయవంతం కావడం రాజకీయంగా వైసీపీ కన్నా సమాజానికి మరింత మేలు చేస్తుంది.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.త్రయోదశి సా.4.34 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** అశ్వని ప.2.57 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.11.09 నుండి 12.37 వరకు, తదుపరి రా.12.16 నుండి 1.48 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.14 నుండి 7.42 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.03 నుండి 9.54 వరకు, శనిత్రయోదశి; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.13, **సూర్యాస్తమయం:** 5.20.

ఉరుకుల పరుగుల జీవితంలో మన ప్రయాసలే కనిపిస్తాయి. ఒకసారి ఆగి చుట్టూ చూస్తే.. ఇన్నాళ్లూ మనం మన కోసమే తప్ప చుట్టూ ఉన్న వారి సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడంలేదనే స్పృహ కలుగుతుంది. కొందరు మనకెందుకులే అని మళ్లీ తమ పనుల్లో మునిగిపోతారు. డాక్టర్ నీలిమా ఆర్య లాంటివాళ్లు మాత్రం సున్నితమైన సమస్యలపై దృష్టి పెట్టి వాటికి సరైన పరిష్కారాలు వెదుకుతారు. హైదరాబాద్ వాసి నీలిమా ఆర్య నిరుపేద అమ్మాయిలకు లో దుస్తులను అందిస్తూ, శుభ్రతపైన అవగాహన కల్గిస్తూ వారి భవిష్యత్తు ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేస్తున్నారు. ఏడాదిలో రెండు లక్షల మంది అమ్మాయిలకు లో దుస్తులను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నీలిమా ఆర్యను కలిసినప్పుడు ఆమెకు వచ్చిన ఈ ఆలోచన గురించి ఇలా పంచుకున్నారు.

'షి నీడ్స్' నీలిమ!

* సేవా మార్గం

''మా సొంతూరు బాపట్ల. అమ్మానాన్నలకు పెద్ద కూతురిని. ఇంగ్లీష్ లిటరేచర్‌లో మాస్టర్స్ చేశాను. మా నాన్నగారు ఆర్మీ ఉద్యోగి కావడంతో నా చదువు అంతా ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా భోపాల్‌లో జరిగింది. చదువు పూర్తయ్యాక హైదరాబాద్ వచ్చాం. ఇక్కడ పదేళ్లపాటు ఇంగ్లీష్ లెక్చరర్‌గా వర్క్ చేశాను. ఆ తర్వాత తిరిగి భోపాల్‌కి వెళ్లాను. అక్కడ నుంచి సౌదీ గవర్నమెంట్‌కు ఆంగ్ల ప్రొఫెసర్‌గా వర్క్ చేశాను. ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి, మీడియా రంగంలో ఉండటంతో చాలా సామాజిక సమస్యలు నా దృష్టికి వచ్చాయి. సమాజానికి నా వంతుగా ఏదైనా చేయాలనే తపన అప్పుడే మొదలైంది. అమ్మానాన్నల దేశ సేవ స్ఫూర్తి కూడా నాలో ఉండటం అందుకు కారణమై ఉంటుంది.



■ ఐదు ప్రాజెక్ట్స్‌తో సేవా రంగం

ఐదేళ్ల క్రితం ఐదు ప్రాజెక్ట్స్‌తో 'యాపిల్ హోమ్ రియల్ నీడ్ ఇండియా' ఫౌండేషన్‌ను ప్రారంభించాను. దీంట్లో భాగంగా ఎవరూ ఆకలితో పడుకోకూడదు అనే ఆలోచనతో మొదటిది ఫీడ్ ద నీడ్ ప్రాజెక్ట్ చేశాను. రోడ్‌సైడ్ ఫ్రిడ్జ్‌లను ఏర్పాటు చేసి, నిరుపేదలకు ఆహారం అందేలా ఏర్పాటు చేశాం. ఆ తర్వాత 'షీ నీడ్' ద్వారా ముఖ్యంగా గ్రామీణ అమ్మాయిలకు, మహిళలకు శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా అందజేశాం. 'మిషన్ భద్రత' పేరుతో ఒక్కో సెట్‌లో ఆరు నాణ్యమైన ఫ్యాబ్రిక్‌తో తయారుచేసిన లో దుస్తులను ఉంచి, ఏడాది నుంచి నిరుపేద అమ్మాయిలకు అందజేస్తున్నాం. వచ్చే ఏడాది వరకు రెండు లక్షల మంది అమ్మాయిలకు లో దుస్తులను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రముఖ డిజైనర్ రవిత మేయర్ ఈ లో దుస్తులను డిజైన్ చేస్తున్నారు. కొన్ని సేవాసంస్థల సహకారంతో ఇండియా మొత్తంలో ఎవరికి అవసరం ఉందో గుర్తించి, వారికి లో దుస్తులను అందజేస్తాం. వీటితర్వాత రైతులు, నిరుద్యోగులు, వయసుపైబడినవారి కోసం సాయం అందించాలనేది మా ఉద్దేశ్యం.


నీలిమా ఆర్య

■ లో దుస్తుల ప్రాముఖ్యత..

నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని, వారికి అత్యవసరంగా కావాల్సినవి ఏమిటి అనే ఆలోచనలు ఎప్పుడూ చేస్తుంటాం. షీ నీడ్ ప్రాజెక్ట్ లో భాగంగా భవన నిర్మాణాలు జరిగే చోట, స్లమ్స్‌లలో, కూలీల పిల్లలను చూసినప్పుడు వారికి లో దుస్తుల సమస్య ఉన్నట్టు గుర్తించాం. 3 నుంచి 13 ఏళ్ల అమ్మాయిల వరకు లో దుస్తుల గురించి సరైన అవగాహన చేయగలిగితే వారిలో పునరుత్పత్తి వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. దీనిద్వారా భవిష్యత్తు తరాలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించగలం. అలాగే, శానిటరీ ప్యాడ్స్ వాడాలన్నా సరైన లో దుస్తులు ఉండాలి. నిజానికి గ్రామీణ అమ్మాయిలు, మహిళలకు సురక్షితమైన శానిటరీ ప్యాడ్స్, లో దుస్తులు అందుబాటులో ఉండవు. ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు క్షేమంగా ఉంటుందనే విషయాన్ని మనం విస్మరించ కూడదు. ఈ విషయాన్ని పదే పదే ఆ కుటుంబాలకు తెలియజేయడానికి కూడా ఈ మార్గాన్ని ఎంచుకున్నాం.

■ సాధికారతలో భాగంగా..

ఆర్య రసోయి–క్లౌడ్ కిచెన్ ద్వారా శాకాహార, మాంసాహార వంటకాలను అందిస్తున్నాను. ఎడ్యుకేటర్‌గా, అడ్మినిస్ట్రేటర్‌గా, ఆంట్రప్రెన్యూర్‌గా, ఇద్దరు పిల్లల తల్లిగా నా బాధ్యతలు కొనసాగిస్తూనే సమాజానికి నా వంతు సహకారాన్ని అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్నాను. ధనం కన్నా ముందు జీవితాన్ని క్రమశిక్షణాయుతంగా మలుచుకోవడంలోనే విజయం దాగుంది అని నమ్ముతాను. ఆ క్రమశిక్షణే నన్ను నడిపిస్తుందని నమ్ముతాను' అని వివరించారు నీలిమా ఆర్య.

– నిర్మలారెడ్డి

బ్యూటిప్స్



సమస్యలు తగ్గించే ఆమ్లా ఆయిల్

మూడు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనెను వేడిచేయాలి. నూనె చక్కగా వేడెక్కిన తరువాత రెండు టేబుల్ స్పూన్ల ఉసిరిపొడి వేసి కలపాలి. సన్నని మంటమీద మరో ఐదు నిమిషాలు మరగనిచ్చి దించేయాలి. నూనె చల్లారాక గాజుసీసాలో వేసి నిల్వచేసుకోవాలి. రాత్రి పడుకునేముందు ఈ నూనెను జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి మర్దన చేసుకోవాలి. వారంలో కనీసం నాలుగుసార్లు ఈ నూనెతో మర్దన చేయడం వల్ల జుట్టు సమస్యలు తగ్గుముఖం పట్టి ఒత్తుగా పెరుగుతుంది.

మెహందీలో ఇవి కలిపితే...





- జుట్టుకు మెహందీ పెట్టుకునేటప్పుడు అరటిపండుని కలిపితే కురులకు మరిన్ని పోషకాలు అందుతాయి. అరటి పండులోని యాంటీ ఆక్సిడెంట్స్ మాడు దురదను తగ్గిస్తాయి. అరటిపండుని మెత్తగా చిదుముకుని మెహందీలో వేసి కలపాలి. ఈ మెహందీని జుట్టుకి పట్టించి గంట తరువాత కడిగేయాలి.
- కొబ్బరిపాలను కొద్దిగా వేడి చేసి కొన్ని చుక్కలు ఆలివ్ ఆయిల్‌ను వేసి కలపాలి. ఈ పాలను మెహందీలో వేసి బాగా కలిపి జుట్టుకు పట్టించాలి. గంట తరువాత షాంపుతో తలస్నానం చేయాలి. వారానికి రెండుసార్లు ఈ విధంగా చేస్తే... కొబ్బరి పాలలోని లారిక్ ఆమ్లం మంచి యాంటీబయోటిక్‌గా పనిచేసి, మాడు సంబంధ సమస్యలను తగ్గిస్తుంది. కండీషనర్స్, షాంపులలో కొబ్బరిపాలను వాడతారు. ఇలా మెహందీలో కొబ్బరిపాలు కలపడం వల్ల మెహందీ మంచి కండీషనర్‌గా పనిచేస్తుంది.
- టేబుల్ స్పూను హెన్నా, టేబుల్ స్పూను ముల్తానీ మట్టిని తీసుకుని నీటిలో నానబెట్టి పేస్టులా చేయాలి. ఈ పేస్టుని తలలో బాగా దురదపెడుతోన్న భాగంలో రాసి, అరగంట తరువాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చుండ్రు సమస్య తగ్గుముఖం పడుతుంది.



మృదువుగా మార్చే క్రీమ్

టేబుల్ స్పూను పెట్రోలియం జెల్లీలో టేబుల్ స్పూను కొబ్బరి నూనె వేసి, టేబుల్ స్పూను గ్లిజరిన్, ఐదారు చుక్కల నిమ్మరసం వేసి క్రీమ్‌లా మారేంతవరకు బాగా కలపాలి. తరువాత ఈ క్రీమ్‌ను పగిలిన పాదాలకు రాసి మర్దన చేయాలి. రోజుకు రెండుసార్లు ఈ క్రీమ్‌ను అరికాళ్లకు రాస్తే పగుళ్లు తగ్గి పాదాలు కోమలంగా, మృదువుగా మారతాయి.

జుట్టుకు కలిముద్ర..



జుట్టు రాలిపోతుందని చాలా మంది బాధపడుతుంటారు. ఒత్తుగా జుట్టు పెరిగేందుకు చేయని ప్రయత్నమంటూ ఉండదు. అయితే జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తింటూ కలిముద్ర వేస్తే చక్కటి జుట్టు వస్తుందని నిపుణులు చెబుతున్నారు. కలిముద్ర జుట్టు సమస్యలను తొలగించి ఒత్తుగా పెరిగేలా చేస్తుంది.

ఇలా వేయాలి..

– రెండు అరిచేతులను ఎదురుగా తీసుకురావాలి. ముందుగా చూపుడు వేళ్లను ఒకదానికి ఒకటి ఎదురుగా తీసుకువచ్చి కలిపి ఉంచాలి. బొటన వేళ్లు, మిగతా వేళ్లను వ్యతిరేక దిశలో పెనవేసుకున్నట్టుగా పెట్టాలి (ఫోటోలో చూపిన విధంగా). ఇలా పెట్టిన చేతులను ఐదు నుంచి పదినిమిషాల వరకు ఉంచాలి. రోజుకొకసారి ఈ ముద్ర వేస్తే ఫలితం త్వరగా కనిపిస్తుంది.



వేస్ట్ టు ప్లేట్

వంట అందరూ చేస్తారు కానీ, ఎక్కువమంది తినేట్టు, నచ్చేటట్లు చేసిన వారు మాత్రమే చెఫ్‌గా మారతారు. మరింత రుచికరంగా... ఘుమఘుమలాడేలా వినూత్నంగా ఆహారాన్ని తయారు చేసిన వారు పాపులర్ చెఫ్‌గా పేరు తెచ్చుకుంటారు. ఇలా పాపులర్ అయిన అతికొద్దిమంది చెఫ్‌లలో ఒకరే దవీందర్ కుమార్. ప్రొఫెషనల్ చెఫ్‌గా యాభై ఏళ్లు పూర్తి చేసుకుని వేస్ట్ టు ప్లేట్' ఐడియాతో ఇండియాలోనే గాక ప్రపంచంలోని చెఫ్‌లు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.


దవీందర్ కుమార్

చెఫ్ డీకేగా పేరొందిన దవీందర్ కుమార్ ఢిల్లీ యూనివర్శిటీలో కామర్స్ డిగ్రీ పూర్తయ్యాక ప్రొఫెషనల్ డిగ్రీ చేయాలనుకున్నారు. అప్పట్లో పెద్దగా ప్రొఫెషనల్ కోర్సులు అందుబాటులో లేవు. తన స్నేహితుడు ఒబెరాయ్ హోటల్‌లో పనిచేస్తుండడంతో తను కూడా హోటల్‌లో చేరాలనుకున్నాడు. ఇంట్లో ఎవరికీ ఇష్టంలేక పోయినప్పటికీ 'ఒబెరాయ్ సెంటర్ ఆఫ్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్'లో చేరాడు. మూడేళ్ల కిచెన్ మేనేజ్‌మెంట్ డిప్లొమా ప్రోగ్రామ్ పూర్తి చేసిన తరువాత.. ఒబెరాయ్ హోటల్‌లో పర్మనెంట్ ఉద్యోగి అయ్యాడు. దీంతో దవీందర్ చెఫ్ ప్రయాణం మొదలైంది. ఫ్రెంచ్ భాషపై ఉన్న ఆసక్తితో ఫ్రెంచ్ వంటకాలను సైతం నేర్చుకునేవాడు. ఆసక్తి మరింత ఎక్కువ కావడంతో పారిస్‌లోని టెక్నిక్ డీ హోటలియర్‌లో రెండేళ్లపాటు శిక్షణ తీసుకున్నాడు. తనకిష్టమైన వంటలన్నీ నేర్చుకుంటూ, మరోపక్క చెఫ్‌గా రాణిస్తూ ఒబెరాయ్ గ్రూప్‌లో 12 ఏళ్లపాటు పనిచేశాడు. ఆ తరువాత 1985లో 'లీ మెరిడియన్'లో టీమ్ సభ్యుడిగా చేరాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు మెరిడియన్ హోటల్స్ వైస్ ప్రెసిడెంట్‌గానేగాక, ఎగ్జిక్యూటివ్ చెఫ్‌గా పనిచేస్తున్నారు. ఇండియన్ కలినరీ ఫోరమ్‌కు (ఐసీఎఫ్)కు ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

■ తొక్కలతో...

చెఫ్‌గా ఎంతో అనుభవం ఉన్న దవీందర్ కుమార్ ఒక రోజు టీవీలో వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ చూస్తున్నారు. ''ప్రపంచంలో ఉత్పత్తి అవుతోన్న ఆహారంలో మూడు వంతులు తినకముందే వ్యర్థంగా పోతుంది. ఒక్కో హోటల్లో పండ్లు, కూరగాయల నుంచి తయారు చేసే వంటకాల్లో కనీసం ఐదు నుంచి పది శాతం వ్యర్థంగా పోతుంది'' అని చెప్పారు. ఇది చూసిన దవీందర్‌కు వ్యర్థాల నుంచి కూడా ఆహారం తయారు చేయవచ్చన్న ఆలోచన వచ్చింది. అదే వేస్ట్ టు ప్లేట్.



అనుకున్న వెంటనే పన్నెండు రెస్టారెంట్లు, ఐదు ఫైవ్ స్టార్ హోటళ్ల నుంచి పండ్లు, కూరగాయ వ్యర్థాలను సేకరించడం మొదలు పెట్టారు. అలా సేకరించిన వాటిని శుభ్రం చేసి రంగు, రుచికి తగ్గట్టుగా వేరు చేసి, పోషకాలతో కూడిన డిష్‌లను తయారు చేసి కస్టమర్లకు వేడి వేడిగా వడ్డించారు వీటిని తిన్న వారు ఇష్టపడడంతో వేస్ట్ టు ప్లేట్‌ను కొనసాగిస్తున్నారు. ఈ ఫుడ్ వ్యర్థాల్లో కూరగాయ, పండ్లతొక్కలు, కొమ్మలు, కాడలు, విత్తనాలు కూడా ఉన్నాయి.

■ స్పెషల్ మెనూ..

వ్యర్థాల నుంచి తయారు చేసే రుచికరమైన వంటలతో ఏకంగా స్పెషల్ మెనూని అందిస్తున్నాడు చెఫ్ డీకే. ఈ మెనూలో పనసపండు విత్తనాలు, బాదం హల్వా, సెలేరి, పాలకూర సలాడ్, యాపిల్ పల్ప్ పై, బ్రొకలీ, పుదీనా కాడల ముక్కల చట్నీ, జ్యూస్ తీయగా మిగిలిపోయిన బీట్‌రూట్‌తో రసం, క్యారట్ తొక్కల సలాడ్‌వంటివి ఉన్నాయి. ఈ డిష్‌లు రుచిగా, శుచిగానేగాక పుష్కలంగా పోషకాలు ఉండేలా వడ్డించడం విశేషం.

■ కుక్ బుక్స్..

కొత్త వంటలని కనిపెట్టడమేగాక తను చేసే వంటలతో చాలా కుక్‌బుక్స్‌ను రాశాడు చెఫ్ డీకే. ఈ బుక్స్‌లో 'కబాబ్ చట్నీ అండ్ బ్రెడ్', జస్ట్ కబాబ్: ఫర్ 365 కబాబ్స్ అండ్ లీప్ ఇయర్', సూప్స్, ఫోర్ సీజన్స్, సీజనల్ సలాడ్, సెకండ్ మీల్స్ వంటివి ఉన్నాయి. పుస్తకాల్లో కొన్నింటికి గౌరవ సత్కారాలు కూడా అందుకున్నారు. లీ మెరిడియన్ పదో వార్షికోత్సవం సందర్భంగా 7500 కేజీల కేక్‌ను తయారు చేసి లిమ్కాబుక్ రికార్డుల్లో నిలిచారు. అంతర్జాతీయ మెడల్స్‌తోపాటు, గోల్డెన్ హ్యాట్ చెఫ్ అవార్డు, భారత పర్యాటక మంత్రిత్వ శాఖతో బెస్ట్ చెఫ్ ఆఫ్ ఇండియా అవార్డు, జాతీయ టూరిజం అవార్డులను అందుకున్నారు.

ఫస్ట్ టైమ్

ప్రపంచం మెచ్చిన సైంటిస్ట్

'క్వాంటమ్' అనే మాటకు ప్రతిధ్వనిగా 'అంతు లేని వేగం' 'అపారమైన శక్తి' అనే శబ్దాలు వినిపిస్తాయి. దేశ పురోగతిని మార్చే శక్తి క్వాంటమ్ సాంకేతికతకు ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మన దేశంతో సహా ప్రపంచంలోని ఎన్నో దేశాలు క్వాంటమ్ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. శాస్త్రవేత్తల విషయానికి వస్తే... ప్రొఫెసర్ ఊర్వశీ సిన్హా క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ ఫండమెంటల్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ ప్రాసెసింగ్‌లాంటి కట్టింగ్–ఎడ్జ్ టెక్నాలజీలో అందె వేసిన చేయిగా పేరు తెచ్చుకుంది. బెంగళూరులోని రామన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఆర్ఐ)లోని క్వాంటమ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ కంప్యూటింగ్ ల్యాబ్‌లో పని చేస్తున్న ప్రొఫెసర్ ఊర్వశీ సిన్హా తాజాగా పరిశోధకులను ప్రోత్సహించడానికి ఏర్పాటైన కెనడా ఎక్స్‌లెన్స్ రిసెర్చ్ చైర్ (సీయిఆర్‌సీ) ప్రోగ్రామ్‌కి ఎంపికైంది. సీయిఆర్‌సీకి ఎంపికైన తొలి ఇండియన్‌గా తన ప్రత్యేకత చాటుకుంది. ఈ ప్రోగ్రామ్ ద్వారా 8 సంవత్సరాలకు గాను 8 మిలియన్ డాలర్లు అంటే సుమారుగా 66 కోట్ల 69 లక్షల రూపాయలను గెలుచుకుంది.

సంప్రదాయ కంప్యూటర్ సంవత్సరాల్లో చేసే పనిని క్వాంటమ్ కంప్యూటర్ నిమిషాల వ్యవధిలో పూర్తి చేస్తుంది. సూపర్ కంప్యూటర్ కంటే క్వాంటమ్ కంప్యూటర్ ఎన్నోరెట్లు వేగంగా పనిచేస్తుంది. గూగుల్, ఐబీఎం... మొదలైన సాంకేతిక దిగ్గజాలు ప్రత్యేకంగా క్వాంటమ్ కంప్యూటింగ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకున్నాయి. 'క్వాంటమ్ టెక్నాలజీ' అనేది ఇప్పుడు హాట్ టాపిక్. మన దేశం విషయానికి వస్తే క్వాంటమ్ టెక్నాలజీ అనగానే గుర్తు వచ్చే పేరు ఊర్వశీ సిన్హా.

లండన్‌లో పుట్టి పెరిగింది సిన్హా. యూనివర్శిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్‌లో చదువుకుంది. సూపర్‌కండక్టింగ్ డివైజ్‌లపై పరిశోధనలు చేసింది. పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్ కోసం కెనడాలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్వాంటమ్ కంప్యూటింగ్(ఐక్యూసీ)కు వెళ్లింది. క్వాంటమ్ ఆప్టిక్స్‌లో పరిశోధనలకు ఇంటర్నేషనల్ కమీషన్ ఫర్ ఆప్టిక్స్(ఐసీవో) నుంచి అవార్డ్ అందుకుంది.

క్వాంటమ్ ఫిజిక్స్‌పై సిన్హాకు ప్రత్యేక ఆసక్తి. బ్యాచులర్స్, మాస్టర్స్ డిగ్రీ చేస్తున్నప్పుడు ఫండమెంటల్ సబ్జెక్ట్‌గా క్వాంటమ్ ఫిజిక్స్‌ను బోధించేవారు. అలా మొదలైన ఆసక్తి అంతకంతకూ పెరుగుతూ పోయింది. 'నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది' అనుకునేది సిన్హా.

'క్వాంటమ్ ఫిజిక్స్‌పై ఆసక్తి అధికమవుతున్న కాలంలో బంగారంలాంటి అవకాశం వచ్చింది. పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్‌లో భాగంగా క్వాంటమ్ ఆప్టిక్స్‌కు చేరువ కావడం నా కెరీర్‌కు ఎంతో మేలు చేసింది. నేను ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవడానికి అవకాశం ఇచ్చింది. ఆసక్తిని, ఉత్సాహాన్ని పెంచింది. ఇక అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు' అంటుంది సిన్హా..


ప్రొఫెసర్ ఊర్వశీ సిన్హా

గొప్ప అవకాశం

సైన్స్ అనే దానికి సరిహద్దులు లేవు. అది ప్రపంచ భాష. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒకరికొకరు సహకరించుకుంటూ వెళ్లడం ద్వారానే సైన్స్‌ను ముందుకు తీసుకువెళ్లగలం. సైన్స్ పురోగతికి నా వంతు కృషి చేస్తాను... అనే మాటలను సీయిఆర్‌సీ ఇచ్చిన అవకాశం ద్వారా ఆచరణరూపం కల్పించే అవకాశం దొరికింది. ఇండియా, కెనడాలలో సమాంతరంగా క్వాంటమ్ ఎకో సిస్టమ్ అభివృద్ధిపై కృషి చేయడానికి ఇదొక గొప్ప అవకాశం.

– ఊర్వశీ సిన్హా, సైంటిస్ట్



చిన్నప్పుడు కాల్పనిక కథల కంటే శాస్త్రీయ విషయాలు, గణితంపై ఎక్కువగా ఆసక్తి ప్రదర్శించేది. ఒకవిధంగా చెప్పాలంటే సైంటిస్ట్ కావాలని చిన్నప్పుడే డిసైడై పోయింది. తల్లిదండ్రులు బాగా ప్రోత్సహించేవారు.

బెంగళూరులోని రామన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లోని 'క్వాంటమ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ కంప్యూటింగ్ ల్యాబ్' క్వాంటమ్ ఇన్‌ఫర్మేషన్ ప్రాసెసింగ్ కోసం మన దేశంలో ఏర్పాటు చేసిన తొలి ల్యాబ్. ఈ ల్యాబ్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్‌కు సంబంధించి ఎన్నో పరిశోధనలు చేసింది సిన్హా.

'మన దేశంలో శాస్త్రీయరంగం పురోగతిని నా కాలేజీ రోజుల నుంచి చూస్తున్నాను. ఉన్నత స్థాయి పరిశోధనలకు ఇప్పుడు తగినన్ని నిధులు అందుబాటులో ఉన్నాయి. విదేశీ కంపెనీల నుంచి రకరకాల పరికరాలు ఆలస్యంగా అందుతున్నాయనే ఫిర్యాదు ఇప్పుడు వినిపించడం లేదు. స్థూలంగా చెప్పాలంటే శాస్త్రీయ పరిశోధనకు ఇప్పుడు నిధులు అనేవి ప్రధాన సమస్య కాదు. మన సమాజం శాస్త్రీయ సమాజంగా ఎదగాలంటే సాంకేతిక పరిజ్ఞానంలో పురోగతి కనిపించాలి. అందుకు మౌలిక సూత్రాలపై అవగాహన పెంచుకోవాలి' అంటుంది సిన్హా.

బాల్యం నుంచి శాస్త్రీయపథంలో పయనిస్తున్న ఊర్వశీ సిన్హా 34 మంది ప్రముఖ గ్లోబల్ సైంటిస్ట్‌లలో ఒకరిగా నిలిచింది.

హెల్త్ టిప్స్



కొంతమందికి నిద్రలేవడంతోనే విపరీతంగా తుమ్ములు వస్తుంటాయి. అలాంటి వారు తులసి, పుదీనా, రెండు మిరియపు గింజలు నిమ్మరసం కలిపి కషాయం లాగా చేసుకొని రోజూ ఒక కప్పు కషాయం తీసుకుంటుంటే నెలరోజుల్లో సమస్య తీరిపోతుంది. ఇవి అందుబాటులో లేనపుడు తుమ్ములు వస్తుంటే కొత్తిమీర వాసన చూస్తూ ఉండండి . తుమ్ములు ఆగుతాయి. ఇది తాత్కాలికంగా పనిచేస్తుంది. పైన చెప్పిన కషాయం పూర్తి ఉపశమనం ఇస్తుంది.



వామును దోరగా వేయించి మెత్తని పొడిగా నూరి ఉదయ, సాయంకాలాలు భోజనానికి అర చెంచాడు పుచ్చుకోవాలి.



ఇంగువను దోరగా వేయించి, పొడి చేసుకొని పావుచెంచాడు మోతాదుగా వేడి అన్నంతో, మొదటి ముద్దతో కలిపి తీసుకుంటే పొట్ట ఉబ్బరింపు బాధించదు.



ఎక్కిళ్ళు ఎక్కువగా వచ్చే వాళ్ళు పావు చెంచా శొంఠిపొడి, పావు చెంచా కరక్కాయ పొడి రెండింటిని ఒక కప్పు వేడినీటిలో కలిపి రెండుపూటలా సేవిస్తూ ఉంటే దగ్గు, దమ్ము, ఎక్కిళ్ళు తగ్గిపోతాయి.

ఆరోగ్యానికి చప్పట్లు





ఎవరైనా ఏదైనా మంచి పని చేసినప్పుడు, వారు చేసిన పని హర్షణీయంగా... ప్రశంసార్హంగా అనిపించినప్పుడు వారిని మెచ్చుకుంటూ చప్పట్లు కొడతాం.. అయితే అలా చప్పట్లు కొట్టడం వెనుక ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. వాటికే 'క్లాపింగ్ థెరపీ' అని పేరు. చప్పట్లు కొట్టడం వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో చూద్దాం...

సాధారణంగా ఎవరినైనా అభినందిస్తున్నప్పుడు చప్పట్లు కొడతాం. అది ప్రశంసలో ఒక భాగం. కానీ చప్పట్లు కొట్టడం వెనుక చాలామందికి తెలియని ఆరోగ్య ప్రయోజనాలెన్నో ఉన్నాయి. 'లాఫింగ్ థెరపీ' మాదిరిగానే 'క్లాపింగ్ థెరపీ' కూడా ఇప్పుడు ఫేమస్ అయ్యింది. క్లాపింగ్ థెరపీ వల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయంటే..

* * *

మనిషి శరీరంలో ప్రతి అవయవం ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటుంది. అరచేతులు రక్తనాళాలు, నరాల చివరలకు కేంద్రం. మీరు వాటిని ఉత్తేజపరిస్తే మీ ఆరోగ్య సమస్యలు నయం అవుతాయి. ఆశ్చర్యం అనిపించినా ఇది నిజం. అయితే చప్పట్లు కొట్టడం వల్లే ఆరోగ్యం విషయంలో అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

* * *

చప్పట్లు కొట్టడం ఆందోళనను నియంత్రించడానికి సులభమైన మార్గం. చప్పట్లు కొట్టడం ప్రారంభించగానే మెదడుకి సానుకూల సంకేతాలు వెళ్తాయి. ఇది నిరాశను పోగొడుతుంది. సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి రోజువారి వ్యాయామంలో చప్పట్లు కొట్టడాన్ని కూడా భాగంగా చేసుకోవాలి.

* * *

కరతాళ ధ్వనులు చేయడం వల్ల రక్తపోటు స్థాయులు నియంత్రణలో ఉంటాయి. తద్వారా గుండె ఆరోగ్యం బాగుంటుంది. చప్పట్లు కొట్టినపుడు శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇది అనేక గుండె సమస్యలను తగ్గిస్తుంది. అంతే కాదు, చప్పట్లు కొట్టడంతో శ్వాస సమస్యలు కూడా తగ్గుతాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.

* * *

చప్పట్లు కొట్టడం వల్ల తెల్ల కణాల ఉత్పత్తి పెరిగి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని రుజువైంది. ఫలితంగా కాలానుగుణంగా వచ్చే అనేక వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. పిల్లలు క్రమం తప్పకుండా చప్పట్లు కొట్టడం వల్ల వారిలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగవడంతో పాటు వారి చేతి రాతలో తప్పులు దొర్లకుండా ఉంటాయి.

* * *

చప్పట్లు కొట్టడం వల్ల జుట్టు రాలే సమస్య అదుపులోకి వస్తుంది. అయితే కొన్ని ప్రత్యేకమైన ఫలితాలను ఆశిస్తూ చప్పట్లు కొట్టే ముందు అరచేతులకు కొద్దిగా ఆవ నూనె లేదా కొబ్బరి నూనె రాసుకోవడం మెరుగైన ఫలితాన్ని ఇస్తుంది. అరచేతుల్ని నిటారుగా ఉంచి.. చేతివేళ్లు ఒకదానికొకటి తాకేలా ఉంచి చప్పట్లు కొట్టాలి. మంచి ఫలితాల కోసం ఉదయం పూట కొట్టడం మంచిదట. లేదంటే ఎవరి వీలును బట్టి వారు ఈ క్లాపింగ్ థెరపీని అనుసరించవచ్చు.

కురులకు మామిడి ఆకులు



నోరూరించే మామిడి పళ్లు తినాలంటే వేసవి వచ్చేవరకు ఎదురు చూడక తప్పదు. అయితే మామిడి ఆకులు కోసుకోవడానికి ఎప్పుడూ ఇబ్బంది ఉండదు. అందుకే వివాహాది శుభకార్యాలు, పండుగలు, పర్వదినాలలో గుమ్మాలకు మామిడాకు తోరణాలు కట్టుకుంటూనే ఉన్నాం. ఇంతేనా? జుట్టు ఒత్తుగా, పొడవుగా పెరగడానికి, ఆరోగ్య సంరక్షణకు కూడా మామిడి ఆకులు ఉపయోగపడతాయని పరిశోధకులు చెబుతున్నారు. మామిడి ఆకులలో జుట్టు కుదుళ్ల బలంగా ఉండటానికి అవసరం అయ్యే కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచే ఎ, ఇ, సి విటమిన్లు ఉండటం వల్ల ఇది సాధ్యం అవుతుందని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి.

మామిడాకులలో పైన చెప్పుకున్న విటమిన్లతోపాటు యాంటీఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉండటం వల్ల వీటిని ఉపయోగించిన వారికి జుట్టు బాగా పెరుగుతుంది. అంతే కాదు... తలపై మామిడి ఆకులను ఉంచి, వాటిని కప్పుతూ ఏదైనా పలుచని క్లాత్‌ను కట్టుకోవడం ద్వారా తలనొప్పి తగ్గుతుంది. తలలో రక్తనాళాలు దెబ్బతినకుండా ఉంటాయి. రక్త ప్రసరణ పెరుగుతుంది. ● మామిడి ఆకుల్లో ఉండే సహజ తైలాలు జుట్టు సంరక్షణకు ఉపకరిస్తాయి. మామిడి ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు నెరవకుండా, బలహీనంగా మారకుండా ఉంచుతాయి.

● మామిడి ఆకులను ఉపయోగించడం వల్ల ఎటువంటి దుష్ఫలితాలూ లేకుండా జుట్టు నల్లగా, ఒత్తుగా తయారవుతుంది. మామిడి ఆకులలో ఉండే ఫ్లేవనాయిడ్లు జుట్టును సహజంగా నల్లగా మార్చడంలో , నిగారింపు వచ్చేలా చేయడంలో సహాయపడతాయి.

ఎలా ఉపయోగించాలి?

తాజా మామిడి ఆకులు కొన్ని తీసుకుని కాసిని నీళ్లు చేర్చి మిక్సీలో వేసుకుని లేదా రుబ్బుకుని పేస్ట్‌లా చేసుకోవాలి. దానికి పెరుగు లేదా ఆలివ్ నూనెను చేర్చాలి. ఈ పేస్ట్‌ను చివళ్ల నుంచి కుదుళ్ల వరకు పట్టించాలి. ఆరేదాకా ఉంచి, ఆ తరవాత మైల్డ్ షాంపూతో స్నానం చేయాలి.

● మామిడి ఆకులను ఎండలో ఎండబెట్టి మెత్తగా పౌడర్ లా చేసుకోవాలి. తరువాత పేస్ట్ లా చేసుకుని బ్లాక్ టీని కలిపి మిశ్రమంలా తయారు చేసుకోవాలి. ఇలా తయారైన మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. ఇలా చేస్తే జుట్టుకు మంచి పోషణ అందటంతోపాటు నల్లగా మారుతుంది.

● మధుమేహంతో బాధపడేవారు కొన్ని మామిడి ఆకులను శుభ్రంగా కడిగి నీళ్లలో ఉడకబెట్టి కషాయంలా కాచుకోవాలి. గోరువెచ్చగా అయ్యాక వడపోసి తాగాలి. ఇలా క్రమం తప్పకుండా కొన్ని రోజులపాటు చేయడం వల్ల మధుమేహం అదుపులోకి వస్తుంది.

చలితో చెలిమి...

ప్రస్తుతం వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. దీని ప్రభావం మన చర్మంపై కూడా కనిపిస్తోంది. మార్పు, వాతావరణం కారణంగా, చర్మం పగుళ్లు మొదలవుతుంది. సకాలంలో జాగ్రత్త తీసుకోకపోతే కొన్ని రోజుల తర్వాత అది మరింత తీవ్రమవుతుంది. ఈ సమస్యను నివారించడానికి మన పెద్దలు కొన్ని గృహ చిట్కాలను పాటించేవారు. అవేమిటో తెలుసుకుందాం.



పూర్వం చలికాలం రాగానే పెద్దవాళ్లు వంటికి వెన్న పూస లేదా నువ్వులనూనెను రాసుకుని ఎండలో కాసేపు నిలబడేవారు. దాంతో చర్మానికి తగిన పోషకాలు అంది తేమను కోల్పోకుండా మృదువుగా ఉండేది. ఇప్పుడు కూడా మనం అలా చేయవచ్చు. వాటితో పాటు మరికొన్ని చిట్కాలు చూద్దాం.



చర్మానికి కలబంద: అలోవెరా జెల్ అంటే కలబంద గుజ్జు చర్మానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇది ఎల్లప్పుడూ చర్మానికి మంచి నేస్తం వంటిది. అలోవెరాలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉండటం వల్ల ఇది చర్మాన్ని మృదువుగా ఉంచడంలోనూ, గాయాలను నయం చేయడానికీ సహాయపడుతుంది. దీనికోసం చేయవలసిందల్లా రాత్రి పూట కాసింత కలబంద గుజ్జు... అదేనండీ... అలోవెరా జెల్‌తో ముఖానికి, శరీరానికి సున్నితంగా మసాజ్ చేస్తే సరి. తప్పకుండా మంచి ఫలితం ఉంటుంది.



కొబ్బరినూనె: తలకే కాదు. ఒంటికి కూడా... కొబ్బరినూనెను కేవలం తలకు మాత్రమే రాసుకునే తైలంగా చూస్తారు చాలామంది. అయితే కొబ్బరి నూనె చర్మానికి కూడా చాలా ప్రయోజనకరమైనది. స్వచ్ఛమైన కొబ్బరినూనెను తీసుకుని ఒంటికి, ముఖానికి సున్నితంగా మసాజ్ చేయాలి. పడుకునే ముందు లేదా స్నానానికి అరగంట ముందు ఇలా చేస్తే చికాకు, అసౌకర్యం లేకుండా ఉంటుంది.



అదేవిధంగా రోజూ పడుకునే ముందు స్వచ్ఛమైన నేతిని చర్మానికి రాసుకుంటూ ఉంటే కొద్దిరోజుల్లోనే చర్మం కోమలంగా... మృదువుగా నిగారింపును సంతరించుకుంటుంది. .

ఆవనూనె: పొడి బారిన చర్మాన్ని తిరిగి కాంతిమంతంగా మార్చుకోవడానికి ఆవనూనెను చర్మంపై అప్లై చేయడం సర్వసాధారణం. దీనివల్ల చర్మం ఆరోగ్యంగా ఉండడంతోపాటు చర్మ సమస్యలు ఏవీ రావు.

పిల్లలకు రోజూ బేబీ ఆయిల్ లేదా వెన్న, నెయ్యి లేదా నువ్వులనూనెను ఒంటికి రాసి ఎండలో ఆరిన తర్వాత స్నానం చేయిస్తే చర్మం మృదువుగా ఉండడంతోపాటు ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి. చలికాలంలో ఇలా చేయడం మంచిది.

సినిమా

హాయ్ నాన్నతో ప్రేమలో పడతారు - నాని



● చెరుకూరి మోహన్, నాని, శౌర్యువ్, విజయేందర్ రెడ్డి

''సినిమా అనేది నాకు ఆక్సిజన్‌తో సమానం. సినిమా అనేది నిజంగా నా ఊపిరి. ఆ ఊపిరి మీద ఒట్టేసి చెబుతున్నా... డిసెంబర్ 7న మీరంతా(అభిమానులు) ప్రేమలో పడిపోయే 'హాయ్ నాన్న' వస్తోంది.. ఆ బాధ్యత నాది, మా టీమ్‌ది. బాక్సాఫీసు వద్ద హిట్ చేసే బాధ్యత మీది '' అని హీరో నాని అన్నారు. శౌర్యువ్ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'హాయ్ నాన్న'. నాని, మృణాల్ ఠాకూర్ జంటగా బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో నటించారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో డిసెంబర్ 7న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో నాని మాట్లాడుతూ–''ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో నన్ను నేను తెరపై చూసుకున్నప్పుడు 'వీడెవడో బావున్నాడు' అనిపించింది 'హాయ్ నాన్న' సినిమాకే(నవ్వుతూ). శౌర్యువ్ సినిమా బాగా తీశాడు. టీజర్, ట్రైలర్‌లో చూడనిది, ఊహించనిది సినిమాలో బోలెడంత ఉంది'' అన్నారు. ఈ వేడుకలో శౌర్యువ్, మోహన్ చెరుకూరి, విజయేందర్ రెడ్డి, రచయిత కాశి తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సానుజాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

డబుల్ ఇస్మార్ట్‌కు మణిశర్మ స్వరాలు



● చార్మీ, మణిశర్మ, రామ్, పూరి జగన్నాథ్

హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019) సూపర్‌హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం రామ్, పూరి కాంబినేషన్‌లో 'ఇస్మార్ట్ శంకర్' కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో జరుగుతోంది. కాగా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రానికి మణిశర్మ సంగీతం సమకూర్చనున్నట్లు చిత్రయూనిట్ శనివారం వెల్లడించింది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'పోకిరి, చిరుత, ఇస్మార్ట్ శంకర్' వంటి హిట్ సినిమాలకు మణిశర్మ సంగీతం అందించిన సంగతి గుర్తుండే ఉంటుంది. పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ నిర్మిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' వచ్చే ఏడాది మార్చి 8న విడుదల కానుంది.

వెబ్ ఎంట్రీ



● కీర్తి సురేష్

కీర్తి సురేష్, రాధికా ఆప్టే ప్రధాన తారాగణంగా పీరియాడికల్ రివేంజ్ థ్రిల్లర్‌గా 'అక్క' వెబ్‌సిరీస్ రూపొందుతోంది. ధర్మరాజ్ శెట్టిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఆదిత్యా చోప్రా ఈ వెబ్‌సిరీస్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ మొదలైనట్లు బాలీవుడ్ సమాచారం. ''ఇందులో కీర్తిసురేష్, రాధికా ఆప్టే పాత్రలు పోటాపోటీగా ఉంటాయి. వీక్షకులను ఆకట్టుకునేలా ఈ సిరీస్ సాగుతుంది'' అని యూనిట్ పేర్కొంది. కాగా కీర్తి సురేష్‌కు తొలి ఓటీటీ ప్రాజెక్ట్ 'అక్క'. వరుణ్‌ధావన్ హీరోగా నటిస్తున్న ఓ బాలీవుడ్ సినిమాలో కీర్తి ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారన్న వార్తలు వస్తున్నాయి.

త్రిషకు మన్సూర్ అలీఖాన్ క్షమాపణ



● మన్సూర్ అలీఖాన్

హీరోయిన్ త్రిషకు ఎట్టకేలకు క్షమాపణ చెప్పారు నటుడు మన్సూర్ అలీఖాన్. ''లియో' సినిమాలో త్రిషతో బెడ్‌రూమ్ సన్నివేశం ఉంటుందనుకున్నాను. అయితే దర్శకుడు అలాంటి సన్నివేశం పెట్టకపోవడం బాధగా అనిపించింది'' అంటూ మన్సూర్ అలీఖాన్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆయన మాటలపై దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగడంతో చివరికి దిగొచ్చారు మన్సూర్. ''త్రిషపై నాకు ఎలాంటి దురు ద్దేశాలు లేవు. నా వ్యాఖ్యలు త్రిష మనసుకు బాధ కలిగించినందుకు క్షమాపణ చెబుతున్నా. ఆమె పెళ్లికి నేనే స్వయంగా వెళ్లి మంగళసూత్రం ఇచ్చి ఆశీర్వదిస్తాను'' అంటూ పోస్టు పెట్టారు మన్సూర్ అలీఖాన్. దీనికి త్రిష పరోక్షంగా స్పందిస్తూ 'తప్పులు చేయడం మానవ సహజం. క్షమించడం అనేది దైవత్వం వంటిది, అత్యుత్తమమైనది' అంటూ ట్వీట్ చేశారు.



● సోనాక్షి, రాజేశ్వరి ఇంద్రజ, భానుశ్రీ

యాక్షన్.. ఎమోషన్

భానుశ్రీ, సోనాక్షీ వర్మ, అనురాగ్, రోషిణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కలశ'. కొండ రాంబాబు దర్శకత్వంలో చంద్రజ ఆర్ట్ క్రియేషన్స్‌పై రాజేశ్వరి చంద్రజ వాడవల్లి నిర్మించిన ఈ చిత్రం రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ సినిమా టీజర్‌ని దర్శకుడు సాగర్ చంద్ర రిలీజ్ చేసి, ''టీజర్ బాగుంది. సినిమాలో మంచి యాక్షన్, ఎమోషన్ ఉన్నాయి'' అన్నారు. బ్యానర్‌లోగోను దర్శకుడు వీఎన్ ఆదిత్య, టైటిల్ లోగోను యాట సత్యనారాయణ, మోషన్ పోస్టర్‌ను దర్శకుడు వీరశంకర్ విడుదల చేశారు. అలాగే ఈ సినిమాలోని ఓ పాటను వీఎన్ ఆదిత్య, వీరశంకర్, సాగర్ చంద్ర, యాట సత్యనారాయణ సంయుక్తంగా రిలీజ్ చేశారు. ''బ్రెయిన్‌కి, హార్ట్‌కి లింక్ చేస్తూ రాసుకున్న సినిమా ఇది'' అన్నారు కొండా రాంబాబు. ''ఎలాంటి కట్స్ లేకుండా సెన్సార్ వారు మా సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వడం మా తొలి విజయంగా భావిస్తున్నాం'' అన్నారు రాజేశ్వరి చంద్రజ.

విశాఖ ఉక్కు నేపథ్యంలో...

పి.సత్యారెడ్డి లీడ్ రోల్‌లో నటించి, జనం ఎంటర్‌టైన్మెంట్స్‌పై స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. శుక్రవారం సత్యారెడ్డి పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ సినిమా ట్రైలర్, పాటల విడుదల వేడుక హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొన్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ–''విశాఖపట్నం ఉక్కు నేపథ్యంలో సత్యారెడ్డి 'ఉక్కు సత్యాగ్రహం' సినిమా తీసుకురావడం చాలా మంచి విషయం'' అన్నారు. దర్శకుడు త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ– ''నేనొక కమర్షియల్ డైరెక్టర్ అయినా నాకు ఉద్యమంతో కూడిన, ప్రజా సమస్యలతో కూడిన ఉద్యమాలు చేసే సినిమాలంటే చాలా ఇష్టం. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''విశాఖ ఉక్కు ఉద్యమానికి సంబంధించిన సమస్యలతో ఈ సినిమా తీశాం'' అన్నారు పి.సత్యారెడ్డి. నిర్మాత దాసరి కిరణ్, దివంగత గాయకులు గద్దర్ కుమార్తె వెన్నెల, నటి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



● సత్యారెడ్డి, ఝాన్సీ

ఉషా పరిణయం ఆరంభం



● తాన్వీ, శ్రీకమల్

'నువ్వేకావాలి, మన్మథుడు, మల్లీశ్వరి' చిత్రాల ఫేమ్ కె.విజయ్‌భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. క్రాఫ్ట్ ప్రొడక్షన్స్‌పై కె.విజయ్‌భాస్కర్ స్వీయ దర్శకత్వంలో ఈ మూవీ రూపొందుతోంది. ఈ సినిమా ద్వారా విజయ్ భాస్కర్ తనయుడు శ్రీకమల్ హీరోగా, తెలుగమ్మాయి తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం పారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. పూజా కార్యక్రమాల అనంతరం హీరో, హీరోయిన్లపై తీసిన సన్నివేశాలతో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టారు విజయ్‌భాస్కర్. కుటుంబ సమేతంగా చూడదగ్గ సరికొత్త ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'ఉషా పరిణయం' రూపొందుతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'వెన్నెల'కిషోర్, శివాజీ రాజా, ఆమని, సుధ, రజిత ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: ఆర్ఆర్ ధ్రువన్, కెమెరా: సతీష్ ముత్యాల.

రీల్స్

సెట్స్‌లో సూర్యకు గాయాలు



● సూర్య

హీరో సూర్య గాయపడ్డారు. ఆయన హీరోగా శివ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న చిత్రం 'కంగువా'. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో ఓ రోప్ కెమెరా అదుపుతప్పి సూర్య భుజంపై పడడంతో ఆయన గాయపడ్డారని కోలీవుడ్ సమాచారం. దీంతో 'కంగువా' సినిమా చిత్రీకరణను తాత్కాలికంగా నిలిపివేశారు. ''నేను త్వరగా కోలుకోవాలని మీరు (అభిమానులు, ప్రేక్షకులు)పంపుతున్న సందేశాలు నాకు ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి.. ఇందుకు ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేసి, తన గాయాన్ని పరోక్షంగా స్పష్టం చేశారు సూర్య. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది.

గౌరవంగా భావిస్తున్నా – ఖతిజా



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ కుమార్తె ఖతిజా రెహమాన్ 'లయనెస్' అనే అంతర్జాతీయ సినిమాకు సంగీతం అందించనున్నారు. కజ్రీ బబ్బర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో పైగే సంధు, అదితీరావ్ హైదరీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. భారత్‌కు చెందిన నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ది బ్రిటిష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నిర్మిస్తున్నాయి. 'లయనెస్' కు సంగీత దర్శకురాలిగా ఖతిజా రెహమాన్‌ను తీసుకున్నారు మేకర్స్. ఖతిజాకు తొలి అంతర్జాతీయ చిత్రం ఇదే కావడం విశేషం. 'లయనెస్' లో భాగమవడం థ్రిల్లింగ్‌గా ఉంది. గౌరవంగా కూడా భావిస్తున్నాను'' అన్నారు ఖతిజా రెహమాన్.


విక్రమ్ రాథోడ్ వస్తున్నాడు



● విజయ్ ఆంటోనీ

విజయ్ ఆంటోనీ హీరోగా బాబు యోగేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా(తెలుగు, తమిళం) చిత్రం 'విక్రమ్ రాథోడ్'. అపోలో ప్రొడక్షన్స్, ఎస్ఎన్ఎస్ మూవీస్ సమర్పణలో రావూరి వెంకటస్వామి, ఎస్.కౌశల్యా రాణి నిర్మించిన ఈ చిత్రాన్ని డిసెంబరు 1న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను తెలుగులో ఒ.బాబూరావు, జీపీఎస్ రెడ్డి విడుదల చేస్తున్నారు. సురేష్ గోపి, రమ్య నంబీశన్, సోనూసూద్, సంగీత ముఖ్యపాత్రలు పోషించిన ఈ సినిమాకు సంగీతం: ఇళయారాజా.

అన్నదమ్ముల భావోద్వేగం



● శంకర్, రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, 'షకలక'శంకర్, శ్రీతేజ్, ఆక్సాఖాన్, రూపిక ప్రధాన తారాగణంగా కాచిడి గోపాల్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'దళారి'. ఎడవల్లి వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలోని 'అన్నదమ్ములను..' అంటూ సాగే పాటని నటులు సునీల్, 'సత్యం' రాజేష్, రచయిత కోన వెంకట్ విడుదల చేశారు. ''ఈ సినిమాలో అన్నదమ్ముల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని యూనిట్ పేర్కొంది.

కామారెడ్డి మినహా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు బీఆర్ఎస్ టికెట్లు
బోధన్, నిజామాబాద్ రూరల్ మినహా కాంగ్రెస్ ప్రయోగాలు
చాలా సెగ్మెంట్లలో కొత్త అభ్యర్థులతో బరిలోకి దిగిన బీజేపీ
మెజారిటీ స్థానాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ముఖాముఖి పోరు
కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌కు సవాల్ విసురుతున్న బీజేపీ
ప్రభుత్వ వ్యతిరేక ఓటుపై ఆశల పల్లకీలో ప్రతిపక్ష పార్టీలు
ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, యువ ఓటర్లే కీలకం


శ్రీరాం సాగర్ ప్రాజెక్టు

ఇందూరు పోరు.. రూటే వేరు.!

(ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కల్వల మల్లికార్జున్ రెడ్డి)

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం తారస్థాయి చేరింది. అధికార బీఆర్ఎస్ తరపున కామారెడ్డి మినహా మిగతా ఎనిమిది చోట్లా సిట్టింగ్ ఎమ్మెల్యేలే మళ్లీ పోటీ చేస్తున్నారు. కామారెడ్డి నుంచి తొలిసారి స్వయంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు బరిలోకి దిగారు. కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థుల ఎంపికలో కొత్త ముఖాలకు చోటు కల్పిస్తూ ప్రయోగాలు చేశాయి. కాంగ్రెస్ నుంచి బోధన్, నిజామాబాద్ రూరల్, బీజేపీ తరపున జుక్కల్, కామారెడ్డి నుంచి మాత్రమే 2018లో పోటీ చేసిన అభ్యర్థులు తిరిగి బరిలోకి దిగారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు తమకు అనుకూలిస్తుందని కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటోంది. యువతతో పాటు స్థానికంగా పార్టీ అభ్యర్థుల సొంత బలం తమకు అక్కడక్కడా కలిసి వస్తుందని బీజేపీ అంచనా వేస్తోంది. ఇక నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి, రైతుబంధు, దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల వంటి సంక్షేమ పథకాలు, నిరంతర విద్యుత్ వంటి అంశాలు తమకు కలసివస్తాయని అధికార బీఆర్ఎస్ ధీమాగా ఉంది. తెలంగాణవాదం, బలమైన పార్టీ యంత్రాంగం, క్షేత్ర స్థాయిలో ఎన్నికల మేనేజ్‌మెంట్ తమ ప్రధాన బలాలుగా బీఆర్ఎస్ భావిస్తోంది. ప్రధాన పార్టీల అంచనాలు, లెక్కల నడుమ ఓటరు మాత్రం గతాన్ని, భవిష్యత్‌ను మేనిఫెస్టోలతో బేరీజు వేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. 2019 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెరమీదకు వచ్చిన 'పసుపు బోర్డు' అంశాన్ని రైతులతో పాటు సంబంధిత వర్గాలు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఓటరు నాడిని పట్టుకునేందుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో క్షేత్ర స్థాయిలో పర్యటించి 'సాక్షి' అందిస్తున్న 'గ్రౌండ్ రిపోర్ట్'.

గ్రౌండ్ రిపోర్ట్ ఉమ్మడి నిజామాబాద్

ఆర్మూరు: ఆదరించేది ఎవరిని?

2014, 2018లో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆశన్నగారి జీవన్‌రెడ్డి మళ్లీ బరిలో ఉన్నారు. గత ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేసిన ప్రొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి ఈసారి కాంగ్రెస్‌లోకి వచ్చి పోటీ చేస్తున్నారు. ఆదర్శగ్రామం అంకాపూర్‌కు చెందిన పైడి రాకేశ్‌రెడ్డి బీజేపీ నుంచి బరిలోకి దిగారు. జీవన్‌రెడ్డి వరుసగా రెండుమార్లు గెలుపొందడంతో ఆయనకు ప్రస్తుత ఎన్నిక కఠిన పరీక్షగా మారింది. ప్రభుత్వ పథకాల లబ్దిదారులపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు తమకు భారీగా లాభిస్తుందని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. వినయ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లినా అంతే స్థాయిలో కమలం కేడర్ ఆయన వెంట వెళ్లలేదు. కాంగ్రెస్ కేడర్‌తో కలిసి పోయేందుకు పార్టీ అభ్యర్థి వినయ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నారు.

బోధన్: బాద్‌షా ఎవరో..

➤ 2014, 2018లో వరుస విజయాలు సాధించిన బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మొహ్మద్ షకీల్ ఆమీర్ మళ్లీ బరిలోకి దిగారు. 2009, 14, 18 ఎన్నికల్లో షకీల్‌కు కాంగ్రెస్ నుంచి ప్రత్యర్థిగా ఉన్న మాజీ మంత్రి సుదర్శనరెడ్డి మరోమారు తలపడుతున్నారు. ఇక్కడ మైనారిటీ ఓటర్లు గణనీయంగా ఉండటం, అదే వర్గానికి చెందిన షకీల్ బరిలో ఉండటం కలిసి వస్తుందని బీఆర్ఎస్ భావిస్తోంది. గ్రామీణ ప్రాంతంలో ఉండే ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఓట్లపై కూడా షకీల్ భారీ ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు, బీజేపీ అభ్యర్థి ప్రచారం పుంజుకోకపోవడం లాభిస్తుందని కాంగ్రెస్ శిబిరం లెక్కలు వేసుకుంటోంది. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న వడ్డి మోహన్‌రెడ్డి ప్రచారం ఇంకా పూర్తి స్థాయిలో పుంజుకోలేదు. ముమ్మలనేని అమర్‌నాథ్ బాబు 'బహుజన్ సమాజ్ పార్టీ' నుంచి పోటీ చేస్తున్నారు. సెటిలర్ల ఓట్లు ప్రధాన పార్టీల ఫలితంపై కొంత మేర ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

జుక్కల్: పాత నేతలు.. కొత్త ముఖం

➤ కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులుగా ఉన్న జుక్కల్ (ఎస్సీ) రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ పాత అభ్యర్థులకే మళ్లీ అవకాశమిచ్చింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా హన్మంతు షిండే పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అరుణతార బరిలో నిలిచారు. పదిమార్లు కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సౌదాగర్ గంగారామ్‌కు ప్రస్తుత ఎన్నికలో కాంగ్రెస్ టికెట్‌ను నిరాకరించి, ఆయన స్థానంలో రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో క్రియాశీలంగా పనిచేసిన తోట లక్ష్మీకాంతరావుకు అవకాశం ఇచ్చింది. పోటీ ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నడుమ కేంద్రీకృతం కాగా, హన్మంతు షిండే వరుసగా మూడు సార్లు గెలవడంతో ప్రతికూలతను అధిగమించేందుకు శ్రమిస్తున్నారు.

బాన్సువాడ: స్పీకర్‌తో బరిలో కొత్త ముఖాలు

శాసనసభ స్పీకర్ పరిగె (పోచారం) శ్రీనివాస్‌రెడ్డి వరుసగా ఎనిమిదోసారి పోటీ చేస్తున్నారు. చివరి నిమిషంలో బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ బీజేపీ నుంచి చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ టికెట్‌పై వరుసగా రెండుసార్లు పోటీ చేసిన కాసుల బాలరాజుకు టికెట్ దక్కక పోవడంతో ఆత్మహత్యాయత్నం చేసినా పార్టీ నేతల జోక్యంతో సర్దుబాటు చేసుకున్నారు. రోడ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, అభివృద్ధిలో పోచారం పనితీరుపై సంతృప్తి వ్యక్తమవుతోంది. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పార్టీ యంత్రాంగాన్ని సమన్వయం చేసుకోవడంపై దృష్టి పెట్టారు. సెటిలర్ ఓట్లు ఎక్కువగా ఉండే వర్ని, నస్రులాబాద్ మండలాల్లో ఓటింగ్ సరళిపై ఆసక్తి నెలకొంది.

కామారెడ్డి: వ్యతిరేక ఓటు చీలికపైనే..

➤ సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు తొలిసారిగా కామారెడ్డి నుంచి ఎన్నికల క్షేత్రంలోకి దిగారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి కూడా బరిలోకి దిగడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. గత ఎన్నికలో బీజేపీ నుంచి పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి మరోమారు పోటీలో ఉన్నారు. బలంగా ఉన్న మైనారిటీ ఓట్లతో పాటు వైశ్య సామాజికవర్గం ఓట్లను ఒడిసి పట్టేందుకు బీఆర్ఎస్ ప్రత్యేకంగా శ్రమిస్తోంది. ఈ నెల 9న నామినేషన్ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగించారు. గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ ప్రస్తుతం నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేస్తున్నారు. షబ్బీర్ తన ఎన్నికల ప్రచారంపై దృష్టి కేంద్రీకరించడంతో కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రచారం ఇంకా పుంజుకునే దశలోనే ఉంది. బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి మూడేళ్లుగా క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాలతో తన ఉనికిని కాపాడుకుంటూ వస్తున్నారు. దీంతో ఎన్నికల సందడి మొదలైన నాటి నుంచే ప్రచారంలో ముందంజలో ఉన్నారు. మూడు ప్రధాన పార్టీల నడుమ త్రిముఖ పోటీ ఉండటంతో కేడర్ ఎక్కడా తగ్గడం లేదు. ప్రధాన పార్టీలతో పాటు ఏకంగా 39 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండటంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిక ఫలితాన్ని శాసించేలా ఉంది.


కేసీఆర్


రేవంత్‌రెడ్డి


వెంకట రమణారెడ్డి

ఎల్లారెడ్డి: చీలిక ఎవరికి లాభమో?

➤ గత ఎన్నికలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కే తిరిగి అధికార పార్టీ అవకాశమిచ్చింది. 2019లో కాంగ్రెస్ నుంచి జహీరాబాద్ ఎంపీగా పోటీ చేసిన కె.మదన్ మోహన్‌రావు ప్రస్తుతం ఎల్లారెడ్డి నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన బాన్సువాడ సుభాష్‌రెడ్డి చివరి నిమిషంలో బీజేపీలో చేరి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ హవాను అధిగమించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కాంగ్రెస్ తరపున ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యేగా సురేందర్ గుర్తింపు సాధించారు. కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన సుభాష్‌రెడ్డి కొన్నేళ్లుగా తాను చేసిన సేవా కార్యక్రమాలు ఫలితాన్ని ఇస్తాయనే అంచనాలో ఉన్నారు. సుభాష్‌రెడ్డికి పడే అనుకూల ఓట్లు ఇక్కడ విజేతను నిర్ణయించే సూచనలు కనిపిస్తున్నాయి.



నిజామాబాద్ అర్బన్: నిలిచేది ఎవరు..

బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా వరుసగా మూడోసారి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికలోనూ మైనారిటీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని పోటీలో నిలిపిన కాంగ్రెస్ ఈసారి కూడా అదే సామాజికవర్గానికి చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీకి అవకాశం ఇచ్చింది. కామారెడ్డిలో 1989 నుంచి పోటీ చేస్తూ వస్తున్న షబ్బీర్ అలీ తొలిసారిగా నిజామాబాద్ అర్బన్ బరిలోకి దిగారు. బీజేపీ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ పోటీ చేస్తున్నారు. బిగాల గణేశ్, ధనపాల్ ఇద్దరూ వైశ్య సామాజికవర్గానికి చెందిన వారే కావడంతో ఆసక్తికర పోటీ నెలకొంది. మున్సిపల్ కార్పొరేషన్‌లో 16 మంది కార్పొరేటర్ల బలం కలిగిన ఎంఐఎం బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతోంది. లక్షకు పైగా ఉన్న మైనారిటీ ఓటర్లపై అటు బీఆర్ఎస్, కాంగ్రెస్ భారీ ఆశలు పెట్టుకున్నాయి.


బిగాల గణేశ్ గుప్తా


షబ్బీర్ అలీ

నిజామాబాద్ రూరల్: ప్రత్యర్థులు పాత వారే

➤ బాజిరెడ్డి గోవర్ధన్ వరుసగా మూడోసారి కూడా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచే బరిలోకి దిగారు. గత ఎన్నికల్లో బాజిరెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రేకులపల్లి భూపతిరెడ్డి ప్రస్తుత ఎన్నికల్లోనూ ప్రత్యర్థిగా తలపడుతున్నారు. గతంలో టీడీపీలో క్రియాశీలంగా పనిచేసిన కులాచారి దినేశ్ కుమార్ బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ నియోజకవర్గానికి చిర పరిచితులు కావడంతో ప్రచారంలో ఒకరిపై ఒకరు పై చేయి సాధించేందుకు పోటీ పడుతున్నారు. బీజేపీ అభ్యర్థి దినేశ్‌కుమార్ తమ సామాజికవర్గం ఓటర్లతో పాటు యువత, సాంప్రదాయ ఓటు బ్యాంకు అనుకూలిస్తుందని భావిస్తున్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని అనుకూలతలు, ప్రతికూలతలను కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రచార ఎజెండాగా మలుచుకున్నాయి.

బాల్కొండ: గెలుపు జెండా ఎవరిదో?

➤ పూర్తిగా గ్రామీణ నియోజకవర్గంగా ఉన్న బాల్కొండలో ప్రధాన రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నుంచి బలమైన అభ్యర్థులు పోటీలో ఉండటంతో త్రిముఖ పోటీని తలపిస్తోంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వరుసగా మూడోసారి పోటీ చేస్తున్నారు. ప్రశాంత్‌రెడ్డి సమీప బంధువు, ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే ఆలేటి అన్నపూర్ణమ్మ బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. గడిచిన ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసి 32వేలకు పైగా ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచిన సునీల్ కుమార్ ముత్యాల ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. వ్యవసాయ ఆధారిత నియోజకవర్గమైన బాల్కొండలో రైతులతో పాటు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి కుటుంబాలు, బీడీ కార్మికుల ఓట్లు కీలకంగా మారాయి. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారపర్వంలో నువ్వా నేనా రీతిలో తలపడుతుండటంతో ఉత్కంఠ పోరు నెలకొంది.

ఇతర రంగాల వారి సంగతేంటి?



గతంలో చందాలు వేసుకుని మరీ గెలిపించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. వ్యవసాయ రంగంపై దృష్టి పెడుతున్న ప్రభుత్వం ఇతర రంగాలకు చెందిన సంక్షేమంపైనా దృష్టి పెట్టాలి. వెహికల్ ఫిట్‌నెస్, జీవిత బీమా వంటివి ప్రభుత్వ పరంగా కల్పిస్తే మాకు కొంత మేలు జరుగుతుంది.
– తోకల ప్రసాద్, ఆటో డ్రైవర్, సదాశివనగర్, ఎల్లారెడ్డి నియోజకవర్గం

వ్యవసాయం బాగుంది కానీ ఉద్యోగాలు లేవు




వ్యవసాయంలో ఎలాంటి సమస్యలు లేవు. ప్రభుత్వ పరంగా కరెంటు, రైతుబంధు వంటి ప్రయోజనాలు బాగున్నాయి. గతంతో పోలిస్తే వ్యవసాయం పరిస్థితి మెరుగైంది. నా ఇద్దరు కూతుళ్లు ఉన్నత విద్య చదివి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రభుత్వ సబ్సిడీలు కాకుండా ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు చూసి ఓటేయమని వారు చెప్తున్నారు.
– బసప్ప స్వామి, రైతు, పెద్దకొడపగల్, జుక్కల్

గిట్టుబాటు ధర ఇవ్వాలి..



రైతుబంధు ఇవ్వడం మంచిదే అయినా.. దానికి బదులుగా పంటలకు గిట్టుబాటు ధర ఇస్తే బాగుంటుంది. పసుపు బోర్డుతో జరిగే లాభం కంటే పసుపు మార్కెటింగ్ వసతులు పెంచితే మేలు. పసుపు బోర్డు ప్రయోజనమేంటో రైతులకే పెద్దగా తెలియదు. – సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, అంక్సాపూర్, బాల్కొండ నియోజకవర్గం

అడవుల కబ్జా పోవాలి..



అప్పుడే గిరిజనులకు అసలైన అభివృద్ధి
మాట్లాడే శక్తి లేకనే గిరిజనులు నష్టపోతున్నారు

గిరిజనేతరులూ ఓటర్లయ్యారు... వారి పెత్తనమే నడుస్తోంది
అన్యాక్రాంతమైన భూమిని స్థానిక గిరిజనులకు తిరిగి అప్పగించాలి
యూకలిప్టస్ మొక్కలు కాదు... గిరిజనులకు ఉపయోగపడే అడవులు పెంచాలి
వైఎస్సార్ హయాంలో గిరిజనులకు భూపంపిణీ దేశంలోనే ఓ రికార్డు
అడవుల్లోకి టిఫిన్ బాక్సులు, మంచినీళ్లు తీసుకెళ్లే పరిస్థితి పోవాలి
ప్రముఖ చరిత్ర పరిశోధకుడు వీఎన్‌వీకే శాస్త్రి

మేకల కళ్యాణ్ చక్రవర్తి

'గతంలో అడవుల్లోకి వెళితే పండ్లు, ఫలాలు లభించేవి. చెలమల్లో మంచినీళ్లు దొరికేవి. అడవుల్లోకి వెళ్లేవారు ఉత్తిచేతులతో వెళ్లినా ఆహ్లాదం పొంది ఆకలి తీర్చుకుని వెనక్కి వచ్చేవారు. కానీ, ఇప్పుడు అదే అడవుల్లోకి వెళ్లాలంటే ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులే టిఫిన్‌బాక్సులు, మంచినీరు తీసుకెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చినప్పుడే రాష్ట్రంలోని గిరిజనుల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది.' అంటున్నారు గిరిజన సంస్కృతి, పరిశోధన, శిక్షణా సంస్థ రిటైర్డ్ డైరెక్టర్, ప్రముఖ చరిత్ర పరిశోధకుడు వట్టిపల్లి నర్సింహ వీరభద్ర కృష్ణశాస్త్రి (వీఎన్‌వీకే శాస్త్రి). ''వాస్తవంగా చెప్పాలంటే గిరిజన ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులున్నాయి ఈ పరిస్థితులు పార్టీలకు కనిపించవు. ఒక టీచర్ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో 270 ఉద్యోగాలను భర్తీ చేస్తే 260 మంది స్థానికేతర గిరిజనులే ఉద్యోగాలు సాధించారంటే పరిస్థితి అర్థం చేసుకోవాలి. దొంగ సర్టిఫికెట్లే ఇందుకు కారణం.'' అని ఆయన అంటున్నారు. త్వరలో జరగబోయే ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని గిరిజనుల స్థితిగతులు, రాజకీయ పార్టీల ప్రాధాన్యాలు, వారి పట్ల అనుసరిస్తున్న వైఖరి, చేయాల్సిన పనులు, కావాల్సిన నిబద్ధత తదితర అంశాలపై ఆయన 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలో శాస్త్రి ఏమన్నారంటే...!

OTHER VOICE

గిరిజనులు మాట్లాడలేకనే నష్టం

ఏజెన్సీతోపాటు మైదాన ప్రాంతాల్లో కూడా గిరిజనులున్నారు. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, నల్లమల అడవిలో ఆదివాసీలు, మైదాన ప్రాంతాల్లో బంజారాలు, చాలా తక్కువ సంఖ్యలో ఎరుకల వర్గానికి చెందిన వారున్నారు. ఏజెన్సీ, మైదాన ప్రాంత గిరిజనుల మధ్య సమస్యలను వేరుగా చూడాలి. గిరిజనుల వెనుకబాటుతనం గురించి పార్టీలు పట్టించుకోవడం లేదు. ఈ వర్గాల్లో కొంచెం నోరున్న వారిని మాత్రమే పట్టించుకుంటారు. గిరిజనులు ఎక్కువగా మాట్లాడరు. దీంతో అవసరాల విషయంలో వారు నష్టపోతున్నారు.

అభివృద్ధి విధానమే మారింది..

భూమి, అడవి మాత్రమే ఏజెన్సీ గిరిజనులకు జీవనాధారం. చింతపండు, ఆకులు లాంటి నిత్యావసరాలు, చిన్న తరహా అటవీ ఉత్పత్తులు వారికి ఆసరాగా నిలిచేవి. కానీ, ఇప్పుడు అటవీ అభివృద్ధి విధానమే మారిపోయింది. వాణిజ్య అడవులకు, యూకలిప్టస్ లాంటి మొక్కలకు ప్రాధాన్యమివ్వడం మొదలైంది. దీనివల్ల రాష్ట్రాలకు ఆదాయం వస్తుంది గానీ స్థానిక గిరిజనులు నష్టపోతారు. వ్యవసాయ భూమిని అటవీయేతరులు కబ్జాలు చేసి అప్పులు, పాలు వ్యవసాయం పేరుతో వారిపై దాడులు చేస్తున్నారు.

గిరిజనుల భూమి సమస్య పరిష్కారం చేయాలి. తాజా లెక్కల ప్రకారం ఏజెన్సీలోని 52 శాతం భూమి గిరిజనేతరుల చేత అన్యాక్రాంతమైంది. రెవెన్యూ అధికారులు రికార్డుల మార్పు కూడా ఇందుకు దోహదపడింది. 1/70 పేరుతో భూమి బదలాయింపు నియంత్రించేందుకు చట్టాలున్నాయి కానీ అమలు కావడం లేదు. ఇందుకోసం ప్రత్యేక అధికారి (డిప్యూటీ కలెక్టర్) కూడా ఉంటారు. కానీ ఆ పోస్టులో పనిచేసేందుకు కూడా రెవెన్యూ అధికారులు ఇష్టపడరు.

ఆ పోస్టులెప్పుడూ ఖాళీనే..

ఈ పోస్టులు దీర్ఘకాలికంగా ఖాళీగా ఉంటాయి. వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో తాతల పేర్ల మీద భూములున్నాయి. ఆ భూముల పంపకాలు జరగలేదు. సర్వే నెంబర్లు డివిజన్ కాలేదు. చాలా మందికి తమ భూములు పోయిన విషయం కూడా తెలియదంటే నమ్మాల్సిందే.

వారు కూడా ఓటర్లే..

అడవి నుంచి గిరిజనులు బయటకు రావడానికి ఇష్టపడరు. కానీ, సాధారణ వ్యక్తులు అడవుల్లోకి వెళుతున్నారు. ఇప్పుడు అడవుల్లో ఇతరుల నివాసాలు 50 శాతానికి పెరిగాయి. వీరు కూడా ఓటర్లే. వీరికి తెలివి ఎక్కువ. పేరుకే రిజర్వ్‌డ్ నియోజకవర్గాలైనా గిరిజనేతరులు చెప్పిన మాటకే రాజకీయంగా విలువ ఉంటుంది. ఎందుకంటే ఆర్థిక నియంత్రణ అంతా గిరిజనేతరుల చేతుల్లోనే. గిరిజన జాతులకు చెందిన ఎమ్మెల్యేలు ఉన్నా వారు పేరుకు మాత్రమే. అధికారాలన్నీ గిరిజనేతరులకే ఉంటాయి.

రాజకీయ పార్టీల దృక్పథం మారాలి

రాజ్యాంగపరంగా అక్కడ గిరిజనులే పోటీ చేయాలి కాబట్టి మాత్రమే పోటీలో గిరిజనులు ఉంటారు. తప్ప గిరిజనులకు సంబంధించిన అంశాలపై పెద్దగా ఎక్కడా చర్చ జరగదు. ఆర్థిక అజమాయిషీ, సంఖ్యాపరమైన అజమాయిషీ ఉన్నప్పుడే రాజకీయ అజమాయిషీ పనిచేస్తుందన్నది తెలంగాణ గిరిజనుల విషయంలో బోధపడుతుంది. ఇక జనాభా ప్రాతిపదికన గిరిజన రిజర్వేషన్ల పెంపు సమంజసమైనది. కానీ రాజకీయ చిత్తశుద్ధి ఉంటేనే అది సాధ్యమవుతుంది.

వందేళ్లుగా పేదలుగానే ఉండాలా?

గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తున్న వారు పండించే పంటలకు మద్దతు ధర ఇవ్వాలి. 1911 సంవత్సరం నుంచే ఆదిలాబాద్ జిల్లాలో పత్తి సాగు చేస్తున్నారు. వందేళ్లుగా పత్తి పండిస్తున్న వారు ఇంకా పేదలుగా ఎందుకుండాలి? మార్కెట్, సీసీఐ చొరవ తీసుకోవాలి. వరంగల్ జిల్లాలోని గిరిజనులు మిర్చి, పొగాకు లాంటి వాణిజ్య పంటలు పండిస్తున్నారు. వాటికీ ధర లభించడం లేదు. అడవుల్లోకి వెళ్లేందుకు గిరిజనులే టిఫిన్‌బాక్సులు, మంచినీళ్లు పట్టుకెళ్లాల్సిన పరిస్థితి. సామాజిక అడవులంటే అక్కడ ఉండే ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలి.

విద్య, ఆరోగ్యంపై దృష్టి సారించాలి

గిరిజనుల విద్య, ఉద్యోగ, ఆరోగ్య సమస్యలపై పార్టీలు దృష్టి సారించినప్పుడే వారి సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. సరైన ప్రణాళిక ప్రకారం వెళితే పదేళ్లలో వారి జీవితాల్లో వెలుగులు నింపొచ్చు. కానీ, ఇందుకు రాజకీయ చిత్తశుద్ధి అవసరం. దేశంలోనే గిరిజనులకు అందరికంటే ఎక్కువగా పట్టాలిచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. అది దేశంలోనే రికార్డు. ఇప్పుడు కూడా పట్టాలిచ్చారు. కానీ చాలా తక్కువ. పట్టాలివ్వడమే కాదు వ్యవసాయ యోగ్యంగా వాటిని మార్చాలి.

ప్యాచ్‌వర్కే చేస్తారా?

ఏ ప్రభుత్వమైనా గిరిజన ప్రాంతాల్లో ప్యాచ్‌వర్క్ తప్ప నిలకడగా అభివృద్ధి చేయడం లేదు. లక్షల మంది గిరిజనులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. పట్టణీకరణతో మైదాన ప్రాంత గిరిజనులను కనెక్ట్ చేయగలిగితే చాలు. అది ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుంది. డీఆర్‌డీఏలు, ఐటీడీఏల ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలి.'

హలో.. ఇదిగో మీ ఓటరు స్లిప్!

ఇంటి అడ్రస్ చెబితే వచ్చి ఇస్తామంటూ పార్టీల ఫోన్లు
ప్రతీ ఓటరుకు చేరేలా ప్రత్యేక బృందాల ఏర్పాటు
ఓటర్ల ప్రసన్నానికి అభ్యర్థుల ప్రణాళిక..


సాక్షి, హైదరాబాద్

'హలో.. మీ ఓటరు స్లిప్ సిద్ధంగా ఉంది. అడ్రస్ చెబితే మీ వద్దకు వచ్చి అందజేస్తాం'. క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఫోన్ కాల్స్‌లో వస్తున్న సమాచారం ఇది. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా చర్యలు తీసుకుంటున్నాయి. ఇప్పటికే వివిధ మార్గాల్లో ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు కష్టపడగా.. ఇప్పుడు మరింత చేరువయ్యేందుకు వారు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఓటర్లను వ్యక్తిగతంగా కలసి తమకు మద్దతు ఇవ్వాలని కోరేందుకు ఓటరు స్లిప్పులతో రెడీ అవుతున్నారు. ఓటర్లకు నేరుగా ఫోన్లు చేసి, మీ ఓటరు స్లిప్పు సిద్ధంగా ఉందంటూ.. ఇంటి అడ్రస్ చెబితే వెంటనే వచ్చి అందిస్తామంటున్నారు. ఈనెల 30వ తేదీన ఫలానా బూత్‌లో మీరు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచిస్తూనే తమకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. ఒకవైపు అభ్యర్థులు రికార్డెడ్ వాయిస్ కాల్స్ రూపంలో ఓటర్లను నిరంతరం పలకరిస్తుండగా.. ఇప్పుడు మరింత లోతుగా ఓటరు మదిని తట్టేందుకు స్లిప్‌లను పంపిణీ చేసే పనిలో పడ్డారు.



ప్రతీ ఓటరుకు అందించేలా..

ఎన్నికల్లో ప్రతీ ఓటూ కీలకమే. గత ఎన్నికల్లో పావు వంతు అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు మూడంకెల మెజారిటీతో గెలిచిన వారున్నారు. ఈ క్రమంలో వీలైనంత వరకు ప్రతీ ఓటరును కలిసేందుకు అభ్యర్థులు ప్రయాసలు పడుతున్నారు. ఇందుకోసం అభ్యర్థులు ప్రత్యేకంగా బృందాలను సిద్ధం చేసుకుంటున్నారు. ప్రతీ బూత్‌కు నలుగురితో ఒక టీమ్ ఏర్పాటు చేసుకున్న అభ్యర్థులు.. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో ఓటర్లకు స్లిప్పులు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ తరపున చురుకుగా ఉన్న ఒక కార్యకర్తతో పాటు ముగ్గురు సహాయకులను నియమించుకుని స్లిప్పులను వేగంగా పంపిణీ చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. స్లిప్పుల పంపిణీతో పాటు కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారికి ఓటరు కార్డులు సైతం డౌన్‌లోడ్ చేయడం, ప్రింట్ చేసి ఇవ్వడంలోనూ చొరవ తీసుకుంటున్నారు. ఓటరు స్లిప్పు ఇచ్చే సమయంలోనే నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టనున్న కార్యాచరణను వివరిస్తున్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యేలు, అధికారపార్టీ అభ్యర్థులు నియోజకవర్గ పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను వివరించడంతో పాటు కరపత్రాలను సైతం పంపిణీ చేస్తున్నారు. స్లిప్పుల పంపిణీ తర్వాత కూడా ఓటర్లతో టచ్‌లో ఉండేలా పోలింగ్ బూత్ బృందాలకు అభ్యర్థులు సూచనలు చేస్తున్నారు. మొత్తంగా పోలింగ్ సమయం ముగిసే వరకు ఈ బృందాలు క్షేత్రస్థాయిలో యాక్టివ్‌గా ఉండేలా అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకున్నారు.



సాక్షి

మహిళల్లో న్యాయ చైతన్యం తెస్తా



నాలో లీడర్‌షిప్ క్వాలిటీస్ స్కూలు నుంచే మొదలయ్యాయి. తెలంగాణ ఉద్యమం సమయంలో అబుదాబిలో ఉన్న నేను రాష్ట్రంగా ఏర్పడాల్సిన అవసరాన్ని తెలియజేయడానికి అక్కడ అనేక సమావేశాలు ఏర్పాటు చేశాను. ఇప్పుడు క్రియాశీలక రాజకీయాల్లోకి రావడం వెనుక ఉద్దేశం మహిళలు... అవినీతి, వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి పరిపాలన అందించగలుగుతారనే నమ్మకమే. దేశం ఎంత అభివృద్ధి చెందినప్పటికీ సమాజంలో మహిళల మీద దాడులు తగ్గడం లేదు. ఆ విషయంలో మహిళల్లో చైతన్యం తీసుకురావాలి. నేను ఎల్ఎల్‌బీ చేసింది కూడా మహిళల్లో న్యాయపరమైన చైత్యనం తీసుకురావడం కోసమే. ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం చట్టసభలో పోరాడడానికే ఎన్నికల్లో పోటీ చేస్తున్నాను.

- చల్లా శ్రీలతారెడ్డి, ఎం.ఏ., ఎల్ఎల్‌బీ, హుజూర్‌నగర్, బీజేపీ

ఐఐటీ స్టూడెంట్... పొలిటికల్ ఎంట్రీ



ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేశాను. చదువు పూర్తి అయ్యాక సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలనుకున్నా. కరోనా సమయంలో మా సొంత జిల్లా పెద్దపల్లిలోని కనగర్తి గ్రామానికి వచ్చాక మా అమ్మనాన్నల పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించాం. 'పద్మహన్మయ్య' ట్రస్ట్ ద్వారా చదువుకున్న నిరుద్యోగులకు జీతాలు చెల్లించి 60గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల్లోని పిల్లలకు ఉచితంగా ట్యూషన్‌లు చెప్పించాం. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా డీఈఓ ఆ కార్యక్రమాలను రద్దుచేయమన్నారు. ఆ విషయమై కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేకపోయింది. 'కలెక్టర్ అయితే ఎంతో మందికి సేవ చేయవచ్చు' అనుకున్న నేను ఆ సంఘటనతో నిర్ణయాన్ని మార్చుకున్నాను. కలెక్టర్ అయినా రాజకీయ నేతల దగ్గర పని చేయాల్సిన పరిస్థితి నెలకొని ఉందనిపించింది. దీనికి తోడు కులవివక్షతో మాపై బురదజల్లే ప్రయత్నాలు జరిగాయి. దాంతో రాజకీయాల్లోకి రావాలనిపించి బీఎస్పీ నుంచి పోటీ చేస్తున్నాను.

- దాసరి ఉష, పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి



మహిళా చైతన్యం

అసెంబ్లీ బరిలో విద్యావంతులైన మహిళలు

- ఒకరు ఐఐటీ గ్రాడ్యుయేట్... ఇద్దరు న్యాయవాదులు.
- ముగ్గురు డాక్టర్లు... మరో ముగ్గురు డాక్టరేట్‌లు.
- ఒకరు ఎన్నారై... మరొకరు నిరుద్యోగి... ఇది ఈ ఎన్నికల చిత్రం.
- రాజకీయాల్లోకి రావడం వెనుక వారి ఉద్దేశాలు... లక్ష్యాలు మహోన్నతం.
- సగభాగం... సమభాగం కోసం పోరాడే క్రమంలో ఇది ఓ ముందడుగు

వాకా మంజులారెడ్డి

మహిళలకు టికెట్ల కేటాయింపులో అన్ని రాజకీయ పార్టీలూ ఏకతాటిపై నిలిచినట్టుగా పూర్తి వివక్ష చూపించినప్పటికీ దక్కిందే దక్కనీ చందంగా సీట్లు పొందిన మహిళలు ఎన్నికల బరిలో సీరియస్‌గా సై అంటున్నారు.నిన్నమొన్నటి వరకు చాలామంది మహిళా ప్రజాప్రతినిధులు కేవలం పేరుకే.. పెత్తనమంతా వారి భర్తలదే అన్న రీతిన రాజకీయం నడిచింది.కానీ ఈ ఎన్నికల్లో స్వతంత్రభావాలు కలిగిన స్త్రీలు, ఉన్నత విద్యావంతులైన యువతులు, సమాజం పట్ల పూర్తి అవగాహన ఉన్న వనితలు రంగంలోకి దిగడంతో అసలైన మహిళా చైతన్యం వెల్లివిరుస్తోంది. కుటుంబాన్ని చక్కదిద్దే బాధ్యతల్లో ఆరి తేరిన మహిళలు.. సమాజాన్ని కూడా తీర్చిదిద్దాలంటే వారే ముందుండాలన్న నారీశక్తి స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో బరిలోకి దిగారు. అలా పోటీలో ఉన్న మహారాణులు ఎవరు, వారేమంటున్నారో చూద్దామా!

చరిత్ర కొత్తగా రాయాలి



సమాజంలో నెలకొన్న అనేక దుర్మార్గాలను చూసి ఆవేదన చెందుతూ నాన్న గద్దర్ ఒక మాట అనేవారు. 'చరిత్రను రాయాల్సిన వాళ్లు రాయలేదు, రాయకూడని వాళ్లు రాసిన చరిత్ర ఇలాగే ఉంటుంది. సమాజంలో కొందరు చెడు చేయడానికే పుడతారు. వాళ్లు చెడ్డపనులే చేస్తారు. వాళ్లను, వాళ్లలోని చెడ్డగుణాన్ని మార్చలేం. ఆ చెడును చూస్తూ గళం విప్పని వాళ్లదే అసలైన తప్పు. వారిలో మార్పు తీసుకురావాలి.' అని చెప్పేవారు. రాజకీయాలింతే అనుకుంటూ విరక్తి చెందడం కాదు, ఆ రాజకీయాలను ప్రక్షాళన చేయడానికి కూడా ముందడుగు వేయాలనుకున్నాను. నా వంతుగా సముద్రంలో ఒక నీటి బొట్టులా నా శక్తిని ధారపోస్తాను. సమాజంలో దుర్బలమైన వాళ్లు మహిళలు, పిల్లలే. వాళ్ల కోసం చట్టసభలో నా గళం వినిపిస్తాను. యువతకు అండగా నిలుస్తాను.

- వెన్నెల గద్దర్, పీహెచ్‌డీ, కంటోన్మెంట్, కాంగ్రెస్

అభివృద్ధి- సంక్షేమం రెండు కళ్లు



నాన్న (పీజేఆర్)ను చూసి రాజకీయాల్లోకి వచ్చాను. ప్రజాసేవలో ఆయన ఎంతగా మమేకమయ్యారో దగ్గరగా చూశాను. ఒకరికి సహాయం చేయడంలో ఉండే సంతృప్తితో మరేదీ సాటిరాదని స్వయంగా తెలుసుకున్నాను. వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన వాళ్ల మీద ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. వాళ్ల మీద పెద్ద పెద్ద అంచనాలుంటాయి. అందునా మహిళలు రాజకీయాల్లో కొనసాగాలంటే ఎక్కువ కష్టపడాలి. కష్టానికి నేను భయపడను. చట్టసభలో నా నియోజకవర్గం కోసం పోరాటం చేస్తాను. నాన్న వారసురాలిగా ఆయనంత గొప్ప నాయకురాలిని అవుతానని చెప్పలేను. కానీ ఆయన దారిలో నడుస్తాను. నాకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాను.

- విజయారెడ్డి, ఎం.టెక్ (పీహెచ్‌డీ), ఖైరతాబాద్, కాంగ్రెస్

రాజకీయాల్లో కూడా రాణించాలి



కాలేజీ రోజుల నుంచి ఏబీవీపీ కార్యకర్తగా చురుగ్గా ఉండేదాన్ని. ఉస్మానియా నుంచి ఎల్ఎల్ఎమ్ చేసి హైదరాబాద్ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నాను. తెలంగాణ బార్ కౌన్సిల్, హైకోర్ట్ బార్ అసోసియేషన్, సిటీ సివిల్ కోర్టు, రంగారెడ్డి కోర్టు, సేల్స్ ట్యాక్స్ అసోసియేషన్ మెంబర్‌గా నా సర్వీస్ ఇస్తున్నాను. నేను గమనించినంతలో మహిళలు ఎన్ని రంగాల్లో దూసుకుపోతున్నప్పటికీ రాజకీయరంగంలో అడుగుపెట్టడానికి సంకోచిస్తున్నారని అర్థమైంది. ఆ ఖాళీని భర్తీ చేయాలంటే ఎవరో ఒకరు ముందడుగు వేయాలి. చైతన్యం ఉన్న వాళ్ల నుంచే ఆ తొలి అడుగు పడాలి. అందుకే ఎన్నికల బరిలో అడుగుపెట్టాను. కుటుంబాన్ని చక్కదిద్దే బాధ్యతల్లో ఆరి తేరిన మహిళలు రాజకీయాల్లో కూడా రాణించగలరు.

- మేఘా అగర్వాల్, అడ్వొకేట్, చార్మినార్, బీజేపీ

ఎంబీబీఎస్ నుంచి ఎమ్మెల్యే పదవికి..



నా భర్త 2014లో శాసనసభకు పోటీ చేసినప్పటి నుంచి నేను క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నాను. ఇద్దరమూ డాక్టర్లమే. వైద్యరంగంలో సేవలందించడంతోపాటు చట్టసభలకు ఎంపికై మరింత విస్తృతమైన సేవలందించవచ్చని రాజకీయాల్లోకి వచ్చాం. మా సత్తుపల్లిలో ఇప్పటి వరకు మహిళలెవరూ శాసనసభకు పోటీ చేయలేదు. మహిళలు రాజకీయాల్లోకి రావాలి. అప్పుడే మహిళాభివృద్ధికి దోహదం చేసే చట్టాలు రూపొందుతాయి. విద్యావంతులైన మహిళలు ఒక అడుగు ముందుకేస్తే, వారి స్ఫూర్తితో మరికొందరు ముందుకు వస్తారు.

- డాక్టర్ మట్టా రాగమయి, సత్తుపల్లి, కాంగ్రెస్

అత్త వదిలిన బాణం



మా పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు సేవలందించాలని మా అత్తమ్మ యూఎస్ నుంచి వచ్చారు. ఆమెకు భారత పౌరసత్వం రాకుండా వ్యూహాత్మకంగా అడ్డుకున్నారు. 'ప్రజలకు నేను మాటిచ్చిన, మన కుటుంబం మాట తప్పిన కుటుంబం కావొద్దు' అన్నది అత్తమ్మ. ఆమె లక్ష్యాన్ని సాధించడానికి నేను ముందుకు వచ్చాను. అత్తమ్మకు వారసురాలిగా పాలకుర్తి ప్రజల ప్రతినిధిగా చట్టసభలో అడుగుపెడతాను. ప్రజాసేవ చేస్తాను. ఇకపై నా కుటుంబం అంటే మా ఇల్లే కాదు, పాలకుర్తి నియోజకవర్గమంతా నా కుటుంబమే. ప్రత్యర్థులు ఆరోపణలు ఎన్నైనా చేస్తారు. ప్రత్యర్థి సీనియారిటీతో నా వయసును పోలుస్తున్నారు. ప్రజల అభిమానం మా వైపుంది. ప్రజలకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే వయసు, అనుభవం లేకపోవడం సమస్యలు కావు. అవి లేని వాళ్లకు ఎంత అనుభవమున్నా ప్రజలు హర్షించరు.

- మామిడాల యశస్విని రెడ్డి, (ఎంఎస్, యుఎస్ఏ) పాలకుర్తి, కాంగ్రెస్



రోడ్లు... బ్రిడ్జిలు సాధించుకున్నా



ప్రజల కోసం పోరాడడం ఇప్పుడు కాదు, నా చిన్నప్పుడే మొదలైంది. అప్పుడు (మావోయిస్టుగా) ప్రాణాలకు తెగించి ఉరికిన. ఇప్పుడు ప్రజాక్షేత్రంలో పోరాడుతున్నా. మా నియోజకవర్గంలో వాగులు, వంకలకు బ్రిడ్జిల్లేవు. తండాలకు రోడ్లు లేవు. అవన్నీ నేను ఎమ్మెల్యే అయినంకనే సాధించుకున్నా. ఆదివాసీ బిడ్డను. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఒక పార్టీలో గెలిచి మరో పార్టీకి అమ్ముడుపోలేదు. ఇప్పుడు నాయకులు ఓట్లు వచ్చినప్పుడే ప్రజల దగ్గరకు వస్తున్నరు. నేను మా జనం కష్టాల్లో ఉన్నప్పుడు వాళ్లకు అండగా ఉన్నా. నాది డబ్బుతో కొనుక్కున్న గుర్తింపు కాదు, ప్రజాభిమానంతో వచ్చిన గుర్తింపు.

- సీతక్క, ఎం.ఏ., పీహెచ్‌డీ, ములుగు, కాంగ్రెస్

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి



మా కుటుంబం ప్రజాసేవలోనే ఉంది. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. నేను డాక్టర్ అయినప్పటికీ ప్రజలకు విస్తృతమైన సేవలందించడం రాజకీయరంగంలోనే సాధ్యమనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చాను. ప్రజా సేవ కోసం యువమహిళలు సైతం ముందుకు రావాలి. యువత కోసం పోరాటం చేయాలి. గతంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సేవలందించాను. ఇప్పుడు చట్టసభ కోసం పోటీలో నిలిచాను. నా ప్రత్యర్థులు అగ్ర నాయకులు. వారితో పోటీ చేస్తున్నాను. ప్రజలు ఆలోచించి నాకు అవకాశం ఇస్తే ఒక బీసీ బిడ్డగా అందరికీ సేవ చేస్తా.

- డాక్టర్ భోగ శ్రావణి, జగిత్యాల, బీజేపీ

జాయమ్మ చెరువుకు సాగునీరందిస్తా



తాతయ్య (చిట్టెం నర్సిరెడ్డి) రాజకీయాల్లో ఉన్నప్పటికీ నేను రాజకీయాల్లోకి వస్తానని మాత్రం ఊహించలేదు. అమ్మ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న బిజినెస్ చేసేవారు. నన్ను డాక్టర్ చేయాలని, నేను మా నారాయణపేటలో పేదవాళ్లకు వైద్య సేవలందించాలనేది తాత, నాన్న ఇద్దరి కల. వాళ్లిద్దరూ మావోయిస్టుల దాడిలో ప్రాణాలు పోగొట్టుకున్న నాటికి నాకు పదకొండేళ్లు. వాళ్ల కల నెరవేర్చాలని డాక్టర్‌నయ్యాను. మహిళల అభివృద్ధి కోసం పనిచేయాలి, తాత ప్రజల కోసం నిర్మించ తలపెట్టిన జాయమ్మ చెరువు ఇంకా అసంపూర్తిగానే ఉంది. ఆ పని నేను పూర్తి చేయాలి. ఇంత వరకు ఈ నియోజకవర్గంలో శాసనసభ్యురాలిగా మహిళలు లేరు. నేనే తొలి మహిళా ఎమ్మెల్యేనవుతానన్న నమ్మకం ఉంది. ప్రజల తీర్పు ప్రతికూలంగా ఉంటే ఇక్కడే ఉండి డాక్టర్‌గా సేవలందిస్తాను. అంతే తప్ప నియోజకవర్గాన్ని వదిలి వెళ్లను.

- డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి (ఎండీ రేడియాలజీ), నారాయణపేట, కాంగ్రెస్ అభ్యర్థి

నిరుద్యోగుల పక్షాన నామినేషన్



మాది నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్ద కొత్తపల్లి మండలం మరికల్ గ్రామం. నేను పీజీ చేస్తున్నా. 'హాయ్ ఫ్రెండ్స్.. డిగ్రీలు ఎన్ని వచ్చినా నోటిఫికేషన్లు, ఉద్యోగాలు రావడం లేదు. అందుకే మా అమ్మకు చెబితే నాలుగు బర్లను కొనిచ్చింది. బర్లను కాయడానికి వచ్చిన ఫ్రెండ్స్' అంటూ రెండేళ్ల కిందట నేను చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నా వీడియో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉందని నా మీద కేసు పెట్టారు. సాటి నిరుద్యోగుల కోసం పోరాటం చేయడానికి నిశ్చయించుకుని నామినేషన్ వేశా. నేను ఊహించనంత రెస్పాన్స్ వస్తోంది. ఆర్థిక సహాయం చేస్తున్నారు. మొదట్లో నన్ను ప్రచారం చేయనివ్వకుండా అడ్డుకోవడానికి చూశారు కొందరు నాయకులు. ఇప్పుడు నా తమ్ముడి మీద దాడి చేశారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా నిరుద్యోగుల తరఫున పోరాటాన్ని కొనసాగిస్తాను.

- బర్రెలక్క, శిరీష (పీజీ), కొల్లాపూర్, ఇండిపెండెంట్

తెలంగాణ రాజకీయం రసకందాయంలో పడింది!
నేతలు శక్తియుక్తులన్నీ ఒడ్డి ఓటరుదేవుళ్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాల్లో తలమునకలై ఉన్నారు. మరి..
119 నియోజకవర్గాల్లో ఎవరు ఎవరితో పోటీ పడుతున్నారు?
ప్రత్యర్థుల బలాబలాలేమిటి? ప్రచార వ్యూహాలేమిటి?
హంగు ఆర్భాటాలు ఎలా సాగుతున్నాయి?
2018 ఎన్నికలు.. అంతకుముందు జరిగిన ఎన్నికల చరిత్ర.. తెలుసుకోవాలని ఉందా?
అన్ని రకాల వార్తలు వివరాలు సమగ్రంగా మీకందిస్తోంది.. జంగ్ తెలంగాణ
పోలింగ్ పోకడలు... ఎగ్జిట్ పోల్స్, కౌంటింగ్ ఫలితాలు ఎప్పటికప్పుడు
మీకందించేందుకూ మేం సిద్ధం! ఇప్పుడే క్లిక్ చేయండి (www.sakshi.com)

సాక్షి SAKSHI.COM జంగ్ తెలంగాణ 2023

నేతలు ఆడే ఉప్పుమూట ఆట!

పిల్లలాటలో ఉప్పుమూట ఎంత ముఖ్యమైన ఆటో తెలియంది కాదు. పిల్లలుగా ఉన్నప్పుడు ప్రతివాడూ ఉప్పెక్కినోడే, పెద్దయ్యాక పిల్లల్ని ఉప్పుమూటలా మోసినోడే.

కొందరు పొలిటికల్ పెద్దలు..మామూలు వ్యక్తుల నడ్డి మీద ఉప్పుమూటలా ఊరేగుతుంటారు. ఈ నాయకులకు సాధారణ ప్రజల మీదుండే అభిప్రాయమేమిటంటే..ఓటరనేవాడో బక్క గుర్రం..ఓ వెర్రి గుర్రం. పెద్దలమై గద్దెనెక్కాక మనం వేసే పన్నుభారాలూ, ఆర్థిక బరువులూ కళ్లు మూసుకుని, బళ్లెరగక మోసే అమాయకపు అశ్వం.

ఎందుకోగానీ..ఎన్నికల నాటికి రోల్ రివర్సల్ జరుగుతుంది. అదెలాగో అర్థంకావాలంటే ముల్లా నస్రుద్దీన్, అతడి గుర్రం కథ తెలియాలి. ఇది అనాదిగా పిల్లల కథా సంస్కృతిలో బాగా నలిగిన జానపద గాథే. అందరికీ బాగా తెలిసిన కథే.

వాగు అవతల ఉండే పట్టణానికి ప్రతిరోజూ పోయి, తనకు అవసరమైన సరుకుల్ని ముసలిగుర్రం మీద వేసుకుని తెచ్చుకుంటూ ఉండేవాడు ముల్లా నస్రుద్దీన్. అన్నింటికంటే కింద ఉప్పుమూటను అడ్డంగా వేసేవాడు. దాని మీద సరుకులన్నింటినీ పొందిగ్గా పేర్చుకుంటూ పోయేవాడు.

ముల్లా నస్రుద్దీన్ గుర్రం బహు తెలివైనది. ఉప్పుమూటతో వాగు దాటే ప్రతిసారీ కాళ్లు కాస్త మడిచి, మూటను మునిగేలా చూసి, ఉప్పు కరిగిపోయేలా చేసి, వీపుమీది భారాన్ని వీలైనంత తగ్గించుకునేది.

ప్రతిసారీ ఉప్పు తగ్గుతుండటంతో కారణమేమిటో తెలుసుకోవాలనుకున్నాడు ముల్లా. అసలేం జరుగుతోందో పరిశీలనగా చూశాడు. గుర్రం వేషాలు త్వరగానే అర్థమయ్యాయి.



షుగర్ & పెప్పర్

..:: యాసీన్

"అబ్బో... మనిషై పుట్టుంటే రాజకీయాల్లో ఉండాల్సినంత తెలివైనదేనే నా గుర్రం" అనుకుంటాడు. దాని తెలివికి మొదట ముచ్చటేసింది. కానీ..దానికి బుద్ధి చెప్పాల్సిన బాధ్యతా తనమీదే ఉంది.

ఓ రోజున ఓడ వాడికి చెప్పి ఓ వస్తువును వాగు దాటించి, తాను కొనుగోళ్లు చేసే కొట్టుకు తరలిస్తాడు. ఎప్పటిలాగే కొనుగోళ్లకు వెళ్లి... ముందుగా ఆ వస్తువును ఉప్పుబస్తాలాగే మూటగట్టి గుర్రం వీపు మీద అడ్డంగా పడేస్తాడు. దాని మీద మిగతా సామాన్లు పేరుస్తాడు.

గుర్రం ఎప్పటిలాగే నీళ్లలోకి దిగింది. వాగు దాటే సమయంలో తన తెలివికి తానే మురుస్తూ, బస్తాను కాస్తా కాస్త తడిసేలా నీళ్లలోకి కాళ్లముడుచుకుంటోంది. తడిసేకొద్దీ బరువెక్కిపోతోంది బస్తా! దాన్ని ఉప్పు బస్తానే అనుకుని మరింత మునిగేలా చూస్తోంది. మునిగే బస్తా.. పెరిగే బరువు! మునిగిన కొద్ది పెరిగే భారం!!

తీరం చేరేసరికి కుప్పకూలిందది. అప్పుడు ముల్లా నస్రుద్దీన్ దాని వీపు మీదున్న బస్తా విప్పి... వస్తువేమిటో చూపించాడు. అదో దూది పరుపు.

ఆ పరుపును తీసి గుర్రానికి చూపి... ఓ మాట చెప్పాడు ముల్లా.

"చూడూ..మామూలు వేళల్లో మనిషి బక్క గుర్రమే. కానీ ఎన్నికల నాటికి వాడే ఓటరవుతాడు. ఓటరయ్యాక ముల్లా నస్రుద్దీన్ తాలూకు తెలివితేటలన్నీ వాడికీ వచ్చేస్తాయి. అప్పుడు నువ్వు జాగ్రత్తగా ఉండాల్సిందెందుకో తెలుసా? ఐదేళ్ల వ్యవధిలో నువ్వు ఏ మతలబులు చేసినా, ఏ హర్‌కత్‌లూ చేసినా భరిస్తాడు. ఓటు అన్నది వాడికి సమకూరే ఓ కంఫర్ట్. ఎన్నికల నాడు తానింతకాలం పురుసత్తుగా వాడిన తన 'ఓటు'ను... బ్యాలెట్ పెట్టె లాంటి నీ వీపు మీద అడ్డంగా పడేస్తాడు. కాబట్టి బిడ్డా... కాస్త జాగ్రత్త" అంటూ తన గుర్రాన్ని ముద్దుముద్దుగా హెచ్చరించాడు ముల్లా నస్రుద్దీన్.

'కండక్టర్' సర్వే కథ వేరు

ప్రయాణికులతో బస్సు కండక్టర్ల పిచ్చాపాటి

- ఆ మాటల్లోనే పొలిటికల్ ముచ్చట
- జనం మాటలతో నాడి పట్టేస్తూ..

అన్నా.. ఏం సంగతి, పట్నం ఎందుకు పోతున్నవ్..
కొత్త ఇల్లు కట్టే సంగతి ఎక్కడిదాకా వచ్చింది..
ఇవాళ్ల ఏం కూర చేసుకున్నరు..
పొలంలో ఏం పంట వేసినవ్..

బస్సు ప్రయాణికులకు– కండక్టర్‌కు మధ్య సాగే కుశల ప్రశ్నలు, కుటుంబ విషయాలపై జరిగే మాటామంతీ.

ఊళ్లకు వెళ్లే బస్సుల్లో ఈ తరహా ముచ్చట్లు సర్వ సాధారణం. ఊరి బస్సుల్లో రెగ్యులర్‌గా ఉండే కండక్టర్లకు, ఆ ఊరి జనంతో ఏర్పడే సాన్నిహిత్యమే దీనికి కారణం. అందుకే, ఆత్మీయుల తరహాలో కండక్టర్‌తో మాట్లాడే వారు ఎంతో మంది ఉంటారు.

ఇప్పుడు ఎన్నికల వేళ.. జనం మనసులో ఉన్న విషయాన్ని కూడా కండక్టర్లు ఈజీగానే పసిగట్టగలుగుతున్నారు. జనం కూడా ఏ పార్టీకి ఓటు వేయాలనుకుంటున్నారో కూడా కండక్టర్‌తో పంచుకుంటున్నారు. అందుకే ఇప్పుడు కొందరు నేతలు కండక్టర్ల ద్వారా ప్రజల నాడి తెలుసుకునే ప్రయత్నం



చేస్తున్నారు. ఎన్నికల సమయంలో సర్వే సంస్థలకు డిమాండ్ ఒక్కసారిగా పెరుగుతుంది. పార్టీలపరంగా కొన్ని సంస్థలు, అభ్యర్థులపరంగా, స్వచ్ఛందంగా ఇంకొన్ని సంస్థలు, మీడియా సంస్థల ద్వారా మరికొన్ని సంస్థలు.. ఇలా సర్వేలు జరుగుతూనే ఉంటాయి. కొన్ని సర్వే ఫలితాలు వాస్తవాలకు దగ్గరగా ఉంటే, మరికొన్ని పూర్తి విరుద్ధంగా కనిపిస్తుంటాయి. అందుకే సర్వే ఫలితాలపై అంతగా నమ్మకం ఉండదు. ప్రజల నాడిని సరిగ్గా పసిగట్టడంలో విఫలమవటమే ఇందుకు కారణం. వేరే ప్రాంతాల నుంచి వచ్చే అపరిచితులతో మనసులోని మాట చెప్పేందుకు తటపటాయించేవారే ఎక్కువగా ఉంటారు. కానీ, సర్వే సంస్థల ప్రతినిధులు రాబట్టలేని విషయాలను ఆర్టీసీ బస్సు కండక్టర్లు సులభంగా తెలుసుకోగలుగుతున్నారు. తరచూ బస్సుల్లో కలిసి ప్రయాణించటం, చాలా విషయాలమీద పిచ్చాపాటిగా మాట్లాడుకోవటం వల్ల కండక్టర్లతో ఊరిజనానికి సాన్నిహిత్యం ఏర్పడుతోంది. దీంతో ఎన్నికల వేళ.. ఊరి జనం తీరును వారు సులభంగా తెలుసుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్యమైన ఊళ్ల అభిప్రాయాన్ని నేతలు కండక్టర్ల ద్వారా తెలుసుకుంటున్నారు. వాటి ఆధారంగా ప్రచార సరళిని మార్చుకుంటున్నారు. వెరసి సర్వే సంస్థలు చేయలేని పనిని బస్ కండక్టర్లు చేసి పెడుతున్నారు.

– సాక్షి, హైదరాబాద్

అమ్మా నాన్నతో ఓట్లు వేయిస్తాం...

- విద్యార్థుల నుంచి హామీపత్రాల సేకరణ..
- ఖమ్మంలో అధికారుల వినూత్న ప్రయోగం

నేలకొండపల్లి: ఈనెల 30న నూరు శాతం పోలింగ్ నమోదయ్యేలా ఖమ్మం జిల్లా అధికారులు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా విద్యార్థుల నుంచి హామీపత్రాలు తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. 'బాధ్యత గల విద్యార్థిగా మా తల్లిదండ్రులు, మా కుటుంబంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ప్రలోభాలకు లొంగకుండా... నిర్భయంగా ఓటు వినియోగించుకునేలా బాధ్యత తీసుకుంటానని హామీ ఇస్తున్నాను' అని ముద్రించిన పత్రాలను జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈ పత్రంపై విద్యార్థి సంతకం చేయడమే కాకుండా తల్లిదండ్రులతోనూ సంతకాలు చేయించి తిరిగి పాఠశాలలో అందజేయాల్సి ఉంటుంది. ఈ విధానంతో విద్యార్థులకు ప్రజాస్వామ్యంపై అవగాహన పెరుగుతుందని భావిస్తున్నారు.


భారత ఎన్నికల సంఘం
30
1950
విద్యార్థి హామీ పత్రం
VOTE
ETHICAL VOTING

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.